www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

పదార్థమేమిటో చెప్పాలి

శాకాహారమా? మాంసాహారమా? అనేది చూపితే చాలు
'కావడి' మార్గంలో హోటళ్లపై పేర్ల ప్రదర్శనపై సుప్రీం
ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల ఆదేశాలపై స్టే
కేసు తదుపరి విచారణ ఈ నెల 26వ తేదీకి వాయిదా
నేను కేరళలో ముస్లిం నడిపే శాకాహార హోటల్‌కు వెళ్లా
అది మంచి ప్రమాణాలతో ఉంది: జస్టిస్ ఎస్వీఎన్ భట్టి

2



మంగళవారం | 23-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 98

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: విదియ ఉ. 10.23 తదుపరి తదియ; నక్షత్రం: ధనిష్ఠ రా. 8.18 తదుపరి శతభిషం; వర్జ్యం: రా.2.52-4.20; దుర్ముహూర్తం: ఉ.8.29-9.21, రా.10.25-11.08; అమృతఘడియలు: ఉ.10.27-12.15; రాహుకాలం: మ.3.00-4.40; సూర్యోదయం: 5.55; సూర్యాస్తమయం: 6.47

హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆహార ధర దడ

రెండేళ్లలో రేట్లు రెట్టింపు!.. వాతావరణ మార్పులు, అకాల వర్షాలే కారణం

సవాళ్లు ఉన్నా 2024-25లో ఆర్థిక వృద్ధి 6.5-7 శాతం

మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.. 2050కల్లా దేశంలో వృద్ధుల సంఖ్య రెట్టింపు
వారి సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలి.. 18 ఏళ్లు దాటిన వారిలో మూడింతలు పెరిగిన స్థూలకాయం
కేంద్రం, రాష్ట్రాలు కలిసి విద్యానాణ్యత పెంచాలి.. యువతలో సగం మందికే ఉద్యోగ నైపుణ్యాలు!
దేశంలో ఏటా 78 లక్షల కొలువులు కల్పించాలి
2023-24 ఆర్థిక సర్వేలో వెల్లడి
లోక్‌సభలో నేడు కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మల

తెలంగాణ పురుషుల్లో 32.3 శాతం, స్త్రీలలో 30.1 శాతం ఊబకాయులని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే పేర్కొన్నట్లు ఆర్థిక సర్వే వివరించింది. ఆంధ్రప్రదేశ్‌లో పురుషుల్లో 31.1 శాతం, మహిళల్లో 36.3 శాతం ఊబకాయులేనని తెలిపింది.



అప్రజాస్వామికంగా.. గొంతునొక్కే యత్నం

పార్లమెంట్ ఉన్నది పార్టీల కోసం కాదు.. దేశం కోసం
రాజకీయాలకు వేదిక కాదు
2029 ఎన్నికల్లో మనం మరోసారి తలపడదాం
అప్పటి వరకు ప్రజా సమస్యలపై దృష్టిపెడదాం
బడ్జెట్ సమావేశాలకు ముందు మీడియాతో ప్రధాని మోదీ
కాంగ్రెస్ ఆగ్రహం

2

న్యూఢిల్లీ, జూలై 22: ఎన్ని సవాళ్లు ఎదురైనా దేశ ఆర్థిక వృద్ధి బాగానే ఉంటుందని ఆర్థిక సర్వే వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.5 శాతం నుంచి 7 శాతం వరకు ఉంటుందని తెలిపింది. దేశంలో ఆహార ద్రవ్యోల్బణం భారీగా పెరిగిందని పేర్కొంది. 2022లో ఇది 3.8 శాతం ఉండగా.. 2023లో 6.6 శాతానికి, 2024లో 7.5 శాతానికి పెరిగిందని వివరించింది. అంటే గడిచిన రెండేళ్లలో 97 శాతం పెరిగిపోయినట్లు పేర్కొంది. వాతావరణ మార్పులు, వడగాడ్పులు, రుతుపవనాల విస్తరణలో వ్యత్యాసాలు, అకాల వర్షాలు వంటి కారణాలతో ఆహార ధరలు రెట్టింపు అయ్యాయని తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను మంగళవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా

మిగతా 2వ పేజీలో...

ఆర్థిక సర్వే పూర్తి వివరాలు బిజినెస్ పేజీలో..



ఢిల్లీలో రాహుల్‌గాంధీని కలిసి వరంగల్ కృతజ్ఞత సభకు రావాలని ఆహ్వానిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నిధులివ్వండి..

మూసీ పరిరక్షణకు రూ.10వేల కోట్లు కావాలి

నల్లా కనెక్షన్ల ఏర్పాటుకు 16 వేల కోట్లు అవసరం.. జల్ జీవన్ మిషన్ నిధులు మంజూరు చేయండి
ధాన్యం బకాయిలు 1,468 కోట్లు చెల్లించండి.. గ్యాస్ సబ్సిడీని ముందే చెల్లిస్తాం.. అనుమతివ్వండి
కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్ విజ్ఞప్తులు.. రాహుల్, ఖర్గేతో రేవంత్, భట్టి, ఉత్తమ్ భేటీ
ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణాన్ని వేగిరం చేయండి.. కేంద్రానికి మంత్రి కోమటిరెడ్డి వినతి

న్యూఢిల్లీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు జాతీయ నదీ పరిరక్షణ ప్రణాళిక కింద రూ.10వేల కోట్లు కేటాయించాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లో 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న మూసీలో మురుగు నీరు చేరుతోందని, దీనిని శుద్ధి చేయాలని తమ ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. శ్రమశక్తి భవన్‌లో సోమవారం కేంద్ర మంత్రితో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. మూసీలో చేరే మురుగును శుద్ధి చేయడం, వరద నీటి కాల్వల నిర్మాణం, స్థాయి పెంపు, మూసీ సుందరీకరణకు సహకరించాలని కోరారు. ఇందులో భాగంగా మూసీలో మురుగు నీటి శుద్ధి పనులకు రూ.4వేల కోట్లు, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌ను

మిగతా 13వ పేజీలో...

ఆరోగ్యశ్రీ చికిత్స ధరలు 20-25% పెంపు

1,375 చికిత్సల రేట్లు మార్పు
కొత్తగా 163 ప్యాకేజీలు చేర్పు
జీవో విడుదల చేసిన సర్కారు

13



బిహార్‌కు హోదా ఇవ్వలేం

లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ
ఎన్డీయే భాగస్వామి జేడీయూకు షాక్
హోదా, ప్యాకేజీ కోరుతున్న నితీశ్ పార్టీ
అఖిలపక్షంలోనూ గట్టిగా డిమాండ్
అయినా కేంద్ర సర్కారుది పాత వైఖరే

2

ఉగ్ర గోదావరి

భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ.. 50.6 అడుగులకు నీరు
ప్రాణహిత ఉధృతి.. ముంపులో గ్రామాలు.. మేడిగడ్డకు 9.5 లక్షల క్యూసెక్కులు
జూరాల సహా తుంగభద్ర నుంచీ శ్రీశైలానికి 2 లక్షల క్యూసెక్కుల వరద!
మరో 3 రోజులూ వర్షాలు.. కలెక్టర్లూ అప్రమత్తం.. సమీక్షలో సీఎస్ ఆదేశం
ఏపీలోని రాజమహేంద్రవరం వద్ద సముద్రాన్ని తలపిస్తున్న గోదావరి



గోదావరి ఉధృతితో భద్రాచలంలో నీటమునిగిన స్నానఘట్టాలు, కల్యాణకట్ట ప్రాంతం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద నది ప్రవాహం 50.6 అడుగులకు చేరడంతో సోమవారం రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. మేడిగడ్డ వద్ద ఏకంగా 9 మీటర్ల ఎత్తున ప్రవాహం కొనసాగుతోంది. మరోవైపు కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలానికి భారీ వరద వస్తోంది. జూరాలతోపాటు తుంగభద్ర నుంచీ నీటిని విడుదల చేయడంతో సుమారుగా 2లక్షల క్యూసెక్కుల ప్రవాహం శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. రాష్ట్రంలో వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టినా.. పలు వాగులు, వంకలు ఇంకా ఉప్పొంగి ప్రవహిస్తూనే ఉన్నాయి. కొన్ని జిల్లాల్లో కల్వర్టులు, రోడ్లు కొట్టుకుపోగా.. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. మరోవైపు.. వచ్చే మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో.. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. భద్రాచలం వద్ద నాలుగు రోజులుగా క్రమంగా పెరుగుతూ వచ్చిన ప్రవాహం.. సోమవారం అర్ధరాత్రి వరకు 50.6 అడుగులకు

మిగతా 12వ పేజీలో...

భారత పరీక్షా వ్యవస్థ ఒక మోసం

డబ్బుంటే దానిని కొనవచ్చని చాలామంది నమ్ముతున్నారు
ప్రతిపక్షం భావన కూడా అదే.. లోక్‌సభలో రాహుల్‌గాంధీ
విద్యా మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలి: అఖిలేశ్
ప్రతిపక్ష నేతలది మొసలి కన్నీరు.. యూపీఏ హయాం నాటి లీకేజీ గణాంకాలు బయటకు వస్తే వారే ఇబ్బందిపడతారు: ప్రధాన్

న్యూఢిల్లీ, జూలై 22: భారత పరీక్షా వ్యవస్థ ఒక మోసమని.. డబ్బుంటే దాన్ని కొనేయవచ్చని చాలామంది నమ్ముతున్నారని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షం భావన కూడా అదేనని ఆయన స్పష్టం చేశారు. కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు తాము నీట్ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతూనే ఉంటామని తేల్చిచెప్పారు. "మన పరీక్షా వ్యవస్థలో తీవ్ర సమస్య ఉందని దేశం మొత్తానికీ తెలుసు. కానీ, మంత్రి (కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్రప్రధాన్) తనను తప్ప అందరినీ నిందిస్తున్నారు. ఇక్కడ జరుగుతున్నదానికి సంబంధించి మౌలిక విషయాలు కూడా ఆయనకు తెలుసని నేను అనుకోను. జరుగుతున్న పరిణామాల పట్ల లక్షలాది మంది విద్యార్థులు తీవ్రంగా ఆందోళన

మిగతా 2వ పేజీలో...

నీట్‌లో ఒక ప్రశ్నకు జవాబు గుర్తించేందుకు కమిటీ

ఐఐటీ ఢిల్లీ డైరెక్టర్‌కు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం

2

నిందితుడు సీఎం అయితే..

న్యాయస్థానాలు ప్రభావితమవుతాయా!?

కేసును వేరే రాష్ట్రానికి ఎందుకు బదిలీ చేయాలి!?
ఉన్నత స్థానాల్లోని వ్యక్తులపై కేసులు నమోదైతే పాక్, శ్రీలంకకు మార్చాలా?
ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు



పైసల్లేక పథకాలు పరేషాన్

12

ఎన్నికల్లేక పంచాయతీలకు నిధులు నిల్
కల్యాణలక్ష్మి చెక్కులు ఇచ్చేది ఎప్పుడు?
ఉపాధి హామీలో రాష్ట్ర వాటా ఏది?
రాష్ట్రంలో తీవ్రంగా విద్యుత్తు సమస్యలు
40% మందికి రుణమాఫీ ఎగ్గొట్టారు
మీడియాతో చిట్‌చాట్‌లో హరీశ్‌రావు

బిల్లులే కీలకం!

1 పూర్తిస్థాయి బడ్జెట్‌తోపాటు ప్రభుత్వ ప్రాధాన్య బిల్లులపై చర్చ, ఆమోదం
1 విద్య, వ్యవసాయ కమిషన్, స్కిల్ వర్సిటీ బిల్లులు పెట్టనున్న సర్కారు
1 స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ పెంపు బిల్లు కూడా..
1 జాబ్ క్యాలెండర్, రైతు భరోసాపై విధాన ప్రకటన చేయనున్న సీఎం
1 నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు.. 10 రోజులు జరిగే చాన్స్
1 లాస్య నందిత మృతికి తొలిరోజు సంతాపం.. వాయిదా.. బీఏసీ భేటీ
1 రైతు బంధు, రుణ మాఫీ, గ్యారెంటీలపై నిలదీయాలని బీఆర్‌ఎస్..
1 అవినీతి, హామీలపై ప్రశ్నించనున్న బీజేపీ.. సంసిద్ధంగా అధికారపక్షం



హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు! విద్య కమిషన్ ఏర్పాటు! వ్యవసాయ కమిషన్ ఏర్పాటు! స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల పెంపు! రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న ఈ బిల్లులన్నీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చకు రానున్నాయి. పూర్తిస్థాయి బడ్జెట్‌తోపాటు వీటిని కూడా సభ ఆమోదం కోసం ప్రవేశపెట్టనున్నారు. వీటితోపాటు జాబ్ క్యాలెండర్, రైతు భరోసా విధి విధానాలపైనా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేయనున్నారు. అందుకే, మంగళవారం నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు కీలకంగా మారాయి. ఉదయం 11 గంటలకు సమావేశాలు ప్రారంభం కావడంతోనే దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత మృతికి శాసనసభ

మిగతా 13వ పేజీలో...

అసెంబ్లీకి కేసీఆర్!

ప్రతిపక్ష నేత హోదాలో తొలిసారి హాజరు..
ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరంపై స్పష్టత ఇవ్వనున్న మాజీ సీఎం



స్మితా సబర్వాల్.. మెంటల్లీ అన్‌ఫిట్

దివ్యాంగులపై వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి
24 గంటల్లో క్షమాపణ చెప్పాలి
లేదంటే నిరవధిక నిరశన దీక్ష
ఐఏఎస్ శిక్షకురాలు బాలలత
ఐఏఎస్ అధికారి వ్యాఖ్యలతో ఏకీభవించను: హరీశ్‌రావు
క్షమాపణలు చెప్పాలి: తమ్మినేని
దివ్యాంగుల ఆగ్రహజ్వాలలు.. పోలీసులకు ఫిర్యాదులు

3

వేతనాలు ఎన్నడో?

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల అవస్థలు
వైద్య శాఖలో 30 వేల మందికి 2 నెలలుగా బాకీ
అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలదీ అదే పరిస్థితి
కుటుంబాలు గడిచే పరిస్థితిలేదని ఆవేదన
మధ్యాహ్న భోజనంలో ఏడు నెలలుగా పెండింగ్



హైదరాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందడం లేదు. కొన్ని విభాగాల్లో నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. అసలే అరకొర జీతాలు.. అవీ నెలనెలా అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నామని వారు వాపోతున్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలతో కుటుంబం గడవడం కష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫీజులు చెల్లించలేక పిల్లల్ని స్కూల్ మాన్పిస్తున్నామని, దురదృష్టవశాత్తు ఇంట్లో ఎవరికైనా ఆరోగ్య సమస్య వస్తే వైద్యానికి డబ్బు ఎలా తేవాలో అర్థం కావడం లేదని ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా కొన్ని ప్రభుత్వ విభాగాల్లోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్

మిగతా 13వ పేజీలో...

ఏక్‌నాథ్ శిందేను కలిసిన శరద్‌పవార్



న్యూఢిల్లీ, జూలై 22: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ సోమవారం భేటీ అయ్యారు. ముంబైలోని సహ్యాద్రి గెస్ట్ హౌస్‌లో వారిద్దరూ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాల ధరలు, షుగర్ ఫ్యాక్టరీలు, ఇరిగేషన్ సంబంధిత అంశాలపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది చివరిలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఈ నేపథ్యంలో వీరి సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది.

'సంఘ్'లో ప్రభుత్వ ఉద్యోగులపై నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ, జూలై 22: ప్రభుత్వ ఉద్యోగులు ఆరెస్సెస్ కార్యకలాపాల్లో పాల్గొనకుండా 1966లో విధించిన నిషేధాన్ని కేంద్రం ఎత్తివేసింది. ఈ నెల 9న ఈ ఉత్తర్వులిచ్చినట్లు బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జి అమిత్ మాలవీయ సోమవారం 'ఎక్స్'లో తెలిపారు. అసలు నిషేధమే విధించి ఉండాల్సింది కాదని, 58 ఏళ్లనాటి ఈ ఉత్తర్వులు రాజ్యాంగవిరుద్ధమని, వాటిని మోదీ సర్కారు ఎత్తివేసిందని వ్యాఖ్యానించారు. మోదీ సర్కారు నిర్ణయంపై విపక్షాలు మండిపడ్డాయి. ఇది దురదృష్టకర నిర్ణయమని.. ప్రజా తీర్పు నుంచి బీజేపీ ప్రభుత్వం పాఠాలు నేర్వడం లేదని కాంగ్రెస్ విమర్శించింది. వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు కూడా ఈ నిషేధాన్ని పొడిగించారని.. సంఘ్‌తో దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించుకునేందుకే ప్రధాని మోదీ దానిని ఎత్తివేశారని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ 'ఎక్స్'లో ధ్వజమెత్తారు. ఇక ప్రభుత్వ ఉద్యోగులు నిక్కర్లు వేసుకుని ఆఫీసులకు వస్తారని ఎద్దేవాచేశారు. రాజ్యాంగాన్ని, జాతీయపతాకాన్ని, జాతీయ గీతాన్ని అంగీకరించేందుకు సంఘ్ వ్యతిరేకించినందునే ఆ సంస్థపై నిషేధం విధించారని ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు.

కన్నడిగులకు ఫోన్‌పే సీఈవో క్షమాపణలు

బెంగళూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కన్నడిగులకు ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమల్లో ఉద్యోగాల రిజర్వేషన్ అంశానికి వ్యతిరేకంగా తీవ్ర వ్యాఖ్యలు చేసిన ఫోన్ పే సంస్థ ఫౌండర్ అండ్ సీఈఓ సమీర్ నిగమ్ క్షమాపణ చెప్పారు. ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమల ఉద్యోగాల్లో కన్నడిగులకు రిజర్వేషన్ కల్పించాలని గతవారం రాష్ట్ర కేబినెట్‌లో తీర్మానం చేశారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. ఈలోగానే సమీర్ నిగమ్ తీవ్రంగా స్పందించారు. తాను దేశవ్యాప్తంగా వేలాదిమందికి ఉద్యోగాలు కల్పించానని, తన పిల్లలు కర్ణాటకలో ఉద్యోగానికి అర్హులు కారా..? అని వ్యాఖ్యానించారు. సమీర్ వ్యాఖ్యలపై కన్నడిగులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫోన్ పే యాప్‌ను బాయ్‌కాట్ చేయాలని సోషల్‌మీడియాలో డిమాండ్ జోరుగా సాగింది. దీంతో.. కర్ణాటకను, కన్నడిగులకు అవమానించే ఉద్దేశం తనకు లేదని, కర్ణాటక సర్కారు, కన్నడిగుల మద్దతుకు సదా కృతజ్ఞుడినని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

పీఎం సూర్య ఘర్ పథకం కింద డిస్కమ్‌లకు రూ.4,950 కోట్ల ప్రోత్సాహకాలు

న్యూఢిల్లీ, జూలై 22: పీఎం-సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం కింద విద్యుత్ పంపిణీ సంస్థల(డిస్కమ్‌లు)కు రూ.4,950 కోట్ల ప్రోత్సాహకాన్ని అందించడానికి సంబంధించి నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఈ) మార్గదర్శకాలు జారీ చేసినట్టు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సోమవారం తెలిపారు. బేస్‌లైన్ స్థాయికి మించి అదనంగా గ్రిడ్‌కు కనెక్ట్ చేసిన రూఫ్‌టాప్ సోలార్ సామర్థ్యం స్థాపనకు డిస్కమ్‌లకు ప్రోత్సాహకాలు ఇవ్వడం వంటివి ఇందులో ఉన్నాయని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. రూ.75,021 కోట్ల పెట్టుబడితో తీసుకొస్తున్న ఈ ప్రాజెక్టును 2026-27 వరకు అమలు చేయనున్నారు.

అవకతవకలతో 79 సీట్లలో బీజేపీకి లబ్ధి

ముంబై, జూలై 22: లోక్‌సభ ఎన్నికలు, ఓట్ల లెక్కింపు సమయంలో పెద్దఎత్తున అవకతవకలు చోటుచేసుకున్నాయని 'ఓట్ ఫర్ డెమోక్రసీ' సంస్థ నివేదిక ఆరోపించింది. పోలైన ఓట్లు మొదట ప్రకటించినప్పటి కంటే చివరిగా వెల్లడించే సమయానికి అనూహ్యంగా 4,65,46,885 పెరిగాయని, ఏడు దశల పోలింగ్‌లో ఈ పెరుగుదల 3.2 శాతం నుంచి 6.32 శాతం వరకు ఉందని పేర్కొంది. అలాగే పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య కూడా తేడా ఉందని పేర్కొంది. దీని వల్ల బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు 79 స్థానాల్లో లబ్ధి కలిగిందని తెలిపింది. ఇందులో ఒడిసాలో 18, మహారాష్ట్రలో 10, పశ్చిమ బెంగాల్‌లో 10 స్థానాలు ఉన్నాయని వివరించింది.

ఇక 'ఏసీ ఎకానమీ'గా గరీబ్ రథ్ రైళ్లు

న్యూఢిల్లీ, జూలై 22: కొత్తగా రూపొందించిన ఏసీ ఎకానమీ కోచ్‌లను అన్ని గరీబ్ రథ్ రైళ్లకు అమర్చాలని రైల్వేశాఖ నిర్ణయించింది. 'ప్రస్తుతం గరీబ్ రథ్ రైళ్లకు ఉన్న కోచ్‌లన్నీ పురాతనమైనవి. అవి బాగా పాతబడిపోయాయి. వాటి స్థానంలో ఎల్‌హెచ్‌బీ(లింకే హాఫ్‌మాన్ బుష్) ర్యాక్‌లతో కూడిన థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లు అమర్చాలని నిర్ణయించాం' అని రైల్వే శాఖ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. కొత్త ర్యాక్‌లతో కూడిన రైళ్లను కొన్ని రూట్‌లలో ఈనెల నుంచే నడపనున్నామన్నారు. ఏసీ ఎకానమీ క్లాస్ టికెట్ ధర థర్డ్ ఏసీ టికెట్ ధర కంటే తక్కువే. ఇప్పటి వరకు గరీబ్ రథ్‌లో థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ, చైర్ కార్ కోచ్‌లు ఉండగా, వాటి స్థానంలో 20 ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో కూడిన ర్యాక్‌లు అందుబాటులోకి రానున్నాయి.



ముంబై డాక్‌యార్డ్‌లో ఉన్న యుద్ధనౌక ఐఎన్ఎస్ బ్రహ్మపుత్రలో ఆదివారం సాయంత్రం తీవ్ర అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రమాద తీవ్రతకు నౌక నీళ్లలో ఇలా ఒక పక్కకు ఒరిగిపోయింది. ఈ ఘటనలో ఒక నావికుడు గల్లంతయ్యారు.

ఆహార ధర దడ

(మొదటి పేజీ తరువాయి)

సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ క్రమంలో సోమవారం ఆమె 2023-24 ఆర్థిక సర్వేను విడుదల చేశారు. విద్య, ఆరోగ్యం, ఉద్యోగావకాశాలు, ఆహార ధరల పెరుగుదల, వృద్ధుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు వంటి వివిధ అంశాలపై ఆర్థిక సర్వే సమగ్ర సూచనలు చేసింది. దేశంలో నాణ్యమైన విద్యను అందించాలని.. అందుకు కేంద్రం, రాష్ట్రాలు, స్థానిక సంస్థలు కలిసి పనిచేయాలని స్పష్టం చేసింది. మానసిక ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించింది. 2050 నాటికి వృద్ధుల సంఖ్య రెట్టింపు కానుందని.. ఈ క్రమంలో వారి సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొంది. దేశంలో పెరిగిపోతున్న స్థూలకాయం సమస్యపై ఆందోళన వ్యక్తం చేసింది. దేశ ఆర్థికాభివృద్ధి కోసం వ్యవసాయేతర రంగంలో ఏటా సుమారు 78 లక్షల ఉద్యోగాలు కల్పించాలని సూచించింది. కృత్రిమ మేధ(ఏఐ) కారణంగా సేవల రంగంలో భారతదేశ ఎగుమతులు ఏటా తగ్గనున్నాయని పేర్కొంది.



బడ్జెట్‌ను రూపొందించిన ఆర్థికశాఖలోని అధికారుల బృందంతో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌదరి

సైకియాట్రిస్టుల సంఖ్య పెంచాలి

మానసిక ఆరోగ్యం విషయంలో మన పంథా మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్థిక సర్వే పేర్కొంది. వ్యక్తిగత, దేశ అభివృద్ధిలో మానసిక ఆరోగ్యానిది కీలక పాత్ర అని తెలిపింది. సైకియాట్రిస్టుల సంఖ్య పెంచాలని, పాఠశాలల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచాలని స్పష్టం చేసింది. జాతీయ మానసిక ఆరోగ్య సర్వే (ఎన్ఎంహెచ్ఎస్) 2015-16 ప్రకారం దేశంలో 18 ఏళ్లు పైబడిన వారిలో 10.6 శాతం మంది మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారని తెలిపింది. 70 నుంచి 92 శాతం మంది సరైన చికిత్స తీసుకోవడం లేదని గుర్తుచేసింది. ప్రస్తుతం దేశంలో వృద్ధుల సంరక్షణ రంగం విలువ రూ.57,881 కోట్లని తెలిపింది. కానీ, ఈ రంగంలో అనేక లోపాలు ఉన్నాయంది. మౌలిక వసతులు, వృద్ధాప్యంలో వచ్చే వ్యాధులపై పరిశోధన, పర్యవేక్షణ యంత్రాంగం, అత్యవసర స్పందన వ్యవస్థ వంటి అంశాల్లో చాలా లోపాలు ఉన్నాయని వివరించింది. 2022 నాటి ఐరాస గణాంకాల ప్రకారం భారత జనాభాలో 0-14 ఏళ్లలోపు వారి సంఖ్య నాలుగో వంతు (సుమారు 36 కోట్ల మంది) ఉండగా.. 60 ఏళ్లు పైబడిన వారి సంఖ్య పదో వంతు (సుమారు 14.7 కోట్ల మంది) ఉన్నట్లు తెలిపింది. 2050 నాటికి పిల్లల జనాభా 18 శాతానికి (30 కోట్ల మందికి) తగ్గిపోనుండగా.. వృద్ధుల సంఖ్య 20.8 శాతానికి (34.7 కోట్లకు) పెరుగుతుందని వెల్లడించింది.

ఊబకాయం.. ఆందోళనకరం..

పెరిగిపోతున్న స్థూలకాయం సమస్యపై ఆర్థిక సర్వేలో ఆందోళన వ్యక్తమైంది. అత్యధిక చక్కెర, కొవ్వులతో కూడిన ఆహార పదార్థాల వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. దేశంలో 54 శాతం అనారోగ్య సమస్యలకు ఆహారపు అలవాట్లే కారణమని తెలిపింది. ఇటీవల భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) విడుదల చేసిన నివేదికను ప్రస్తావిస్తూ.. అధిక చక్కెర, కొవ్వులతో కూడిన ప్రాసెస్డ్ ఆహార వినియోగం విపరీతంగా పెరిగిందని సర్వే తెలిపింది.స్థూలకాయం విషయంలో వియత్నాం, నమీబియా తర్వాత స్థానంలో భారత్ ఉందంటూ ప్రపంచ ఒబెసిటీ సమాఖ్య నివేదికను ఉటంకించింది. ఆంధ్రప్రదేశ్‌లో పురుషుల్లో 31.1 శాతం, మహిళల్లో 36.3 శాతం ఊబకాయులేనని, తెలంగాణలో పురుషుల్లో 32.3 శాతం, స్త్రీలలో 30.1 శాతం ఊబకాయులని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే పేర్కొందని వివరించింది. విద్యా నాణ్యతను మెరుగుపర్చాలని, ప్రత్యేకించి ప్రాథమిక విద్యపై దృష్టి సారించాలని ఆర్థిక సర్వే సూచించింది.

65 శాతం మంది 35 ఏళ్లలోపు వారే..

వ్యవసాయేతర రంగంలో 2030 వరకు ఏటా సగటున 78 లక్షల ఉద్యోగాలు కల్పించాలని సర్వే స్పష్టం చేసింది. 2023లో దేశంలో మొత్తం పనిచేసేవారి వారి సంఖ్య 56.50 కోట్లు ఉండగా.. ఇందులో వ్యవసాయ రంగ కార్మికుల వాటా 45.8 శాతం ఉందని తెలిపింది. 2047 నాటికి ఇది నాలుగో వంతుకు తగ్గిపోతుందని అంచనా వేసింది. ఈ వ్యత్యాసాన్ని భర్తీ చేయడానికి వ్యవసాయేతర రంగంలో ఏటా సగటున 78 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించాలని పేర్కొంది. ఇక తయారీ రంగంలో ఉపాధి కల్పన వృద్ధి రేటు తగ్గిపోతోందని తెలిపింది. దేశంలోని 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారేనని.. చాలా మందికి ఆధునిక నైపుణ్యాలు లేవని తెలిపింది. ఇక దేశ యువతలో 51.25 శాతం మందికి ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు ఉన్నాయని పేర్కొంది. అయితే పదేళ్ల కిందట ఇది 34 శాతమే ఉందని.. ప్రస్తుతం మెరుగుపడిందని సర్వే వెల్లడించింది.

● కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా సేవల రంగంలో భారతదేశ ఎగుమతుల వృద్ధి రేటు రాబోయే పదేళ్లలో ఏటా 0.3 నుంచి 0.4 పర్సంటేజీ పాయింట్లు తగ్గిపోయే అవకాశం ఉందని ఆర్థిక సర్వే తెలిపింది.

బడ్జెట్‌పై చర్చకు 20 గంటలు!

లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌తో పాటు రైల్వే, విద్య, ఆరోగ్యం, ఎంఎస్ఎంఈ, ఆహార ప్రాసెసింగ్ మంత్రిత్వ శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చ జరపాలని లోక్‌సభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) సోమవారం నిర్ణయించింది. ఈ మేరకు పార్లమెంట్ సమావేశాల ఎజెండాను నిర్ణయించేందుకు లోక్‌సభ, రాజ్యసభల బీఏసీలు సోమవారం సమావేశమయ్యాయి. లోక్‌సభ, రాజ్యసభ.. రెండూ బడ్జెట్‌పై చర్చకు 20 గంటల చొప్పున సమయం కేటాయించాలని నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

లోకం తీరు



బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వలేం..

లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ

ఎన్డీయే కీలక భాగస్వామి జేడీయూకు షాక్

న్యూఢిల్లీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక హోదా కోసం బిహార్ ప్రభుత్వ చేసిన వినతిని కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. దీనిపై సోమవారం లోక్‌సభలో స్పష్టమైన వైఖరిని తెలియజేసింది. బడ్జెట్ పార్లమెంటు సమావేశాలకు సన్నాహకంగా ఆదివారం జరిగిన అఖిలపక్ష పార్టీల సమావేశంలో ఎన్డీయే ముఖ్య భాగస్వామి, బిహార్ అధికార పక్షం జేడీయూ ప్రత్యేక హోదా అంశాన్ని ప్రస్తావించింది. ప్రత్యేక హోదాను, ప్రత్యేక ప్యాకేజీని బిహార్ నుంచి జార్ఖండ్‌ను విభజించిన నాటి నుంచీ తాము కోరుతున్నామని జేడీయూ నేత మనోజ్‌కుమార్ ఝా వివరించారు. "కేంద్రం బిహార్‌ను చౌక శ్రమల సరఫరాదారుగానే చూస్తోంది. ఆ దృష్టి మారాలి. రాజకీయాలకు అతీతంగా మేం.. ప్రత్యేక హోదా విషయంలో కేంద్ర విధానం మారాలని కోరుకుంటున్నాం. ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ రెండూ బిహార్‌కు ఇవ్వాల్సిందే"నని ఆయన స్పష్టం చేశారు. అయితే, రాష్ట్రాలకు ప్రత్యేక హోదాపై తన పాత వైఖరినే మోదీ ప్రభుత్వం పునరుద్ఘాటించింది. పర్వత ప్రాంతాలు, తక్కువ జనాభా, అధిక సంఖ్యలో గిరిజన జనాభా, సరిహద్దులు, ఆర్థిక, మౌలికసదుపాయాల్లో వెనుకబాటుతనం, రాష్ట్ర నిధులు ఏ మాత్రం సరిపోకపోవడం వంటి సమస్యలు ఉన్న రాష్ట్రాలకే ప్రత్యేక హోదా కల్పించాలని జాతీయ అభివృద్ధి మండలి నిర్ణయించిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో తెలిపారు. ఈ లక్షణాలు బిహార్‌కు లేవని, అందుకే ఆ రాష్ట్రానికి ప్రత్యేక హోదా లభించదని తెలిపారు. కాగా, ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా పొందే అర్హత లేదు.

పార్లమెంట్‌లో అప్రజాస్వామికంగా నా గొంతునొక్కే ప్రయత్నం



» బడ్జెట్ సెషన్‌కు ముందు మీడియాతో ప్రధాని

న్యూఢిల్లీ, జూలై 22: పార్లమెంట్ సాక్షిగా విపక్షాలు అప్రజాస్వామికంగా తన గొంతు నొక్కేయాలని ప్రయత్నించాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. గత సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగానికి మోదీ ధన్యవాదాలు చెబుతుండగా.. విపక్షాలు ఆందోళన చేయడాన్ని ఆయన గుర్తుచేశారు. "రాజకీయాలకు పార్లమెంట్ వేదిక కాదు. పార్లమెంట్ అనేది పార్టీల కోసం కాదు. దేశ ప్రజల కోసం. ఎన్నికల్లో పోరాడాం. ఎన్నికలు అయిపోయాయి. మళ్లీ 2029 ఎన్నికల్లో పోరాడుదాం. అప్పటి వరకు పార్లమెంట్‌లో మహిళలు, యువత, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రయత్నిద్దాం" అని వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన పార్లమెంట్ సమావేశాలకు ముందు విలేకరులతో మాట్లాడారు. మంగళవారం ప్రవేశపెట్టబోయే బడ్జెట్ రాబోయే ఐదేళ్లకు మార్గదర్శకంగా ఉంటుందని, విపక్షాలు కూడా 2047లోగా సాధించాలని సంకల్పించిన 'వికసిత్ భారత్' కోసం కృషి చేయాలని కోరారు. మోదీ 'గొంతు నొక్కడం' వ్యాఖ్యలను కాంగ్రెస్ ఖండించింది. "విపక్షాలు తన గొంతు నొక్కాయని ప్రధాని కన్నీళ్లు కారుస్తున్నారు. కానీ, గడిచిన పదేళ్లుగా మోదీయే దేశం గొంతు నొక్కుతున్నారు" అని విమర్శించింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది.

'లఖింపూర్ హింస' కేసులో ఆశిష్ మిశ్రాకు బెయిల్

న్యూఢిల్లీ, జూలై 22: లఖింపూర్ ఖేరీ హింసాకాండ ఘటనలో నిందితుడిగా ఉన్న కేంద్ర మాజీ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రాకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే ఆయన ఢిల్లీ లేదా లక్నోలోనే ఉండాలంటూ ఆదేశించింది. 2021లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖింపూర్‌లో ఆందోళన చేస్తున్న రైతుల మీదకు ఆశిష్ మిశ్రా కారు దూసుకెళ్లిన ఘటనలో నలుగురు రైతులు మరణించగా.. ఆ తర్వాత అల్లర్లలో మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసులో గతేడాది జనవరి 25న ఆశిష్ మిశ్రాకు మధ్యంతర బెయిల్ సుప్రీంకోర్టు మంజూరు చేసింది. తాజా విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ '114 మంది సాక్షుల్లో ఇప్పటివరకు ఏడుగురినే విచారించారు. విచారణను వేగవంతం చేయాలని ట్రయల్ కోర్టును ఆదేశిస్తున్నాం' అని పేర్కొంది. కేసులోని మరో నలుగురు రైతులకు కూడా బెయిల్ మంజూరు చేసింది.

నేషనల్ హెరాల్డ్ కేసులో లిఖిత వాదనలు దాఖలు చేయండి

న్యూఢిల్లీ, జూలై 22: నేషనల్ హెరాల్డ్ కేసులో లిఖిత పూర్వక వాదనలు దాఖలు చేయాలంటూ నిందితులుగా ఉన్న కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా, రాహుల్‌తో పాటు పిటిషన్ వేసిన బీజేపీ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామిని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. '4వారాల్లోగా తమ వాదనలను లిఖిత పూర్వకంగా దాఖలు చేయాలి. గడువు దాటితే రూ.15 వేల రుసుముతో స్వీకరిస్తాం' అని జస్టిస్ నీనాబన్సాల్ స్పష్టం చేశారు. విచారణను అక్టోబర్ 29కి వాయిదా వేశారు.

భారత పరీక్షా వ్యవస్థ ఒక మోసం

(మొదటి పేజీ తరువాయి)

చెందుతున్నారు. భారత పరీక్షా వ్యవస్థ ఒక మోసమని వారు విశ్వసిస్తున్నారు. బాగా డబ్బు ఉంటే.. భారత పరీక్షా వ్యవస్థను కొనేయవచ్చని నమ్ముతున్నారు. ఇక్కడ ప్రతిపక్షంలో ఉన్నవారి భావన కూడా అదే" అని రాహుల్ సోమవారం లోక్‌సభలో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నీట్ అక్రమాల గురించి అడుగుతుంటే ధర్మేంద్రప్రధాన్ సుప్రీంకోర్టు గురించి, ప్రధాని గురించి మాట్లాడుతున్నారే తప్ప.. ఈ సమస్యను పరిష్కరించడానికి తాము తీసుకుంటున్న చర్యల గురించి చెప్పలేకపోయారన్నారు. ఒక్క నీట్ పరీక్ష అనే కాక, అన్ని పెద్ద పరీక్షల పరిస్థితీ అలాగే ఉందని ధ్వజమెత్తారు. ఇక, నీట్ నిర్వహణలో అవకతవకలను దేశంలోనే అతిపెద్ద కుంభకోణంగా అభివర్ణించిన కాంగ్రెస్ ఎంపీ (ఎర్నాకుళం నియోజకవర్గం) హిబి ఈడెన్.. పేపర్ లీకేజీపై విచారణకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. "ప్రభుత్వ గణాంకాల ప్రకారమే గడిచిన ఏడేళ్లలో 15 రాష్ట్రాల్లో 70 పరీక్షల ప్రశ్నపత్రాలు లీకయ్యాయి" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అఖిలేశ్ కూడా ధర్మేంద్ర ప్రధాన్‌పై మండిపడ్డారు. ఆయన విద్యా మంత్రిగా ఉన్నంతవరకూ విద్యార్థులకు న్యాయం జరగదని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వం పేపర్ లీకేజీల్లో రికార్డులు సృష్టిస్తోందని వ్యంగ్యంగా అన్నారు. రాహుల్, అఖిలేశ్ వ్యాఖ్యలపై ధర్మేంద్ర ప్రధాన్ ఘాటుగా స్పందించారు. గట్టిగా అరిచినంతమాత్రాన అబద్ధం నిజమైపోదని.. దేశంలో పరీక్షల వ్యవస్థను పనికిమాలిన వ్యవస్థగా విపక్ష నేత పేర్కొనడాన్ని తీవ్రంగా



ఖండిస్తున్నానని ఆయన వ్యాఖ్యానించారు. "లోక్‌సభలో విపక్ష నేత (రాహుల్), ఆయన దుష్టకూటమి మొసలికన్నీరు కారుస్తున్నారు. యూపీఏ హయాంలోను, ఉత్తరప్రదేశ్‌లో అఖిలేశ్ అధికారంలో ఉన్నప్పటి పేపర్ లీక్స్‌కు సంబంధించి క్షేత్రస్థాయి వాస్తవాలు బయటికొస్తే వారే ఇబ్బందిపడే పరిస్థితి నెలకొంటుంద"ని ప్రధాన్ ట్వీట్ చేశారు.

16 పరీక్షలే వాయిదా..

సాంకేతిక, న్యాయ, పాలనా కారణాల వల్లగానీ, కొవిడ్ కారణంగా గానీ.. 2018 నుంచి ఇప్పటిదాకా ఎన్‌టీఏ 16 పరీక్షలను వాయిదా వేసిందని కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సుకాంత మజుందార్ సోమవారం లోక్‌సభలో తెలిపారు. డీఎంకే ఎంపీ కనిమొళి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. "2018లో ఏర్పాటైనప్పటి నుంచీ ఎన్‌టీఏ 5.4 కోట్ల మంది విద్యార్థులకు.. 240 పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది" అని ఆయన పేర్కొన్నారు. ఇక.. ఎన్‌టీఏ పనితీరుపై సమీక్ష, సంస్కరణలపై ఏర్పాటు చేసిన ఏడుగురు సభ్యుల ప్యానెల్ తాజాగా.. ఐఐటీ కాన్పూర్‌కు చెందిన ఇద్దరు విద్యావేత్తలను సభ్యులుగా చేర్చుకుంది.

కమిటీ వెయ్యండి..

నీట్ ప్రశ్నపత్రంలో 'ఆటమ్స్ (అణువుల) లక్షణాల'పై ఇచ్చిన ప్రశ్నకు సరైన సమాధానాన్ని గుర్తించడానికి ముగ్గురు నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలంటూ సుప్రీంకోర్టు ఐఐటీ ఢిల్లీ డైరెక్టర్‌ను ఆదేశించింది. వారు గుర్తించిన సమాధానాన్ని మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకల్లా సుప్రీంకోర్టు రిజిస్ట్రార్‌కు సమర్పించాలని ఆ ఆదేశాల్లో పేర్కొంది. నీట్‌కు సంబంధించి దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపి.. దీనిపై నిపుణుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని భావిస్తున్నట్టు తెలిపింది. దీనికి ముందు.. నీట్ పరీక్షను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్లను విచారించిన ధర్మాసనం.. పేపర్ లీకేజీ పెద్ద ఎత్తున జరిగిందనడానికి ఆధారాలు ఉంటే సమర్పించాలని పిటిషనర్లను కోరింది. లీకేజీ విస్తృత స్థాయిలో జరిగిందనడానికి ఆధారాల్లేవని వ్యాఖ్యానించింది. నీట్‌పై మంగళవారం కూడా విచారణ జరగనుంది.

పదార్థాలేమిటో చెప్పాలి

శాకాహారమా? మాంసాహారమా? అనేది చూపితే చాలు

» కావడి మార్గంలో పేర్ల ప్రదర్శనపై సుప్రీం కోర్టు

» యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల ఆదేశాలపై స్టే



న్యూఢిల్లీ, జూలై 22: శ్రావణ మాసంలో జరిగే కావడి యాత్ర సందర్భంగా భక్తులు వెళ్లే మార్గంలో ఉన్న హోటళ్లు, దాబాలు, తోపుడు బండ్ల ఎదుట వాటి యజమానులు సిబ్బంది సహా వ్యక్తిగత వివరాలను ప్రదర్శించాలంటూ ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు జారీ చేసిన ఆదేశాలపై సుప్రీం కోర్టు స్టే విధించింది. హోటళ్ల యజమానులు పేర్లు కాదు.. అందించే ఆహార పదార్థాలు శాకాహారమా? మాంసాహారమా? అనే వివరాలను మాత్రమే ప్రదర్శించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ టీఎంసీ ఎంపీ మహువాతో పాటు విద్యావేత్త అపూర్వానంద్, కాలమిస్ట్ ఆకార్ పటేల్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలతో పాటు ఉజ్జయిని మున్సిపాలిటీ కూడా ఇదే తరహా ఆదేశాలు ఇచ్చినందుకు మధ్యప్రదేశ్ సర్కారుకూ నోటీసులు జారీ చేసింది. కాగా, విచారణ సందర్భంగా మొయిత్రా తరఫు ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదిస్తూ.. పేర్ల ప్రదర్శనపై ప్రభుత్వాలు ఇచ్చిన ఆదేశాల వెనుక అసలు ఉద్దేశం వేరే ఉందని ఆరోపించారు. నిబంధనను ఉల్లంఘించినవారికి జరిమానా విధించే అంశాన్ని ప్రస్తావించారు. వ్యక్తి ఎవరో తెలుసుకుని దూరం పెట్టే ఉద్దేశం ఉందని, ఇది రాజ్యాంగానికి విరుద్ధమని అన్నారు. విచారణకు యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల తరఫున న్యాయవాదులు హాజరు కాలేదు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేస్తూ.. కేసు తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసింది.

గొడ్డు మాంసం ఎగుమతిదార్ల పేర్లు అడిగే దమ్ముందా!

నటుడు ప్రకాశ్‌రాజ్ వివాదాస్పద పోస్టు

హైదరాబాద్, జూలై 22: "గొడ్డు మాంసం ఎగుమతి చేసే కంపెనీల యజమానుల పేర్లు, కులం, మతమేమిటో అడిగే దమ్ము ఈ మతోన్మాదులకు ఉందా" అంటూ ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ ఎక్స్‌లో పోస్టు చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు దుమారం రేపుతున్నాయి. కావడి యాత్ర వివాదాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రప్రభుత్వాల ఆదేశాలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. మతోన్మాదులు ఇంకా పాఠాలు నేర్చుకోలేదన్నారు.

కేరళలో ముస్లిం నడిపే హోటల్‌కు వెళ్లా..

కేసు విచారణ సదర్భంగా జస్టిస్ ఎస్వీఎన్ భట్టి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. తాను కేరళలో జడ్జిగా ఉన్నప్పుడు ముస్లిం వ్యక్తి నడిపే శాకాహార హోటల్‌కు తరచూ వెళ్లేవాడినని తెలిపారు. అది అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉండేదన్నారు. కాగా, కావడి యాత్రపై యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల ఆదేశాల మీద సుప్రీంకోర్టు స్టే ఇవ్వడం పట్ల అధికార ఎన్డీఏ కూటమిలోని జేడీయూ, కాంగ్రెస్, సమాజ్‌వాదీ వంటి ప్రతిపక్ష పార్టీలు హర్షం వ్యక్తం చేశాయి. ప్రధాని మోదీ.. "రాజధర్మం" గురించి వారి సీఎంలకు చెబుతారని తాము ఆశిస్తున్నట్లు కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా వ్యాఖ్యానించారు.

అదిరేటి డ్రెస్సు మీరేస్తే..!

మోదీ, బైడెన్, ట్రంప్, పుతిన్ ర్యాంప్ వాక్.. ఏఐ వీడియోను విడుదల చేసిన ఎలాన్ మస్క్



న్యూఢిల్లీ, జూలై 22: నరేంద్ర మోదీ, జో బైడెన్, డొనాల్డ్ ట్రంప్, వ్లాదిమిర్ పుతిన్, బరాక్ ఒబామా.. వీళ్లంతా ప్రపంచస్థాయి నాయకులు. నిత్యం సంప్రదాయ దుస్తులతో దర్శనమిస్తూ ఉంటారు. వీళ్లంతా ఒకరోజు ఫ్యాషన్ ప్రపంచంలోకి అడుగుపెట్టి.. ఒకే వేదికపై అదిరేటి డ్రెస్సులతో ర్యాంప్ వాక్ చేస్తే ఎలా ఉంటుంది..? ఈ చిత్రాన్ని కలలో కూడా ఊహించలేం కదా..! అయితే.. టెస్లా అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్.. ఈ కాల్పనిక దృశ్యాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా సృష్టించారు. ఏఐకి ఫ్యాషన్‌ను మేళవిస్తూ అగ్రస్థాయి నేతలకు కొత్త కొత్త మోడల్ డ్రెస్సులు తొడిగి.. వాళ్లతో ర్యాంప్ వాక్ చేయించారు. ఈ వీడియోను తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసి 'ఫ్యాషన్ షోకు వేళయింది' అంటూ క్యాప్షన్ పెట్టారు. ఈ వీడియోలో భారత ప్రధాని మోదీ.. ఒంటినిండా రంగురంగుల దుస్తులు, నల్ల కళ్లద్దాలు, నుదుటిన బొట్టుతో స్టైల్‌గా వాకింగ్ చేస్తూ కనిపించారు. అమెరికా సైనిక దుస్తుల్లో ఉన్న బైడెన్‌ను వీల్‌చైర్‌లో వస్తున్నట్టు చూపించారు. ఖైదీలు ధరించే డ్రెస్, చేతిలో బేడీలు, సీరియస్ లుక్‌తో ట్రంప్ ర్యాంప్‌పై నడిచారు. మస్క్ కూడా టెస్లా, ఎక్స్ థీమ్‌లో ఉన్న స్పేస్ సూట్‌లో సూపర్ హీరోలా కనిపించారు. ఇంకా.. హిల్లరీ క్లింటన్, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్, అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్, ఉత్తర కొరియా అధినేత కిమ్, ఫేస్‌బుక్ చీఫ్ మార్క్ జుకెర్‌బర్గ్ వంటి ప్రముఖులు కూడా ఈ వీడియోలో ర్యాంప్ వాక్ చేశారు. ఇటీవల మైక్రోసాఫ్ట్ సర్వర్ క్రాష్ అయిన విషయాన్ని గుర్తుచేస్తూ 'బ్లూ స్క్రీన్' కనిపించేలా ల్యాప్‌టాప్ పట్టుకుని ర్యాంప్ వాక్ చేస్తున్న బిల్ గేట్స్‌ను కూడా ఈ వీడియోలో చూపించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

నిందితుడు సీఎం అయితే.. కోర్టులు ప్రభావితమవుతాయా!?

» కేసును వేరే రాష్ట్రానికి ఎందుకు బదిలీ చేయాలి!?

» ఓటుకు నోటు కేసులో సుప్రీం కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసును వేరే రాష్ట్రానికి ఎందుకు మార్చాలని సుప్రీం కోర్టు నిలదీసింది. నిందితుడు ముఖ్యమంత్రి అయినంత మాత్రాన కోర్టులు ప్రభావితం అవుతాయా? అంటూ అసహనం వ్యక్తం చేసింది. ఓటుకు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలంటూ ఈ ఏడాది జనవరి 31న మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, శాసన సభ్యుడు కల్వకుంట్ల సంజయ్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. తొలుత పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. విచారణకు ముందు రోజు (ఆదివారం) రాత్రే కౌంటర్ దాఖలు చేశారని, దానికి జవాబు (రీజాయిండర్) ఇచ్చేందుకు రెండు వారాల సమయం కావాలని కోరారు. ఈ కేసులో నిందితుడు ప్రస్తుతం ముఖ్యమంత్రి అని, ఆధారాలు తారుమారు చేయవచ్చని, సాక్షులను ప్రభావితం చేయవచ్చని ఆరోపించారు. దర్యాప్తు సంస్థలు తమ వాదనలను మార్చుకునే అవకాశం ఉందని తెలిపారు. దీంతో ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. "నిందితుడు ముఖ్యమంత్రి అయినంత మాత్రాన కోర్టులు ప్రభావితం అవుతాయా? కేసును మరో రాష్ట్రానికి మార్చాలా? దేశంలో ఉన్నత స్థానాల్లోని వ్యక్తులపై కేసులు నమోదైతే పాకిస్థాన్, శ్రీలంకకు మార్చాలా?" అని ప్రశ్నించింది. రెండు వారాల్లో కౌంటర్‌కు జవాబు ఇవ్వాలని పిటిషనర్లకు నిర్దేశించింది.

స్మితాసబర్వాల్.. మెంటల్లీ అన్‌ఫిట్

దివ్యాంగులపై వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి.. ఇరవైనాలుగు గంటల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలి

» సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు బాలలత

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సివిల్స్‌లో దివ్యాంగుల కోటా అవసరమా అంటూ సీనియర్ ఐఏఎస్ స్మితా సబర్వాల్ 'ఎక్స్'లో చేసిన వ్యాఖ్యలపై దివ్యాంగ సంఘాలు మండిపడుతున్నాయి. ఆమె వ్యాఖ్యలు తమ మనోభావాలను దెబ్బతీశాయని.. 24 గంటల్లో స్మిత బహిరంగ క్షమాపణ చెప్పాలని, 'ఎక్స్' వేదికగా చేసిన అనుచిత వ్యాఖ్యలను తొలగించాలని డిమాండ్ చేశాయి. "స్మితా.. రాజీనామా చేసి రా. మళ్లీ పరీక్ష రాద్దాం. ఎవరికి ఎక్కువ మార్కులు వస్తాయో చూద్దాం" అని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు మల్లవరపు బాలలత సవాల్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో.. దివ్యాంగ హక్కుల సంఘాలకు చెందిన పలువురు నేతలతో కలిసి ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్ తొలి నియామకపత్రాన్ని దివ్యాంగురాలికి ఇచ్చారని గుర్తుచేసిన బాలలత.. దివ్యాంగులపై ఇలాంటి వ్యాఖ్యలు చట్టరీత్యా నేరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్, జ్యుడీషియరీ నిర్ణయాలకు వ్యతిరేకంగా స్మిత మాట్లాడుతున్నారని.. ఆమె ఫిజికల్‌గా ఫిట్‌గా ఉన్నారేమోగానీ మానసికంగా ఫిట్‌గా లేరని మండిపడ్డారు. "దివ్యాంగులపై వ్యాఖ్యలు చేసే అర్హత ఆమెకు లేదు. నైతికంగా ఆమె డిజేబుల్. ఆమెకు కీలక శాఖలు ఇస్తే ఎవరూ బతకరు" అని ధ్వజమెత్తారు "ఐఏఎస్, ఐపీఎస్ చేయడానికి ఫిజికల్ ఫిట్నెస్ కావాలా? మెంటల్ ఫిట్నెస్ కావాలా? ఆమె పరుగెడుతూ పనిచేసిందా? కార్లు, చాపర్లు ఎక్కి పనిచేస్తోందా?" అని ప్రశ్నించారు.



దివ్యాంగ హక్కుల సంఘాల నేతలతో కలిసి ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న బాలలత

జైపాల్ రెడ్డి తన గురువు అని చెబుతు న్న సీఎం రేవంత్, తెలంగాణ సీఎస్, డీవోపీటీ వారు ఆమె వ్యాఖ్యలను పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని.. 24 గంటల్లో స్మిత బహిరంగ క్షమాపణ చెప్పాలని, తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే బడ్జెట్ సమావేశాల అనంతరం ఎస్.జైపాల్ రెడ్డి స్మృతి వనం వద్ద నిరవధిక నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. సివిల్ సర్వెంట్‌గా తాను 12 ఏళ్లు పనిచేశానని, ఇలాంటి అధికారులు తోటి వారిలో ఉండబట్టే తాను రాజీనామా చేశానని బాలలత అన్నారు. స్మితాసబర్వాల్‌కు ఏదైనా జరగరానిది జరిగి దివ్యాంగురాలు అయితే తన పదవికి రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో అఖిల భారత దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు శ్రీనివాస్, సామాజిక కార్యకర్త వసుంధర, ఉదయ్ సంస్థ ప్రతినిధి సుమన్, స్కాలర్స్ అసోసియేషన్ ప్రతినిధి నాగరాజు, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నిరసనలు.. ఫిర్యాదులు..

దివ్యాంగులపై స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలతో తాను ఏకీభవించనని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. స్మిత వ్యాఖ్యలను తమ పార్టీ ఖండిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. స్మితా సబర్వాల్‌పై కేసు నమోదు చేయాలని జాతీయ వికలాంగుల హక్కు ల వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకట్, ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. ఆమె వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మంచిర్యాలలో వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు స్మితపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్మిత బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఉమ్మడి ఏపీ దివ్యాంగుల సంస్థ చైర్మన్ పి.సాయిబాబా, ఆమెను చట్టప్రకారం శిక్షించాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. శాంతి దివ్యాంగుల సంఘం అధ్యక్షురాలు శ్రీగిరి రజని చత్రినాక పోలీసులకు స్మితపై ఫిర్యాదు చేశారు.

పోలీస్, ఫారెస్ట్ సర్వీసుల్లో ఎందుకు అమలు చేయట్లేదు?

» సివిల్స్‌లో దివ్యాంగుల కోటాపై స్మితా సభర్వాల్ మరో ట్వీట్

» ట్వీట్ల కోసమే మీకు జీతమిస్తున్నారా..? పనిపై దృష్టి పెట్టండి

» 'ఎక్స్'లో ఆమె ట్వీట్లపై తీవ్రంగా మండిపడుతున్న నెటిజన్లు



హైదరాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): సివిల్స్‌లో దివ్యాంగుల కోటాపై ప్రశ్నలు సంధించిన సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్.. తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నా ఈ అంశంపై సోమవారం మళ్లీ స్పందించారు. "సమాజం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యను ప్రస్తావించినందుకు చాలా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నన్ను విమర్శిస్తున్న హక్కుల కార్యకర్తలకు విజ్ఞప్తి చేస్తున్నాను. దివ్యాంగుల కోటాను ఐపీఎస్, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో, రక్షణ వంటి కొన్ని కీలక రంగాల్లో ఇప్పటికీ ఎందుకు అమలు చేయడం లేదో పరిశీలించండి. ఐఏఎస్ కూడా అలాంటిదే అన్నది నా అభిప్రాయం. సమ్మిళిత సమాజంలో జీవించాలన్నది మనందరి కల. కానీ, కొన్ని అంశాల్లో నా మనసులో సున్నితత్వానికి చోటులేదు" అని ఆమె పేర్కొన్నారు. స్మిత పోస్టును 11 గంటల వ్యవధిలో 4 లక్షల మందికిపైగా వీక్షించారు. అత్యధికులు విమర్శించారు. "తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి పూజా ఖేద్కర్ ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. మీ సర్టిఫికెట్లను సైతం పరిశీలించాల"ని ఓ నెటిజన్ వ్యాఖ్యానించారు. ఐఏఎస్‌గా రాణించాలంటే శారీరక ధృడత్వం కంటే మానసిక ధృడత్వం కీలకమని.. అంగవైకల్యం ఉన్నా ప్రజాసేవలో తమ ప్రత్యేకత చాటుతున్న సివిల్ సర్వెంట్లు ఎంతోమంది ఉన్నారని మరో నెటిజన్ అన్నారు. "వివాదాస్పద అంశాలపై ట్వీట్లతో సమయాన్ని వృథా చేసే బదులు.. తీసుకుంటున్న జీతానికి న్యాయం చేయండి. ఏసీ గదులను వీడి క్షేత్రస్థాయిలో వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించండి" అని మరో నెటిజన్ సూచించారు. కొందరు మాత్రం.. "అంధుడిని కారు డ్రైవరుగా నియమిస్తామా? వైకల్యం ఉన్న వైద్యుడితో శస్త్రచికిత్స చేయించుకుంటామా?" అంటూ స్మిత వ్యాఖ్యలను సమర్థించారు. కాగా.. దివ్యాంగులపై స్మిత చేసిన వ్యాఖ్యలపై బక్క జడ్సన్ జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు.

కవితతో కేటీఆర్ ములాఖత్

» అనారోగ్యంతో బాధపడుతున్న చెల్లెల్ని చూసి కేటీఆర్ భావోద్వేగం

» కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ ఆగస్టు 5కు వాయిదా



న్యూఢిల్లీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆమె సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిశారు. సోమవారం ఉదయం జైలుకు వెళ్లి కవితతో ములాఖత్ అయ్యారు. కవిత వారం, పది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గత మంగళవారం ఆమె అస్వస్థతకు గురికావడంతో జైలు వైద్యుల సూచనల మేరకు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ హాస్పిటల్‌కు తరలించి వైద్య చికిత్స అందించారు. అనంతరం కోర్టు అనుమతితో కవితకు జైలు అధికారులు శుక్రవారం ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయించారు. ఈ నేపథ్యంలో ఆమెను పరామర్శించేందుకు ఆదివారమే కేటీఆర్ ఢిల్లీ వచ్చారు. న్యాయ నిపుణులతో చర్చించామని, తప్పకుండా బెయిల్ వస్తుందని ధైర్యం చెప్పినట్టు తెలిసింది. ఆమెను చూసి కేటీఆర్ భావోద్వేగానికి గురైనట్టు తెలిసింది. ఆమె తన ఆరోగ్య, మానసిక పరిస్థితి గురించి వివరించినట్టు సమాచారం. ఆమె బెయిల్ పిటిషన్‌పై విచారణను రౌస్ అవెన్యూ కోర్టు ఆగస్టు 5కు వాయిదా వేసింది. ఆమెతో పాటు మరో నలుగురి ప్రమేయంపై సీబీఐ అనుబంధ ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నట్టు ప్రకటించింది. 26న విచారణ చేపడతామని తెలిపింది.

పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్!

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులపై ఆ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించే పనిలో ఉంది. ఈ విషయమై కేటీఆర్ రెండు రోజులుగా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు ఫిరాయింపులపై హైకోర్టులో దాఖలైన పిటిషన్లపై తీర్పు వచ్చే వరకు వేచిచూడాలా? లేక ముందే సుప్రీంకోర్టును ఆశ్రయించాలా అనే అంశాలపై చర్చిస్తున్నారు. న్యాయవాదులు సూచిస్తే రెండు మూడు రోజుల్లో బీఆర్ఎస్ తరఫున సుప్రీంకోర్టులో పిటిషన్ వేయాలని యోచిస్తున్నారు.

వీధి కుక్కల నియంత్రణకు ఎపెక్స్ కమిటీ

» ఉన్నత స్థాయి సమావేశంలో దానకిషోర్

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల నియంత్రణ, కుక్క కాటు కేసుల నివారణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు వివిధ విభాగాల సీనియర్ అధికారులు, బ్లూ క్రాస్ సభ్యులతో ఎపెక్స్ కమిటీ ఏర్పాటు చేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ ఆదేశించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కుక్కల దాడిలో చిన్నారులు మృతి చెందడం, కుక్క కాటు కేసులు పెరుగుతున్న నేపథ్యంలో సోమవారం సచివాలయంలో సమావేశం నిర్వహించారు. జంతు సంరక్షణ సంస్థల ప్రతినిధుల అభిప్రాయం తీసుకున్నారు. కుక్కల ప్రవర్తనపై కాలనీ సంక్షేమ సంఘాలు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు దానకిషోర్ సూచించారు.

వీధి కుక్కలను చంపేందుకు ఆదేశాలివ్వండి

» మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శికి ఎఫ్‌జీజీ లేఖ

మనుషుల ప్రాణాలకు ముప్పుగా మారిన వీధి కుక్కలను చంపడానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి.. మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ రాశారు. పసి పిల్లలను వీధికుక్కలు తీవ్రంగా గాయపర్చడం, శరీర భాగాలను తినడం వంటివి టీవీల్లో చూసినప్పుడు హృదయం కలచివేస్తోందన్నారు. జీహెచ్ఎంసీ సర్వే ప్రకారం హైదరాబాద్‌లో 4 లక్షల శునకాలున్నాయని తేలిందని చెప్పారు. సుప్రీంకోర్టు అభిప్రాయంపై అభ్యంతరం లేదని.. కానీ కుక్కల బారి నుంచి మనుషుల ప్రాణాలను కాపాడటమూ ముఖ్యమన్నారు.

బోగస్ గ్యారంటీలతో భారీ కాంట్రాక్టులు

» రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు రూ.కోట్లలో పనులు

» మంత్రి పొంగులేటిపై బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలు

» విదేశీ ఫైనాన్స్ సంస్థ విశ్వసనీయతపై ఎస్‌బీఐ, యూబీఐ లేఖలపై అనుమానం



హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి సంబంధించిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ మోసపూరిత బ్యాంకు గ్యారంటీలతో వందల కోట్ల రూపాయల కాంట్రాక్టు పనులు దక్కించుకుందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సంచలన ఆరోపణ చేశారు. ఒక విదేశీ ఫైనాన్సు కంపెనీ ఇచ్చిన గ్యారంటీతో దేశవ్యాప్తంగా 400 కాంట్రాక్టు సంస్థలు పనులు చేస్తున్నాయని పేర్కొంటూ, ఇది అతిపెద్ద కుంభకోణమని, తీవ్రమైన ఆర్థిక నేరమని పేర్కొన్నారు. ఈ కుంభకోణంలో భాగస్వామిగా ఉన్న పొంగులేటికి క్యాబినెట్‌లో కొనసాగే నైతిక అర్హత లేదన్నారు. సోమవారం మహేశ్వర్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. 'సెయింట్ లూసియా అనే దీవిలో యూరో ఎగ్జిమ్ బ్యాంకు లిమిటెడ్ ఉంది. దాని మొత్తం విలువ మన దేశ కరెన్సీ ప్రకారం రూ.8 కోట్లు వి ంచదు. అసలు అది బ్యాంకు కూడా కాదు.. ఓ ఫైనాన్సు కంపెనీ. అలాంటి కంపెనీ బ్యాంకు పేరుతో మన రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల కాంట్రాక్టు పనులకు గ్యారంటీ లేఖలు ఇచ్చింది. వాటిని ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీలు పనులు మంజూరు చేయడం విడ్డూరం. ఈ వ్యవహారంలో యూరో ఎగ్జిమ్ బ్యాంకు లిమిటెడ్ విశ్వసనీయమైనదేనని పేర్కొంటూనే దానితో తమకు ఎలాంటి సంబంధం లేదని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) ధ్రువీకరణ లేఖలు ఇవ్వడం మరో ట్విస్టు. మన దేశంలో కానీ ఆర్బీఐ పరిధిలో కానీ లేని ఓ ఫైనాన్సు కంపెనీ విశ్వసనీయతను ఈ రెండు ప్రముఖ బ్యాంకులు ధ్రువీకరించడం వెనుక ఏదో మతలబు ఉంది. రూ.8 కోట్ల విలువ కూడా లేని ఓ ఫైనాన్సు కంపెనీ.. రూ.400 కోట్ల పనులకు గ్యారంటీ లేఖలు ఇస్తే దాని విశ్వసనీయతను మన దేశ బ్యాంకులు ఎలా ధ్రువీకరిస్తాయి?' అని మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆర్బీఐ నిబంధనల ప్రకారం జాతీయ బ్యాంకులు లేదా షెడ్యూల్డ్ బ్యాంకుల గ్యారంటీ మాత్రమే చెల్లుబాటు అవుతుందని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై తక్షణం సీబీఐ విచారణకు సీఎం రేవంత్ రెడ్డి కోరాలని, ఈ బ్యాంకు ఇచ్చిన గ్యారంటీలను రద్దు చేసి కొత్త బ్యాంకు గ్యారంటీలు తీసుకోవాలని మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పంచాయతీ సర్పంచుల బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతూ మంత్రికి సంబంధించిన కంపెనీకి మాత్రం వేల కోట్ల రూపాయల బిల్లులు రాత్రికి రాత్రే మంజూరు అవుతున్నాయన్నారు.

ప్రముఖ కాలేజీల్లో డ్రగ్స్

టీజీ న్యాబ్‌కు దొరికిన విద్యార్థులు.. హైదరాబాద్, పలు జిల్లాల్లో గుర్తింపు

» బాసర ట్రిపుల్-ఐటీకి గంజాయి బెడద

» నాందేడ్ నుంచి యథేచ్ఛగా సరఫరా

» జాబితాలో గురునానక్, కలనరీ, సీబీఐటీ.. ఇండస్, జోగిపేట జేఎన్‌టీయూ కాలేజీలు

» పట్టుబడ్డ వారిలో ఉస్మానియా వైద్యులు

» వారిపై చర్యలకు ఎంసీఐకి లేఖలు

» టీజీ న్యాబ్ చీఫ్ సందీప్ శాండిల్య



హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రముఖ కాలేజీలు డ్రగ్స్‌కు అడ్డాగా మారుతున్నాయి. జీవితంలో ఉన్నత శిఖరాలను అందుకోవాల్సిన విద్యార్థులు మత్తుకు బానిసలవుతున్నారు. హైదరాబాద్‌తోపాటు.. పలు జిల్లాల్లో ఈ పరిస్థితి నెలకొంది. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) వరుస దాడుల్లో విస్తుబోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో.. ఇకపై కార్పొరేట్, ప్రముఖ స్కూళ్లలోనూ డ్రగ్స్‌ను పసిగట్టే శునకాలతో తనిఖీ చేయాలని నిర్ణయించినట్లు టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. కొన్ని రోజులుగా టెక్నికల్/హ్యూమన్ ఇంటెలిజెన్స్, ఇతర మార్గాల్లో సమాచారం సేకరించి, పలు కాలేజీలు, పబ్బులు, ఇతర ప్రాంతాల్లో తనిఖీలు చేసినట్లు ఆయన వివరించారు. "ఇంత కాలం డ్రగ్స్ దొరికిన కాలేజీల పేర్లను గోప్యంగా పెట్టాం. కాలేజీల్లో యాంటీ డ్రగ్స్ కమిటీ(ఏడీసీ)లను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తూ వస్తున్నాం. టీజీ న్యాబ్ ఏర్పాటై ఏడాది కావొస్తున్నా.. కాలేజీల యాజమాన్యాల్లో దిద్దుబాటు చర్యలు లేకపోవడంతో వాటి పేర్లను బయట పెడుతున్నాం" అని ఆయన వెల్లడించారు.

ఈ కాలేజీల్లోనే..

సింబయోసిస్ కాలేజీల్లో 25 మంది విద్యార్థులు డ్రగ్స్, గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారని, వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, తల్లిదండ్రులకు సమాచారం అందజేశామని సందీప్ శాండిల్యా వివరించారు. "గురునానక్ ఇంజనీరింగ్ కాలేజీలో 15 మంది విద్యార్థులు, కుందన్‌బాగ్‌లోని కలినరీ అకాడమీ ఆఫ్ ఇండియాలో నలుగురు, చైతన్య భారతీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)లో ఒక విద్యార్థికి డ్రగ్స్ టెస్ట్‌లో పాజిటివ్ వచ్చింది. బాసర ట్రిపుల్-ఐటీలో కొందరు విద్యార్థులు గంజాయి, ఇతర మత్తుపదార్థాలతో పట్టుబడ్డారు. అయితే.. ట్రిపుల్-ఐటీకి మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి గంజాయి సరఫరా అవుతున్నట్లు గుర్తించి, ఆ లింకులను కట్ చేశాం. జోగిపేట జేఎన్‌టీయూలో ముగ్గురు గంజాయి, ఇతర మత్తుపదార్థాలతో చిక్కారు. ఇండస్ స్కూల్, సీబీఐటీలో ఈ-సిగరెట్లను విక్రయిస్తున్న జాఫర్, అహ్మద్ అనే వ్యక్తులను అరెస్టు చేశాం. ఇంతకాలం విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా కాలేజీల పేర్లను గోప్యంగా పెట్టాం" అని ఆయన వెల్లడించారు. కాగా.. ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో ఆరుగురు వైద్యులు కూడా మాదకద్రవ్యాలను సేవిస్తూ పట్టుబడ్డారని, వారిపై తదుపరి చర్యల కోసం భారత వైద్య మండలి(ఎంసీఐ)కి లేఖ రాసినట్లు టీజీ న్యాబ్ అధికారులు తెలిపారు.

జోరా పబ్‌లో నలుగురికి పాజిటివ్

బంజారాహిల్స్ జూలై 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి కట్టడిలో భాగంగా పబ్బులపై నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్లు టీజీ న్యాబ్ అధికారులు వెల్లడించారు. కేవ్ పబ్‌లో ఇటీవల జరిపిన దాడి కీలకమైనదని పేర్కొన్నారు. పబ్బుల్లో పనిచేసే డీజేలు, ఇతరులపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. తరచూ పబ్బుల్లో తనిఖీలు ఉంటాయని స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి జూబ్లీహిల్స్ జోరా పబ్‌లో ఓ పార్టీకి హాజరైన 61 మందికి నార్కోటిక్స్ పరీక్షలను నిర్వహించగా.. నలుగురు పాజిటివ్‌గా తేలారని పేర్కొన్నారు. డ్రగ్స్ పరీక్షలకు తమకు ప్రత్యేక కిట్స్ అందాయని.. వాటి వల్ల ఐదు నిమిషాల్లో ఫలితాలు వస్తాయని వివరించారు.

గొర్రెల పథకం అక్రమాల కేసు.. రాంచందర్ ఆస్తులు 80 కోట్లు!

» గుర్తించిన ఏసీబీ అధికారులు

» మొహియుద్దీన్, అతని కుమారుడిపై తదుపరి చర్యలకు రంగం సిద్ధం

» మరోసారి ఏపీ రైతుల విచారణ

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకం కుంభకోణం కేసులో ఏ-9గా ఉన్న సబావత్ రాంచందర్ ఆస్తులు రూ.80 కోట్లుగా ఉన్నట్లు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) నిగ్గుతేల్చింది. ఈ కేసుకు ముందు వరకు ఆయన తెలంగాణ స్టేట్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీఈవోగా పనిచేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు 12 మంది నిందితులు అరెస్టవ్వగా.. వారిలో ప్రైవేటు వ్యక్తులు, ప్రభుత్వోద్యోగులు ఉన్నారు. రాంచందర్ గతంలో తెలంగాణ స్టేట్ షీప్ అండ్ గోట్ డెలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్‌కు ఎండీగా కూడా పనిచేశారు. ఆ సమయంలో తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని, గొర్రెల కొనుగోలు, నిధుల చెల్లింపుల్లో నిబంధనలను తుంగలో తొక్కినట్లు ఏసీబీ గుర్తించింది. రాంచందర్ 2021-23 మధ్య కాలంలో షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్‌లో ఉండగానే వచ్చిన అవినీతి ఆరోపణలను సైతం ఏసీబీ పరిగణనలోకి తీసుకుంటోంది. దాంతోపాటు.. ఎన్‌సీడీసీ రుణం రాకపోయినా.. 80 వేల మంది లబ్ధిదారుల నుంచి అదనపు డీడీలను వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇష్టానుసారంగా గొర్రెల యూనిట్ ధరలను పెంచారనే అభియోగాలు కూడా ఉన్నాయి. వీటిపై దర్యాప్తు అధికారులు ఆధారాలను సేకరిస్తున్నారు. రాంచందర్ అక్రమ ఆస్తులు గుర్తించిన నేపథ్యంలో ఆదాయపు పన్ను(ఐటీ) శాఖ నుంచి వివరాలను సేకరించే దిశలో చర్యలు తీసుకుంటున్నారు. ఈ కేసులో ఏ-1గా ఉన్న మొహియుద్దీన్, అతని కుమారుడు ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారు. వీరిద్దరూ దుబాయ్‌లో తలదాచుకుంటున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. తదుపరి చర్యల్లో వీరిద్దరి పాస్‌పోర్టులను రద్దు చేయించేదిశలో ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారులకు లేఖ రాసేందుకు సిద్ధమయ్యారు. కాగా.. ఇదివరకే వీరిద్దరూ ఈ కేసుతో తమకు సంబంధం లేదని, కేవలం ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టు వ్యవహారాలను చూసుకున్నట్లు కోర్టుకు వివరించారు. ఏ-10గా ఉన్న కల్యాణ్ ఆదాయం, ఆస్తులపైనా అధికారులు దృష్టి సారించారు. ఏసీబీ అధికారులు ఈ కేసులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రైతులను మరోమారు విచారించారు. వారి స్టేట్‌మెంట్‌లను రికార్డు చేశారు. ఏపీ రైతులు ఇచ్చిన ఫిర్యాదుతోనే ఈ కేసు నమోదైంది. తమ ఖాతాకు రావాల్సిన రూ.2.10 కోట్లను ఇతరులకు మళ్లించారంటూ వారు అప్పట్లో గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. అలా రూ.2.10 కోట్లతో మొదలైన దర్యాప్తు.. ఇప్పటి వరకు ఈ కుంభకోణం విలువను రూ.700 కోట్లుగా తేల్చింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బైడెన్ లేని పోటీ

అమెరికా అధ్యక్ష ఎన్నికల బరినుంచి జోబైడెన్ నిష్క్రమణ ఆయన పార్టీ నేతల, సభ్యుల ఒత్తిడిమేరకు జరిగిపోయింది. బైడెన్ అడ్డంకి తొలగిపోతే, మరింత సమర్థవంతమైన నాయకత్వంలో రిపబ్లికన్ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్‌ను ఢీకొనగలమని డెమోక్రాట్లు నమ్ముతున్నారు. అధ్యక్ష ఎన్నికల వేడి రాజుకోకముందే చాలా సర్వేలు బైడెన్ వెనుకబడివున్న విషయాన్ని తేల్చాయి. జూన్ 28న జరిగిన తొలి ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో బైడెన్ తడబాటు, గందరగోళం తరువాత ఉన్న ఆ కాస్త మద్దతు కూడా నీరుగారిపోయింది. మరోపక్క, ట్రంప్‌మీద జరిగిన హత్యాయత్నంతో ఆయనమీద సానుభూతిహెచ్చిందనీ, పాపులారిటీ పెరిగిందనీ అందరూ నమ్మారు. ఈ దశలో ట్రంప్‌ను ఓడించాలంటే వేరొకరు రావాలన్న పార్టీలోని అత్యధికుల విశ్వాసం సరైనదో కాదో రేపటి ఎన్నికల్లో తేలుతుంది కానీ, బైడెన్‌కు బైబైచెప్పే విషయంలో జరిగిన జాప్యం పార్టీకి కొంత నష్టం చేసిన మాట నిజం.

న్యాయ వివాదాల్లో, కేసుల్లో ఇరుక్కున్నప్పటికీ, అధ్యక్ష ఎన్నికల దిశగా ట్రంప్ తన నడకలో ఎన్నడూ తడబడలేదు. ప్రచారం ఉధృతంగా సాగుతున్న తరుణంలో హత్యాయత్నం జరగడం, ఒక్కక్షణం ట్రంప్ నిర్ఘాంతపోయినా మరుక్షణం తేరుకొని పిడికిలిబిగించి నినదించడం, భద్రతాసిబ్బంది వాహనంలోకి ఎక్కించేవరకూ రక్తమోడుతున్న తన మొఖాన్ని చూపించడం వంటివి ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేసే అంశాలే. తనమీద జరిగిన హత్యాయత్నాన్ని రాజకీయంగా వాడుకున్నప్పటికీ, ఆ తరువాత రిపబ్లికన్ పార్టీ నుంచి నామినేషన్‌ను స్వీకరిస్తున్న సందర్భంలో ఆయన బాధ్యతాయుతంగా మాట్లాడారు. అధికారంకోసం సమాజంలో విద్వేషాలు రగల్చడానికీ, మనుషులను చీల్చడానికీ, వ్యవస్థలమీద దాడులు చేయించడానికీ వెనుకాడని ట్రంప్ ఈ హత్యాయత్నం తరువాత సమైక్యత గురించి మాట్లాడటం ద్వారా తటస్థ ఓటర్లను సైతం ఆకర్షించాడని వార్తలు వచ్చాయి.

ట్రంప్ విజయం ఖాయమైన ఈ ఆఖరుదశలో, పోటీనుంచి తప్పుకోవడం ద్వారా బైడెన్ తన పార్టీకి చేయగలిగే మేలు ఎక్కువగా ఉండకపోవచ్చు. కమలా హారిస్‌కు మద్దతు ఇవ్వడానికి ఆయన ఆఖరుక్షణం వరకూ ఇష్టపడలేదని వార్తలు వచ్చాయి కానీ, ఆయన ప్రకటన తరువాత పార్టీఅంతా ఆమె పక్షాన రావచ్చు. కానీ, ఆమెకు పార్టీలో మిగతావారినుంచి ఏ మాత్రం పోటీ ఉండబోదని ఇప్పుడే కచ్చితంగా చెప్పలేం. ఒకసారి బైడెన్ తప్పుకున్న తరువాత కమలకంటే ట్రంప్‌ను బలంగా ఢీకొట్టగలిగేవారు ఎవరైనా ఉన్నారా అన్న ప్రశ్న, చర్చ తప్పవు. స్వల్పకాలంలోనే ఆ అన్వేషణ ముగిసి, కమల ఖాయమైన తరువాత పార్టీ తన పూర్తి శక్తియుక్తులను ఆమె పక్షాన మోహరించడం జరుగుతుంది. విధిగా తప్పుకోవాల్సివచ్చిన ఈ స్థితిలో, కమలకు మద్దతు ప్రకటించి బైడెన్ డెమోక్రాటిక్ పార్టీ మూలసిద్ధాంతాలకు అనుగుణంగా వ్యవహరించారు. భారత్–జమైకా సంతతికి చెందిన ఈమెకు ఆఫ్రికా, ఇండియా మూలాలున్న ఓటర్లు అండగా నిలవవచ్చు. అలాగే, ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, అబార్షన్ హక్కుల విషయంలో ఆమె ప్రదర్శించిన పోరాటస్ఫూర్తి మహిళా ఓటర్లను విస్తృతంగా ఆకర్షించింది. బైడెన్ వయసు లక్ష్యంగా ట్రంప్ దాడి సాగింది కనుక, ఇప్పుడు తమ అభ్యర్థిని మార్చుకుంటున్న డెమోక్రాట్లు ట్రంప్‌ను హాయిగా అపహాస్యం చేయవచ్చు. కమలాహారిస్ అంత అద్భుతమైన వక్త కాదు కానీ, బైడెన్‌కు ఉన్న మతిమరుపు సమస్య ఆమెకు లేదు కనుక, లోతైన అధ్యయనంతో అన్ని అంశాలమీదా ట్రంప్‌ను ఆమె బలంగా ఢీకొట్టవచ్చు. ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో ట్రంప్ గతాన్ని ప్రజలకు బలంగా గుర్తుచేసి, తన అభిమానులను రెచ్చగొట్టి అమెరికన్ కాంగ్రెస్ భవనంమీద దాడులుచేయించిన ఆయన తన చర్యలు, చేష్టలతో అమెరికాకు తెచ్చిన అపకీర్తిని ఏకరువుపెట్టవచ్చు. ఆయనమీద ఉన్న కేసులు దేశం పరువు దిగజార్చిన మాట వాస్తవం. అధ్యక్ష రేసునుంచి బైడెన్ తప్పుకున్నప్పటికీ, ఫలితం ఏకపక్షంగానే ఉండబోతోందన్న విశ్లేషణలు పూర్తిగా కొట్టిపారేయలేనివి. బైడెన్ మద్దతు తరువాత కూడా కమలాహారిస్‌కు ప్రత్యామ్నాయంగా మిచెల్లే ఒబామా వంటి కొన్ని పేర్లు కనీసం ప్రచారంలో ఉన్న మాట నిజం. ఎన్నికలు ముంచుకొస్తున్న ఈ చివరిదశలో డెమోక్రాట్ల తరఫున బరిలోకి దిగినవారెవ్వరైనా ట్రంప్‌మీద విజయం సాధించగలిగితే అది మహాద్భుతమే అవుతుంది. ఒకవేళ అలా జరగకపోయినా, ఇప్పటికే జరిగిపోయిన నష్టాన్ని కొంతమేరకు పూడ్చుకొని కనీసం గట్టిపోటీ ఇవ్వగలరా అన్నది చూడాలి.

ఉద్యమాల ఓయూలో ఊపిరాడటం లేదు!

డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు, ముఖ్యంగా ఓయూ విద్యార్థులు రోడెక్కి ఉద్యమించారు. అభిప్రాయ స్వేచ్ఛలో భాగంగా ప్రజాస్వామ్యబద్ధంగా తమ హక్కులకై పోరాడారు. కానీ ప్రభుత్వం వారిని అక్రమ అరెస్టులతో కేసులతో వేధించింది. క్యాంపస్ చుట్టూ పోలీసులను మోహరించి నిర్బంధం పెంచింది. కాంగ్రెస్ పార్టీ ఈ విద్యార్థి వ్యతిరేక విధానాలను తక్షణం విరమించుకోవాలి.

గత ఏడాది ఎన్నికల ప్రచారంలో భాగంగా సరూర్‌నగర్ సభలో ప్రియాంక గాంధీ 'హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌ను ప్రకటించారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ప్రకటిస్తామని, జూన్ 2 నాటికి అధికారికంగా జాబ్ క్యాలెండరు విడుదల చేస్తామని అన్నారు. కానీ ఇప్పటికీ ప్రకటించలేదు. ఇచ్చిన వాగ్దానాలను నిలుపుకోనప్పుడు చెలరేగే అసంతృప్తికి కాంగ్రెస్ పార్టీనే బాధ్యత వహించాలి కదా? డీఎస్సీ, గ్రూప్స్ అభ్యర్థులను చర్చలకు పిలిచి వారి అభ్యర్థనలు విని, వీలైనంత మేరకు పరిష్కరించే ప్రయత్నం చేస్తే సరిపోయేది. పరిష్కారం కాని అంశాలుంటే సర్దిచెప్పవచ్చు. అంతే కానీ మొండివైఖరి ప్రదర్శించడం సమర్థనీయం కాదు.

యూనివర్సిటీ విద్యార్థులు భిన్నమైన భావాలతో సభలు, సమావేశాలు, ధర్నాలు లాంటివి నిర్వహిస్తారు. కానీ ఇక్కడ పోలీసులే వారి భావజాలాన్ని నిర్ణయిస్తున్నారు. వారి అత్యుత్సాహం వల్ల సైద్ధాంతిక చర్చలకు తావు లేకుండా పోయింది. నాలుగేళ్ల క్రితం యూనివర్సిటీలో పోలీస్ జోక్యాన్ని తగ్గించాలని అన్ని విద్యార్థి సంఘాలూ కలిసి వీసీ లాడ్జిలో ఒకరోజు అర్ధరాత్రి వరకు నిరసన తెలిపారు. అప్పుడు ఒక వారం రోజుల పాటు పోలీసులు యూనివర్సిటీ పరిధిలో కనిపించలేదు. తర్వాత మళ్ళీ మామూలే. విద్యార్థులంటే కనీస గౌరవం లేకుండా పరుష పదజాలంతో



దూషిస్తున్నారు. ఏ చిన్న విద్యార్థి సమావేశం జరిగినా యూనివర్సిటీలోకి ప్రవేశించి విద్యార్థుల హాస్టల్‌లోకి, లైబ్రరీలోకి చొచ్చుకువెళ్లి అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారు. నిత్యం హాస్టళ్ళ మీద దాడులు జరుగుతున్నాయి. ఈ చరిత్ర ఆనాటి సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో జరిగింది. ఇప్పుడు మళ్ళీ చీటికీ మాటికీ పోలీస్ ప్రమేయం లేకుండా పాలనను నిర్వహించలేకపోతున్నారు. ఇలాంటి పరిస్థితి అన్ని యూనివర్సిటీల్లో ఉన్నది. కాకతీయ, తెలంగాణ, పాలమూరు యూనివర్సిటీలను మరింత దిగజార్చారు. ఈ తరహా పరిస్థితులకు యూనివర్సిటీలే ప్రధాన బాధ్యత వహించాల్సి ఉంటుంది. తెలంగాణాలో ఉన్న అన్ని యూనివర్సిటీల విద్యార్థుల భాగస్వామ్యం లేనిదే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందా?

ఎలాంటి సామాజిక న్యాయాన్ని పట్టించుకోకుండానే కార్పొరేషన్ పదవులు ఇస్తున్నారు. మరి ఈ కార్పొరేషన్ పదవులలో ఒక్కటంటే ఒక్కటి కూడా విద్యార్థి నాయకులకు దక్కలేదు. ప్రజల హక్కులను, ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు చెప్పిన గుణపాఠం కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలియంది కాదు. తెలంగాణలో ప్రజలు ప్రజాస్వామిక ప్రభుత్వం కావాలనుకున్నారు కాబట్టే అధికారాన్ని కాంగ్రెస్‌కు కట్టబెట్టారు. కానీ గత ప్రభుత్వం చేసిన తప్పులనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేస్తున్నది. అందుకే కాంగ్రెస్ పట్ల కూడా ప్రజల్లో అదే తరహాలో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఉస్మానియా యూనివర్సిటీ అంటేనే పాలకులకు చిన్నచూపు. ఉద్యమకారులంటే గౌరవం లేదు. ప్రజా ఉద్యమాల ద్వారా ఏర్పడిన తెలంగాణలో ఈ ప్రభుత్వం కూడా విద్యార్థుల ఆకాంక్షలను విస్మరిస్తే ప్రజలు సహించరు. తెలంగాణ సమాజానికి సుదీర్ఘ పోరాటాల చరిత్ర ఉంది. నిర్బంధాన్ని అది సహించదు.

కాంగ్రెస్ పార్టీ తక్షణమే దృష్టి సారించాల్సిన అంశాల్లో యూనివర్సిటీలలో పోలీస్ జోక్యం తగ్గించటం కీలకమైనది. అలాగే యూనివర్సిటీల అభివృద్ధిపై కూడా దృష్టి పెట్టాలి. గత ప్రభుత్వం అనుసరించిన మూర్ఖపు విధానాల వల్ల రాష్ట్రంలో ఉన్నత విద్య విలువలు దిగజారాయి. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల పక్షాన ఉందని ప్రజలు భావిస్తున్నారు. ప్రజాపాలన పేరుతో ప్రజలకు చేరువవుతున్నారని ప్రజలు అనుకుంటున్నారు. దశాబ్దాలుగా అనేక సమస్యలతో సతమతమవుతున్న ఉస్మానియా, ఇతర యూనివర్సిటీల సమస్యలు ప్రభుత్వానికి తెలియనివి కావు. కాబట్టి ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా యూనివర్సిటీలు కోల్పోయిన పూర్వ వైభవాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం ఓయూలో భావప్రకటన స్వేచ్ఛను కాపాడాలి.

○ సునీల్ నీరడి
ఉస్మానియా యూనివర్సిటీ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి,
ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

అనాథగా మిగిలిన తెలుగు అకాడమి

రాష్ట్ర విభజన సందర్భంలో తెలుగు అకాడమిని పదవ షెడ్యూల్‌లో చేర్చారు. దురదృష్టవశాత్తు గత పది సంవత్సరాలు పరిపాలించిన ప్రభుత్వం ఉదాసీన వైఖరి వల్ల తెలుగు అకాడమి, తెలుగు విశ్వవిద్యాలయం వంటి భాషా సంస్థల అభివృద్ధి పూర్తిగా ఆగిపోవడమే కాకుండా, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడక ముందున్న ప్రగతి కూడా కోల్పోయింది.

కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక తెలుగు భాషకు ప్రోత్సాహం లభిస్తుందని మాతృభాషాభిమానులంతా ఆశపడ్డారు. కాని ఈ పదేండ్ల పరిపాలనలో తెలంగాణలో విద్యా వికాసానికి ప్రధాన కేంద్రమైన తెలుగు అకాడమిని నిర్వీర్యం చేశారు. సంవత్సరానికి 15 నుంచి 20 కోట్ల వరకు ఆదాయం వచ్చే బ్యాంకుల్లోని ఫిక్స్‌డ్ డిపాజిట్లను రద్దు చేయించి 140 కోట్లకు పైగా అకాడమి నిధులను అక్రమంగా ప్రభుత్వ ట్రెజరీకి బదిలీ చేయించారు. అందుకే ప్రజలు మార్పు కోరుకున్నారు. ఈ సందర్భంలో రాష్ట్రంలో ఏర్పడిన క్రొత్త ప్రభుత్వం విద్యారంగ పునర్నిర్మాణ దిశగా అడుగులు వేస్తున్నది. ఈ తరుణంలో రాష్ట్రంలో ఇంటర్ నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఉన్న విద్యాసంస్థలన్నింటికీ దాదాపు 600 సబ్జెక్టులలో పాఠ్యగ్రంథాలను అందించే తెలుగు అకాడమి పునర్నిర్మాణం గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

1956లో దేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడిన చారిత్రక నేపథ్యంలో ఆనాటి భారత ప్రభుత్వం సర్వేపల్లి రాధాకృష్ణన్, బి.ఆర్. అంబేడ్కర్ మొదలైన రాజ్యాంగ నిపుణులతో లాంగ్వేజ్ కమిషన్ ఏర్పాటు చేసింది. దేశంలో మాతృభాషల వికాసం జాతి వికాసానికి, తద్వారా దేశ వికాసానికి కారణమవుతుందన్న భాషా కమిషన్ నివేదికలోని సత్యాన్ని గ్రహించిన ఆనాటి భారత ప్రభుత్వం విద్యావిధానంలో మాతృభాషలకు ప్రాధాన్యం ఇచ్చింది. మాతృభాషలో విద్యాబోధన జరగటానికి వీలుగా భాషా అకాడమిలను ప్రారంభించమని రాష్ట్రప్రభుత్వాలకు నిర్దేశించింది. పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఉన్న ఆయా కోర్సులకు అవసరమైన పాఠ్యగ్రంథాలను మాతృభాషలో రూపొందించమని అకాడమిలకు ప్రధాన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సూచించింది. విజ్ఞాన శాస్త్రాల అనువాదం కొరకు 'టెక్నికల్ టర్మినాలజీ'ని తయారు చేసుకోవాలి. దీనికి అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చడానికి కేంద్ర ప్రభుత్వం కమిషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ (సి.ఎస్.టి.టి) అనే సంస్థను స్థాపించి దాని ద్వారా వివిధ రాష్ట్రాలలోని భాషా అకాడమిలకు కోట్లాది రూపాయల ఆర్థిక సహాయాన్ని ఇప్పటికీ అందిస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు భాషా సంస్థగా తెలుగు అకాడమి 1968 ఆగస్టు 6న రిజిష్టర్డ్ సొసైటీగా ఐదుగురు సభ్యులతో ప్రారంభమైంది. అప్పుడు విద్యాశాఖ మంత్రి పి.వి.నరసింహారావు అధ్యక్షులుగా, ఎస్.ఆర్. రామమూర్తి (విద్యాశాఖ కార్యదర్శి), కె. రామాచారి (డిప్యూటీ సెక్రెటరీ, లా డిపార్ట్‌మెంట్), ఎల్. బుల్లయ్య (డైరెక్టర్, పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్స్), టి.ఆర్. దాస్ (డైరెక్టర్, టెక్నికల్ ఎడ్యుకేషన్)– ఈ నలుగురూ సభ్యులుగా ఉన్నారు.

తెలుగు అకాడమి కేవలం భాషా సాహిత్యాలకే పరిమితం కాదు. కళలు, సంస్కృతి, సామాజిక శాస్త్రాలు, విజ్ఞాన శాస్త్రాలు మొదలుగా సమస్తమైన విజ్ఞానాన్ని మాతృభాషలో అందించే శాస్త్ర, విజ్ఞాన పరిశోధన సంస్థ. ఎంతోమంది పండితులు, మేధావులు, ఆచార్యులు, విషయ నిపుణులు తమ ప్రతిభా నైపుణ్యాలతో పాఠ్యగ్రంథాలను, శాస్త్ర గ్రంథాలను, సంకేత పదకోశాలను, నిఘంటువులను, మాండలిక పదకోశాలను తయారు చేశారు. కాలానుగుణంగా ఆయా సబ్జెక్టులలో వచ్చే మార్పులను స్వీకరిస్తూ ప్రామాణికమైన ప్రచురణలను అందించే సంస్థ తెలుగు అకాడమి. అందువల్ల దీనిని కేవలం పాఠ్యగ్రంథ ప్రచురణ సంస్థగా మాత్రమే కాకుండా 'తెలంగాణ రాష్ట్ర తెలుగు విజ్ఞాన పరిశోధనా సంస్థ'గా గుర్తించి, రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయ హోదా కల్పించాలి. దాంతో తెలుగులో విజ్ఞానశాస్త్రాల అభివృద్ధికి, వికాసానికి ఎంతో మేలు జరుగుతుంది.



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ సంస్థకు పూర్తి స్థాయి డైరెక్టర్‌ను కూడా నియమించకపోవడం దురదృష్టకరం. తెలుగు అకాడమికి పాఠశాల విద్యకు సంబంధించిన అధికారులను ఇన్‌చార్జ్‌లుగా నియమించడం వల్ల వారికి ఉన్నత విద్యకు సంబంధించిన అవగాహన లేక, పర్యవేక్షణ లోపించి, పరిపాలన కుంటుపడి, విద్యార్థులకు అవసరమైన నూతన గ్రంథాలు రూపొందలేదు. గత పదేళ్ళుగా పాత పాఠ్యగ్రంథాలనే పునర్ముద్రించుకోవలసి వచ్చింది.

ఈ సంస్థ ఏర్పడి 55 ఏళ్లు గడిచింది. నాలుగు వేలకు పైగా శీర్షికలతో లక్షలాది గ్రంథాలను ప్రచురించి దేశంలోని రాష్ట్ర భాషా అకాడమిలలో కేరళ, బెంగాలతో పాటు అగ్రస్థానంలో నిలిచింది. తెలుగు అకాడమి తెలుగు–ఇంగ్లిషు భాషల్లో ప్రచురించిన ఆంత్రోపాలజీ సంపుటాలు దేశవ్యాప్తంగా సివిల్ సర్వీస్ విద్యార్థులకు పఠనీయ గ్రంథాలై దాదాపు 200 మంది ఉత్తీర్ణులై ఎంపిక కావడం తెలుగు అకాడమి ప్రతిష్ఠకు నిదర్శనం. ఇది 2014 జూన్ వరకు ఉన్న తెలుగు అకాడమి ప్రగతి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ సంస్థకు పూర్తి స్థాయి డైరెక్టర్‌ను కూడా నియమించకపోవడం దురదృష్టకరం. తెలుగు అకాడమికి పాఠశాల విద్యకు సంబంధించిన అధికారులను ఇన్‌చార్జ్‌లుగా నియమించడం వల్ల వారికి ఉన్నత విద్యకు సంబంధించిన అవగాహన లేక, పర్యవేక్షణ లోపించి, పరిపాలన కుంటుపడి, విద్యార్థులకు అవసరమైన నూతన గ్రంథాలు రూపొందలేదు. గత పదేళ్ళుగా పాత పాఠ్యగ్రంథాలనే పునర్ముద్రించుకోవలసి వచ్చింది. పైరసీకి అడ్డుకట్ట వేయలేక, అమ్మకాలు తగ్గి అకాడమి ఆర్థికంగా నష్టపోయింది. అంతేకాక ఆంధ్ర ప్రాంతంలో పుస్తకాల సరఫరా, విక్రయం దాదాపు 9 సంవత్సరాలుగా నిలిచిపోయింది. ముఖ్యంగా కోట్లాది రూపాయల విలువైన పాఠ్యగ్రంథాల కాపీరైటు విషయంపై నిర్ణయం తీసుకోకపోవడంతో, ఆంధ్ర రాష్ట్రంలో ప్రైవేటు ప్రచురణ సంస్థ పాఠ్యగ్రంథాలను ప్రచురించడం వల్ల అకాడమికి ఆర్థిక నష్టం జరిగింది.

గత పది సంవత్సరాలుగా ప్రతి ఏటా ఆనవాయితీగా సమర్పించే బడ్జెట్ ప్రతిపాదనలు గవర్నింగ్ బాడి (పాలక మండలి) ఆమోదం లేకుండా ఆర్థిక వ్యవహారాలు కొనసాగటం అకాడమి నియమావళికి పూర్తి విరుద్ధం. పదేళ్లుగా పాలక మండలి సమావేశాలు జరగకపోవడం, విద్యా విషయక స్థాయీ సంఘం పునర్నియామకం జరగకపోవడం, పూర్తి స్థాయి సంచాలకుడు లేకపోవడం, ఉద్యోగ నియామకాలు లేకపోవడం, సిబ్బంది కొరత– ఇన్ని కారణాల వల్ల తెలుగు అకాడమి అయోమయ పరిస్థితిలో పడిపోయి, ఆర్థిక అవకతవకలకు గురయింది. ఈ పరిస్థితుల నుంచి తెలుగు అకాడమిని ఉద్ధరించడానికి ప్రస్తుత ప్రభుత్వం ముందుకు రావాలి.

రాష్ట్ర విద్యారంగ వికాసానికి ఆధారమైన 'తెలుగు అకాడమి'ని 'తెలంగాణ రాష్ట్ర తెలుగు భాషా సంస్థ' అనో 'తెలంగాణ రాష్ట్ర తెలుగు విజ్ఞాన పరిశోధన సంస్థ' పేరుతోనో 'రిజిష్టర్డ్ సొసైటీ'గా ఏర్పాటు చేయాలి. తెలుగు అకాడమి ఇంటర్మీడియెట్ స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు (ఒకేషనల్ కోర్సులతో కలిపి) మొత్తం 600 సబ్జెక్టులలో పాఠ్యగ్రంథాలు తయారు చేసి ప్రచురించి ఇచ్చే సంస్థ కాబట్టి, దీనికి రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయ హోదా ఇచ్చి గుర్తించాలి. ఇది ప్రధానంగా తెలుగు విజ్ఞాన పరిశోధన సంస్థ కాబట్టి, దీనికి అన్ని సబ్జెక్టుల విషయ నిపుణులతో (గ్రంథ రచయితలతో) నిరంతర పర్యవేక్షణ, ఎప్పటికప్పుడు మార్గదర్శనం చేయవలసిన అవసరం ఉంది. కాబట్టి ఈ సంస్థకు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్, తత్ సమాన హోదాతో 'ఛైర్మన్' పదవి ఏర్పాటు చేయాలి. ఆ వ్యక్తి తెలుగు భాషా సాహిత్య విజ్ఞాన రంగాలలో నిష్ణాతుడై, విద్యా పరిపాలనా రంగంలో అనుభవం కలిగినవారై ఉండాలి. ప్రస్తుతం ఉన్న తెలుగు అకాడమి 'డైరెక్టర్' పదవిని 'కార్యనిర్వహణాధికారి' (ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్)గా మార్చు చేయాలి. ఈ పదవికి డిప్యూటీ సెక్రెటరీ స్థాయి వారిని నియమించాలి. అలాగే తెలుగు అకాడమి అకౌంట్స్ ఆఫీసర్ పదవిని 'ఫైనాన్స్ ఆఫీసర్'గా మార్పు చేయాలి. ఈ పదవికి ప్రభుత్వ ఆర్థికశాఖ, ఆడిట్ విభాగం నుండి అసిస్టెంట్ సెక్రెటరీ స్థాయివారిని నియమించాలి.

తెలుగు అకాడమి చేపట్టే నూతన పరిశోధన ప్రాజెక్టుల క్రింద పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఉన్న సామాజిక శాస్త్రాలు, విజ్ఞాన శాస్త్రాలు, కళాతత్త్వ శాస్త్రాలు, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి అత్యాధునిక శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన సంకేత పదకోశాలను, నిఘంటువులను, భాషా సాహిత్యాలకు సంబంధించిన మాండలిక పదకోశాలను ఎప్పటికప్పుడు ఆధునికీకరిస్తూ గ్రంథాలను తయారు చేయాలి. ఇందుకు అవసరమైన ఆర్థిక వనరులను కేంద్ర ప్రభుత్వ సంస్థల నుండి రాబట్టుకోవాలి.

అకాడమి పునర్నిర్మాణంలో మరొక ముఖ్యమైన అంశం విశాలమైన నూతన క్యాంపస్‌ను వందకోట్ల రూపాయల బడ్జెట్‌తో తెలంగాణ రాష్ట్ర 'తెలుగు విజ్ఞాన భవనం' పేరుతో ఏర్పాటు చేయడం. ఈ ప్రతిపాదనకు 2012లో అకాడమి పాలకమండలి ఆమోదం తెలిపింది, ఉస్మానియా యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ కూడా నాలుగు ఎకరాలు స్థలం ఇవ్వడానికి ఆమోదం తెలిపింది. దీంతో ప్రస్తుత ప్రభుత్వం తెలుగు అకాడమి సొంతనిధులతో నూతన క్యాంపస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టవచ్చు. తెలుగు అకాడమి పునర్నిర్మాణంతో పాటు రాష్ట్రంలో ఉన్న ఇతర మాతృభాషా సంస్థలయిన తెలుగు విశ్వవిద్యాలయం, తెలంగాణ సాహిత్య అకాడమి, అధికార భాషా సంఘం ఈ మూడు సంస్థలను గురించి కూడా సమీక్షించాలి. ఈ నాలుగు భాషా సంస్థల పనితీరు వేరువేరుగా ఉన్నందున, వీటి పనితీరును సమీక్షిస్తూ మార్గదర్శకాలను సూచించే భాషా సంఘం (లాంగ్వేజ్ కమిషన్) ఏర్పాటు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఈ విధమైన చర్యలు తీసుకుంటే ప్రజలకు మరింత సన్నిహితమై రాష్ట్ర సర్వతోముఖ వికాసానికి దోహదం చేస్తుంది.

■ ప్రొఫెసర్ కె. యాదగిరి
పూర్వ సంచాలకులు, తెలుగు అకాడమి

టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో విజయ్, పేస్

క్రికెట్ ప్రతిధ్వనులు తప్ప మరే చప్పుడూ వినిపించని భారత్‌లో ఇద్దరు ఆటగాళ్ళు వరల్డ్ లవ్ గేమ్‌లో లెజెండ్స్‌గా, గ్రేట్స్‌గా నిలుస్తారని ఎవరైనా ఊహించారా? వనరులు, ప్రమాణాలు, ప్రోత్సాహకాలు, స్పాన్సర్లు దక్కనిచోట ఆటనే శ్వాసగా చేసుకుని దేశం కోసం పోరాడిన ఇద్దరు యోధులు ఇప్పుడు అపురూపమైన సత్కారం అందుకుంటారని ఎవరైనా ఊహించారా? టెన్నిస్ దిగ్గజాలు విజయ్ అమృత్‌రాజ్, లియాండర్ పేస్ అంతర్జాతీయ టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటుచేసుకోవడం అపురూపమైన దృశ్యమే కదా.. భారత్‌లో ఎన్నో తరాలకు స్ఫూర్తిగా నిలిచిన ఈ ఇద్దరు దిగ్గజాలు.. టెన్నిస్ గ్రేట్స్ మెక్‌ఎన్రో బ్రదర్స్, అగస్సీ, నవ్రతిలోవా, క్రిస్ ఎవర్ట్, కిమ్ క్లియెస్టర్స్ తదితరుల సమక్షంలో సత్కారం అందుకోవడం కన్నులపండువ కాక మరేమిటి?

ఆసియా నుంచి ఈ ఘనత సాధించింది కూడా ఈ ఇద్దరే. అంతర్జాతీయ టెన్నిస్‌కు చేసిన సేవలకు విజయ్ అమృత్‌రాజ్, సాధించిన ఘనతకు లియాండర్ పేస్‌కు ఈ అరుదైన గౌరవం దక్కింది. 1970వ దశకంలో భారత్ నుంచి ఒక ఆటగాడు 19 ఏళ్ళ వయసులో వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరడం అంటే ఆషామాషీ కాదు. మొన్నటి వింబుల్డన్ ఛాంపియన్ అల్కరాజ్‌కు కూడా ఈ రికార్డు లేదు. (అల్కరాజ్ వింబుల్డన్ క్వార్టర్స్ ఫైనల్స్ చేరడానికి 20 ఏళ్ళు పట్టింది) భారత్‌లో అప్పుడున్న పరిస్థితుల మధ్య విజయ్ అమృత్‌రాజ్ లాంటి ఆటగాడు 19 ఏళ్ళ వయసులోనే వింబుల్డన్ మెన్స్ సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోవడం అంటే ఆషామాషీ కాదు. ఇదొక్కటే కాదు గ్రాండ్ శ్లామ్ టోర్నమెంట్స్‌లో విజయ్ అమృత్‌రాజ్ నాలుగుసార్లు మెన్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరారు. డబుల్స్‌లో ప్రపంచ 23వ ర్యాంకర్‌గా 13 డబుల్స్ టైటిల్స్ నెగ్గారు. రెండుసార్లు ఇండియాకు డేవిస్ కప్‌ను అందించారు. అన్ని విభాగాలనూ కలిపితే విజయ్ అమృతరాజ్ సాధించిన టైటిల్స్ 28. నిజానికి ఏడేళ్ళ వయసులో విజయ్ అమృత్‌రాజ్ తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. ఊపిరితిత్తుల సమస్యతో బాధపడిన విజయ్ అసలు లేచి పరిగెత్తగలడా అని ఆయన తల్లి తల్లడిల్లిపోయింది. అలాంటి విజయ్ అమృతరాజ్ తన విజయాలతో కొత్త చరిత్ర లిఖించారు. అద్భుతాలతో భారత టెన్నిస్‌ను మలుపు తిప్పి తర్వాత తరానికి స్ఫూర్తిగా నిలిచారు. తర్వాత కాలంలో రమేష్ కృష్ణన్ భారత టెన్నిస్‌కు కాస్తోకూస్తో విజయాలు సాధించిపెట్టినా దీర్ఘకాలం నిలవలేకపోయాడు.



1970వ దశకంలో 19 ఏళ్ళ పిన్న వయసులో వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన విజయ్ అమృతరాజ్ ఆ తరువాత అనేక అద్భుత విజయాలతో భారత టెన్నిస్‌ను మలుపు తిప్పి తర్వాత తరానికి స్ఫూర్తిగా నిలిచిన దిగ్గజ క్రీడాకారుడు. టెన్నిస్‌లో భారత్‌కు ఒలింపిక్ పతకం సాధించి పెట్టిన ఏకైక ఆటగాడు లియాండర్ పేస్.

విజయ్ అమృతరాజ్‌ది ఓ రకమైన స్ఫూర్తిదాయకమైన పోరాటమైతే, పేస్‌ది మరో కథ.. పేస్ తండ్రి భారత హాకీ ఒలింపియన్. పేస్‌ను ఫుట్‌బాలర్‌గా చూడాలనుకుని ఫుట్‌బాల్ కోచింగ్ ఇప్పించారు. ఆ తర్వాత యూరోపియన్ క్లబ్స్‌లో ఆడించేందుకు పంపారు. యూరోపియన్ క్లబ్స్‌లో ఆడాలంటే భారత గుర్తింపును వదిలేయాలంటూ షరతులతో పేస్ వెనక్కివచ్చేశాడు. హాకీ అనుకున్నా అదీ కుదరలేదు. దీంతో చెన్నై విజయ్ అమృత్‌రాజ్ అకాడమీలో చేరాక పేస్ ప్రస్థానం ప్రారంభమైంది. విజయ్ అమృతరాజ్ శిక్షణలో పేస్ రాటుదేలాడు. ఆ తర్వాత మళ్ళీ లియాండర్ పేస్ రూపంలో భారత్ టెన్నిస్ మలుపు తిరిగింది. పేరుకు తగినట్టే పేస్.. రాకెట్‌తో దూసుకెళ్ళాడు. ఆ రోజుల్లోనే క్రికెట్ నీడలో వెనుకబడిన భారత టెన్నిస్‌ను పేస్ తన భుజాన వేసుకున్నాడు. భూపతితో పాటు పలువురు ప్లేయర్లతో కలిసి మెన్స్ డబుల్స్‌ను, టెన్నిస్ గ్రేట్స్ మార్టినా నవ్రతిలోవా, హింగిస్ తదితరులతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్‌ను ఆడి ఎన్నో గొప్ప విజయాలు సాధించాడు. మెన్స్ డబుల్స్‌తో పాటు మిక్స్‌డ్ డబుల్స్‌లో పేస్ పేరు అంతర్జాతీయంగా మార్మోగింది. 23 ఏళ్ళ నెలా 17 రోజుల వయసులో 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో పేస్ పతకం సాధించాడు. టెన్నిస్‌లో భారత్‌కు ఒలింపిక్ పతకం సాధించి పెట్టిన ఆటగాడు ఇప్పటి వరకూ పేస్ ఒక్కడే. మెన్స్ డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ అన్నింటినీ కలుపుకుంటే మొత్తం 19 గ్రాండ్ శ్లామ్ టైటిల్స్‌ను పేస్ సాధించాడు. అతడు గొప్ప అథ్లెట్ అని, అతను రాకెట్ పట్టుకుంటే ఆర్కెస్ట్రాలా ఉంటుందని నవ్రతిలోవావంటి టెన్నిస్ గ్రేట్ ప్రశంసలను అందుకున్నాడు. తన అభిమాన మిక్స్‌డ్ డబుల్స్ ప్లేయర్ పేస్ అంటూ ఎన్నో ఏళ్ళ క్రితం భారత్‌కు వచ్చినప్పుడే నవ్రతిలోవా చెప్పింది. పేస్–నవ్రతిలోవా రెండు గ్రాండ్‌శ్లామ్ టైటిల్స్ సాధించారు. పేస్‌తో మిక్స్‌డ్ డబుల్స్ ఆడటం గౌరవంగా భావిస్తున్నానని నవ్రతిలోవా ఎప్పుడూ చెబుతూ ఉంటుంది. నిజానికి పురుషులు–మహిళలు తారతమ్యం లేకుండా ఆడే ఆట టెన్నిస్ ఒక్కటే.. అందుకే ఎవరు ఆడినా, ఎవరు తలపడినా ఈ ఆట ప్రపంచానికి లవ్ గేమ్‌గా మారింది.

తనను ఇంతటిస్థాయికి తెచ్చిన తన తండ్రి, గురువులు, టెన్నిస్ గ్రేట్స్‌కు చెమర్చిన కళ్ళతో పేస్ కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. ఎన్ని టైటిల్స్, ఎంత ప్రైజ్‌మనీ సాధించామన్నది ముఖ్యం కాదు. ఎంత మందికి స్ఫూర్తిగా నిలుస్తామన్నదే ముఖ్యం–అంటూ తండ్రి చెప్పిన మాటను పేస్ గుర్తు చేసుకున్నాడు. ఇదే స్ఫూర్తితో రాబోయే 15 ఏళ్ళలో 25 కోట్ల మందికి టెన్నిస్‌ను చేరువ చేయడమే ఆశయమని ప్రకటించాడు. లవ్ గేమ్‌లో 51 ఏళ్ళ ఈ చాంపియన్ తన లక్ష్యాన్ని చేరుకోవాలని, లవ్ ఆల్‌గా తీర్చిదిద్దాలని కోరుకోవడంలో తప్పేమీ లేదేమో!


• కేవీఎస్ నాగరాజు
జర్నలిస్టు

'వినుట' అనే విప్లవం మళ్లీ రావాలి!

సినిమాహాలు, ఎగ్జామ్‌హాలు, గర్భగుడి.. లాటి కొన్నిచోట్ల తప్ప ఎక్కడయినా చూడండి– బస్సూ, రైలూ, మెట్రో, వెయిటింగ్ హాళ్ళూ, మ్యారేజిహాళ్ళూ.. ఇందుగలదందులేదని కాక ఎందెందు వెతికి చూడకుండానే అందరి చేతిలో కనిపించేవి మొబైల్‌ఫోన్లు. 'కనికట్టు' అన్నపదం విన్నాం కానీ, చూడలేదు. ఇప్పుడు మాత్రం అందరి కంటిచూపుల్ని తన స్క్రీన్‌కి కట్టిపడేస్తున్నాయి సెల్‌ఫోన్లు. చివరికి బండ్లు నడిపేవాళ్ళు కూడా. అయితే ప్రయాణీకుల అదృష్టవశాత్తూ సెల్‌ఫోన్లను గుండెలకు హత్తుకొని శబ్దాల్ని మాత్రం చెవులకెత్తుకుంటున్న దృశ్యాలూ చూస్తున్నాము. ఇక ఇండ్లల్లో టీవీలూ, ఆఫీసుల్లో కంప్యూటర్లూ, ల్యాప్‌టాపులూ.. ఇలా జెట్ వేగంతో విస్తరిస్తున్న గ్యాడ్జెట్లు.

పెళ్ళాం – మొగుడు, తల్లి – పిల్ల, బాసూ – సబార్డినేటూ.. అన్న స్థాయీభేదాల్ని సైతం రూపుమాపి అందరినీ ఎవరి సెల్లుల్లో వారిని బంధింపచేస్తున్నాయి. స్వచ్ఛంద బందీలయిపోతున్నాం అందరమూనూ. ఇలాటి వాటికి ఒకే ఒక ఆరోగ్యవంతమూ, ఆనందప్రదమూ, విషయ, విజ్ఞాన ప్రేరకమూ అయిన అతి పాత మాధ్యమం రేడియో. అదే అందరికీ 'అమ్మ'లా తెలిసిన ఆకాశవాణి.

పాపం! ఏ అమ్మ కూడా తన పిల్లలతో చెప్పదు 'కొంచెం! నన్ను చూసుకోండ్రా' అని. 'నన్ను మరవకండ్రా' అని. ఇదిగో అలాంటి అమ్మే ఆకాశవాణి. అంటే రేడియో. అమ్మ సహజంగానే అందరి గుండెల్లో ప్రేమైక రాశిలా ఉంటుంది. ఆకాశవాణి ప్రసక్తి వస్తే చాలు – నా చిన్నప్పుడు.. అంటూ ఎన్నో తీయని ముచ్చట్లు. కానీ.. ఆ విషయాలన్నీ గతకాలపు తీపిగురుతులుగానే ఉండాలా? హు..హు... అయితే మరి ఆ తీయదనాన్ని మళ్ళీ అందరికీ దగ్గర చేద్దాం. అనుభవిస్తే అది ఎంత ఆరోగ్యవంతమో రుజువవుతుంది. ఇదివరకు పెద్దపెద్ద రేడియోసెట్లు, ఏరియళ్ళ ట్రాన్సిస్టర్ రేడియోలు, గ్రామ పంచాయతీల్లో, పార్కుల్లో ప్రతిధ్వనించే లౌడ్ స్పీకర్లు. ఇపుడు ఇలాటివి చూడాలంటే పాత సినిమాలు చూడాల్సిందే.



టెక్నాలజీ పుణ్యమా అని రేడియోసెట్లు లేకున్నా మొబైల్ ఫోన్లలో యాప్స్ రూపంలో అన్ని రేడియో కేంద్రాలు అందుబాటులో వున్నాయి. ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకుని వింటూ ఉంటే ఎన్నెన్నో మనలోకి స్పీడ్‌గా అప్‌లోడ్ అవుతాయి. అసలు రేడియో గొప్పతనం ఏంటంటే? అంటే ఒకే పదంలో సమాధానం 'చెప్పలేనంత'. విశ్వసనీయమయిన, సూటిగా, సరళంగా చెప్పే వార్తలు, శాస్త్రీయ, జానపద, సినీ సంగీతాలు, రూపకాలు, నాటకాలు, ప్రసంగాలు, పరిచయాలు, ప్రత్యక్ష ఫోన్‌ఇన్ కార్యక్రమాలూ. గర్భస్థ శిశువుల ఆరోగ్యం నుండి వయోధికుల దాకా.... అందరూ ఆకాశవాణి కుటుంబ సభ్యులే. బాలబాలికలు, యువతీయువకులు, కర్షకులు, కార్మికులు, మహిళాలోకం, విద్యా, వైద్య, వర్తమాన విజ్ఞాన రంగాలు, సృజనాత్మకత ప్రతిబింబించే కళా ప్రక్రియలు, సంగీత సాహిత్యాలూ, రూపకాలూ, నాటకాలూ... అసలు ఆకాశవాణి అంటే ఒక అద్భుత శబ్ద ప్రపంచం.

ఆకాశవాణి– భాషకు స్వరాభిషేకం చేస్తుంది. గాత్ర వాద్య సంగీతాలకు చిరంజీవిత్వాన్నిస్తుంది. మహామహుల స్వరాల్ని వినిపిస్తుంది, భద్రపరుస్తుంది. సస్య విప్లవ వైభవాన్ని గుర్తు చేస్తుంది. సతత హరిత సాగుబడికీ, శ్వేతవిప్లవ ధవళ ధారకూ, రైతులోకానికి అండగా నిలబడుతుంది. ఆయా ప్రాంతాల యాసలతో పరవశిస్తుంది. భాషలోని సొగసుతో పరిమళిస్తుంది. సూక్తులతో ఆరోజంతటికీ సానుకూల దృక్పథపు దారి పరుస్తుంది. తత్వాలు, సుప్రభాతాలు, కీర్తనలు, పద్యాలు, పాటల మాధుర్యాన్ని హాయిగా కండ్లు మూసుకుని ఆస్వాదించమంటుంది.

విన్నవారికి విన్నంత – భావించిన వారికి భావించినంత. రూపాన్ని మనసు తెరపై చిత్రించే శబ్ద చిత్రాలు... మనకు తెలియకుండానే మన ఊహాశక్తికీ, కాల్పనిక సృజనకూ పదును పెడతాయి. విద్యావిధానంలో, ఉద్యోగాన్వేషణకోసం పోటీ పరీక్షలలో, స్వయం ఉపాధి కల్పనలో నైపుణ్యశిక్షణ అంటూ నినదిస్తున్నది సమకాలం. మన కాల్పనిక శక్తికి ఏ మాత్రం అవకాశం కల్పించని, మిక్సీలో గ్రైండ్ చేసి నేరుగా జీర్ణాశయంలో పోసిన ఆహారంలాగా విజువల్ మీడియా, సోషల్ మీడియా ఉధృతిలో కొట్టుకుపోతున్నాం. సహజంగానే వినిపించే రేడియో అయినా, చదివించే పుస్తకాలైనా కొంచెం ముఖం చిన్న బుచ్చుకుంటున్నాయి. టెక్నాలజీని ఆహ్వానిద్దాం. నూతన ఆవిష్కరణల ఫలితాల్ని ఆదరిద్దాం, ఆస్వాదిద్దాం. అదే సమయంలో కొంతలోకొంత సంప్రదాయ మాధ్యమం రేడియో విలువను మళ్లీ గ్రహిద్దాం... అర్థవంతమైన, అందమైన కార్యక్రమాల్ని ప్రతిరోజూ ఆస్వాదిద్దాం.

నేను 1987లో కడప కేంద్రంలో పనిచేసిన రోజులు గుర్తుకు తెచ్చుకుంటే.. రేడియో ప్రేమికులందరూ ఎంతో సంతోషిస్తారు. ఆకాశవాణి కడప కేంద్రంలో షిఫ్ట్ డ్యూటీ ముగించుకుని సైకిల్‌మీద బజారులో వెళుతుంటే.. ఇస్త్రీషాపులు, పాన్‌షాపులు, కిరాణా అంగళ్ళు, ఇంటి వసారాల్లో రేడియోలు మోగుతూనే వుండేవి. ఒక సినిమాపాట రమారమి మూడు, నాలుగు నిమిషాలు ఉంటుంది. పల్లవి, చరణాలేవీ మిస్ కాకుండా అలా రోడ్లపై వెళుతూ కూడా పాట మొత్తం వినే అవకాశం వుండేది.

ఆకాశవాణి– భాషకు స్వరాభిషేకం చేస్తుంది. గాత్ర వాద్య సంగీతాలకు చిరంజీవిత్వాన్నిస్తుంది. మహామహుల స్వరాల్ని వినిపిస్తుంది, భద్రపరుస్తుంది. సస్య విప్లవ వైభవాన్ని గుర్తు చేస్తుంది. సతత హరిత సాగుబడికీ, శ్వేతవిప్లవ ధవళ ధారకూ, రైతులోకానికి అండగా నిలబడుతుంది. ఆయా ప్రాంతాల యాసలతో పరవశిస్తుంది. భాషలోని సొగసుతో పరిమళిస్తుంది. సూక్తులతో ఆరోజంతటికీ సానుకూల దృక్పథపు దారి పరుస్తుంది. తత్వాలు, సుప్రభాతాలు, కీర్తనలు, పద్యాలు, పాటల మాధుర్యాన్ని హాయిగా కండ్లు మూసుకుని ఆస్వాదించమంటుంది. నీ పనికి ఏ మాత్రం ఆటంకంగా ఉండను అంటుంది. ఉదయాన్నే యోగా చేసుకోండి, వ్యాయామం చేయండి, వంట చేస్తూనో, ఇస్త్రీ చేస్తూనో, బట్టలు కుడుతూనో, బుట్టలల్లుతూనో, వస్త్రాలు నేస్తూనో... ఎవరి వ్యాపకాల్ని వారు కొనసాగిస్తూ ఉండండి. మొత్తం ప్రపంచాన్ని నీ శ్రవణేంద్రియాలద్వారా మనో ఫలకాలపై ముద్రిస్తాను అంటుంది ఆకాశవాణి. ఎడ్లబండికి రేడియో కట్టండి, కారులో రేడియో పెట్టండి... మీ పనిలో మీరు మీ కోసమే ఆకాశవాణి పనిలో ఆకాశవాణి. అందుకే ఆకాశవాణి లక్ష్యమూ, లక్షణమూ 'బహుజన హితాయ – బహుజన సుఖాయ'.

టెక్నాలజీ పుణ్యమా అని ఇపుడు ప్రతియింటా కాదు ప్రతి జేబులో, ప్రతి హ్యాండ్ బ్యాగ్‌లో ఆకాశవాణి సిద్ధంగా వుంది. యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి. ఆకాశవాణి వినటం అంటే అమ్మ మాట వినటమే. ఆకాశవాణి మన భారతీయ సమష్టి కుటుంబ ఆస్తి. నిరుపేదలకైనా, ఆగర్భ శ్రీమంతులకైనా అంతే అందుబాటులో ఉన్న ప్రజాప్రసార సాధనం.

◆ మడిపల్లి దక్షిణామూర్తి
ఆకాశవాణిలో సుదీర్ఘకాలం పనిచేసిన వ్యాఖ్యాత

(నేడు జాతీయ ప్రసార దినోత్సవం)

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 కనిష్ఠం 23.1

33 కేవీ లైన్లలో తలెత్తే సమస్యల గుర్తింపునకు

ఫాల్ట్‌ప్యాసేజ్ ఇండికేటర్స్



- సమస్యలు వస్తే రెడ్‌లైట్‌తో అలర్ట్
- 675 ఫీడర్లలో 216 ఇండికేటర్ల ఏర్పాటు

ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): 33కేవీ విద్యుత్ లైన్లలో సాంకేతిక సమస్యలు ఎక్కడా తలెత్తినా నిమిషాల్లో గుర్తించేలా డిస్కం సరికొత్త టెక్నాలజీని అందుబాటులోకి తెస్తున్నది. ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్స్(ఎఫ్‌పీఐ) పేరిట 216 పరికరాలను 675 ఫీడర్ల పరిధిలో ఏర్పాటు చేసి స్కాడా కార్యాలయానికి అనుసంధానం చేయనున్నారు. దీంతో విద్యుత్ లైన్లలో ఎక్కడ సమస్యలు తలెత్తినా కిలోమీటర్ల మేర సిబ్బంది పెట్రోలింగ్ చేయకుండానే దానిని గుర్తించి నేరుగా అక్కడకు వెళ్లి పరిష్కరించనున్నారు. విద్యుత్ సరఫరా వ్యవస్థలో కీలకమైన 33 కేవీ విద్యుత్ లైన్లు గ్రేటర్‌జోన్ పరిధిలో వేల కిలోమీటర్లు ఉన్నాయి. భారీవర్షాలు, ఈదురుగాలుల కారణంగా లైన్లపై చెట్లు పడినప్పుడు సమస్యలు ఎక్కడ తలెత్తాయో గుర్తించి వాటిని పరిష్కరిస్తుంటారు. సాధారణ సమయంలో సుమారు 10 కిలోమీటర్ల 33 కేవీ విద్యుత్ లైన్లలో సమస్య తలెత్తితే ఆ సమస్య ఎక్కడ ఉందో గుర్తించేందుకు సిబ్బంది, అధికారులు లైన్ మొత్తం పరిశీలించేందుకు గంటల సమయం పట్టేది. అదే ఫాల్ట్ ప్యాసేజ్

మిగతా 8వ పేజీలో..





అదే జోరు..

లష్కర్ బోనాల ఉత్సవాలకు పోటెత్తిన జనం

- రెండోరోజూ బారులు తీరిన లక్షలాది మంది భక్తులు
- అమ్మవారిని దర్శించుకున్న సీఎస్, శైలజారామయ్యర్
- జాతర విజయవంతం : మంత్రి పొన్నం ప్రభాకర్
- జాతర సక్సెస్ : ఎమ్మెల్యే తలసాని
- బోనాలలో చైన్ స్నాచర్ల చేతివాటం
- ఎస్‌ఐ బైకు కూడా చోరీ..

లష్కర్ బోనాల జాతర సోమవారం అంగరంగ వైభవంగా ముగిసింది. జాతరలో రెండో రోజున కూడా లక్షలాది మంది భక్తులు ఉజ్జయినీ మహాకాళి అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. రంగం కార్యక్రమంలో భవిష్యవాణి పలుకులను శ్రద్ధగా విన్నారు. తామెదుర్కొంటున్న సమస్యలను కూడా అమ్మవారి దృష్టికి తీసుకెళ్లగా వాటికి సమాధానాలు ఇచ్చారు. అనంతరం నిర్వహించిన అంబారీ ఊరేగింపులో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సందట్లో సడేమియాలా ఉత్సవాల్లో చైన్‌స్నాచర్లు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. బైక్‌లు, సెల్‌ఫోన్లు, ఆభరణాలను తస్కరించారు. 8

అంబారీపై అమ్మవారి ఊరేగింపు, పాల్గొన్న భక్తులు



అమ్మవారిని దర్శించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్, శైలజా రామయ్యర్, కోట నీలిమ

ఔషధ వినియోగం తగ్గించండి..

ఆరోగ్యంగా ఉంటారు

- 'రంగం'లో స్వర్ణలత భవిష్యవాణి
- వర్షాలకు కొదువలేదు..
- కష్టపడకపోతే ప్రజలు సోమరులవుతారు..



భవిష్యవాణి వినిపిస్తున్న మాతంగి స్వర్ణలత

సికింద్రాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పాడిపంటల్లో ఔషధాల వినియోగం తగ్గించండి.. అప్పుడే ఆరోగ్యం చక్కబడుతుంది. ఆయుష్షు పెరుగుతుంది.. అంటూ భవిష్యవాణి వినిపించిన స్వర్ణలత ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఉజ్జయిని మహాకాళి బోనాల జాతరలో సోమవారం రంగం నిర్వహించారు. మాతంగి స్వర్ణలత పసుపు పూసుకొని, చేతిలో గవ్వలహారం, తంబూర పట్టుకుని శ్రీమహాకాళి అమ్మవారి గర్భగుడికి ఎదురుగా ఉన్న మాతంగేశ్వరీ ఆలయం ముఖమండపం వద్ద పచ్చికుండపై నిలుచుని అమ్మవారిని ఆవహించుకుని భవిష్యవాణి వినిపించారు. జనం ఎక్కువగా మధుమేహం (డయాబెటీస్)తో బాధపడుతున్నారని, దీనికి నివారణ లేదా అంటూ భక్తులు అడిగిన ప్రశ్నకు ఆమె బదులిచ్చారు. 'పాడిపంటలు ఇంతకుముందులా లేవు.. ఎక్కువగా ఔషధాలు వాడుతున్నారు. అందువల్లే మీకు రోగాలు వస్తున్నాయి..' అంటూ భవిష్యవాణి చెప్పారు. రాష్ట్రంలో సరిపడా వర్షాలు కురుస్తాయని, అనుమానాలు పెట్టుకోవలసిన అవసరం లేదన్నారు. కష్టపడకపోతే ప్రజలు సోమరిపోతులవుతారని అన్నారు. ఈ ఏడాది బోనాల జాతర పూజలపై సంతృప్తి వ్యక్తం చేశారు. తనను నమ్ముకునే భక్తులను ఆనందంగా ఉంచుతానన్నారు. బాలికలను, గర్భిణులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు.

సక్సెస్ చేశారు.. సంతోషం

- అధికారులకు, ప్రజలకు మంత్రి పొన్నం కృతజ్ఞతలు

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బోనాల పండుగను విజయవంతం చేయడంలో అధికార యంత్రాంగం సహకారంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. దేవాదాయ శాఖ, పోలీస్, ఫైర్, ట్రాఫిక్, జీహెచ్‌ఎంసీ, విద్యుత్, తదితర శాఖల అధికారుల సహకారంతో బోనాలు విజయవంతం అయ్యాయని వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నగరంలో ఆషాడమాస బోనాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఈనెల 7న గోల్కొండలో ప్రారంభమైన బోనాలు ఆగస్టు 4న ముగుస్తాయన్నారు. గతేడాది కంటే ఈసారి ఆలయాలకు నిధులు ఎక్కువగా అందజేశామన్నారు. రంగంలో భవిష్యవాణి చెప్పినట్లుగా రాబోయే కాలంలో అమ్మవారి ఆశీర్వాదంతో ప్రకృతి సహకరించి రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్, రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



8

సివిల్ వివాదాలకు దూరంగా ఉండాలి

వాతావరణ మార్పులతో గ్రేటర్ పరిధిలో ఒక్కసారిగా వైరల్ ఫీవర్లు, డెంగీ వ్యాధులు పంజా విసురుతున్నాయి. జలుబు, దగ్గు, విరేచనాలు నగర వాసులను పట్టి పీడిస్తున్నాయి. చిత్తడిగా మారిన నేలలు, మురుగు కుంటల్లో దోమలు వృద్ధి చెంది వైరల్ ఫీవర్లకు కారణమవుతున్నాయి. ఈ నేపథ్యంలో విషజ్వరాల బారిన పడిన వారిని గుర్తించేందుకు వైద్య ఆరోగ్య శాఖాధికారులు సర్కిళ్ల వారీగా సర్వేను నిర్వహిస్తున్నారు. 2వేల మంది జ్వరపీడితులు ఉన్నట్లు సర్వేలో గుర్తించారు. మరికొద్ది రోజులు ఈ సర్వే కొనసాగనుంది.

అటు వర్షాలు.. ఇటు జ్వరాలు

గ్రేటర్‌కు సుస్తీ..

2 వేల మంది జ్వర బాధితులు

- వైరల్ ఫీవర్లు, జలుబు, దగ్గు, విరేచనాలతో జనం సతమతం
- 152 బస్తీ దవాఖాలు, 89 పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వారం రోజులుగా ఫీవర్ సర్వే
- ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న ఆశ వర్కర్లు



భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్‌లో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

హైదరాబాద్ సిటీ న్యూస్‌నెట్‌వర్క్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నగరాన్ని కొద్ది రోజులుగా ముసురు, వర్షాలు పట్టిపీడిస్తున్నాయి. పలు ప్రాంతాలు అపరిశుభ్రంగా మారి జనం దోమల బెడదతో రోగాల బారిన పడుతున్నారు. మారిన వాతావరణ పరిస్థితులతో దగ్గు, జలుబు, విరేచనాలు, శ్వాసకోస వ్యాధులతో సతమతమవుతున్నారు. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వారం రోజులుగా గ్రేటర్ పరిధిలో ఆరోగ్య సర్వేను నిర్వహిస్తున్నది. జిల్లా పరిధిలోని 152 బస్తీ దవాఖానాలు, 89 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (యూపీహెచ్‌సీ) పరిధుల్లో ఈ సర్వే జరుగుతుంది.

ఒక్కొక్క ఆశా వర్కర్‌కు పది కుటుంబాలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఒక్కొక్క ఆశా వర్కర్‌కు పదేసి కుటుంబాల చొప్పున టార్గెట్‌ను నిర్ణయించారు. జిల్లా పరిధిలో 700 మంది ఆశా వర్కర్లు ఈ సర్వేలో నిమగ్నమయ్యారు. ప్రతిరోజు కుటుంబాల సమాచారం సేకరిస్తున్నారు. వివరాలను యూపీహెచ్‌సీకి సంబంధించిన మెడికల్ ఆఫీసర్, స్టాఫ్‌నర్స్ వాటిని క్రోడీకరిస్తారు. జబ్బుల వారీగా విభజించి పూర్తి నివేదికను తయారు చేస్తారు. సాధారణ జబ్బులు, బీపీ లాంటి సమస్యలతో బాధపడుతున్న వారికి యూపీహెచ్‌సీ, బస్తీ దవాఖానాల్లోనే చికిత్సలు అందిస్తారు. ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తారు. సీరియస్ జబ్బులతో బాధపడుతున్న వారిని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రులకు రప్పించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారు.



జల్‌పల్లి మున్సిపాలిటీ వాది-ఏ-ముస్తఫా వీధిలో నీటి నిల్వపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పాతబస్తీ, శివారు ప్రాంతాలలో..

పాతబస్తీ, శివారు ప్రాంతాలలో జ్వర పీడితులను గుర్తించేందుకు క్లస్టర్, పీహెచ్‌సీల వారీగా సర్వే నిర్వహించారు. పాతబస్తీ జంగమ్మెట్ క్లస్టర్ పరిధిలోని అలియాబాద్, ఉందాబజార్, జంగమ్మెట్, చందులాల్ బారాదరి, జహానుమా, చార్మినార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లలో నిర్వహించిన ఫీవర్ సర్వేలో 134 మందికి, బార్కాస్ క్లస్టర్ పరిధిలో 83 మందికి జ్వరాలు వచ్చినట్లు గుర్తించామని అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. జ్వరాలు వచ్చిన వారికి డెంగీ, మలేరియా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. జల్‌పల్లి, శ్రీరాంకాలనీ, కొత్తపేట్, పహాడీషరీఫ్, షాహీన్‌నగర్ ప్రాంతాలలో ఇటీవల మూడు రోజుల పాటు నిర్వహించిన జ్వర సర్వేలో మొత్తం 203 మంది జ్వరంతో ఉన్నట్లు గుర్తించామని వైద్య వర్గాలు తెలిపాయి. శివరాంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మిగతా 8వ పేజీలో..

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల పరిధిలో..

డీబీఆర్ మిల్స్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలో 17మంది సిబ్బంది అయిదు రోజుల పాటు 910 ఇళ్లల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇందులో ఐదుగురు వైరల్ ఫీవర్, ముగ్గురు విరేచనాలతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. గగన్‌మహల్ పీహెచ్‌సీ పరిధిలో 1,510ఇళ్లలో నిర్వహించిన సర్వేలో 9మందికి జ్వరం ఉన్నట్లు తేలింది. ముషీరాబాద్ పీహెచ్‌సీ పరిధిలో 12 బృందాలు ఇంటింటి సర్వే చేయగా 10 మందికి జ్వరం ఉన్నట్లు గుర్తించి ఓఆర్‌ఎస్ పౌడర్, పారాసిటమాల్ మందులను ఇచ్చారు. ఈ ప్రాంతంలో ఒక డెంగీ కేసును గుర్తించారు. భోలక్‌పూర్ పీహెచ్‌సీ పరిధిలో 21మంది సిబ్బంది సర్వే చేయగా 15 మందికి జ్వరం, ఒంటి నొప్పులు ఉన్నట్లు తెలుసుకుని మందులను అందజేశారు. తిలక్‌నగర్ పీహెచ్‌సీ పరిధిలో 15మంది సిబ్బంది నిర్వహించిన సర్వేలో 9మందికి జ్వరం, కొందరికి ఒంటి నొప్పులు ఉన్నట్లు గుర్తించి మందులను అందజేశారు.

డెంగీ లక్షణాలు ఉంటే పరీక్షలు



జిల్లా పరిధిలో రెండు వేల మంది వరకు జ్వరం, విరేచనాలు, జలుబు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించాం. వైరల్ ఫీవర్ ఉండి, డెంగీ లక్షణాలు ఉంటే వారి నుంచి రక్తనమూనాలు సేకరించి తెలంగాణ డయోగ్నోస్టిక్‌కు పంపించి పరీక్ష చేయిస్తున్నాం. జ్వరం ఉన్న వారి ఆరోగ్య వివరాలు ఎప్పటికప్పుడు సేకరిస్తున్నాం. సర్వేతో పాటు పలు ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి జ్వరపీడిత బాధితుల సమాచారం సేకరిస్తున్నామని తెలిపారు.

- డాక్టర్ వెంకటి, డీఎంఅండ్‌హెచ్‌ఓ



గ్రేటర్‌కు 300 మెట్రో డీలక్స్ బస్సులు

- నిధులు కేటాయించాలంటూ ప్రభుత్వానికి ఆర్టీసీ ప్రతిపాదనలు
- ఎలక్ట్రిక్ బస్సుల రాక ఆలస్యంతో ప్రత్యామ్నాయ చర్యలు

హైదరాబాద్ సిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో మళ్లీ మెట్రోడీలక్స్ బస్సులు అందుబాటులోకి రాబోతున్నాయి. ఎలక్ట్రిక్ బస్సుల రాక ఆలస్యంతో ప్రత్యామ్నాయ చర్యలపై ఆర్టీసీ దృష్టిసారించింది. గ్రేటర్ జోన్ పరిధిలో సెప్టెంబర్ నాటికి 300 మెట్రో డీలక్స్ బస్సులు రోడ్లపైకి తీసుకువచ్చే లక్ష్యంతో ప్రత్యేక నిధులు కేటాయించాలంటూ ప్రభుత్వానికి ఆర్టీసీ ఇప్పటికే ప్రతిపాదనలు పంపింది. జూలై నాటికి వందకుపైగా ఎలక్ట్రిక్ బస్సులు గ్రేటర్‌లో అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నా ఒక్క బస్సు కూడా అందుబాటులోకి రాకపోవడంతో ప్రయాణికుల రద్దీతో సిటీ బస్సులపై ఓవర్‌లోడ్ పడుతున్నది. మహాలక్ష్మి ఉచిత ప్రయాణంతో సిటీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ భారీగా పెరగడంతో బస్సులు సరిపోవడం లేదంటూ ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రేటర్‌లో మెట్రో డీలక్స్ బస్సులు అందుబాటులోకి తెచ్చే దిశగా ఆర్టీసీ ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే, మెట్రో డీలక్స్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఉండదని దీంతో టికెట్లతో వచ్చే ఆదాయం కూడా పెరుగుతుందని ఆర్టీసీ భావిస్తోంది.

సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్దాం

- ఇన్‌చార్జి మంత్రి పొన్నం ● ఎమ్మెల్యేలతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శాసనసభ బడ్జెట్ సమావేశాల్లోపు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలను కలిసి నగర అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, అవసరమైన నిధులు, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వివరిద్దామని ఎమ్మెల్యేలకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సోమవారం సచివాలయంలో జిల్లా ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ పనులు నిధుల కొరతతో నెమ్మదించాయని, వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. దోమల నియంత్రణ, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. కొన్ని మెడికల్ షాపుల్లో డ్రగ్స్ సంబంధిత ఔషధాలు అందుబాటులో ఉన్నాయని పలువురు ఎమ్మెల్యేలు పేర్కొనగా.. తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోన్న దుకాణాలను సీజ్ చేయాలని పొన్నం అధికారులకు సూచించారు. గురుకులాలు, ప్రభుత్వ హాస్టల్‌లు, పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించాలని ఎమ్మెల్యేలు, అధికారులకు సూచించారు. సమావేశంలో శాసనసభ్యులు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, మహ్మద్ ముబీన్, కౌసర్ మొహినుద్దీన్, మాజిద్ హుస్సేన్, కలెక్టర్ అనుదీప్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



చెట్టు కూలి ధ్వంసం అయిన ద్విచక్రవాహనం

చెట్టు కూలి మీద పడి

వాహనదారుడి మృతి

- ముగ్గురికి గాయాలు
- నాలుగు ద్విచక్రవాహనాలు, ఒక ఆటో ధ్వంసం

6




షేక్ మహ్మద్ సాలెహ్(ఫైల్)

రూ.500 కోట్లతో 'ఫ్యూచరిస్టిక్ ఎక్స్‌పీరియన్స్ కేంద్రం'

- మంత్రి శ్రీధర్‌బాబు



8



రెండు పడకల ఇళ్లు ఇవ్వండి

● కమిషనర్‌కు పలువురి విజ్ఞప్తి


కమిషనర్ ఆమ్రపాలికి వినతి పత్రం ఇస్తున్న మహిళ

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రెండు పడకల ఇళ్లు కేటాయించాలని పలువురు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కోరారు. సోమవారం సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో పలు అంశాలపై పౌరులు ఫిర్యాదు చేశారు. ఇళ్ల కేటాయింపు వ్యవహారాన్ని రెవెన్యూ విభాగం చూసుకుంటుందని, నిర్మించడం వరకే బల్దియా బాధ్యత అని ప్రజలతో కమిషనర్ పేర్కొన్నారు. అధ్వాన రహదారులు, దోమల తీవ్రత, అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత విభాగాల అధికారులకు ప్రజలు ఇచ్చిన అర్జీలను అందజేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన కార్యాలయంలో నేరుగా 32, ఫోన్ ద్వారా 11 మంది ఫిర్యాదు చేశారు. జోనల్ కార్యాలయంల్లో 81 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు.

అన్నపూర్ణ భోజన కేంద్రాల వద్ద వసతులు కల్పించాలి

నగరంలోని అన్నపూర్ణ భోజన కేంద్రాల వద్ద మెరుగైన వసతులు కల్పించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులకు సూచించారు. దోమల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జోనల్ కమిషనర్లు, అదనపు కమిషనర్లతో సోమవారం కమిషనర్ ఆమ్రపాలి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. శానిటేషన్ నిర్వహణను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని పేర్కొన్నారు.

ప్రజావాణికి 108 దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై 108 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖకు 73, ఎస్సీ కార్పొరేషన్‌కు 4, జిల్లా ఉపాధి కల్పన శాఖకు 3, దివ్యాంగుల సంక్షేమ శాఖకు 4, చీఫ్ ప్లానింగ్ ఆఫీస్‌కు 4, ఇతర శాఖలకు సంబంధించి 20 మంది దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. సంబంధిత శాఖల అధికారులు తమ వద్దకు వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కదిరివన్, ఆర్డీఓలు మహిపాల్, దశరథ్‌సింగ్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ పురాతన భవనాల పునరుద్ధరణపై గవర్నర్ సమావేశం


రాజ్‌భవన్‌లోని షా మంజిల్‌ను పరిశీలిస్తున్న గవర్నర్ రాధాకృష్ణన్ తదితరులు

హైదరాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలోని పురాతన భవనాల పునరుద్ధరణపై గవర్నర్ సిపి.రాధాకృష్ణన్ సోమవారం రాజ్‌భవన్లో సమీక్షా సమావేశం నిర్వహించారు. న్యూయార్క్‌కు చెందిన వరల్డ్ మాన్యుమెంట్స్ ఫండ్ (డబ్ల్యూఎంఎఫ్) ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వర్సిటీలో తూర్పు, పశ్చిమ భాగాల్లో పాత ఫిజిక్స్ బ్లాక్, కెమిస్ట్రీ బ్లాక్‌ల్లో నిర్వహించిన పునరుద్ధరణ పనులపై చర్చించారు. వీటి పునరుద్ధరణకు విదేశీ ప్రతినిధులు తమ ప్రణాళికలను వివరించారు. రాజ్‌భవన్ ప్రాంగణంలోని 'షా మంజిల్' అనే వారసత్వ కట్టడాన్ని కూడా పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా గవర్నర్ పేర్కొన్నారు. ఆ భవనాన్ని డబ్ల్యూఎంఎఫ్ ప్రతినిధులకు చూపించారు. పునరుద్ధరణకు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.విజ్జులత హాజరయ్యారు.

విమానాల రద్దుపై ప్రయాణికుల ఆందోళన

శంషాబాద్ రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన ఆకాశ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఆకాశ్ క్యూపీ 1405 విమానం, బెంగళూర్ వెళ్లాల్సిన అలయన్స్ ఎయిర్ 91869 విమానం రద్దు కావడంతో ప్రయాణికులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం 5గంటలకు వెళ్లాల్సిన ఈ విమానాలు రద్దు కావడంతో ప్రయాణికులు ఎయిర్‌పోర్టు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయాణికులను మరో విమానంలోనైనా ఢిల్లీ చేర్చే ప్రయత్నం చేయకుండా ఇబ్బందులకు గురిచేశారని వారు వాపోయారు.

తెలంగాణ ఉద్యమకారులకు వెంటనే 250 గజాల స్థలం ఇవ్వాలి: పిడమర్తి రవి

పంజాగుట్ట, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని వెంటనే ఇవ్వాలని, మిగతా హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి విజ్ఞప్తి చేశారు. 250 గజాల ఇంటి స్థలం సాధన కోసం ఏర్పడిన సంఘానికి ఉమ్మడి పది జిల్లాల ఇన్‌చార్జిలను నియమించామని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జిగా విష్ణువర్ధన్‌గౌడ్, రడం సురేష్ (ఖమ్మం), గుజ్జుల శ్రీనివాస్‌రెడ్డి (వరంగల్), దేవిరెడ్డి విజయ్ (నల్గొండ), కుమార్‌సాగర్ (మెదక్), శ్రీనివాస్‌గౌడ్ (నిజామాబాద్), శ్రవణ్‌నాయక్ (ఆదిలాబాద్), శివగౌడ్ (హైదరాబాద్), సంజయ్‌గౌడ్ (రంగారెడ్డి), పాలెపు దిలీప్ (కరీంనగర్), సమన్వయకర్తలుగా ఈ.ఉపేందర్, ఎస్.కె.రహీం నియమితులయ్యారు.

ఈ నెల 30న 'కో అహం' నాటక ప్రదర్శన

రవీంద్రభారతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): క్రియేటివ్ థియేటర్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 'కో అహం' అనే నాటకాన్ని ఈనెల 30న తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో ప్రదర్శించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ ఆవిష్కరించారు. కో అహం నాటకానికి క్రియేటివ్ థియేటర్ డైరెక్టర్ అజయ్ మంకెనపల్లి దర్శకత్వం వహించగా కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారగ్రహీత మెర్సీ మార్గరేట్ రచించారు. కార్యక్రమంలో వీరమనోహర్ కావలి, అజయ్‌తో పాటు నటీనటులు పాల్గొన్నారు.

చెట్టు కూలి మీద పడి వాహనదారుడి మృతి

చాంద్రాయణగుట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఓ భారీ వృక్షం కూలి రోడ్డుపై వెళ్తున్న వాహనాలపై పడడంతో ఒక వ్యక్తి మృతిచెందగా మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. నాలుగు ద్విచక్రవాహనాలు, ఒక ఆటో ధ్వంసమైంది. ఈ ఘటన శాలిబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. శంషీర్‌గంజ్ జలమండలి కార్యాలయం పక్కన గోశాలకు వెళ్లే దారిలో ఉన్న భారీ చింతచెట్టు ఒక్కసారిగా వేళ్లతోసహా పెకిలి రోడ్డుపై వెళ్తున్న వాహనదారులపై పడింది. యాక్టివాపై వెళ్తున్న చందులాల్ బారాదరి ప్రాంతానికి చెందిన షేక్ మహ్మద్ సాలెహ్(65)పై చెట్టు పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అతన్ని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇదే ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న జహనుమాకు చెందిన షేక్ అహ్మద్(43) అతని తల్లి, తోపుడు బండిపై కూరగాయలు విక్రయిస్తున్న హుసేన్ కూడా గాయపడ్డారు. సమాచారమందుకున్న శాలిబండ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఫలక్‌నుమా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్, జీహెచ్ఎంసీ యూబీడీ అధికారులు, డీఆర్ఎఫ్, విద్యుత్ శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

భార్య, కుమార్తె హత్య.. భర్త ఆత్మహత్య కేసులో సూసైడ్ లెటర్‌లో ఆసక్తికర విషయాలు

బోయిన్‌పల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అనుమానంతో భార్య స్వప్నను, 11నెలల కుమార్తె నక్షత్రను హత్యచేసిన గణేష్ సంగ్రామ్ సుచిత్ర సమీపంలోని రైల్వేట్రాక్‌పై రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన కేసులో మృతుడి వద్ద లభించిన సూసైడ్ లెటర్‌లో ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఇన్వెస్టిగేషన్ ఎస్ఐ శివశంకర్ తెలిపిన ప్రకారం.. న్యూబోయిన్‌పల్లికి చెందిన గణేష్ సంగ్రామ్ ఆదివారం తెల్లవారుజామున 4గంటలకు ముందు పిల్లల నోట్‌పుస్తకంలో పోలీసులను, కుటుంబ సభ్యులను ఉద్దేశిస్తూ మరాఠీ భాషలో రెండు సూసైడ్ నోట్లను రాశాడు. వాటిని ఫొటోలు తీసి తన కుటుంబసభ్యులకు వాట్సాప్‌లో పంపాడు. 'బంధువు ఒకే ఊరుకు చెందిన ఉమేష్ వల్ల నా జీవితం నాశనమైంది. అందువల్లే నేను నా బతుకు చాలిస్తున్నాను' అని సూసైడ్ లెటర్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అయితే, సూసైడ్ నోట్‌లో పేర్కొన్న ఉమేష్.. మృతుడి స్వగ్రామమైన మహారాష్ట్ర నాందేడ్ డెగ్లూర్‌కు చెందినవాడని, అతడు కొంత కాలంగా న్యూబోయిన్‌పల్లిలోనే ఉంటున్నాడని దర్యాప్తులో తేలిందని ఎస్ఐ తెలిపారు. ప్రస్తుతం ఉమేష్ కనిపించడం లేదని, ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుందని వారు తెలిపారు. కేసును వేగంగా దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

కిషన్‌రెడ్డి నిరుద్యోగుల పక్షాన ధర్నా చేయడమా?

● కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీసతీష్

అఫ్జల్‌గంజ్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ పది సంవత్సరాలు అధికారంలో ఉండి, నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి పబ్బం గడుపుకున్న బీజేపీ రెండు రోజుల క్రితం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నిరుద్యోగుల పక్షాన ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీసతీష్ అన్నారు. ఈమేరకు సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గౌరీసతీష్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పరిపాలన కొనసాగిస్తూ ఉద్యోగుల పక్షాన నిలబడి కార్యాచరణతో ముందుకెళుతుంటే బీజేపీ దీనిని పక్కదోవపట్టించేందుకు దొంగ దీక్షలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని ఆయన తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఎనిమిది నెలల్లో 35,500 ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు, ప్రస్తుతం మెగా డీఎస్సీని నిర్వహిస్తుండగా గ్రూపు-2 నిరుద్యోగుల అభ్యర్థుల అభ్యర్థన మేరకు వాయిదా వేసి గ్రూపు-1 పరీక్షలు నిర్వహిస్తూ, ఖాళీలను భర్తీ చేస్తూ ముందుకెళుతుంటే బీజేపీ చౌకబారు ఆరోపణలు చేస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి మండలి సమిష్టిగా పనిచేసుకుంటూ రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధిగా తీర్చిదిద్దుతూ ముందుకెళుతూ బీజేపీ ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు.



గౌతమ బుద్ధుని విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కార్పొరేటర్ మోండ్ర సంగీత

గౌతమ బుద్ధుని విగ్రహం ఆవిష్కరణ

రాజేంద్రనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్, అత్తాపూర్ డివిజన్ ముష్కమహల్, హుడా కాలనీ పార్కులో నూతనంగా ప్రతిష్ఠించిన గౌతమ బుద్ధుని విగ్రహాన్ని సోమవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మోండ్ర సంగీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ, గౌతమ బుద్ధుని ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. శాంతియుత ధ్యానం వల్ల ఆరోగ్యానికి బాగుంటుందన్నారు. గౌతమ బుద్ధుడు అంటే ప్రశాంతత అని, అహింసా సిద్ధాంతం అని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్‌కు చెందిన వనం శ్రీరాంరెడ్డి, రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ రవికుమార్, నాయకులు బాలపోచయ్య, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భవానీ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్ యాదవ్



శ్రీనివాస్ యాదవ్

రాజేంద్రనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భవానీ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్ యాదవ్ రెండోసారి ఎన్నికయ్యారు. 422 మంది సభ్యులున్న భవానీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు పోలీస్ బందోబస్తు మధ్య ఆదివారం ఎన్నికలు జరుగగా, అందులో 341 మంది కాలనీ ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదివారం రాత్రి తొమ్మిది గంటలకు ఓట్ల లెక్కింపు పూర్తికాగా, ఎం.శ్రీనివాస్ యాదవ్ ప్యానెల్ ఘనవిజయం సాధించింది. ఎన్నికల పర్యవేక్షకులుగా కాలనీకి చెందిన ఎ.వెంకటేశ్వర్‌రావు, ఎ.సత్యనారాయణ రెడ్డి, రామారావు, జి.లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్.మోహన్, సుగుణాచంద్, వెంకట్‌రావు, బి.మనోహర్‌రెడ్డిలు వ్యవహరించారు.

నూతన కమిటీ : అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా అక్కెం క్రిష్ణాయాదవ్, కోశాధికారిగా మహ్మద్ ఎజాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎ.చంద్రకాంత్‌రావు, ఉపాధ్యక్షులుగా ఎస్.వి.సతీష్, సంయుక్త కార్యదర్శిగా జి.శ్రీనివాస్ యాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్.ఎం.బాషా, క్రీడలు, సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా రూపేశ్ శుక్లా, ప్రచార కార్యదర్శిగా బండి నరోత్తంరెడ్డి, ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా నియమితులైన ఎం.శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, భవానీ కాలనీ సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనను రెండవసారి అత్యధిక మెజారిటీతో గెలిపించిన కాలనీ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బద్రీనారాయణ



బద్రీనారాయణ


రాజేంద్రనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్‌గా బద్రీనారాయణ బాధ్యతలు చేపట్టారు. రాజేంద్రనగర్ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనాథ్ బదిలీపై నల్గొండ డిపోకు వెళ్లారు. ఆయన స్థానంలో ఫరుక్‌నగర్ డిపోలో మేనేజర్‌గా పనిచేస్తున్న బద్రీనారాయణ బాధ్యతలు చేపట్టారు. రాజేంద్రనగర్ డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన బద్రీనారాయణను ఉద్యోగులు సోమవారం ఘనంగా సన్మానించారు.

హామీలను అమలు చేయకపోతే అసెంబ్లీని ముట్టడిస్తాం



మహముద్ హుస్సేన్ మక్కి

చార్మినార్ జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో, క్యాబ్ డ్రైవర్ల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలనీ సిటీ ఆటో మోటార్, క్యాబ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహముద్ హుస్సేన్ మక్కి అన్నారు. సోమవారం చంద్రాయణగుట్ట, రియాసత్ నగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించారని, అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లకు చేసిన వాగ్దానాలను పరిష్కరించడంలేదన్నారు. దీనివల్ల ఆటో డ్రైవర్ల పరిస్థితి దీనంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సొంత ఆటో నడిపేవారికి ప్రతి సంవత్సరం పదిహేను వేలు ఆటో పర్మిట్ ఇస్తే వారి పేదరికం పోతుందన్నారు. గత పది సంవత్సరాలుగా ఆటోమీటర్ చార్జీలు పెంచలేదని, ఆటో మీటర్ మినిమం చార్జీలు రూ.50లు, ఆపై కిలో మీటర్‌కు రూ.30లు చేయాలన్నారు. నగరంలో ఆటోలకు క్యాబ్‌లకు పార్కింగ్ స్థలాలు లేవని, ట్రాఫిక్ పోలీసులు నో పార్కింగ్ చలాన్లు విధిస్తున్నారని, కావున ప్రభుత్వం నగరంలో ఆటోలకు, క్యాబ్‌లకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలన్నారు. వెంటనే ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని సిటీ ఆటోక్యాబ్ డ్రైవర్ల పిల్లల భవిష్యత్‌కు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సిటీ ఆటో, క్యాబ్ డ్రైవర్ల సంక్షేమానికి చొరవ తీసుకోవాలని, లేనిచో ఆటో క్యాబ్ డ్రైవర్‌లతో కలిసి అసెంబ్లీని, ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.



హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయ 76వ బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

- చాంద్రాయణగుట్ట, (ఆంధ్రజ్యోతి)

దివ్యాంగ పిల్లల సుస్థిర భవిష్యత్‌కు కృషిచేయాలి

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



భవిత కేంద్రాన్ని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌తో కలిసి సోమవారం ప్రారంభిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పిల్లలకు సుస్థిరమైన భవిష్యత్‌ను అందించేందుకు కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం గన్‌ఫ్రౌండ్రీలోని ఆలియా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ నిర్మాణ సంస్థ, బోష్ ఆధ్వర్యంలో పునరుద్ధరించిన భవిత కేంద్రాన్ని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌తో కలిసి సోమవారం కలెక్టర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధికి అన్ని వర్గాలు చేయూతనందించాలని సూచించారు. సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ డైరెక్టర్ అర్చన సురేష్ మాట్లాడుతూ తెలంగాణ నిర్మాణ్ సంస్థ, బోష్ కృషి ఫలితంగా హైదరాబాద్‌లోని 18 భవితా కేంద్రాలు విజయవంతంగా పునరుద్ధరించబడ్డాయని, దాదాపు 450 మంది దివ్యాంగ పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

కార్యక్రమంలో హైదరాబాద్ డీఈఓ రోహిణి, టీఎస్ఐజీ బోష్ సీనియర్ లీడర్లు అంజాద్ ఖాన్ పటాన్, కార్పొరేటర్ సురేఖ, డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఐఓఎస్ విశ్వనాథ్ గుప్తా, తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, సీఎస్ఆర్ కమిటీ సెక్రటరీ శిల్పా దేవదర్, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు సంఘటనల్లో ఒకరి ఆత్మహత్య, గుర్తు తెలియని వృద్ధుడు మృతి

అమీర్‌పేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వేర్వేరు సంఘటనల్లో ఒక యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా, గుర్తుతెలియని(60) సంవత్సరాల వయస్సు గల వృద్ధుడు మృతి చెందారు. ఎస్ఐ రాజు రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జోగులాంబ వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన తరుణ్ కుమార్ రెడ్డి (18) ఇంటర్ పూర్తిచేసి సీఏ కోచింగ్ కోసం నగరానికి వచ్చి బాపునగర్‌లోని వెంగమాంబ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ కోచింగ్ తీసుకుంటున్నాడు. కాగా తరుణ్ కుమార్ రెడ్డికి గత రెండు సంవత్సరాలుగా కిడ్నీల ఇబ్బందితో పాటు తరుచుగా కడుపు నొప్పి వస్తుండేది. ఇటీవల కడుపునొప్పి అధికం కావడంతో గండిమైసమ్మలో ఉంటు బీటెక్ చేస్తున్న సోదరి సుస్మితకు ఉదయం 11-30 గంటలకు ఫోన్ చేసి కడుపు నొప్పి భరించలేకపోతున్నానని చెప్పి స్విచ్ఛాఫ్ చేశాడు. వ్యక్తిగత పనులపై బయటకు వెళ్లి వచ్చిన రూమ్‌మెట్స్ లోపలికి వెళ్లి చూడగా తరుణ్ కుమార్ రెడ్డి ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే 108కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పోస్ట్ మార్టమ్ నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

బల్కంపేట ఎల్లమ్మ ఆలయం సమీపంలో..

బల్కంపేట ఎల్లమ్మ ఆలయం సమీపంలో సుమారు (60) సంవత్సరాల వయసు కలిగిన గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎక్కడి నుంచో కొద్ది రోజుల క్రితం బల్కంపేటకు వచ్చిన వృద్ధుడు స్థానికంగా భిక్షాటన చేస్తూ రాత్రివేళ ఫుట్‌పాత్‌లపై నిద్రించేవాడు. గతరెండు రోజులుగా ఆరోగ్యం క్షీణించడంతో కదలలేని స్థితిలో ఫుట్‌పాత్ పైనే పడిఉన్నాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికిచేరుకున్న పెట్రోలింగ్ పోలీసులు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వృద్ధుడిని పరిక్షించిన సిబ్బంది అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. స్థానికుల పిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు శవ పరిక్ష నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.



డా.యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను సత్కరిస్తున్న రమణాచారి తదితరులు

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు సినారె పురస్కారం ప్రదానం

రవీంద్రభారతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసిన మహనీయులను స్మరించుకోవడం స్ఫూర్తిదాయకమని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. సోమవారం తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో రసమయి సంస్థ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ పురస్కారగ్రహీత పద్మభూషణ్ డా.సి.నారాయణరెడ్డి 93వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు డా.యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు డా.సినారె పురస్కారం ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణాచారి లక్ష్మీప్రసాద్‌ను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. సినారె పురస్కారాన్ని ఆచార్య యార్లగడ్డకు అందజేయడం సముచితమైన నిర్ణయమని అన్నారు. తెలుగు భాష, సాంస్కృతిక వ్యాప్తికి సినారె, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ విశేష కృషి చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ వేణుగోపాలచారి, ఎం.కె.రాము, ఎం.కె.ఆర్.ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

గృహిణులకు ఆర్థికంగా చేయూతనందించేందుకు

స్టైల్ సితార ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్

● రాంకోఠిలోని కచ్చి భవన్‌లో ఈనెల 25,26లో నిర్వహణ

మంగళ్‌హట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారిత కోసం గత ఎనిమిదేళ్లుగా క్రియేటివ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో స్టైల్ సితార ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తూ వస్తున్నామని ప్రతినిధులు రామారాణీ, వైశాలి, ఇనాని, మీనల్ శారద, వినీత బల్దువ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కోఠిలోని సంస్థ కార్యాలయంలో స్టైల్ సితార ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ప్రదర్శన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... గత ఎనిమిదేళ్లుగా గృహిణులకు ఆర్థికంగా చేయూతనందించేందకు స్టైల్ సితార ఫ్యాషన్‌ను నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. గృహ నివాసాల్లో పనిచేసేవారు వారి ప్రతిభతో తయారు చేసిన ఉత్పత్తులను వారే స్వయంగా ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసేలా 100కు పైగా స్టాళ్లను ఈ ఏడాది ఎగ్జిబిషన్‌లో అవకాశం కల్పించినట్లు వారు వెల్లడించారు. సామాజికంగా, ఆధ్యాత్మికంగా క్రియేటివ్ ఆర్ట్స్ చారిటీ సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తు వస్తుందన్నారు. ఈనెల 25, 26వ తేదీల్లో రెండు రోజులపాటు రాంకోఠిలోని కచ్చి భవన్‌లో ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌ను ప్రముఖ సంఘ సేవకురాలు భగవతి మహేశ్ బల్ద్వా, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ శ్వేత్ అగర్వాల్‌లు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. రెండు రోజుల పాటు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోని ముంబాయి, కలకత్తా, జైపూర్‌తో పాటు వివిధ రాష్ట్రాల మహిళలు ఫ్యాషన్ డిజైనింగ్, ఫుడ్ స్టాల్, గేమ్స్ హ్యాండ్‌క్రాఫ్, జూవెల్లరీ తదితర వాటిని ఏర్పాటు చేస్తారన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

● ఓబీసీ మోర్చా రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్

రాజేంద్రనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తు బీజేపీ ఓబీసీ మోర్చా రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్ ఆధ్వర్యంలో సోమవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ బి.రాములుకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీ డిక్లరేషన్ ప్రవేశపెడతామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. జనాభా ప్రాతిపదికన 42శాతం ఉన్న బీసీలకు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. జ్యోతిరావు పూలే బీసీ సబ్ ప్లాన్‌ను ఏర్పాటు చేసి రూ.20వేల కోట్లు మంజూరు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను మంజూరు చేయడంలేదని, ఎంబీసీ కులాలకు ప్రత్యేక హోదా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రోగ్రాం కోఆర్డినేటర్ అడికె రాజు, బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు డి.సత్యనారాయణ ముదిరాజ్, చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ ఎ.మల్లారెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, నాయకులు మూల శ్రీనివాస్‌గౌడ్, ఎస్.వాసు, ఎన్.జగన్, రావుల బాస్కర్, జోగి రవి, కాడెం సుదాకర్, రాచూరి రాజశేఖర్, జి.బాబురావు, ఎస్.విజయ్‌కుమార్, మల్లేశ్‌చారి, జయానంద్‌రెడ్డి, కాకులారం క్రిష్ణ పాల్గొన్నారు.

'బోనాలకు రోడ్లను బాగుచేయండి'

రాజేంద్రనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28న మైలార్‌దేవుపల్లి డివిజన్ పరిధిలోని వివిధ బస్తీలలో బోనాల ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, అందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను చేపట్టాలని కోరుతూ సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మైలార్‌దేవుపల్లి డివిజన్‌కు చెందిన టి.ప్రేంగౌడ్ వినతిపత్రం అందజేశారు. రోడ్లపై ప్యాచ్ వర్క్ పనులు చేపట్టాలని, వీధి దీపాలు వెలిగేటట్లు చూడాలని, గుంతలను పూడ్చాలని, దేవాలయాల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. బోనాలకు వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కాటేదాన్, అప్కో కాలనీ, మధుబన్ కాలనీ, పద్మశాలిపురం, టీఎన్‌జీవోస్ కాలనీలలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇవే కాకుండా మరో నాలుగు దరఖాస్తులు ప్రజావాణిలో వచ్చాయని డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ తెలిపారు.

మద్యం మత్తులో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

మంగళ్‌హట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ అడ్డుగా వచ్చిన వ్యక్తిపై దాడి చేసిన నిందితునిపై అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 18న చర్మాస్ నుంచి అబిడ్స్ మీదుగా ఎంజే మార్కెట్ వైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్న కవాడిగూడకు చెందిన శ్రీను అబిడ్స్ చౌరస్తా వద్దకు రాగానే ముందు పాతబస్తీకి చెందిన అజీమ్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ క్రమంలో అజీమ్, శ్రీనులు ఇద్దరూ దుర్భాలాషడుకుంటూ ఒకరిపై ఒకరూ దాడి చేసుకున్నారు. దీంతో అబిడ్స్ ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శ్రీనుకు బ్రీత్ అనలైజర్‌తో పరీక్షలు నిర్వహించగా మద్యం సేవించినట్లు నిర్ధారించడంతో అతనిపై కేసు నమోదు చేసుకొని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

దేశంలో అంతరించిపోతున్న ఆస్ట్రో ఆసియాటిక్ భాషలు

● ఆ భాషలు మాట్లాడే ఆదివాసీ తెగలపై ఇండో యూరోపియన్ భాషల ప్రభావం
● పారిశ్రామికీకరణ, వలసలే ఇందుకు కారణం
● సీసీఎంబీ తాజా అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్, జూలై 22: మన దేశంలో ఆస్ట్రో ఆసియాటిక్ (దక్షిణాసియా దేశాల ప్రజల మూల భాషలు) భాషలను మాట్లాడే ఆదివాసీ తెగలు క్రమంగా ఇండో-యూరోపియన్ (అస్సామీ, బెంగాలీ, కొంకణీ) భాషల వైపు మొగ్గుచూపుతున్నాయని సీసీఎంబీ నిర్వహించిన జన్యు-భాషాపరమైన అధ్యయనంలో వెల్లడైంది. ఒడిశా, చత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లోని ఆదివాసీ తెగలతో పాటు మన దేశంలో దాదాపు 5% మంది ప్రజలు ఆస్ట్రో ఆసియాటిక్ భాషలను మాట్లాడుతారు. దాదాపు 4వేల సంవత్సరాలుగా వీరి భాషలివే. అయితే, క్రమంగా ఈ తెగలపై ఇండో-యూరోపియన్ భాషల ప్రభావం పెరుగుతున్నట్లు సీసీఎంబీ వెల్లడించింది. పారిశ్రామికీకరణ, వలసలు ఇందుకు కారణాలుగా పేర్కొంది. ఈ ధోరణి వల్ల ఆస్ట్రో ఆసియాటిక్ భాష మాట్లాడేవారు పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఒడిశాలోని భతూడి, భుమ్జి, హో, మహాలీ ఆదివాసీ తెగలు మాట్లాడే భాషలో వస్తున్న మార్పులపై సీసీఎంబీ శాస్త్రవేత్త కుమారసామి తంగరాజ్, లక్నోలోని బీర్బల్ సాహ్ని ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్త నీరజ్‌రాయ్ తాజాగా అధ్యయనం నిర్వహించారు. ఆస్ట్రో ఆసియాటిక్ భాష మాట్లాడే తెగలకు చెందినవారు, ఆ తెగలకు సమీపంలోనే ఉంటూ ఇండో-యూరోపియన్ భాష మాట్లాడే వారి జన్యువులను సరిపోల్చి చూశారు. వీరిద్దరి మధ్య జన్యుభేదం ఉందని నిర్ధారణ అయిందని తంగరాజ్ తెలిపారు. జన్యువులు, భాషకు గల సంబంధంపై సీసీఎంబీ అధ్యయనం నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ అధ్యయనం అంతర్జాతీయ జర్నల్ హేలియాన్‌లో ప్రచురితమైంది.

రూ.2 లక్షల రుణం ఇస్తామని.. రూ.1.20 లక్షలు కాజేశారు

● లోన్ మోసాలకు పాల్పడుతున్న నలుగురు సైబర్ నేరగాళ్ల అరెస్ట్
● నిందితులపై దేశవ్యాప్తంగా 401, తెలంగాణలో 24 కేసులు
● ఢిల్లీలో అరెస్ట్ చేసిన సైబర్ క్రైం పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): లోన్ ఇప్పిస్తామని మోసాలకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. బిహార్‌కు చెందిన మనీష్‌కుమార్(24), ఆకాష్ కుమార్(24), కుందన్‌కుమార్(28), తెలంగాణకు చెందిన వెంకటేష్ మాన్‌జీ రాథోడ్ (21) ముఠాగా ఏర్పడి ప్రముఖ రుణ సంస్థల ప్రతినిధులమంటూ తక్కువ వడ్డీకి లోన్ ఇప్పిస్తామని ప్రచారం చేసుకుంటున్నారు. రుణం కావాలని సంప్రదించిన వారి నుంచి జీఎస్‌టీ, ఎన్ఓసీ, పెనాల్టీ పేరుతో అందినకాడికి డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్నారు. ధనీ ఇన్‌స్టంట్ పర్సనల్ లోన్ సంస్థలో పనిచేస్తున్నామంటూ బహదూర్‌పురాకు చెందిన వ్యక్తికి రుణం ఇప్పిస్తామని నమ్మించారు. బాధితుడు రూ. 2లక్షల రుణం కావాలని కోరగా, అతడి నుంచి ఆధార్, పాన్, బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకున్నారు. ప్రాసెసింగ్ చార్జీలు, జీఎస్‌టీ, టీడీఎస్, ఎస్‌జీఎస్‌టీ, లేట్ పెనాల్టీ, క్లియరెన్స్, ఎన్ఓసీ, చెక్ క్లియరెన్స్ చార్జీలు, రీఫండబుల్ అమౌంట్ పేరుతో పలు దఫాలుగా బాధితుడి నుంచి రూ. 1,20,340 వసూలు చేశారు. బాధితుడు ఫోన్ చేయగా స్పందించలేదు. మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాంకేతిక ఆధారాలతో నిందితులు ఢిల్లీలో ఉన్నట్లు గుర్తించారు. సైబర్ క్రైం ఏసీపీ శివమారుతి ఆధ్వర్యంలో సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రావు, ఎస్సై కె.సతీస్‌రెడ్డిల బృందం ఢిల్లీ వెళ్లి నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 11 ఫోన్లు, 2 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై దేశవ్యాప్తంగా 401, తెలంగాణలో 24 కేసులు నమోదయ్యాయని సైబర్ క్రైం ఏసీపీ శివమారుతి తెలిపారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/xLOdQjLలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.



దర్బార్ మైసమ్మ ఆలయం

ఈనెల 28న దర్బార్ మైసమ్మ బోనాలు

కార్వాన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాలు జూలై 28న నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ఠాకూర్ అమర్‌సింగ్ తెలిపారు. సోమవారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోనాల నేపథ్యంలో దేవాలయాన్ని విద్యుత్ దీపాలు, రంగులతో ముస్తాబు చేస్తున్నామని తెలిపారు. నగరం నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దర్బార్ మైసమ్మ దేవాలయంతో పాటు సమీపంలో ఉన్న మహాకాళి మైసమ్మ ఆలయ బోనాలు ఉమ్మడిగా జరపడం ఆనవాయతీగా వస్తుందని ఆయన తెలిపారు. బోనాల ఉత్సవాలకు వారం రోజులు ముందే ఘటం ఎదుర్కోళ్ల కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అమ్మవారి ఘటం ఎదుర్కోవటంతో దర్బార్ మైసమ్మ బోనాలు ప్రారంభమవుతాయని తెలిపారు. బోనాల ఉత్సవాలు, రంగం, జాతర కార్యక్రమం ప్రతి ఏటా మాదిరిగానే అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు కేటాయించొద్దు

రాజేంద్రనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని ఏడు మండలాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని, అలా కాకుండా 23సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన పథకాన్ని వండి విద్యార్థులకు పెడుతున్న మహిళా సంఘాల సభ్యులకే ఆ పథకాన్ని వర్తింపచేయాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి కోరారు. ఇదే విషయాన్ని సోమవారం మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేమ్‌పావనితో కలసి సీపీఐ శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీలో ఈ విషయంపై మాట్లాడి మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులకు న్యాయం చేయాలన్నారు.

బోనాల పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

కార్వాన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బోనాల పండగను శాంతియుతంగా ఘనంగా నిర్వహించుకోవాలని సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్ సూచించారు. సోమవారం టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏకేఎం ఫంక్షన్‌హాల్లో పీస్‌వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి డీసీపీ చంద్రమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బోనాలను ప్రతీ ఒక్కరు శాంతియుతంగా నిర్వహించుకోవాలని, పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. మైత్రీపీస్ కమిటీ సభ్యుల సహాయ సహకారాలు పండగల సందర్భంగా ఎంతో అవసరమని ఆయన సూచించారు. ఫలహారం బండ్ల నిర్వాహకులు కూడా త్వరగా ఊరేగింపు నిర్వహించాలని, పోలీసులు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆయన సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అశ్వాక్, కార్పొరేటర్ స్వామి యాదవ్, పీస్ కమిటీ అధ్యక్షుడు మోజం, ఏసీపీ మునావర్ అలీ, ఏసీపీ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జేపీఎల్ పోటీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): కేఎస్‌జీ జర్నలిస్టు టీ20 ప్రీమియర్ లీగ్ (జేపీఎల్) తొలి రోజు మ్యాచ్‌లు ఉత్సాహంగా సాగాయి. సోమవారం విజయానంద్ గ్రౌండ్‌లో జరిగిన తొలి మ్యాచ్‌ను త్రుక్ష ఫుడ్స్ ఎండీ చల్లా భరత్ రెడ్డి టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ఉరుకులు పరుగులు తీసే జర్నలిస్టులకు ఈ లీగ్‌తో ఒత్తిడి నుంచి కొంత ఉపశమనం లభిస్తుందని, ఇలాంటి లీగ్‌లు భవిష్యత్‌లోనూ కొనసాగించాలని నిర్వాహకులను కోరారు. అనంతరం జరిగిన తొలి మ్యాచ్‌లో థండర్స్ విజయం సాధించగా, రెండో మ్యాచ్‌లో ఎన్ రైజర్స్ గెలుపొందింది.

లాల్‌దర్వాజ అమ్మవారికి చీర నేతప్రారంభం

చాంద్రాయణగుట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయ 116వ బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని లాల్‌దర్వాజ మేకలబండకు చెందిన పద్మశాలి కులస్తులు ఏనుగుల కుటుంబసభ్యులు ప్రత్యేకంగా చేనేత చీరను సమర్పించనున్నారు. 115 ఏళ్ళ చరిత్రలో మొదటిసారిగా అమ్మవారికి మగ్గంపై స్వహస్తాలతో నేస్తున్న చేనేత పోచంపల్లి పట్టుచీరను అమ్మవారికి శుక్రవారం సమర్పిస్తామని చేనేత కార్మికుడు అనిల్ కుమార్‌లు తెలిపారు. ఈ నేత కార్యక్రమాన్ని సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ సి.రాజేందర్‌యాదవ్ ప్రారంభించారు. చీర నేత పని పూర్తయిన తర్వాత శుక్రవారం అమ్మవారికి సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్‌తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.రామాంజనేయులు, మారుతీ యాదవ్, అర్విండ్‌కుమార్ గౌడ్, కె.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మంగళ్‌హట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మృతదేహం ఎంజే మార్కెట్ చౌరస్తా ఫుట్‌పాత్‌పై పడి ఉండడంతో బేగంబజార్ పోలీసులు స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఎస్సై సాయితేజరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మృతుడి వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని ఒంటిపై బ్రౌన్ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ఉందని సంబంధీకులు ఎవరైనా ఉంటే బేగంబజార్ పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

సినారె పురస్కారానికి కవి యాకుబ్ ఎంపిక

గోషామహల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సారస్వత పరిషత్ ప్రతి సంవత్సరం ప్రదానం చేసే డాక్టర్ సి.నారాయణ రెడ్డి సాహితీ పురస్కారానికి ఈసారి కవి డాక్టర్ యాకుబ్ ఎంపికయ్యారు. ఈనెల 27న తెలంగాణ సారస్వతపరిషత్ ఆడిటోరియంలో సినారె 93వ జయంతి సందర్భంగా యాకుబ్‌కు ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



డాక్టర్ యాకుబ్



'బ్రేక్'ఫాస్ట్

ప్రభుత్వ పాఠశాలల్లో ఆగిన అల్పాహారం

- గతేడాది అక్టోబర్ 6న షురూ
- 45 రోజులే కొనసాగింపు
- తిరిగి ప్రారంభించాలని సర్కారుకు వినతులు

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉదయం పూట ఆకలితో అలమటించకుండా ఉండేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన 'సీఎం బ్రేక్‌ఫాస్ట్'కు ఆదిలోనే బ్రేక్‌లు పడ్డాయి. గతేడాది అక్టోబర్ 6న ఎంతో ఆర్భాటంగా మొదలుపెట్టి కేవలం 45 రోజులు టిఫిన్ అందజేసి చేతులు దులుపుకున్నారు. నిధుల కొరత అంశాన్ని దాచిపెట్టి, ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపించి కేవలం నెలన్నర మాత్రమే అందజేసి అర్ధాంతరంగా నిలిపివేయడంతో విమర్శలు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇపుడా పథకాన్ని పునరుద్ధరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో దీన్ని అమలు చేయడం ద్వారా హాజరుశాతం పెరుగుతుందని విద్యావేత్తలు సూచిస్తున్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందుతున్న విషయం తెలిసిందే.

సూర్యుడిని రానివ్వని నీలాకాశం



ముస్తాబయినంత ముద్దుగా ఆకాశం నీలిరంగును సంతరించుకుంది. మూడు రోజులుగా ముసురు కమ్మేయడం, సూర్యుడు ముఖం చాటేయడంతో ఆహ్లాదకరంగా కనిపించింది. నగరంలోని జూబ్లీహిల్స్ వద్ద కనిపించిన ఈ దృశ్యం సోమవారం సాయంత్రం పలువురిని మైమరపింపజేసింది. ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్‌మనిపించింది.



సచివాలయంలో పారిశ్రామికవేత్తలతో మంత్రి శ్రీధర్‌బాబు

రూ.500 కోట్లతో ఫ్యూచరిస్టిక్ ఎక్స్‌పీరియన్స్ కేంద్రం

- పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ చరిత్రతో పాటు అభివృద్ధి, భవిష్యత్తు లక్ష్యాల గురించి వివరించే 'ఫ్యూచరిస్టిక్ ఎక్స్‌పీరియన్స్' కేంద్రం ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రాధాన్యత అంశంగా పరిశీలిస్తుందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఇందుకోసం అవసరమయ్యే రూ.500 కోట్లను ప్రభుత్వపరంగా లేదా కార్పొరేట్ సంస్థల సహకారంతో సమకూరుస్తామని హామీఇచ్చారు. ఫ్యూచరిస్టిక్ కేంద్రంపై పలువురు పారిశ్రామికవేత్తలు సోమవారం సచివాలయంలో ఇచ్చిన ప్రజెంటేషన్‌ను మంత్రి తిలకించారు. భారీ మాల్ తరహాలో ఉండే ఈ కేంద్రంలో సమావేశ మందిరాలు, సినిమా ప్రదర్శన ఏర్పాట్లతో పాటు తెలంగాణ చరిత్ర, సాధించిన అభివృద్ధి, భవిష్యత్తు గమ్యాల గురించిన అవగాహన కల్పించే విభాగాలు ఉంటాయని మంత్రి వెల్లడించారు. పారిశ్రామికవేత్తలు శ్రీరంగారావు, సుమన్ వల్లపురెడ్డి, హన్మంతరెడ్డి, పునీత్, శ్రీకాంత్, సునీల్ లడ్డా పాల్గొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగ రామకథా యాత్రపై డాక్యుమెంటరీ

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక గురువు మొరారి బాపు ఇటీవల తమ శిష్యులతో కలిసి పర్యటించిన ద్వాదశ జ్యోతిర్లింగ యాత్రతో ప్రత్యేకంగా రూపొందించిన డాక్యుమెంటరీ, రెండు పుస్తకాలను ఆదివారం విడుదల చేశారు. గతేడాది కేవలం 18 రోజుల్లో దేశవ్యాప్తంగా 12 వేల కిలోమీటర్ల దూరం యాత్రలు చేపట్టామని..ఈ డాక్యుమెంటరీలో ద్వాదశ జ్యోతిర్లింగ యాత్ర విశేషాలు, భక్తుల అనుభవాలు ఉంటాయని బాపు తెలిపారు.

ఫాల్ట్‌ప్యాసేజ్ ఇండికేటర్స్

(5వ పేజీ తరువాయి)

ఇండికేటర్స్ ఏర్పాటుతో సమస్యను క్షణాల్లో గుర్తించవచ్చు. సమస్య తలెత్తినపుడు ఇండికేటర్స్ కింది భాగంలో ఉన్న రెడ్‌లైట్ బ్లింక్ అవుతుంది. ఎఫ్‌పీఐ పరికరంలో రెడ్‌లైట్ ఎక్కడ వచ్చిందో ఆ ప్రాంతానికి నేరుగా వెళ్లి నిమిషాల్లో సమస్యను పరిష్కరించే వీలుంటుంది. ఎఫ్‌పీఐ పరికరాల ఏర్పాటుతో ఏ లైన్‌లో సమస్యలు తలెత్తాయో స్కాడా కార్యాలయం ద్వారా ఉన్నతాధికారులకు వెంటనే చేరిపోతుంది. దీంతో సూచనల మేరకు సమస్యను వెంటనే పరిష్కరించేందుకు అవకాశాలుంటాయని అధికారులు చెబుతున్నారు.

ఆధునిక టెక్నాలజీపై డిస్కం ప్రత్యేక దృష్టి

దేశంలోని పలు ప్రముఖ నగరాల్లో విద్యుత్ వ్యవస్థ పనితీరు, అక్కడ వినియోగిస్తున్న సాంకేతిక టెక్నాలజీపై తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ (టీజీఎస్పీడీసీఎల్)సంస్థ దృష్టి పెట్టింది. అందులో భాగంగా నలుగురు చీఫ్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో నాలుగు బృందాలు అహ్మదాబాద్, ఢిల్లీ, బెంగళూరు, ముంబై వంటి నగరాల్లో పర్యటించి వచ్చారు. సాంకేతిక టెక్నాలజీని వినియోగించుకుంటూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు విద్యుత్‌సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు డిస్కం చర్యలు చేపట్టింది.

జేఎన్టీయూలో సైబర్ సెక్యూరిటీ సర్టిఫికేట్ ప్రోగ్రామ్

- ప్రారంభించిన ఇన్‌చార్జి వీసీ బుర్రా

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలోని డైరెక్టరేట్ ఆఫ్ అంత్రప్రెన్యూర్, ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్స్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ సైబర్ సెక్యూరిటీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నాలుగువారాల 'సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్' ప్రోగ్రామ్ ప్రారంభమైంది. ఆగస్టు 17 వరకు జరిగే ఈ ప్రోగ్రామ్‌ను ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశం సోమవారం ప్రారంభించారు. రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రోగ్రామ్‌కు జేఎన్‌టీయూ అనుబంధ, అఫిలియేటెడ్ కళాశాలల నుంచి విద్యార్థులు, అధ్యాపకులు, ఇండస్ట్రీ నిపుణులు పెద్ద సంఖ్యలో నమోదు చేసుకున్నట్లు కన్వీనర్ శ్రీదేవి తెలిపారు.

ముగిసిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలు

జేఎన్‌టీయూలో పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలు ఎట్టకేలకు ముగిశాయి. మొత్తం 16 సబ్జెక్టులకు గాను అత్యధికంగా కంప్యూటర్ సైన్స్‌కు 485 మంది దరఖాస్తు చేయగా 360 మంది పరీక్ష రాశారు. జాతీయ విద్యాసంస్థల స్థాయిలో క్లిష్టమైన ప్రశ్నపత్రం అభ్యర్థులను తీవ్రంగా నిరాశపరిచింది. మరోవైపు మెకానికల్ ఇంజినీరింగ్ పరీక్ష ప్రశ్నపత్రం చూసి అభ్యర్థులకు మైండ్‌బ్లాక్ అయ్యిందని, సుమారు 50 మంది పరీక్షకు హాజరైతే, అర్హత సాధించిన వారు సింగిల్ డిజిట్‌కు మించలేదని తెలుస్తోంది. సివిల్, బయోటెక్నాలజీ, ఈసీఈ, ఈఈఈ ప్రశ్నపత్రాల్లోనూ మోస్తరు కంటే ఎక్కువగా కఠినంగా ఉన్నాయని సమాచారం. కాగా, పీహెచ్‌డీ ప్రవేశాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో త్వరలో మరొక నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు జేఎన్‌టీయూ అధికారులు వెల్లడించారు.



ఫతేనగర్ ఎస్‌టీపీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఆమ్రపాలి

ఎస్టీపీ నిర్మాణం వేగంగా పూర్తికావాలి

- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

ఫతేనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రూ.171 కోట్ల వ్యయంతో ఫతేనగర్ డివిజన్ ఎల్‌బీఎస్‌నగర్‌లో నిర్మిస్తున్న ఎస్‌టీపీ (సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్) పనులను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి సోమవారం పరిశీలించారు. నిర్మాణ పురోగతిని తెలుసుకొని వేగంగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, మేఘా ఇంజనీరింగ్ ప్రతినిధులు, జలమండలి అధికారులు ఉన్నారు. ఈ ఎస్‌టీపీని త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

27న ఎస్టీపీని ప్రారంభించనున్న సీఎం

కుత్బుల్లాపూర్ : జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డ ఎన్నాచెరువు సమీపంలో నిర్మిస్తున్న సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను కమిషనర్ ఆమ్రపాలి ఆకస్మిక తనిఖీ చేశారు. 27న ఈ ప్లాంట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు.

అవసరమైతే షరతులతో పదోన్నతులు కల్పించాలి



రోనాల్డ్‌రాస్‌కు వినతిపత్రమిస్తున్న టీఈఈ జేఏసీ నేతలు

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో అవసరమైతే షరతులతో పదోన్నతులు కల్పించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఈఈ జేఏసీ) డిమాండ్ చేసింది. టీఈఈ జేఏసీ చైర్మన్ ప్రకాష్, కన్వీనర్ శివాజీ, కో-చైర్మన్ అంజయ్య ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు సోమవారం ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రోనాల్డ్‌రాస్‌కు వినతిపత్రం సమర్పించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల సమస్యను పరిష్కరించి బదిలీల ప్రక్రియ చేపట్టాలని సీఎండీని కోరారు.

రూల్స్, రెగ్యులేషన్స్ ప్రకారం కల్పించాలి

విద్యుత్ సంస్థల్లో ఇప్పటికే అమల్లో ఉన్న రూల్స్, రెగ్యులేషన్స్ ప్రకారం సీనియార్టీని నిర్ణయించి పదోన్నతులు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జేఏసీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జేఏసీ నేతలు సీఎండీ రోనాల్డ్‌రాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఎండీతోపాటు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్, టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావులతో చర్చలు జరిపారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పాటించాలని కోరారు.

సివిల్ వివాదాలకు దూరంగా ఉండాలి

-రాచకొండ సీపీ సుధీర్‌బాబు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సివిల్ వివాదాలకు పోలీసులు దూరంగా ఉండాలని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు సూచించారు. నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్ల ప్రత్యేక సమీక్ష సమావేశంలో సీపీ మాట్లాడారు. నేరాల నియంత్రణ, నేరస్థులను పట్టుకోవడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని, సీసీటీవీ ఫుటేజీలను వినియోగించుకోవాలన్నారు. పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచాలని, స్టేషన్‌కొచ్చే వారితో మర్యాదతో మసలుకోవాలని హితవుపలికారు. మహిళలు, చిన్నారుల పట్ల నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా ఉండాలని.. డ్రగ్స్ సరఫరా, విక్రయంపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. డీసీపీలు రాజేష్ చంద్ర, ప్రవీణ్ కుమార్, కరుణాకర్, అరవింద్ బాబు, సునీతారెడ్డి, ఉషా విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గసగసాల పౌడర్, ఎండీఎంఏ విక్రేతల అరెస్ట్

బస్సులు, లారీలు, రైళ్ల ద్వారా నగరానికి మత్తు పదార్థాలు తరలించి విక్రయిస్తున్న ఇద్దరిని ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ, జవహర్‌నగర్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఎస్‌వోటీ డీసీపీ మురళీధర్‌తో కలిసి కేసు వివరాలను సీపీ వెల్లడించారు. రాజస్థాన్ జోధ్‌పూర్‌కు చెందిన పెయింటర్ ఓమా రామ్ అలియాస్ ఓం ప్రకాష్ (35) నల్లమందు, పాపిస్ట్రా పౌడర్ విక్రయించేవాడు. అదే రాష్ట్రానికి చెందిన సన్వాలరామ్ (33) చందానగర్‌లో ఉంటూ రోలింగ్ షట్టర్ల కార్మికుడిగా పనిచేస్తున్నాడు.. ఇద్దరూ కలిసి సులభంగా డబ్బులు సంపాదించే లక్ష్యంతో డ్రగ్స్ వ్యాపారి వికాస్ అలియాస్ ముఖేష్ నుంచి పాపిస్ట్రా పౌడర్, ఎండీఎంఏ కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నారు. నిఘా ఉంచిన పోలీసులు.. జవహర్‌నగర్ పరిధిలోని తిమ్మాయిపల్లి శివారులో డ్రగ్స్ తరలిస్తుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 40 కిలోల పాపిస్ట్రా పౌడర్ (గసగసాల పొడి), 10 గ్రాముల ఎండీఎంఏ, 3 మొబైల్ ఫోన్లు, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సరఫరాదారుడు వికాస్ పరారీలో ఉన్నాడు



బదిలీ అయిన ప్రొఫెసర్లతో సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌రెడ్డి

గాంధీ ఆస్పత్రిలో ప్రొఫెసర్లకు వీడ్కోలు

- 80 శాతం మందికి స్థానచలనం

అడ్డగుట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని గజగజ వణికించిన కొవిడ్ కష్టకాలంలో గాంధీ ఆస్పత్రిలో ప్రతిఒక్కరూ కుటుంబసభ్యుల్ని వదిలి శ్రమించి లక్షల మంది ప్రాణాలు నిలబెట్టారని బదిలీపై వెళ్తున్న గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు అన్నారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న దాదాపు 80 శాతం ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, హెచ్‌వోడీలకు స్థానచలనం కలగడంతో సోమవారం అభినందన సమావేశం నిర్వహించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ గాంధీ ఆస్పత్రి పేరును ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన గౌరవం ఇక్కడి వైద్యులు, సిబ్బందికి దక్కిందని గుర్తుచేశారు. అనంతరం సీనియర్ వైద్యులను సూపరింటెండెంట్ రాజారావు, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

బదిలీలపై ఆవేదన

రాష్ట్ర ప్రభుత్వం ఒక్కసారిగా గాంధీ ఆస్పత్రి వైద్యుల్ని బదిలీ చేయడంతో కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రిని విడిచిపెట్టి పోవడానికి ఇష్టం లేకపోయినా, నిబంధనల ప్రకారం వెళ్లక తప్పదని మదనపడ్డారు. ఇంతమందిని ఒకేసారి బదిలీ చేయడంపై తమకు అనుమానాలున్నాయని అభిప్రాయపడ్డారు.

ఏఐపై ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, వర్క్‌ఫ్లో ఆటోమేషన్ రంగాల్లో ఇంజినీరింగ్ విద్యార్థుల నైపుణ్యం పెంపొందించేందుకు పెగా యూనివర్సిటీ అకడమిక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. మాదాపూర్ హెచ్ఐసీసీలో సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పెగా సిస్టం ఎండీ, వైస్ ప్రెసిడెంట్ దీపక్ విశ్వేశ్వరయ్య మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక సవాళ్లను అధిగమించడానికి ప్రత్యేకంగా సన్నద్ధమయ్యేలా శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెరిజోన్ డైరెక్టర్ హరిణి శ్రీధర్, కారెలోన్ సీనియర్ డైరెక్టర్ విశాల్ మహాజన్, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి కన్హా శాంతివనంలో ఆధ్యాత్మిక సమ్మేళనం

- 4 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు షాద్‌నగర్‌లో హాల్టింగ్

హైదరాబాద్ సిటీ, జూలై 22 ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ సమీపంలోని తిమ్మాపూర్ కన్హా శాంతివనంలో ఈనెల 23 నుంచి 25వరకు అంతర్జాతీయ ఆధ్యాత్మిక సమ్మేళనం జరగనుంది. ఈ నేపథ్యంలో రాకపోకలు సాగించేందుకు వీలుగా నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రత్యేక హాల్ట్ కల్పిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈనెల 21 నుంచి 23 వరకు మధురై-కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌కు షాద్‌నగర్‌లో, ముంబయి-భువనేశ్వర్, రాజ్‌కోట్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వికారాబాద్ స్టేషన్‌లో నిమిషం పాటు ఆగుతాయి. 25, 26 తేదీల్లో భువనేశ్వర్-ముంబయి ఎక్స్‌ప్రెస్‌కు వికారాబాద్ స్టేషన్‌లో హాల్ట్ కల్పించారు.

అదే జోరు..

లష్కర్ బోనాల ఉత్సవాలకు పోటెత్తిన జనం

సికింద్రాబాద్, రాంగోపాల్‌పేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులపాటు వైభవంగా సాగిన ఉజ్జయినీ మహాకాళి జాతర సోమవారం ముగిసింది. ఆదివారం రాత్రి నుంచి తెల్లవార్లూ కార్యక్రమాలను నిర్వహించారు. అర్ధరాత్రి ఓ వైపు ఫలహారపు బండ్ల ఊరేగింపు సాగుతుండగానే మరోవైపు ఆలయ అనువంశిక ధర్మకర్త సురిటి రామేశ్వర్‌తో పాటు ఆలయ నిర్వాహకులు నాలా బజార్ నుంచి జల్లకుండను, పీనుగుల మల్లన్న గుడి వద్ద నుంచి పచ్చికుండను తీసుకువచ్చారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఆర్పీ రోడ్డులోని చిత్రదర్గ వద్ద నుంచి వెయ్యికళ్ల కుండను, 2.30 గంటలకు గుమ్మడికాయను తీసుకువచ్చి కార్యక్రమాలను నిర్వహించారు. తెల్లవారుజామున ఉదయం 5.30కు మహాహారతి ఇచ్చిన అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనానికి అనుమతినిచ్చారు.

అంబారిపై ఊరేగింపు

మహాకాళి ఆలయం వద్ద ఉదయం 10 గంటలకు రంగం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయాన్ని శుద్ధి చేసి, ఘటాన్ని ఊరేగింపుగా మెట్టుగూడలోని మహాకాళి అమ్మవారి ఆలయానికి తీసుకువెళ్లారు. తరువాత మేళతాళాలు, బాజా భజంత్రీల నడుమ పోతరాజుల వీరంగం, కళాకారుల విన్యాసాలు, స్థానికుల నృత్యాల మధ్య అమ్మవారి చిత్రపటాన్ని అంబారీపై ఉంచి ఆలయ పుర వీధుల్లో ఊరేగించారు. ఊరేగింపులో పోతరాజుల వీరంగాలలో బాల పోతరాజు అక్షిత్ పలువురిని ఆకర్షించాడు. పోతరాజుల విన్యాసాలను, ఫలహార బండ్ల ఊరేగింపును తిలకించేందుకు భక్తులు ఎగబడ్డారు. ఇదిలాఉండగా రంగం కార్యక్రమం ముగిసిన వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అమ్మవారిని దర్శనం చేసుకుని వెళ్లిపోయారు. ఈ ఉత్సవాల్లో టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ, కార్పొరేటర్ చీర సుచిత్ర, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్, అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, మనోజ్‌కుమార్‌గౌడ్, దండుగుల యాదగిరి పాల్గొన్నారు. కాంగ్రెస్ సర్కారు కొలువుదీరిన తర్వాత తొలిసారి వచ్చిన లష్కర్ బోనాల జాతర ప్రశాంతంగా జరిగిందని పీసీసీ కార్యదర్శి కోట నీలిమ అన్నారు.



సికింద్రాబాద్‌లో జరిగిన ఫలహార బండి ఊరేగింపులో పోతరాజులు

జాతర సక్సెస్ : ఎమ్మెల్యే తలసాని

లష్కర్ బోనాల జాతరను ప్రశాంతంగా, ఘనంగా నిర్వహించడంపై సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను అభినందించారు. బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు.

రెచ్చిపోయిన చైన్‌స్నాచర్లు

ఉజ్జయిని మహాకాళి బోనాల జాతరలో చైన్‌స్నాచర్లు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. ఆదివారం, సోమవారం రెండు రోజుల వ్యవధిలో క్యూలలో ఉన్న భక్తుల నుంచి దాదాపు 25 సెల్‌ఫోన్లు, బంగారు ఆభరణాలు, సమీపంలో పార్క్ చేసిన రెండు వాహనాలను వారు అపహరించారు. అందులో ఓ వాహనం బందోబస్తుకు వచ్చిన ఓ ఎస్ఐదని సమాచారం. 1500 వందల మందికి పైగా పోలీసుల బందోబస్తు, 100కు పైగా సీసీ కెమెరాలు పెట్టామని పోలీసులు చెప్పుకున్నప్పటికీ ఇలా జరగడమేమిటని ప్రజలు గుసగుసలాడుతున్నారు.

స్మిత సబర్వాల్ పోస్ట్ కలకలం

- నగరంలో దివ్యాంగుల నిరసన
- బహిరంగ క్షమాపణలకు డిమాండ్

చిక్కడపల్లి /రాంనగర్/చాంద్రాయణగుట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ సోషల్ మీడియా పోస్ట్ సోమవారం నగరంలో అలజడి సృష్టించింది. సివిల్స్ పోస్టుల ఎంపికలో దివ్యాంగుల కోటా అవసరమా? అని ఆమె తన వ్యక్తిగత 'ఎక్స్' ఖాతాలో చేసిన పోస్ట్‌పై పలు సంఘాలు భగ్గుమన్నాయి. జాతీయ వికలాంగుల హక్కుల వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్, అడివయ్య ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో నిరసన వ్యక్తం చేశారు. ప్రతిభ ఎవరి సొత్తు కాదని, అంగవైకల్యం కలిగిన అనేకమంది అద్భుతాలు సృష్టిస్తున్న విషయం సీనియర్ అధికారి స్మితా సబర్వాల్‌కు తెలియదా అని ప్రశ్నించారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ దివ్యాంగులు ఒంటరి వారు కాదని, వారిజోలికి వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. స్మితా సభర్వాల్ దివ్యాంగులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఉమ్మడి ఏపీ దివ్యాంగుల సంస్థ చైర్మన్, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సాయిబాబా డిమాండ్ చేశారు. దివ్యాంగుల పట్ల చిన్నచూపు చూడడం తగదని ఆయన సూచించారు. అహంకారపూరిత పోస్ట్ చేసిన స్మితను చట్టప్రకారం శిక్షించాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

చత్రినాక పోలీసులకు ఫిర్యాదు

దివ్యాంగుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యానించిన స్మితా సభర్వాల్, సినీ దర్శకుడు రాజమౌళిలపై చర్యలు తీసుకోవాలంటూ శాంతి దివ్యాంగుల సంఘం అధ్యక్షురాలు రజనీ ఛత్రినాక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తిరుపతి ఐఐటీతో 'అమరరాజా' ఎంఓఏ

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అడ్వాన్స్‌డ్ ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీస్‌కు సంబంధించి తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)తో ప్రముఖ బ్యాటరీ తయారీ సంస్థ 'అమరరాజా' మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్ (ఎంఓఏ) కుదుర్చుకుంది. అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు గౌరవార్థం ఐఐటీ తిరుపతిలో విజిటింగ్ చైర్ ప్రొఫెసర్‌షిప్‌ను ఏర్పాటు చేసేందుకు సంస్థ అంగీకారం తెలిపినట్లు మేనేజింగ్ డైరెక్టర్ గల్లా జయదేవ్ ప్రకటించారు. విజిటింగ్ చైర్ ప్రొఫెసర్‌షిప్ 2025 నుంచి పదేళ్లపాటు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణ, జేఎస్‌డబ్ల్యు సంస్థ ఎండీ సజ్జన్ జిందాల్, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు గోపాలకృష్ణన్, డాక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌కు సుస్తీ..

(5వ పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో 99మంది వరకు జ్వరంతో బాధపడుతున్నట్లు తేలిందని పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు.

కాప్రా సర్కిల్‌లో 176 మందికి జ్వరాలు, 12 మందికి డెంగీ..

కాప్రా సర్కిల్ పరిధిలో కాప్రా, ఏఎస్‌రావునగర్, చర్లపల్లి, హెచ్‌బీ కాలనీ, మల్లాపూర్, నాచారం డివిజన్‌లలో, కుషాయిగూడ, మల్లాపూర్, ఉప్పల్ పీహెచ్‌సీలకు చెందిన ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి జ్వరం సర్వే నిర్వహించారు. ఆయా డివిజన్‌లలో ఇప్పటి వరకు 176 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు, 12 మందికి డెంగీ సోకినట్లు సర్వేలో తేలింది. ప్రస్తుతం బాధితులంతా కోలుకుంటున్నారని అధికారులు తెలిపారు. కాగా ఫీవర్ సర్వే నివేదిక ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సర్కిల్ ఏఎంవోహెచ్ డాక్టర్ వెంకటరమణ తెలిపారు.

ఉప్పల్ సర్కిల్‌లో 3 డెంగీ కేసులు

ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు మూడు డెంగీ కేసులు నమోదు అయ్యాయి. హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ -7లో ఒకటి, రామంతాపూర్ రాంరెడ్డినగర్‌లో ఒకటి, రామంతాపూర్ గాంధీనగర్‌లో ఒక డెంగీ కేసు నమోదయ్యాయి, డెంగీని గుర్తించిన ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం దోమల నివారణకు పైరిథ్రమ్ స్ప్రే, ఫాగింగ్ చేయడంతోపాటు చుట్టుపక్కల 100 ఇండ్లలో యాంటి లార్వా ఆపరేషన్ చేస్తున్నారు.

మల్కాజిగిరిలో ఇద్దరికి, అల్వాల్‌లో ముగ్గురికి డెంగీ

మల్కాజిగిరి సర్కిల్‌లో జరిగిన ఫీవర్ సర్వేలో ఇద్దరికి డెంగీ వచ్చినట్లు నిర్ధారణ అయ్యింది. డెంగీ కేసు నమోదైన ప్రాంతంలో ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్ కొనసాగుతోంది. అల్వాల్ పరిధిలో 700 ఇళ్లలో జరిగిన ఫీవర్ సర్వేలో 3 డెంగీ కేసులు వెలుగుచూశాయి. బాలానగర్ పీహెచ్‌సీ పరిధిలో 548కిపైగా ఇళ్లల్లో సర్వే పూర్తి చేశారు. 558 మందికి పరీక్షలు చేయగా అందులో 25 మందికి జ్వరం ఉన్నట్లు తేలింది. కేపీహెచ్‌బీ కాలనీ 3వ, 4వ ఫేజ్‌లలోని 248 ఇళ్లలో సర్వే చేయగా 11 మందికి జ్వరం ఉన్నట్లు తేలింది. జయానగర్‌లో ఒకరికి జ్వరం ఉన్నట్లు తేలింది. గోల్కొండ, కార్వాన్ సివిల్ ఆస్పత్రుల పరిధుల్లో సర్వే నిర్వహించి జ్వరం వచ్చిన వారికి మందులు అందజేశారు.

పొంచి ఉన్నాయి.. జాగ్రత్త!

వానలు బాగా పడుతున్నాయి. డెంగ్యూ జ్వరాలు వ్యాపిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ప్రమాదకరమైన జైకా వైరస్ వ్యాపిస్తోందనే వార్తలొస్తున్నాయి. డెంగ్యూ, జైకాలకు సంబంధించిన కొన్ని లక్షణాలు ఒకే విధంగా ఉంటాయి. అందువల్ల ఎవరికైనా జ్వరం తగ్గకపోతే వెంటనే డాక్టర్‌ను సంప్రతించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఎలా వస్తాయి?

ఈ రెండు రకాల జ్వరాలు- ఏడియస్ అనే దోమల ద్వారా వ్యాప్తి చెందుతాయి. ఇవి సాధారణంగా పగటి పూటే కుడతాయి. డెంగ్యూ కేవలం దోమలు కుట్టడం ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుంది. జైకా మాత్రం- దోమలతో పాటుగా రక్తం ద్వారా, లైంగిక సంపర్కం ద్వారా, గర్భంలో ఉన్న శిశువులకైతే తల్లుల ద్వారా సంక్రమిస్తుంది. వెంటనే చికిత్స చేయించుకోపోతే గర్భస్థ శిశువు లోపాలతో పుట్టే అవకాశం ఉంటుంది.

లక్షణాలేమిటి?

జైకా:

- జ్వర తీవ్రత ఎక్కువగా ఉండదు
- వళ్లంతా దద్దుర్లు వస్తాయి
- కళ్లు ఎర్ర బడతాయి
- కొద్దిగా కీళ్ల నొప్పులు వస్తాయి
- కొద్దిగా తలనెప్పి కూడా ఉంటుంది

గర్భిణిలకు జైకా జ్వరం వస్తే- ఆ ప్రభావం గర్భస్థ శిశువుపై పడే అవకాశముంది. అలాంటి శిశువులకు మెదడు సరిగ్గా ఎదగకపోవచ్చు. మెదడుకు సంబంధించిన ఇతర సమస్యలు ఏర్పడే అవకాశముంది.



డెంగ్యూ:

- జ్వరతీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది. 104 డిగ్రీల వరకూ చేరుకోవచ్చు
- తలనెప్పి తీవ్రంగా ఉంటుంది. నుదిటిపై కూడా నెప్పిగా ఉంటుంది.
- కీళ్ల నొప్పులు తీవ్రంగా ఉంటాయి.
- వాంతులు అవుతాయి.
- కొందరికి వళ్లంతా దద్దుర్లు కూడా వస్తాయి
- ప్రమాద హెచ్చరికలు

వెంటనే చికిత్స చేయకపోతే డెంగ్యూ ప్రమాదకరంగా మారుతుంది. లో బ్లడ్ ప్రెషర్, ప్లాసా తగ్గిపోవటం, పేట్‌లెట్ సంఖ్య పడిపోవటం వంటి అనేక సమస్యలు ఎదురవుతాయి.

ఏం చేయాలి?

వీలైనన్ని నీళ్లు, ఇతర ద్రవ పదార్థాలు తాగాలి. జ్వరం, వళ్లు నెప్పులు తగ్గటానికి మందులు వేసుకోవాలి.

గుడ్ ఫుడ్

తృణధాన్యాల్లో ప్రొటీన్

తృణధాన్యాలు ఆరోగ్యకరమైన పిండిపదార్థాలు. వీటిలో విటమిన్ బి, ఐరన్, వృక్షాధారిత మాంసకృత్తుల్లాంటి కీలకమైన పోషకాలుంటాయి. సాధారణంగా మాంసకృత్తులు అనగానే ఎవరికైనా మాంసం, చేపలు గుర్తే స్ఫురిస్తాయ. కానీ కొన్ని తృణధాన్యాల్లో ఎముకలు, కండరాలను బలపరిచే మేలు రకం మాంసకృత్తులుంటాయి. వాటి గురించి తెలుసుకుందాం!



క్వినోవా

ఈ తృణధాన్యంలో అత్యధిక ప్రొటీన్లుంటాయి. పీచుతో కూడిన ఈ తృణధాన్యాన్ని నీళ్లలో ఉడికించి, కూరగాయలతో కలిపి తినొచ్చు. ఆకుకూరల సలాడ్ మీద చల్లుకుని తినొచ్చు. లేదంటే ఓట్‌మీల్ మాదిరిగా పాలతో కలిపి, నట్స్, సీడ్స్, పండ్ల ముక్కలు చల్లుకుని తినొచ్చు. ఒక కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది.

అడవి బియ్యం

బ్రౌన్, వైల్డ్ రైస్‌లో తక్కువ పిండిపదార్థాలు ఎక్కువ పీచు, ప్రొటీన్ ఉంటాయి. పర్పుల్ బ్లాక్ రైస్‌లో బి విటమిన్లు, క్యాల్షియం, పొటాషియం, ఫాస్ఫరస్, జింక్ కూడా ఉంటాయి. ఈ బియ్యాన్ని ప్రధాన భోజనంలా లంచ్, డిన్నర్‌లో తినొచ్చు. ఒక కప్పు వైల్డ్ రైస్‌లో ఆరున్నర గ్రాముల ప్రొటీన్ ఉంటుంది.

అమరాంథ్

తోటకూర విత్తనాలు ప్రధానంగా హృద్రోగాలు, టైప్2 మధుమేహాలకు ఆరోగ్యకరం. తోటకూర విత్తనాల్లో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. అలాగే బి విటమిన్లు, కాపర్, జింక్, మాంగనీస్ మొదలైన ఖనిజాలు ఉంటాయి. ఉడికించినప్పుడు మెత్తగా జారుడుగా తయారయ్యే ఈ విత్తనాలను ఓట్స్ మాదిరిగా తినొచ్చు. ఒక కప్పు తోటకూర విత్తనాల్లో తొమ్మిది గ్రాముల ప్రొటీన్ ఉంటుంది.

మీకు తెలుసా?

- వేడి నీటి స్నానాన్ని చల్లని నీళ్లతో ముగిస్తే, చర్మ రంధ్రాలు మూసుకుపోయి, వాటిలోకి ధూళి, బ్యాక్టీరియా చేరకుండా ఉంటుంది.
- ముక్కు దిబ్బెడ ఉంటే, రాత్రి నిద్రపోయేటప్పుడు, దగ్గర్లో ఒక ఉల్లిపాయను ఉంచుకోవాలి.
- మైగ్రెయిన్ తలనొప్పి తగ్గాలంటే, చల్లని నీళ్లలో అరచేతులను ముంచి ఉంచి, కొద్దిసేపు వేళ్లను మడిచి, విప్పారుస్తూ ఉండాలి.
- దోమ కాటు మీద డియోడరెంట్ పూసుకుంటే దురద తగ్గుతుంది.

లంగ్ కేర్

వానాకాలంలో దగ్గు, తుమ్ములు, ఆయాసం, అలర్జీలు విజృంభించడం సహజమే! అయితే అలాగని వాటిని తేలికగా తీసుకుంటే, ఊపిరితిత్తులు తిరిగి కోలుకోలేనంతగా దెబ్బతింటాయి. కాబట్టి తగిన ముందస్తు జాగ్రత్తలతో ఈ ఇబ్బందులకు అడ్డుకట్ట వేయాలంటున్నారు వైద్యులు.

ఊపిరి... ఉల్లాసంగా

ఫ్లూ, న్యుమోనియాలకు మంచి వ్యాక్సిన్లున్నాయి. వీటిని తీసుకుంటే ఇన్‌ఫెక్షన్లు సోకినా, వాటి ఉధృతి పెరగకుండా ఉంటుంది. కాబట్టి ఊపిరితిత్తుల సమస్యలున్నవాళ్లు, వ్యాధినిరోధకశక్తి తక్కువగా ఉన్నవాళ్లు, పెద్దలు తప్పనిసరిగా వ్యాక్సిన్లు వేయించుకోవాలి. అలాగే ఉబ్బసం ఉన్నవాళ్లు సమస్య అదుపులోకి రాగానే ఇన్‌హేలర్ల వాడకం మానేస్తూ ఉంటారు. అది సరి కాదు.

ఇంట్లోనే కాలుష్యం

ధూళి, జంతు విసర్జకాలు, పొగ.. ఇటీవలి కాలంలో ఊపిరితిత్తుల సమస్యలు పెరగడానికి ప్రధాన కారణాలు. పూజ కోసం ఒక అగర్‌బత్తీ వెలిగించినా, దోమలను తరమడం కోసం ఒక మస్క్యుటో కాయిల్ వెలిగించినా వాటి నుంచి వెలువడే పొగ 500 సిగరెట్లతో సమానం. అలాగే హోమాలకు బహిర్గతం కావడం కూడా ప్రమాదకరమే! ఇళ్లలో పెంపుడు జంతువులు ఉన్నంత మాత్రాన వాటి నుంచి ఊపిరితిత్తులెలా పాడవుతాయి? అని అందరూ అనుకుంటూ ఉంటారు. వాటిని దగ్గరకు తీయకుండా ఉంటే, మనకేమీ కాదు అనుకుంటే పొరపాటు. పక్షుల వల్ల కూడా ఊపిరితిత్తుల వ్యాధులు వేధిస్తాయి. వాటి విసర్జకాల నుంచి వెలువడే అలర్జెన్స్ గాల్లో కలిసి ఊపిరితిత్తుల్లోకి చేరతాయి. ఇలా ఏళ్ల తరబడి వీటికి బహిర్గతమైతే ఊపిరితిత్తులు దెబ్బతింటూ హైపర్ సెన్సిటివిటీ న్యుమోనైటిస్ వ్యాధి బారిన పడతాం! ఈ వ్యాధి ఇన్‌హేలర్స్‌తో అదుపు కాదు. కాబట్టి స్టిరాయిడ్స్ వాడుకోవలసి వస్తుంది. వీటిని వాడుకోవడం వల్ల వాటి దుష్ప్రభావాలను కూడా భరించవలసి వస్తుంది. కాబట్టి పెంపుడు జంతువులను పెంచుకోకుండా ఉండడమే మేలు. కుక్కలు, పిల్లుల వెంట్రుకలు రాలిపడిపోతూ ఉంటాయి. ఇలా రాలిన వెంట్రుకల నుంచి 24 గంటలపాటు అలర్జెన్స్ విడుదలవుతూనే ఉంటాయి. వీటితో ఉబ్బసం వస్తుంది. కాబట్టి పెంపుడు కుక్కలు, పిల్లుల నుంచి కూడా దూరంగా ఉండాలి. అలాగే కార్పెట్లలో ఇరుక్కునే దుమ్ము, ధూళి, డస్ట్ మైట్స్ వల్ల, శుభ్రంగా లేని దుప్పట్లు, పిల్లో కవర్స్, కర్టెన్స్ వల్ల కూడా ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. కాబట్టి కార్పెట్లను తరచూ వ్యాక్యూమ్ చేస్తూ ఉండాలి. పగటి వేళ ఒక దుప్పటి, రాత్రి వేళ ఒక దుప్పటి వాడుకోవాలి.

ప్రివెంటివ్ ఇన్‌హేలర్స్ నిరంతరంగా వాడుకుంటూ ఉంటే, దుమ్ము, ధూళి, వైరస్ వల్ల ఊపిరితిత్తులు ఇన్‌ఫెక్షన్‌కు లోనైనా పరిస్థితి ఉబ్బసానికి దారి తీయకుండా ఉంటుంది. ఈ కాలంలో స్మోకింగ్ వల్ల సిఒపిడి రోగుల పరిస్థితి మరింత దిగజారుతుంది. కాబట్టి ఈ సిఒపిడి రోగులు స్మోకింగ్ మానేసి, తప్పనిసరిగా వ్యాక్సిన్లు వేయించుకోవాలి. అలాగే ఇన్‌హేలర్ల వాడకం కొనసాగించాలి. ఊపిరితిత్తుల్లో ధూళి కణాలు స్థిరపడిపోవడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలు ఇటీవలి కాలంలో పెరుగుతున్నాయి. ఆ ధూళి కణాలు 2.5 మైక్రాన్ల కంటే పెద్దవిగా ఉంటే, అవి ఊపిరితిత్తుల్లో డిపాజిట్ అయిపోయి, వాటిని డ్యామేజ్ చేస్తాయి. మరీ ముఖ్యంగా వర్షాకాలంలో ఈ సమస్య ఎక్కువగా ఇబ్బంది పెడుతూ ఉంటుంది.

ఉబ్బసం ఇలా దూరం

వర్షాకాలంలో ఎక్కువగా ఇబ్బంది పెట్టే సమస్య ఉబ్బసం అనే విషయం మనందరికీ తెలిసిందే! అయితే ముందు నుంచీ ఉబ్బసం వాళ్లకే వర్షాకాలంలో సమస్యలు పెరుగుతాయనుకుంటే పొరపాటు. కొత్తగా ఉబ్బసం బారిన పడే సందర్భాలు కూడా ఈ కాలంలోనే పెరుగుతూ ఉంటాయి. కాబట్టి ఎడతెరిపి లేని దగ్గు, రాత్రివేళ లేదంటే తెల్లవారుఝామున దగ్గు పెరగడం, పిల్లికూతలు లాంటి లక్షణాలు కనిపిస్తే, పీక్ ఫ్లో మీటరుతో పరిస్థితి తీవ్రతను పరీక్షించుకోవాలి. 300 నుంచి 400 దర పలికే ఈ పరికరంతో ఉబ్బసం తీవ్రతను కొలుచుకుని, రీడింగ్ 200 - 250కు తగ్గితే వైద్యులను కలవాలి. ఒకవేళ ఊపిరితిత్తుల పనితీరు తగ్గినట్టు లంగ్ ఫంక్షన్ టెస్ట్‌లో తేలితే, ఇన్‌హేలర్స్ వాడుకోవాలి. రోజూ వాడే ఇన్‌హేలర్‌తో పాటు, ఉబ్బసం అటాక్ వచ్చినప్పుడు వేరే ఇన్‌హేలర్‌ను కూడా వాడుకుంటూ ఉండాలి.

ఆ అలవాటు లేకపోయినా...

పొగకు ఎక్కువగా బహిర్గతమయ్యేవాళ్లకు సిఒపిడి (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మొనరీ డిసీజ్) తప్పదు. ధూమపాన ప్రియులతో పాటు, ఆ అలవాటు లేని వాళ్లు కూడా ఈ సమస్య బారిన పడుతూ ఉంటారు. మరీ ముఖ్యంగా కట్టెల పొయ్యి దగ్గర పనిచేసే వాళ్లు, గర్భగుడిలో ధూపాల మధ్య ఎక్కువ సమయం గడిపే పూజారులు పొగ మూలంగా సిఒపిడికి గురవుతూ ఉంటారు. క్షయ నుంచి పూర్తిగా కోలుకున్నా ఆ వ్యాధితో ఊపిరితిత్తులు దెబ్బతినడం మూలంగా సిఒపిడి బారిన పడే వారి సంఖ్య కూడా మన దేశంలో పెరిగిపోతోంది. కాబట్టి దగ్గుతో పాటు పసుపుపచ్చ, ఆకుపచ్చ తెమడ కనిపిస్తూ, ఆయాసం వేధిస్తే ఆలస్యం చేయకుండా వైద్యులను కలవాలి. ఆయాసాన్ని బట్టి ఈ సమస్యను ఉబ్బసంగా భ్రమపడేవాళ్లు ఉంటారు. కానీ ఉబ్బసంలో తెమడ కనిపించదనే విషయం గుర్తు పెట్టుకోవాలి. ఉబ్బసంలో మాదిరిగానే లంగ్ ఫంక్షన్ టెస్ట్ చేసినప్పుడు, వాటి సామర్థ్యం తగినట్టు కనిపిస్తే, ప్రత్యేకించి సిఒపిడి కోసం నిర్దేశిత ఇన్‌హేలర్స్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. అలాగే వ్యాక్సినేషన్ కూడా తీసుకోవాల్సి ఉంటుంది. ఈ సమస్య శాశ్వతంగా నయం కాకపోయినా చికిత్సతో అదుపులో పెట్టుకోవచ్చు.



అపోహలు మానండి

ఇన్‌హేలర్స్: ఇన్‌హేలర్స్ వాడుకుంటే వాటికి అలవాటు పడిపోతాం అనే ఒక ప్రధాన అపోహ నాటుకుపోయింది. చివరి దశలోనే ఇన్‌హేలర్స్ వాడుకోవాలి అనుకుంటూ ఉంటారు. కానీ నిజానికి ఇవి వ్యాధి ప్రారంభంలో వాడుకోవలసినవి. మిల్లీగ్రాముల పరిమాణంలో ఔషధాన్ని కలిగి ఉండే ఇన్‌హేలర్స్ మాత్రల కంటే సున్నితమైనవి. ఇవి మాత్రల్లా రక్తంలో కలిసి శరీరమంతా ప్రవహించకుండా, నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లి సమస్యను పరిష్కరిస్తాయి. పైగా వీటికి దుష్ప్రభావాలు ఉండవు. సమస్య కూడా వెంటనే పరిష్కారమవుతుంది. కాబట్టి ఇన్‌హేలర్స్ అన్ని విధాలా సురక్షితమైనవి.

ఉబ్బసం: కుటుంబ చరిత్రలో ఉబ్బసం ఉంటేనే ఆ వ్యాధి సంక్రమిస్తుందన్నది కూడా అపోహే! ఉబ్బసం ఎవరికైనా రావచ్చు.



పెరుగుతున్న కొత్త సమస్యలు

జలుబు, ముక్కు దిబ్బెడ, గొంతులో ఇబ్బంది, పొడి దగ్గు, ఒళ్లు నొప్పులు, జ్వరం.. ఇవి అప్పర్ రెస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్ లక్షణాలు. ఈ సీజన్‌లో విజృంభించే రైనోవైరస్ వల్లే ఈ సమస్య వేధిస్తుంది. ఇది ప్రమాదకరమైనది కాకపోయినా, మధుమేహం, ఇతరత్రా దీర్ఘకాలిక వ్యాధులున్న వాళ్లలో ఈ సమస్య మరింత తీవ్రమవుతూ ఉంటుంది. కాబట్టి ఈ కోవకు చెందిన వాళ్లు వ్యాక్సినేషన్ తప్పనిసరిగా తీసుకోవాలి. ఐఎల్‌డి (ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్) తీవ్రత ఇటీవలి కాలంలో పెరుగుతోంది. ఊపిరితిత్తులు బిరుసుగా మారి వ్యాకోచించలేని పరిస్థితి ఇది. దాంతో నాలుగు అడుగులకే ఆయాసం, పొడి దగ్గు, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది మొదలైన లక్షణాల వేధిస్తాయి. అలాగే బ్రాంఖియెక్టేటిస్ అనే సమస్య కూడా వర్షాకాలంలో పెరుగుతుంది. ఏళ్ల తరబడి దగ్గు, తెమడతో బాధపడుతూ ఉన్న వాళ్లలో ఈ సమస్య తలెత్తుతుంది. వర్షాకాలంలో ఇన్‌ఫెక్షన్ పెరగడం వల్ల ఆకుపచ్చ, పసుపుపచ్చ తెమడతో పాటు కొన్ని సందర్భాల్లో తెమడతో పాటు రక్తం కూడా పడుతుంది. ఈ కోవకు చెందిన వాళ్లు దీర్ఘకాలం పాటు ఇన్‌హేలర్స్ వాడుకోవలసి ఉంటుంది.

డాక్టర్ ప్రద్యుత్ వాఘ్రే
సీనియర్ కన్సల్టెంట్ పల్మొనాలజిస్ట్,
అపోలో హాస్పిటల్స్,
జూబ్లీహిల్స్, హైదరాబాద్.



ఊపిరితిత్తులు ఇలా బలం

- క్రమం తప్పక ప్రాణాయామం చేయాలి
- బెలూన్లు ఊదడం వల్ల కూడా ఊపిరితిత్తులు బలపడతాయి
- బాల్ స్పైరోమీటర్ అనే పరికరాన్ని వాడుకుంటూ ఉండొచ్చు
- దుమ్ము, ధూళి, పొగలకు బహిర్గతం కాకుండా మాస్క్ పెట్టుకోవాలి.



అవేర్‌నెస్

ఐబిఎస్ శత్రువులు

ఇరిటబుల్ బోవెల్ సిండ్రోమ్.. ఈ జీర్ణకోశ సమస్య పెద్ద పేగులకు సంబంధించినది. ఈ సమస్య ఉన్న వాళ్లు తరచూ పొట్ట నొప్పి, అసౌకర్యం, మలబద్ధకం, విరోచనాలతో బాధపడుతూ ఉంటారు. అయితే ఐబిఎస్ ఉన్నవాళ్లు కొన్ని ఆహార నియమాలు పాటిస్తే సమస్య అదుపులో ఉండే వీలుంది. వీళ్లు తినకూడదని పదార్థాలు ఏవంటే..



- **బీన్స్:** సెనగలు, పప్పులు, బీన్స్ ఐబిఎస్ సమస్యను పెంచుతాయి. వీటి నుంచి వెలువడే వాయువులు జీర్ణ ప్రక్రియను బాధాకరంగా మారుస్తాయి. కాబట్టి వీటిని తీసుకోకపోవడమే మేలు. ఒకవేళ తినాలనిపిస్తే, తేలికగా అరిగేలా, మెత్తని ముద్ద రూపంలో తీసుకోవాలి.
- **వేపుళ్లు:** వీటిని కొవ్వు ఎక్కువ కాబట్టి కడుపు ఉబ్బరిస్తుంది. కొన్ని సందర్భాల్లో విరోచనాలూ వేధిస్తాయి. కాబట్టి ఫ్రెంచ్ ఫ్రైస్ లాంటివి తినాలనిపిస్తే వాటిని బేక్ చేయడం లేదా, గ్రిల్లింగ్ చేయాలి.
- **క్రూసిఫెరస్ కూరగాయలు:** ఈ జాతికి చెందిన కూరగాయల్లో పీచు ఎక్కువ. నిజానికి జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలంటే పీచు ఎక్కువగా ఉండే కూరగాయలకే ప్రాధాన్యం ఇవ్వాలి. కానీ ఐబిఎస్ ఉన్నవాళ్లు ఈ రకం కూరగాయలు తినడం వల్ల, వాటిలో 'రాఫినోస్' అనే జీర్ణం కాని సుగర్‌తో సమస్య మరింత పెరుగుతుంది. కాబట్టి క్యాబేజీ, కాలీఫ్లవర్, బ్రొకొలి కూరగాయలకు దూరంగా ఉండాలి.
- **చక్కెర ప్రత్యామ్నాయాలు:** చక్కెరకు ప్రత్యామ్నాయంగా వాడుకునే స్వీటెనర్లతో ఐబిఎస్ లక్షణాల తీవ్రత పెరుగుతుంది. పాలియోల్, సార్బిటాల్, క్జైలిటాల్, మానిటాల్ మొదలైన స్వీటెనర్లు రెడీమేడ్ ఫుడ్స్‌లో ఉంటాయి. ఇవన్నీ ఐబిఎస్ లక్షణాలను రెట్టింపు చేసేవే. కాబట్టి 'సుగర్ ఫ్రీ' అనే లేబుల్ ఉన్న రెడీమేడ్ ఆహారాలను మానేయాలి.

ఫుడ్ ఫ్యాక్ట్

తీపి ఎప్పుడు?

తీపిని ఇష్టపడని వాళ్లు ఉండరు. అయితే తీపితో క్యాలరీలు, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా ఉండాలంటే ఒక ప్రధాన నియమం పాటించాలి. అదేంటంటే..

భోజనం చేసిన వెంటనే తీపి తినే అలవాటు ఎంతో మందికి ఉంటుంది. రోజు మొత్తంలో అడపాదడపా చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌లూ, సంప్రదాయ పిండి వంటలు తినేవాళ్లు కూడా ఉంటారు. కానీ అతిగా తీపి తినడం వల్ల బరువు పెరగడంతో పాటు, అదనపు అనారోగ్యాలు తప్పవు. అయితే తీపిని ఆస్వాదిస్తూనే, తీపి తెచ్చే అనర్థాల నుంచి తప్పించుకోవాలంటే, మధ్యాహ్న భోజనం తిన్న గంట తర్వాత తీపి తినాలి. రాత్రి డిన్నర్



తర్వాత స్వీట్ తింటే కడుపుబ్బరం, ఛాతీలో మంట వేధిస్తాయి. అలాగే తీపి తినే ముందు గ్లాసుడు నీళ్లు తాగడం ద్వారా అతిగా తీపి తినే ప్రమదం కూడా తగ్గుతుంది. తీపి తిన్న తర్వాత పది నిమిషాలు నడవడం ద్వారా తీపితో అందిన క్యాలరీలను ఖర్చు చేసుకోవచ్చు.

ఫిట్‌నెస్

గర్భిణులకు వ్యాయామం

గర్భిణుల వ్యాయామానికి సంబంధించి బోలెడన్ని అపోహలు, భయాలను కలిగి ఉంటారు. నిజానికి వ్యాయామంతో సుఖ ప్రసవం జరిగే అవకాశాలు మెరుగవుతాయి. అయితే వైద్యు సూచించిన వ్యాయామాలనే ఎంచుకోవడం ఉత్తమం.

వ్యాయామంతో కటి కండరాలు, ఎముకలు దృఢపడతాయి. అంతే కాదు. ప్రసవ సమయంలో, ప్రసవం తర్వాత అవసరానికి మించి బరువు పెరిగే సమస్య తప్పుతుంది. ప్రసవ నొప్పులు కూడా తగ్గుతాయి. ప్రసవం తర్వాత కోలుకునే సమయం కూడా తగ్గుతుంది. కాబట్టి ఎలాంటి ప్రసవసంబంధ, పునరుత్పత్తి వ్యవస్థకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు లేనివారు తేలికపాటి వ్యాయామాలు గర్భిణిగా ఉన్న సమయంలోనూ చేయవచ్చు.

ఇలాంటి వ్యాయామాలు చేయకూడదు

పొత్తికడుపు మీద ఒత్తిడి పెంచే వ్యాయామాలతో పాటు, పరుగు, గెంతడం లాంటి వ్యాయామాలు చేయకూడదు. ఎంత ఫిట్‌గా ఉన్నవాళ్లైనా సరే వైద్యులను సంప్రతించకుండా ఎలాంటి వ్యాయామాలు చేయకూడదు. జంపింగ్ జాక్స్, స్క్వాట్స్, స్కిప్పింగ్, ఎక్కువ బరువులతో కూడిన వ్యాయామాలకు దూరంగా ఉండాలి.

గర్భ దశలో శరీరం ఎన్నో మార్పులకు లోనవుతూ ఉంటుంది. ఒత్తిడిని భరిస్తూ ఉంటుంది. రక్త పరిమాణం పెరగడం, ఫలితంగా రక్తపోటు పెరగడం లాంటి మార్పులూ జరుగుతూ ఉంటాయి. కాబట్టి విపరీతంగా అలసటకు లోను చేసేవి, విపరీతంగా చమటలు పట్టించేవి, ఊపిరి ఆడనంతగా ఒత్తిడికి లోను చేసే వ్యాయామాలకు దూరంగా ఉండాలి.

వాకింగ్

ఇది గర్భిణులకు సురక్షిత వ్యాయామం. తక్కువ తీవ్రతతో కూడిన ఈ వ్యాయామంతో గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. అయితే వేగం సౌకర్యవంతంగా ఉండేలా చూసుకోవాలి. నడుస్తున్నప్పుడు ఒక వాక్యం పూర్తిగా మాట్లాడలేకపోతున్నారు అంటే, అవసరానికి మించి శరీరాన్ని కష్టపెడుతున్నారు అని అర్థం. కాబట్టి వేగం తగ్గించి, సౌకర్యవంతంగా ఉండే వేగంతోనే నడవాలి. తొమ్మిదవ నెల నిండేవరకూ కూడా నడక కొనసాగించవచ్చు.

జాగింగ్

ఎంతో అనుభవం ఉన్న జాగర్ అయితేనే గర్భం దాల్చిన తర్వాత కూడా జాగింగ్ చేయవచ్చు. అయితే జాగింగ్ వేగం, దూరం మాత్రం తగ్గించుకోవాలి. శరీరం కుదుపులకు గురయ్యేలా జాగింగ్ చేయకూడదు. అలాగే నెలలు నిండేకొద్దీ శరీరం బరువు పెరుగుతుంది కాబట్టి జాగింగ్ వేగం తగ్గించాలి. జాగింగ్ ఇబ్బందిగా అనిపించినప్పుడు ఆపేసి, నడకతో సరిపెట్టుకోవాలి.

యోగా

గర్భం దాల్చినప్పుడు, కండరాలు, లిగమెంట్లు సాగుతాయి. ఈ స్థితికి శరీరం తట్టుకోవాలంటే అందుకు తోడ్పడే యోగాసనాలు వేయాలి. అయితే పూర్వ అనుభవం ఉన్నప్పుడు మాత్రమే అనుభవజ్ఞులైన శిక్షకుల సమక్షంలో యోగాసనాలు సాధన చేయాలి.

వెయిట్ ట్రైనింగ్

గర్భిణిగా ఉన్న సమయంలో కండర నిర్మాణానికి వెయిట్ ట్రైనింగ్ చేయవచ్చు. అయితే బరువులను పట్టుకుని వెల్లకిలా పడుకుని చేసే వ్యాయామాలు చేయకూడదు. ఎక్కువ బరువులను ఎత్తే ప్రయత్నం చేయకూడదు. పొత్తికడుపు కండరాల మీద ఒత్తిడి పడే భంగిమల్లో వెయిట్ ట్రైనింగ్ చేయకూడదు. మరీ ముఖ్యంగా నాల్గవ నెల నుంచి తొమ్మిదవ నెల గర్భం సమయంలో బరువులతో కూడిన వ్యాయామాలకు దూరంగా ఉండాలి.



కీళ్లు జాగ్రత్త

ప్రసవ సమయంలో వ్యాకోచించడానికి అనువుగా గర్భిణిగా ఉన్న సమయంలోనే కీళ్లు కొంత వదులవుతాయి. ఈ సమయంలో కటి ప్రదేశంలోని కీళ్లు వదులుగా మారతాయి. కాబట్టి కటి ప్రదేశంలో బరువు పడే వ్యాయామాలకు దూరంగా ఉండాలి. యోగా, ఈత, నడక, పైలేట్స్ లాంటి వ్యాయామాలకే పరిమితం అవడం మేలు. వీటికి బదులు ఎగిరి దూకడం, గెంతడం లాంటి వ్యాయామాలు చేయకూడదు.

సమతౌల్యం జాగ్రత్త

గర్భంతో శరీరం బరువు పెరుగుతుంది కాబట్టి పూర్వంలా శరీరాన్ని బ్యాలెన్స్ చేయడం కష్టం. కాబట్టి వ్యాయామం చేసే సమయంలో శరీర కదలికల మీద ఓ కన్నేసి ఉంచాలి. తొట్రుపడడానికి, అదుపు తప్పడానికి వీలున్న వ్యాయామాలు చేయకూడదు. ఒంటి కాలు ఆసరాతో చేసే వ్యాయామాలు చేయకూడదు.

ఈత

గర్భిణులకు అన్నివిధాలుగా సురక్షితమైన వ్యాయామం ఇది. పెరిగిన శరీర బరువుతో అలసిన శరీరాలు ఈతతో సేద తీరతాయి. శరీరం తేలికైన భావన కలుగుతుంది. గుండె వేగం పెరిగి రక్తప్రసరణ మెరుగవుతుంది. స్వాంతన కూడా దక్కుతుంది.

సైక్లింగ్

సాధారణ సైకిల్ తొక్కడం మంచిది కాదు. దీంతో ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువ. కాబట్టి స్టేషనరీ సైకిల్ తొక్కవచ్చు. ఇది తక్కువ ప్రభావం చూపించినా సురక్షితమైనది కాబట్టి ఈ సమయంలో దీన్ని ఎంచుకోవడమే ఉత్తమం.

నీళ్లు సరిపడా

వ్యాయామాలు చేసే గర్భిణిలు నీళ్లు తాగుతూ ఉండాలి. వ్యాయామంతో ఒళ్లు వేడెక్కకుండా, 140కి మించి గుండె వేగం పెరగకుండా చూసుకోవాలి. తల తిరిగినా, నీరసంగా అనిపించినా వెంటనే వ్యాయామం మానేయాలి. వ్యాయామానికి ముందు వార్మప్ తప్పనిసరి. సౌకర్యవంతమైన దుస్తులు, షూస్ ధరించాలి. కనీసం అరగంటపాటు వారంలో 4 నుంచి 5 సార్లు చేస్తే చాలు.

వాటర్ ఏరోబిక్స్

5వ నెల నుంచి ప్రసవం ముందు వరకూ నీళ్లలో నడుము వరకూ మునిగి చేసే ఏరోబిక్ వ్యాయామాలు మంచివి. కండరాలకు సుతిమెత్తని వ్యాయామం అందించే వాటర్ ఏరోబిక్స్‌వల్ల బడలిక, అలసట తొలగుతాయి. శరీరం మీద వ్యాయామంతో పడే ఒత్తిడి కూడా తక్కువే! నీళ్లలో మునిగి ఉండడం వల్ల కీళ్ల మీద ఒత్తిడి తగ్గుతుంది.

గమనిక:

పడక విశ్రాంతి, ప్రసవ సమస్యల గురించిన వైద్యుల సూచనలు పొందినవారు ఎట్టి పరిస్థితుల్లోనూ, ఎంత పూర్వ అనుభవం, అలవాటు ఉన్నా వ్యాయామాలు చేయకూడదు

డిగ్రీతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం

ఎస్ఎస్‌సీ సీజీఎల్ఈ-2024

ఖాళీలు 17,727



స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ)... కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో గ్రూప్-బి, సి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టుల వివరాలు: గ్రూప్-బిలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్/అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, సబ్ ఇన్‌స్పెక్టర్, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్, రీసెర్చ్ అసిస్టెంట్, డివిజన్ అకౌంటెంట్, జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి. గ్రూప్-సిలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్/జూనియర్ అకౌంటెంట్, పోస్టల్ అసిస్టెంట్/సార్టింగ్ అసిస్టెంట్, సీనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్/అప్పర్ డివిజన్ క్లర్క్, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, ట్యాక్స్ అసిస్టెంట్, సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఉన్నాయి.

అర్హతలు: ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్మీడియట్ స్థాయిలో మేథమెటిక్స్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఆ తరవాత డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. లేదా డిగ్రీ స్థాయిలో స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ గ్రేడ్-2 పోస్టులకు స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎన్‌హెచ్ఆర్‌సీలో రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టులకు కనీసం ఏడాది రీసెర్చ్ అనుభవం ఉన్నవారికి, న్యాయశాస్త్రంలో డిగ్రీ లేదా హ్యూమన్ రైట్స్‌లో డిగ్రీ పూర్తిచేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. నిర్దిష్ట విద్యార్హతలన్నీ 2024 ఆగస్టు 1లోపు పొంది ఉండాలి.

వయసు: జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు 32 ఏళ్లు, గ్రూప్-సి పోస్టులకు 27 ఏళ్లు. మిగతా అన్ని పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి 30 ఏళ్లు. నిబంధనల ప్రకారం రిజర్వేషన్ వర్గాలకు వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రెండు దశల్లో నిర్వహించే రాత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 24
- **టైర్-1 పరీక్ష:** సెప్టెంబరు/అక్టోబరు
- **టైర్-2 పరీక్ష:** డిసెంబరు
- **వెబ్‌సైట్:** ssc.gov.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/SM4CD72లో చదవండి.

మొరార్జీ దేశాయ్ఇన్‌స్టిట్యూట్‌లో
డిప్లొమా

కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా(ఎండీఎన్ఐవై-న్యూఢిల్లీ)-డిప్లొమా ఇన్ యోగా సైన్స్ (డీవైఎస్సీ)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 75 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 33, ఓబీసీలకు 18, ఎస్సీలకు 10, ఎస్టీలకు 6, ఈడబ్ల్యూఎస్ వర్గానికి 8 సీట్లు ప్రత్యేకించారు. అదనంగా మరో 22 స్పెషల్ కేటగిరీ సీట్లు కూడా ఉన్నాయి. వీటిని విదేశీ విద్యార్థులు, స్పోర్ట్స్/ఎన్‌సీసీ/ఎన్ఎస్ఎస్ అభ్యర్థులు, మాజీ సైనికులు, సంస్థ ఉద్యోగుల పిల్లలకు నిర్దేశించారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్, మెడికల్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు సెకండరీ స్కూళ్లు, ప్రీ యూనివర్సిటీలు, యూనివర్సిటీలలో యోగా ఇన్‌స్ట్రక్టర్లుగా రాణించవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. వయోపరిమితి నిబంధనలు లేవు. అభ్యర్థులు ఆరోగ్యవంతులై ఉండాలి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 2
- **వెబ్‌సైట్:** yogamdniy.nic.in

సెస్‌లో పీహెచ్‌డీ

బేగంపేట(హైదరాబాద్)లోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్ ఇన్ డెవలప్‌మెంట్ స్టడీస్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌నకు నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ సహకారం అందిస్తోంది. మొత్తం 12 సీట్లు ఉన్నాయి. రీసెర్చ్ ప్రపోజల్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. తెలంగాణ ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి. స్థానికేతరులకు హాస్టల్ సౌకర్యం ఉంది. అర్హులైన అభ్యర్థులకు ఫైనాన్షియల్ అసిస్టెన్స్/ఫెలోషిప్స్ అందిస్తారు.

విభాగాలు: ఎకనామిక్స్, సోషియాలజీ/ఆంత్రోపాలజీ/సోషల్ వర్క్, డెవలప్‌మెంట్ స్టాటిస్టిక్స్, పొలిటికల్ సైన్స్/పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కామర్స్/బిజినెస్ మేనేజ్‌మెంట్

దిక్సూచి
DIKSUCHI

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో పీజీ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. యూజీసీ జేఆర్ఎఫ్/యూజీసీ నెట్ అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 20
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** సెప్టెంబరు రెండో వారంలో
- **వెబ్‌సైట్:** www.cess.ac.in

డా.వైఎస్సార్ వర్సిటీలో డెంటల్ పీజీ ప్రవేశాలు


విజయవాడలోని డా.వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(డావైఎస్సార్‌యూహెచ్ఎస్)-పోస్ట్ గ్రాడ్యుయేట్ డెంటల్ డిగ్రీ/డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్, నాన్ మైనారిటీ, అనుబంధ డెంటల్ కళాశాలల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా, మేనేజ్‌మెంట్ కోటా సీట్లు భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ డెంటల్ కళాశాలల్లో 50 శాతం సీట్లను స్టేట్ కోటా/కాంపిటెంట్ అథారిటీ కోటా కింద; మిగిలిన 50 శాతం సీట్లను ఆలిండియా కోటా కింద భర్తీ చేస్తారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ నాన్ మైనారిటీ డెంటల్ కాలేజీల్లో 50 శాతం సీట్లను కాంపిటెంట్ అథారిటీ కోటా కింద, మిగిలిన 50 శాతం సీట్లను మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేస్తారు. ఎండీఎస్, డిప్లొమా ప్రోగ్రామ్‌లను అందిస్తున్న కాలేజీలు-సీట్ల వివరాలు వెబ్‌సైట్‌లో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హతలు: పీజీ డెంటల్ డిగ్రీ/డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీడీఎస్(బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జరీ) ఉత్తీర్ణతతోపాటు 2024 జూన్ 30 నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తి కావాలి. రాష్ట్ర స్థాయి/జాతీయ స్థాయిలో ఉన్న డెంటల్ కౌన్సిల్ గుర్తింపు తప్పనిసరి. నీట్ ఎండీఎస్ 2024 అర్హత పొంది ఉండాలి.

- **చివరి తేదీ:** జూలై 24
- **వెబ్‌సైట్:** drysr.uhsap.in

నవ్య | చిత్రజ్యోతి

ఆలోచనలే మన శత్రువులు



వెంకట సత్య దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'ఆపరేషన్ రావణ్'. 'పలాస 1978' ఫేమ్ రక్షిత్ అట్లూరి, సంగీర్తన విపిన్ జంటగా నటించారు. ఈ న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌ను ధ్యాన్ అట్లూరి నిర్మించారు. ఈ నెల 26న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు వెంకట సత్య మీడియాతో ముచ్చటించారు.

"మన ఆలోచనలే మన శత్రువులు అన్నది ఈ సినిమా కథకు మూలం. ఈ పాయింట్‌ను నేను పురాణాల్లోంచి తీసుకున్నాను. ఈ సినిమా ఒక మనిషి ఎలా సైకోగా మారతాడో విజువల్‌గా చూపిస్తుంది. సినిమాలోని ప్రతీ పాత్రకూ విశిష్టత ఉంటుంది. ఇప్పటివరకూ ఏ సినిమాలోనూ చూడని అంశాలు 'ఆపరేషన్ రావణ్'లో ఉంటాయి. ఈ సినిమాను ప్రేక్షకులు చాలా బాగా రిసీవ్ చేసుకుంటారనే నమ్మకం ఉంది. ఇందులో మా అబ్బాయి రక్షిత్ స్టంట్స్ చేసేటప్పుడు ఒక తండ్రిగా భయపడ్డాను.. డైరెక్టర్‌గా జాగ్రత్తపడ్డాను. రక్షిత్ ఈ క్యారెక్టర్‌ను బాగా ఓన్ చేసుకున్నాడు. తన కష్టం స్ర్కీన్‌పై మంచి ఫలితాన్ని ఇస్తుంది. రాధిక పోషించిన పాత్ర.. చాలా కాలం పాటూ గుర్తుండిపోయేలా ఉంటుంది. సినిమాలోని ప్రతీ సన్నివేశం ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది. అన్ని విభాగాల నుంచి మంచి అవుట్‌పుట్ వచ్చింది" అని చెప్పారు.

ప్రైమ్ షో కు డబుల్ ఇస్మార్ట్ హక్కులు

రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'డబుల్ ఇస్మార్ట్' ఆగస్టు 15న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో మాస్, యాక్షన్, డ్రామా, ఎంటర్‌టైన్‌మెంట్.. డబుల్ డోస్‌లో ఉంటాయంటున్నారు దర్శకుడు పూరి. తాజా సమాచారం ఏమిటంటే.. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల వరల్డ్ థియేట్రికల్ రైట్స్ ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ అధినేతలు నిరంజన్ రెడ్డి, చైతన్యరెడ్డి సొంతం చేసుకున్నారు. సంజయ్‌దత్ ఓ పవర్‌ఫుల్ రోల్ పోషించిన 'డబుల్ ఇస్మార్ట్'లో కావ్య థాపర్ కథానాయిక. పూరి జగన్నాథ్, చార్మి కౌర్ నిర్మాతలు.



నిర్మాతలతో ఇన్‌కమ్ టాక్స్ అధికారుల సమావేశం



తెలుగు నిర్మాతలతో ఆదాయపు పన్ను అధికారులు సోమవారం ఔట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిల్మ్ ఛాంబర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆదాయపు పన్ను రిటర్న్స్ దాఖలు చేయడానికి వివిధ గడువు తేదీల గురించి, సినిమాల నిర్మాణం, రాబడికి సంబంధించిన అకౌంటింగ్ గురించి ఈ కార్యక్రమంలో అధికారులు వివరించారు. ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ ఎస్.మూకాంబికేయన్, టి.మురళీధర్, కె.శ్రీనివాసరావు, సతీశ్ తదితర అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు దిల్ రాజు, కార్యదర్శి దామోదర ప్రసాద్ సహా పలువురు నిర్మాతలు పాల్గొన్నారు.

ఏడాదికి ఆరు చిత్రాలు



'బిగ్ బాస్' ఫేమ్ అలీ రజా హీరోగా నటించిన 'రామ్ ఎన్.ఆర్.ఐ.' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. సీతా నారాయణన్ కథానాయిక. 'పవర్ ఆఫ్ రిలేషన్‌షిప్' అనేది ఉప శీర్షిక. ఎన్. లక్ష్మీ నందా దర్శకత్వంలో ముప్పా సత్యనారాయణ నిర్మించారు. ఆదివారం రాత్రి జరిగిన చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో చిత్ర సమర్పకుడు సింగులూరి మోహన్‌కృష్ణ మాట్లాడుతూ 'సినిమా బాగా వచ్చింది. గోదావరి అందాలను అద్భుతంగా చూపించాం. ఈ నెల 26న విడుదల చేస్తున్నాం. ఇకపై ఏడాదికి ఆరు చిత్రాలైనా విడుదల చేయాలని నిర్ణయించుకున్నా. ప్రతి చిన్న చిత్రాన్నీ రిలీజ్ చేస్తా' అని చెప్పారు.

ఒక సిరీస్... అనేక మంది తారలతో!


ఒక సినిమాను ఇద్దరు దర్శకులు సంయుక్తంగా తెరకెక్కించడం అప్పుడప్పుడు జరుగుతుంటాయి. అనేక పాత్రలతో వైవిధ్యమైన కథలను కలుపుతూ ఒకే సినిమాగా తీయడం కూడా తెలిసిందే. కానీ విభిన్న కథలున్న ఒకే సినిమాను లేదా వెబ్ సిరీస్‌ను పలువురు దర్శకులు తీస్తే ఎలా ఉంటుంది?. లాక్ డౌన్ టైమ్‌లో మొదలైన ఈ సరికొత్త పంథా.. ఇప్పుడు అన్ని భాషల్లోనూ పాపులర్ ఫార్ములాగా మారింది. అదే ఆంతాలజీ. వెబ్ సిరీస్‌ల్లో ఎక్కువగా ఈ ట్రెండ్ కనిపిస్తుంది. అవేమిటో తెలుసుకుందాం.



లాక్‌డౌన్‌లో మొదటిసారిగా ఈ ఆంతాలజీ సిరీస్‌ను మన దక్షిణాది మేకర్స్ ప్రేక్షకులకు పరిచయం చేశారు. వెట్రిమారన్, గౌతమ్ వాసుదేవ్ మీనన్, విఘ్నేష్ శివన్, సుధా కొంగర దర్శకత్వం వహించిన 'పావై కథైగల్' 2020లో నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైంది. పరువు హత్యలు అంతర్భాగంగా విభిన్న కథలతో నాలుగు భాగాలుగా ఈ సిరీస్ తెరకెక్కింది. ఇందులో ప్రకాశ్ రాజ్, సాయి పల్లవి, అంజలి నటించారు. సమాజంలో జరిగిన కొన్ని వాస్తవిక సంఘటనల ఆధారంగా కల్పనను జోడించి తెరకెక్కించిన ఈ సిరీస్ అందరినీ గగుర్పాటుకు గురిచేసింది.







ప్రేమలోని డార్క్ సైడ్

ఆ తర్వాత తెలుగులో తొలి ఆంతాలజీ సిరీస్ 'పిట్టకథలు'. ఇప్పుడు కల్కి చిత్రంతో ప్రపంచ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన నాగ్ అశ్విన్ మరో ముగ్గురు దర్శకులు తరుణ్ భాస్కర్, సంకల్ప్ రెడ్డి, బి.వి. నందినీ రెడ్డి ఈ సిరీస్‌ను తెరకెక్కించారు. నాలుగు భాగాలుగా నెట్‌ఫ్లిక్స్‌లో 2021లో విడుదలైన ఈ సిరీస్‌లో జగపతిబాబు, సత్యదేవ్, లక్ష్మీ మంచు, శ్రుతీ హాసన్, ఈషా రెబ్బా నటించారు. ప్రేమలోని చీకటి కోణాల్ని.. ప్రేమికుల మధ్యన ఉండే విభిన్న పార్శ్వాలను టచ్ చేసిన ఈ ఆంతాలజీకి అప్పట్లో ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన లభించింది.

నవరసాలతో 'నవరస'

నవరసాలను తెరపై పలికించడమే లక్ష్యంగా.. తొమ్మిది మంది తమిళ దర్శకులు.. తొమ్మిది భాగాలుగా 2021లో వచ్చిన సిరీస్ 'నవరస'. ప్రియదర్శన్, గౌతమ్ వాసుదేవ్‌మీనన్, కార్తీక్ సుబ్బరాజ్, వసంత్, అరవింద్‌స్వామి, బిజోయ్ నంబియార్, కార్తీక్ నరేన్, సర్జున్ కే.ఎమ్, రతీంద్రన్ ప్రసాద్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌కు దర్శకుడు మణిరత్నంతో పాటు పలువురు కథలు అందించారు. సూర్య, విజయ్ సేతుపతి, సిద్ధార్థ్, అరవింద స్వామి, గౌతమ్ వాసుదేవ్ మీనన్, యోగిబాబు, రేవతి, పార్వతి తిరువోతు నటించిన ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉంది.

ఆరు విభిన్న ప్రేమ కథలతో..

న్యూయార్క్ టైమ్స్ పత్రికలో వచ్చిన 'మోడరన్ లవ్' ఆర్టికల్స్ ఆధారంగా తెలుగు, తమిళంలో 'మోడరన్ లవ్ హైదరాబాద్', 'మోడరన్ లవ్ చెన్నై' సిరీస్‌లను అమెజాన్ ప్రైమ్ వేదికగా తెరకెక్కించారు. 2022లో విడుదలైన 'మోడరన్ లవ్ హైదరాబాద్'.. 2023లో 'మోడరన్ లవ్ చెన్నై' రెండూ ఆరు భాగాలుగా వచ్చాయి. రెండింటిలోనూ హైదరాబాద్, చెన్నై నగరాల్లో వయసు, కుల మతాలకు అతీతంగా జరిగే ఆరు ఆసక్తికరమైన ప్రేమ కథలే కథాంశం. తెలుగు సిరీస్‌కు నగేశ్ కుకునూర్, వెంకటేశ్ మహా, ఉదయ్ గుర్రాల, దేవిక బహుధానం దర్శకత్వం వహించారు. ఆది పినిశెట్టి, రేవతి, నిత్యామీనన్, రీతూ వర్మ నటించారు. తమిళ సిరీస్ 'మోడరన్ లవ్ చెన్నై' సిరీస్‌కు భారతీరాజా, బాలాజీ శక్తివేల్, త్యాగరాజన్ కుమార్‌రాజా, రాజు మురుగన్, క్రిష్ణ కుమార్, అక్షయ్ సుందర్ దర్శకత్వం వహించారు. అశోక్ సెల్వన్, రీతూ వర్మ, వామికా గబ్బి ప్రధాన పాత్రలు పోషించారు.

వాసుదేవన్ నాయర్‌కు నివాళిగా...

జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, మలయాళ దర్శకుడు, రచయిత ఎమ్.టి.వాసుదేవన్ నాయర్ రచించిన షార్ట్ స్టోరీస్ ఆధారంగా తెరకెక్కిన వెబ్ సిరీస్ 'మనోరథంగళ్' ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కారణం కమల్ హాసన్, మమ్ముట్టి, మోహన్ లాల్, ఫహాద్ ఫాజిల్, పార్వతి తిరువోతు, అపర్ణ బాలమురళి, మధుబాల వంటి ప్రముఖ తారాగణం నటించడమే. ఎనిమిది మంది దర్శకులు దీనికి దర్శకత్వం వహించారు. ఈ వెబ్ సిరీస్ ఎమ్.టి.వాసుదేవన్ నాయర్‌కు, మలయాళ చిత్ర పరిశ్రమ మహోన్నత సంస్కృతికి ఇచ్చే నివాళి అని కమల్‌హాసన్ తెలిపారు. ఆగస్టు 15న జీ5లో ఇది విడుదలవుతుంది.

బాలీవుడ్‌లో ఈ ఆంతాలజీ సిరీస్ ట్రెండ్ ఎప్పుడో మొదలై.. సక్సెస్‌ఫుల్‌గా కొనసాగుతోంది. ఇప్పటివరకూ అక్కడ పదుల సంఖ్యలో ఇలాంటివి తెరకెక్కగా.. అధిక భాగం ఆకట్టుకున్నాయి. సౌత్‌లో ఈ తరహా ప్రయత్నాలు అప్పుడప్పుడు జరుగుతున్నాయి. మంచి కంటెంట్‌తో.. అనేక మందికి వినోదం అందించే దిశగా.. దక్షిణాది మేకర్స్ తరచూ ఇలాంటి ప్రయత్నాలతో ముందుకు వస్తే.. కొత్తదనాన్ని ఆదరించే ప్రేక్షకులు విజయం అందించడానికి సిద్ధంగా ఉన్నారు.

ఆ కుర్చీని మడత పెట్టి...



'డెడ్ పూల్' మూవీ ఫ్రాంఛైజ్ నుంచి వస్తున్న మూడో సినిమా 'డెడ్ పూల్ అండ్ వాల్వరిన్' ఈ నెల 26న విడుదల కానుంది, ఇందులో సూపర్ హీరోలు డెడ్ పూల్, వాల్వరిన్ చేసే సాహసాలు ప్రేక్షకులను అలరించనున్నాయి. ఇటీవల విడుదలైన టీజర్, ట్రైలర్స్ ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పొందాయి. ఈ నేపథ్యంలో మార్వెల్ టీమ్ ఈ సినిమాను అన్ని భారతీయ భాషల్లో విడుదల చేస్తోంది. అన్ని భాషల డబ్బింగ్స్ పూర్తయ్యాయి. తెలుగులో ఉన్న ట్రెండింగ్ పదాలు, యూత్ మధ్య విపరీతంగా వినిపించే డైలాగ్స్‌తో తెలుగు వెర్షన్ సిద్ధమైంది. 'కుర్చీ మడత పెట్టి', 'కెవ్వు కేక', 'రింగ రింగా' వంటి ప్రేక్షకులను అలరించే డైలాగ్స్ ప్రేక్షకులను అలరిస్తాయని చెబుతున్నారు. వాల్వరిన్‌గా హ్యూ జాక్‌మన్, డెడ్ పూల్‌గా రయాన్ రెనాల్డ్స్ నటించారు.

ఆయనకు 41.. ఆమెకు 28!


ఔను... వాళ్లిద్దరు ఇష్టపడ్డారు

ప్రేమకు వయసుతో పని లేదు. మనసులు కలిస్తే చాలు. ఈ విషయాన్ని మరోసారి నిరూపిస్తున్నారు కన్నడ దర్శకుడు తరుణ్ కిశోర్ సుధీర్ (41). బాల నటుడిగా కొన్ని చిత్రాల్లో నటించి, పెరిగి పెద్దయ్యాక కూడా నటుడిగా కొనసాగిన సుధీర్ ఆ తర్వాత 'చౌక' చిత్రంతో దర్శకుడిగా పరిచయమయ్యారు. ఆ తర్వాత 'రాబర్ట్' (2021), 'కాటేరా' (2023) చిత్రాలకు దర్శకత్వం వహించారు తరుణ్. ప్రస్తుతం రేణుకా స్వామి హత్య కేసులో అరెస్ట్ అయిన దర్శన్ ఈ రెండు చిత్రాల్లో హీరో కావడం గమనార్హం. 'రాబర్ట్' చిత్రంలో హీరోయిన్‌గా నటించిన సోనాల్ మోంటెరో (28)తో తరుణ్ ప్రేమలో పడ్డారు. అయితే ఆ విషయాన్ని రహస్యంగా దాచారు. వీరిద్దరి గురించి రూమర్స్ వచ్చినా ఎవరూ బయట పడలేదు. తాజా ఇప్పుడు తమ ప్రేమ విషయాన్ని బయట పెట్టిన తరుణ్, సోనాల్.. ఆగస్టు 11న బెంగళూరులో పెళ్లి చేసుకోబోతున్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.

ఏటా 78.5 లక్షల కొలువులు కావాలి

ఆర్థిక సర్వే పలు కీలక అంశాలను ప్రభుత్వం ముందుంచింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉపాధి కల్పన కీలకమని స్పష్టం చేసింది. ఇందుకోసం 2030 వరకు వ్యవసాయేతర రంగాల్లో ఏటా 78.5 లక్షల ఉద్యోగ/ ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉంటుందని తెలిపింది. ఉద్యోగాల కల్పన ఒక్క ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని స్పష్టం చేసింది. ప్రైవేటు రంగమూ ఇందుకు కలిసి రావాలని కోరింది. పెద్దఎత్తున లాభాలు ఆర్జిస్తున్నా ప్రైవేటు కంపెనీలు కొలువుల కల్పనపై పెద్దగా ఆసక్తి చూపకపోవడాన్ని తప్పుపట్టింది. గత మూడేళ్లలో దేశంలోని 33,000 కంపెనీల స్థూల లాభాలు నాలుగింతలు పెరిగినా, ఆ కంపెనీల్లో ఉద్యోగాల కల్పన మాత్రం పెద్దగా లేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. అలాగే దేశ జనాభాలో వ్యవసాయ రంగంపై ఆధారపడేవారి సంఖ్య క్రమంగా తగ్గుతున్న విషయాన్ని గుర్తు చేసింది. 2023 నాటికి దేశ జనాభాలో 48.5 శాతం మంది తమ జీవనోపాధి కోసం ఈ రంగంపై ఆధారపడి ఉంటే, 2047 నాటికి ఇది 25 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది.



రాష్ట్రాలూ కలిసి రావాలి

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉద్యోగాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వాలదీ కీలక పాత్ర అని ఆర్థిక సర్వే పేర్కొంది. ఇందుకోసం రాష్ట్రాలు భూ చట్టాలు, కార్మిక చట్టాలను సవరించాలని కోరింది. కొన్ని రాష్ట్రాలు కొత్త కార్మిక చట్టాలకు, పాత కార్మిక చట్టాల్లోని నిబంధనలు జోడించడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. కంపెనీలకు భారంగా మారిన కొన్ని నియంత్రణలకు రాష్ట్ర ప్రభుత్వాలు ఫుల్‌స్టాప్ పెట్టాలని కోరింది. కొత్త కార్మిక చట్టాలను కొన్ని రాష్ట్రాలు ఇంకా పూర్తి స్థాయిలో అమలు చేయక పోవడడాన్ని తప్పుపట్టింది. సులభతర కార్మిక చట్టాల ద్వారా ఆర్థిక వృద్ధి రేటు మరింత జోరందుకుంటుందని తెలిపింది.

వ్యవసాయంలో తక్షణ సంస్కరణలు

వ్యవసాయ రంగంలో తక్షణం సంస్థాగత సంస్కరణలకు సమయం ఆసన్నమైందని ఆర్థిక సర్వే పేర్కొంది. లేకపోతే మన వ్యవసాయ రంగంలో ఉన్న పూర్తి స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోలేమని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఈ రంగంలో సంక్షోభమైతే లేదని పేర్కొంది. అయితే వాతావరణ మార్పులు, ముందు ముందు ఎదురయ్యే నీటి కొరతలను దృష్టిలో ఉంచుకుని ఈ రంగంలో వెంటనే సంస్థాగత మార్పులు చేపట్టాలని సూచించింది. ఆగ్నేయాసియా దేశాలు, అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే, మన వ్యవసాయ రంగం ఇంకా వెనుకబడే ఉందని తెలిపింది. సాగునీరు, ఎరువులు, విద్యుత్ వంటి వాటిపై సబ్సిడీలతో పాటు వ్యవసాయ ఆదాయానికి పన్ను మినహాయింపు, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) వంటి మద్దతు చర్యలు ఉన్నా, మన వ్యవసాయ రంగంలో మరిన్ని విధానపరమైన సంస్కరణలకు అవకాశం ఉందని సర్వే ముందు మాటలో కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు నాగేశ్వరన్ తెలిపారు. ఆహార ద్రవ్యోల్బణ నియంత్రణ, రైతుల పంటలకు సరైన గిట్టుబాటు ధరల కల్పన, చిన్న కమతాల సమస్య పరిష్కారం మన వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న పెద్ద సవాళ్లని ఆర్థిక సర్వే తెలిపింది. ప్రస్తుత ఆహార భద్రత విధానం నుంచి పోషకాహార భద్రత వైపు మరలాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపింది. డిమాండ్ ఆధారిత ఆహార విధానాన్ని సర్వే సూచించింది.

ఆర్థిక సర్వే 2023-24

ఏఐతో కుదుపు తప్పదు

కొన్ని రంగాల్లోని ఉద్యోగాలపై కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం తప్పదని ఆర్థిక సర్వే హెచ్చరించింది. భవిష్యత్‌లో అన్ని రంగాల్లోని ఉద్యోగాల స్వరూప, స్వభావాలను ఏఐ మార్చి వేస్తుందని తెలిపింది. అయితే అన్ని రకాల ఉద్యోగులు, కార్మికుల నైపుణ్యాలపై ఏఐ ప్రభావం ఎలా ఉంటుందనే దానిపై ఇంకా స్పష్టత లేదని పేర్కొంది. ఉత్పాదకతను భారీగా పెంచే ఏఐ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే మార్చివేసే అవకాశం ఉందని అంచనా వేసింది. విద్యుత్, ఇంటర్నెట్ లానే.. ఏఐ కూడా నిత్య జీవితంలో తప్పనిసరిగా మారుతోందని తెలిపింది. ఏఐ కారణంగా కస్టమర్ సర్వీసెస్ వంటి రంగాల్లో ఆటోమేషన్ పెరిగి ఉద్యోగాలు పోతాయని హెచ్చరించింది. అయితే ఇమేజ్, వీడియోల చిత్రీకరణ వంటి సృజనాత్మక రంగాల్లో ఏఐ టూల్స్‌ని విరివిగా ఉపయోగిస్తారని అంచనా వేసింది. ఏఐ ట్యూటర్ల కారణంగా విద్యా రంగంలోనూ మార్పులు తప్పవని పేర్కొంది. ఏఐ కారణంగా కొత్త ఔషధాల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని సర్వే తెలిపింది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న ఏఐ టెక్నాలజీని మన దేశం ఎంత మాత్రం నిర్లక్ష్యం చేయకూడదని కోరింది.

చైనా నుంచి మరింత ఎఫ్‌డీఐ

చైనా నుంచి మరిన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు (ఎఫ్‌డీఐ)లు ఆకర్షించేందుకు దృష్టి పెట్టాలని ఆర్థిక సర్వే ప్రభుత్వాన్ని కోరింది. ఇలా చేయడం ద్వారా అమెరికా, ఈయూ వంటి దేశాలకు మన ఎగుమతులు మరింత పెంచుకోవచ్చని సూచించింది. ప్రస్తుతం ఈ దేశాలు 'చైనా వన్ ప్లస్' వ్యూహంలో భాగంగా తమకు అవసరమైన వస్తు, సేవల కోసం భారత్ వంటి దేశాలవైపు చూస్తున్న విషయాన్ని గుర్తు చేసింది. చైనా ఎఫ్‌డీఐని సరళీకృతం చేస్తే, ఆ దేశ కంపెనీలు మన దేశంలో తమ యూనిట్లు ఏర్పాటు చేసుకుని, మన దేశం నుంచి తమ సరుకులను అమెరికా, ఈయూ దేశాలకు ఎగుమతి చేయగలుగుతాయని తెలిపింది. గల్వాన్ ఘర్షణల తర్వాత చైనా కంపెనీలు భారత్‌లో పెట్టే పెట్టుబడులను కేంద్ర ప్రభుత్వం కఠినతరం చేసింది. దీనికి తోడు చైనా కంపెనీలు కూడా మన దేశంలో తమ యూనిట్లు ఏర్పాటు చేయడం కంటే, తమ సరుకులను చౌకగా దిగుమతి చేయడంపైనే ఆసక్తి చూపిస్తున్నాయి. అమెరికా, ఈయు,సింగపూర్, జపాన్, కొరియా వంటి దేశాల నుంచి మన దేశానికి పెద్ద ఎత్తున ఎఫ్‌డీఐ వస్తోంది. గత పాతికేళ్లలో మన దేశానికి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలో చైనా వాటా కేవలం 0.37 శాతం (250 కోట్ల డాలర్లు) మాత్రమే. ఈ నేపథ్యంలో ఆర్థిక సర్వే చైనా నుంచి మరింత ఎఫ్‌డీఐకి ప్రయత్నించాలని సూచించడం విశేషం. అయితే కీలకమైన వ్యూహాత్మక ఖనిజాల కోసం చైనాపై ఆధారపడడం ఏ మాత్రం మంచిది కాదని సర్వే స్పష్టం చేసింది.

మానసిక ఆరోగ్యం కీలకం

ప్రజల మానసిక ఆరోగ్యం, ఆహార అలవాట్లపైనా దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని ఆర్థిక సర్వే తెలిపింది. లేకపోతే అధిక జనాభా ప్రయోజనాలను మన ఆర్థిక వ్యవస్థ అందుకోలేదని స్పష్టం చేసింది. ఇందుకోసం ప్రజలు ఆరోగ్యకర ఆహార అలవాట్లు పెంపొందించుకోవాలని కోరింది. మానసిక ఆరోగ్యం ప్రభావం వ్యక్తుల మీదే గాక, దేశ అభివృద్ధిపైనా ఉంటుందని తెలిపింది. అయినా ఈ అంశంపై మన దేశంలో పెద్దగా చర్చ జరగక పోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. మన ప్రజలు ఎదుర్కొంటున్న వ్యాధుల్లో 56.4 శాతానికి అనారోగ్యకర ఆహార అలవాట్లే కారణమన్న భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) నివేదికను సర్వే ఈ సందర్భంగా ఉదహరించింది. చక్కెర, కొవ్వులతో కూడిన ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు ప్రజల ఆరోగ్యాలను పాడు చేస్తున్నాయని తెలిపింది. సరైన వ్యాయామం లేకపోవడం, సరైన పోషకాహారం అందుబాటులో లేకపోవడం ఈ సమస్యను మరింత తీవ్రం చేస్తోందని పేర్కొంది.

వృద్ధి లక్ష్యాలను అందుకుంటాం



ఆర్థిక సర్వేలో ప్రకటించిన వృద్ధి అంచనాలను అందుకోవటం సాధ్యమేనని ప్రధాన ఆర్థిక సలహాదారు వీ అనంత నాగేశ్వరన్ అన్నారు. రుతుపవనాలు, అంతర్జాతీయ ఆర్థిక రిస్క్‌లను దృష్టిలో ఉంచుకునే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.5-7 శాతం మధ్యన ఉంటుందని ఆర్థిక సర్వే అంచనా వేసిందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో వృద్ధి రేటు 8.2 శాతంగా ఉన్న విషయం విదితమే. వృద్ధి రేటు పట్ల తమకు నిరాశావహమైన ఆలోచనేదీ లేదని, పూర్తిగా ఆశావహమైన ధోరణిలోనే ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. రుతుపవనాల పురోగతిని పరిశీలించిన తర్వాతే నిర్దేశిత వృద్ధి లక్ష్యాలను ప్రకటించామని నాగేశ్వరన్ తెలిపారు. ఇతర వర్ధమాన దేశాలతో పోల్చితే భారత బహిర్గత రుణ నిష్పత్తి తక్కువ స్థాయిలో ఉందని, అంతేకాకుండా ద్రవ్యోల్బణం కూడా నియంత్రణలో ఉందని, ఇవన్నీ కలిసి వచ్చే అంశాలని ఆయన పేర్కొన్నారు. కాగా ప్రైవేట్ పెట్టుబడులు మరింతగా పెరగాల్సిన అవసరం ఉందని తెలిపారు.

అంతరాలు పూడ్చేలా పన్ను విధానాలు

ఆదాయ అంతరాలు పూడ్చడంలో ముందు ముందు పన్ను విధానాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని ఆర్థిక సర్వే తెలిపింది. అంతర్జాతీయంగానూ ఈ సమస్య విధాన నిర్ణేతలకు పెద్ద ఆర్థిక సవాల్‌గా మారిందని పేర్కొంది. మన దేశంలో ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సర్వే వివరించింది. ఉద్యోగాల కల్పన, అసంఘటిత రంగాన్ని సంఘటిత రంగంతో అనుసంధానం చేయడం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో మహిళల పాత్ర పెంచడం ద్వారా ఈ సమస్యను అధిగమించేందుకు మన దేశం ప్రయత్నిస్తోందని తెలిపింది. కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా భవిష్యత్‌లో ఉద్యోగ, ఆదాయాలపై ప్రతికూల ప్రభావం తప్పదని కూడా సర్వే హెచ్చరించింది.

వికసిత్ భారత్‌కు ఆరంచెల వ్యూహం

ఈ ఏడాది వృద్ధి 6.5%

కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని (2024-25)కి వృద్ధి రేటు అంచనాను కుదించింది. ప్రపంచంలో పెరిగిన భౌగోళిక, రాజకీయ సంఘర్షణల ప్రభావం వృద్ధి రేటుపై పడుతుందని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరపు వృద్ధి రేటు అంచనాను 6.5 శాతం నుంచి 7 శాతానికే పరిమితం చేసింది. వడ్డీ రేట్లను నిర్ణయించే సమయంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోకూడదని సూచించింది. ఆర్థిక వ్యవస్థలో మరిన్ని ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉన్నదంటూ ఎగుమతులు ఉత్తేజితం చేయడానికి చైనా నుంచి మరిన్ని ప్రత్యక్ష పెట్టుబడుల ఆకర్షణకు మద్దతు ప్రకటించింది. ప్రస్తుత అమృత కాలానికి, 2047 నాటికి వికసిత్ భారత్ సాధనకు ఆరంచెల వ్యూహాన్ని ప్రతిపాదించింది. ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వీ అనంత నాగేశ్వరన్ రూపొందించిన 2023-24 ఆర్థిక సర్వే నివేదికను ఆర్థిక మంత్రి నిర్మల సోమవారం పార్లమెంటుకు సమర్పించారు. విభిన్న అంశాలపై ఆర్థిక సర్వే ప్రకటించిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.



వృద్ధికి ప్రపంచ సవాళ్ల అవరోధం

ఈ ఏడాది వృద్ధి రేటు 6.5 శాతం నుంచి 7 శాతం మధ్యన ఉండవచ్చు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన 8.2 శాతం వృద్ధిరేటు కన్నా ఇది తక్కువే. అలాగే ఆర్‌బీఐ ప్రకటించిన అంచనా 7.2 శాతం కన్నా కూడా తక్కువ. ఈ ఏడాది సాధారణ వర్షపాతం ఉండవచ్చని వాతావరణ పరిశోధనా శాఖ అంచనా. నైరుతి రుతుపవనాల గమనం ఇప్పటివరకు సంతృప్తికరంగానే ఉంది. దీనివల్ల వ్యవసాయ రంగం పనితీరు మెరుగుపడి గ్రామీణ ప్రాంతాల్లో డిమాండు పెరగవచ్చు. జీఎస్‌టీ, ఐబీసీ వంటి వ్యవస్థాత్మక సంస్కరణలు కూడా సత్ఫలితాలనిస్తున్నాయి. అయితే ప్రపంచ స్థాయిలో పెరిగిన భౌగోళిక, రాజకీయ సంఘర్షణలు వృద్ధికి సవాలు విసురుతున్నాయి. వీటి ప్రభావం వల్ల సరఫరా వ్యవస్థలో అంతరాయాలు పెరగవచ్చు. కమోడిటీ ధరలు కూడా పెరిగి ద్రవ్యోల్బణ ఒత్తిడులకు కారణం కావచ్చు. ఫలితంగా ద్రవ్య విధాన సడలింపు సైతం జాప్యం అయ్యే ఆస్కారం ఉంది.

రిటైల్ ఇన్వెస్టర్ల హల్‌చల్...తస్మాత్ జాగ్రత

స్టాక్ మార్కెట్లలో రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం పెరిగింది. రిటైల్ భాగస్వామ్యం పెరగడం మాత్రం ఆహ్వానించదగ్గ అంశమే. దీని వల్ల వారు పొదుపు మొత్తాలపై అధిక రాబడులు పొందగలుగుతారు. వారి రాకతో పెట్టుబడి మార్కెట్లలో స్థిరత్వం వచ్చినా వాస్తవిక మార్కెట్ పరిస్థితులతో ప్రమేయం లేకుండా అధిక రాబడులకు ఆశ పడి అతి విశ్వాసంతో పెట్టుబడులు పెడుతూ పోవడం మాత్రం ఆందోళనకరం. ప్రధానంగా డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో వారి ఆసక్తి పెరిగడంపై ఒక కన్నేసి ఉంచాలి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీ నగదు విభాగం టర్నోవర్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల వాటా 35.9 శాతానికి పెరిగింది. దేశంలోని రెండు డిపాజిటరీల వద్ద నమోదైన డీమ్యాట్ ఖాతాల సంఖ్య 1145 లక్షల (2022-23 ఆర్థిక సంవత్సరం) నుంచి 1514 లక్షల కోట్లకు (2023-24 ఆర్థిక సంవత్సరం) పెరిగింది. ఎన్‌ఎస్ఈలో నమోదైన ఇన్వెస్టర్ల సంఖ్య 2020 మార్చితో పోల్చితే 2024 మార్చి 31 నాటికి 9.2 కోట్లకు పెరిగింది. అంటే 20 శాతం మంది గృహస్థులు తమ పొదుపును ఆర్థిక మార్కెట్లకు తరలించారు. "ఈ పరిణామాలన్నింటినీ జాగ్రత్తగా పరిశీలించాలి. మితిమీరిన విశ్వాసంతో స్పెక్యులేషన్‌కు పాల్పడే ప్రమాదం అధికంగా ఉంది. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి". ప్రధానంగా మ్యూచువల్ ఫండ్ల మార్గంలో రిటైల్ భాగస్వామ్యం గణనీయంగా పెరిగింది. 2024లో ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.14 లక్షల కోట్లు (35 శాతం)పెరిగి రూ.53.4 లక్షల కోట్లకు చేరింది.

డెరివేటివ్స్ జోలికి పోవద్దు

మానవుల్లో సహజసిద్ధంగా ఉండే జూద లక్షణంతో రిటైల్ ఇన్వెస్టర్లు ఎఫ్ అండ్ ఓ విభాగంలో ప్రవేశిస్తున్నారు. అతి తక్కువ తలసరి ఆదాయం ఉన్న భారత్ వంటి వర్ధమాన దేశంలో స్పెక్యులేటివ్ వ్యాపారాలకు తావుండ కూడదు. స్టాక్ మార్కెట్లలో ఏ మాత్రం కరెక్షన్ ఏర్పడినా రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే ఎవరో కనిపించని వ్యక్తులు తమను మోసం చేశారన్న భావన వారిలో పెరిగి దీర్ఘకాలం పాటు పెట్టుబడి మార్కెట్ల వైపు చూడకపోవచ్చు.

> **ఆహార ద్రవ్యోల్బణంపై ఫోకస్ తగ్గించాలి**
>
> వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకునే సమయంలో ఆర్‌బీఐ ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకునే వైఖరి మార్చుకోవాలి. అధిక ఆహార ధరల నుంచి పేదలకు ఊరట కల్పించేందుకు ప్రభుత్వం ఫుడ్ కూపన్లు, ప్రత్యక్ష నగదు బదిలీ వంటి అవకాశాలు అన్వేషించాలి. ఆహార ధరలను మినహాయించి ఇతర విభాగాల్లో ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోవడం మంచిది. తయారీ రంగంలో ద్రవ్యోల్బణం 2023-24 సంవత్సరంలో నాలుగు సంవత్సరాల కనిష్ఠ స్థాయికి తగ్గింది. మెరుగైన నిల్వల నిర్వహణ, ఓపెన్ మార్కెట్ కార్యకలాపాలు, నిత్యావసర వస్తువులపై సబ్సిడీ, వాణిజ్య విధాన చర్యల ద్వారా ఆహార ద్రవ్యోల్బణాన్ని చాలా వరకు అదుపులో ఉంచగలిగారు.

భారత వృద్ధిలో మార్కెట్ల పాత్ర కీలకం

భారత వృద్ధి గాధలో పెట్టుబడి మార్కెట్ల పాత్ర కీలకంగా ఉంది. భారత మార్కెట్ అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలను తట్టుకుంటూ పురోగమిస్తున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరంలో అత్యుత్తమ పనితీరు ప్రదర్శించిన మార్కెట్‌గా భారత మార్కెట్ ఉంది. బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ ఇన్వెస్టర్లకు అద్భుతమైన రాబడులు అందించాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిఫ్టీ 26.8 శాతం, సెన్సెక్స్ 25 శాతం వృద్ధిని నమోదు చేశాయి. భారత మార్కెట్‌ను ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యంగా ప్రపంచ ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. పబ్లిక్ ఇష్యూల జారీ కార్యకలాపాలు కూడా నిలకడగా సాగుతూ ఉండడంతో మార్కెట్ విలువపరంగా భారత మార్కెట్ ప్రపంచంలోనే ఐదో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది మే నెలలో ఈక్విటీ మార్కెట్ విలువ 5 లక్షల కోట్ల డాలర్ల (రూ.415 లక్షల కోట్లు) మైలురాయిని తాకింది. గత ఐదేళ్ల కాలంలో భారత జీడీపీలో మార్కెట్ విలువ వాటా 124 శాతానికి పెరిగింది. భారత మార్కెట్లో వృద్ధి అన్ని ఉప విభాగాలకు విస్తరించడం విశేషం. ప్రస్తుతం మార్కెట్లో 9.5 కోట్ల మంది రిటైల్ ఇన్వెస్టర్లున్నారు. వారంతా కలిసి 2,500 లిస్టెడ్ కంపెనీల్లో 10 శాతం ప్రత్యక్ష వాటా కలిగి ఉన్నారు. దేశీయంగా ఆర్థిక స్థితి మెరుగ్గా ఉండడం, సానుకూల పెట్టుబడి వాతావరణం నేపథ్యంలో 2023-24లో పెట్టుబడుల సమీకరణ రూ.10.9 లక్షల కోట్ల స్థాయిలో ఉంది.

ఆహార ధరలపై వాతావరణ ప్రభావం



గత రెండేళ్లుగా ఆహార ధరలపై వాతావరణ ప్రభావం అధికంగా ఉంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గి పంటల నష్టం పెరిగింది. ప్రధానంగా కూరగాయలు, పప్పు దినుసుల ఉత్పత్తి తగ్గింది. ఫలితంగా 2022 ఆర్థిక సంవత్సరంలో 3.8 శాతం ఉన్న ఆహార ద్రవ్యోల్బణం 2023 ఆర్థిక సంవత్సరం నాటికి 7.5 శాతానికి పెరిగింది. ప్రధానంగా వాతావరణ మార్పుల వల్ల వేడి గాలులు, రుతుపవన అస్థిరతలు, తుపానులు పెరిగాయి. వీటికి తోడు క్రిమికీటకాలు, పంటలను ఆశించే వ్యాధుల కారణంగా టమాటా, ఉల్లి పంటలు దెబ్బ తిని వాటి ధరలు పెరిగాయి. ఒక పక్క అభివృద్ధి లక్ష్యాలను సాధిస్తూ మరో పక్క వాతావరణ మార్పుల లక్ష్యాలకు కట్టుబడడం ఒక గారడీ వంటిదే. భారతదేశం ప్రకటించిన నెట్ జీరో లక్ష్యాలు సాధించడంలో శిలాజేతర ఇంధనాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఎన్‌డీసీ లక్ష్యాలు సాధించాలంటే 2030 నాటికి 2.5 లక్షల కోట్ల ఆర్థిక వనరులు అవసరం.

ఆరంచెల వ్యూహం

భారత్ గత దశాబ్ది కాలంలో ఎన్నో ఆటుపోట్లను తట్టుకుంటూ మెరుగైన వృద్ధిరేటును సాధిస్తూ వస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల కారణంగా అల్పాదాయ దేశం స్థాయి నుంచి అల్ప మధ్యాదాయ దేశంగా ఎదిగింది. ఇప్పుడు మధ్యాదాయ, ఎగువ మధ్యాదాయ దేశంగా మారే క్రమంలో ప్రజల ఆకాంక్షలు విశేషంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యకాలిక దృక్పథంలో మనం ఆరంచెల వ్యూహం అనుసరించడం మంచిది.

ఆ వ్యూహంలో ముఖ్యాంశాలు...

- ప్రైవేట్ రంగ పెట్టుబడులు నిలకడగా పెరగాలి. దీని వల్ల ఉద్యోగాల్లో వృద్ధి ఏర్పడడంతో పాటు కార్మికులకు ఆదాయంలో న్యాయబద్ధమైన వాటా దక్కుతుంది.
- హరిత ఆర్థిక వ్యవస్థగా పరివర్తన చెందే క్రమంలో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాలు కీలకం కానున్నాయి. ఈ ప్రయాణానికి మద్దతు ఇచ్చేందుకు నవ్య దృక్పథంతో కూడిన ఆర్థిక సాధనాలు అందుబాటులోకి రావాలి. వీటి వల్ల ప్రైవేటు పెట్టుబడుల సమీకరణ తేలికవుతుంది.
- ఎంఎస్ఎంఈలకు రుణ లభ్యతలో వ్యత్యాసాల తొలగింపునకు ప్రభుత్వం మార్గాలు అన్వేషించాలి. నియంత్రణల సడలింపు; భౌతిక, డిజిటల్ కనెక్టివిటీ పెంపు, ఎంఎస్ఎంఈలు తమ మార్కెట్ పరిధిని విస్తరించుకోవడానికి వీలుగా మెరుగైన ఎగుమతి వ్యూహం ప్రతిపాదించడం అవసరం.
- భారత వృద్ధికి చోదక శక్తి కాగల సామర్థ్యం వ్యవసాయ రంగానికి ఉంది. ఈ నేపథ్యంలో పర్యావరణ, వాతావరణ పరంగా రైతులకు సహాయకారి అయ్యే విధానాలు రూపొందించాలి.
- జనాభాలో నైపుణ్యాల వ్యత్యాసాన్ని పూడ్చేందుకు అనువైన విద్య, నైపుణ్య విధానాలు అనుసరించాలి. ఇందుకు ఈయూ తరహాలో సమీకృత విధానం వంటిది అనుసరించడం మంచిది.
- ఈ పై అంశాలన్నీ ఫలవంతం కావాలంటే ప్రభుత్వ సామర్థ్యాలు, సమర్థతలు పెరగాలి. ప్రభుత్వ యంత్రాంగాన్ని పునరుజ్జీవింపచేయడంపై ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.

యూకో బ్యాంక్ లాభంలో 147% వృద్ధి

క్యూ1 లాభం రూ.551 కోట్లు

కోల్‌కతా : ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంక్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికం (క్యూ1)లో అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గాను నికర లాభం ఏకంగా 147 శాతం వృద్ధి చెంది రూ.551 కోట్లుగా నమోదైందని వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో బ్యాంక్ నికర లాభం రూ.223 కోట్లుగా ఉంది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం వ్యాపారం 11.46 శాతం వృద్ధితో రూ.4,61,408 కోట్లకు చేరుకుంది. ఇదే కాలంలో స్థూల అడ్వాన్సులు 7.39 శాతం పెరిగి రూ.2,68,155 కోట్లుగా నమోదయ్యాయి. మొత్తం డిపాజిట్లు కూడా 7.39 శాతం వృద్ధితో రూ.2,68,155 కోట్లకు చేరుకున్నట్లు బ్యాంక్ తెలిపింది. నికర వడ్డీ మార్జిన్ 12.20 శాతం వృద్ధితో రూ.2,254 కోట్లుగా నమోదైంది. కాగా సమీక్షా కాలంలో స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 4.48 శాతం నుంచి 3.32 శాతానికి, నికర ఎన్‌పీఏలు 1.18 శాతం నుంచి 0.78 శాతానికి తగ్గినట్లు పేర్కొంది. ఈ కాలంలో బ్యాంక్ క్యాపిటల్ అడిక్వసీ రేషియో (సీఏఆర్) 17.09 శాతంగా ఉంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3,230 శాఖలు, హాంకాంగ్, సింగపూర్‌లలో ఒక్కో శాఖను, ఇరాన్‌లో రిప్రజెంటేటివ్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నట్లు యూకో బ్యాంక్ వెల్లడించింది.

ఐఓబీ లాభం రూ.633 కోట్లు

చెన్నై : జూన్‌తో ముగిసిన త్రైమాసికలో ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) నికర లాభం 26.60 శాతం వృద్ధితో రూ.633 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో బ్యాంక్ నికర లాభం రూ.500 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం కూడా 21.54 శాతం వృద్ధితో రూ.6,227 కోట్లుగా నమోదైంది. ఈ కాలంలో మొత్తం వ్యాపారం రూ.16.04 శాతం పెరిగి రూ.4,55,664 కోట్ల నుంచి రూ.5,28,773 కోట్లకు చేరుకుందని ఐఓబీ తెలిపింది. త్రైమాసిక కాలంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం రూ.5,424 కోట్ల నుంచి రూ.6,535 కోట్లకు పెరగటంతో నికర లాభం గణనీయంగా పెరిగింది.

24% పెరిగిన మాస్‌చిప్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మాస్‌చిప్ టెక్నాలజీస్..జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గాను రూ.75.42 కోట్ల కార్యకలాపాల ఆదాయంపై రూ.3.98 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం(రూ.3.21 కోట్లు)తో పోల్చితే లాభం 24 శాతం వృద్ధి చెందగా రెవెన్యూ 41 శాతం పెరిగింది. అయితే గత ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంతో పోల్చితే మాత్రం లాభం ఏకంగా నాలుగున్నర రెట్లు పెరిగింది.

హైదరాబాద్ మార్కెట్లోకి యూలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): షేర్డ్ ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) మొబిలిటీ 'యూలు'.. హైదరాబాద్ మార్కెట్లోకి ప్రవేశించింది. కంపెనీ ఇప్పటికే దేశవ్యాప్తంగా 35,000 ఈవీలతో ఎనిమిది నగరాల్లో కార్యకలాపాలు సాగిస్తుండగా తాజాగా హైదరాబాద్‌లోకి అడుగు పెట్టినట్లు యూలు చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ నవీన్ దాచూరి తెలిపారు. తొలుత క్విక్ కామర్స్ కంపెనీలకు యూలు గూడ్స్ మొబిలిటీ సేవలందించనున్నట్లు చెప్పారు. ఇందుకోసం స్విగ్గీ, బ్లింకిట్, జెప్టో వంటి క్విక్ కామర్స్ సంస్థలతో జట్టు కట్టినట్లు తెలిపారు.

అమ్మకాల వెల్లువ

- పతనబాటలో సూచీలు
- సెన్సెక్స్ 120 పాయింట్లు డౌన్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాల బాటలోనే సాగాయి. కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించటంతో సోమవారం నాడు మార్కెట్లు ఆరంభం నుంచి పతనబాటలోనే సాగాయి. ఇండెక్స్ హెవీ వెయిట్ షేరు రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లతో పాటు కోటక్ మహీంద్రా షేర్లలో భారీగా అమ్మకాలకు దిగటంతో బెంచ్‌మార్క్ సూచీ సూచీ 102.57 పాయింట్ల నష్టంతో 80,502.08 పాయింట్ల వద్ద క్లోజైంది. ఇంట్రాడేలో ఒక దశలో సెన్సెక్స్ 504 పాయింట్ల నష్టంతో 80,100.65 పాయింట్ల స్థాయిని తాకింది. ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తటంతో సూచీ నష్టాలను భారీగా తగ్గించుకుంది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 168.6 పాయింట్లు నష్టపోయి 24,362.20 స్థాయిని తాకినప్పటికీ చివరలో కోలుకుంది. దీంతో నిఫ్టీ 21.65 పాయింట్ల నష్టంతో 24,509.25 పాయింట్ల వద్ద ముగిసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలకు తగ్గట్టుగా లేకపోవటంతో ఇన్వెస్టర్లు భారీ ఎత్తున అమ్మకాలకు పాల్పడ్డారు. దీంతో రిలయన్స్ షేరు 3.49 శాతం నష్టంతో రూ.3,001.10 వద్ద క్లోజైంది. కంపెనీ మార్కెట్ విలువ కూడా రూ.73,470 కోట్లు తగ్గి రూ.20,30,488.32 వద్దకు చేరుకుంది. కోటక్ మహీంద్రా బ్యాంక్ షేరు కూడా 3 శాతం మేర నష్టపోయింది.

ఆటుపోట్లు తప్పవు..

సోమవారం ఆరంభంలో నష్టపోయిన సూచీలు ఆ తర్వాత ఇన్వెస్టర్లు.. బ్యాంకింగ్, రియల్టీ షేర్లలో లాభాల స్వీకరణకు దిగటంతో చివరకు మార్కెట్లు స్వల్ప నష్టాలను మూటగట్టుకున్నాయని మెహతా ఈక్విటీస్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సే అన్నారు. మంగళవారం నాడు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో బెంచ్‌మార్క్ సూచీలు ఆటుపోట్లలో సాగే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు.

దొడ్ల డెయిరీ ఆదాయం 912 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో దొడ్ల డెయిరీ రూ.65 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.34.97 కోట్లు)తో పోల్చితే లాభం 86 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం కూడా రూ.823.40 కోట్ల నుంచి రూ.911.60 కోట్లకు పెరిగింది. జూన్ త్రైమాసికంలో కంపెనీ ఆదాయం ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి చేరటమే కాకుండా వాల్యూయాడెడ్ ఉత్పత్తులు, అంతర్జాతీయ వ్యాపారం కూడా గణనీయంగా పెరిగిందని దొడ్ల డెయిరీ ఎండీ సునీల్ రెడ్డి తెలిపారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,850 ▼	67,700 ▼	96,000 ▼
ముంబై	73,218 ▼	67,068 ▼	88,196 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	520
వరంగల్	522	గోదావరి	520
చిత్తూరు	573	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	117
వరంగల్	112	గుంటూరు	118
కరీంనగర్	112	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	129
కర్నూలు	112	నెల్లూరు	129
విశాఖపట్నం	106	అనంతపురం	117
గోదావరి	117		



వరద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

పెదవాగుకు తక్షణ మరమ్మతులు


- ప్రాజెక్టును ఈ సీజన్‌లోనే అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళిక
- ఇసుకమేటల తొలగింపునకు ఎకరానికి రూ.10 వేలు: పొంగులేటి

అశ్వారావుపేట, జూలై 22: తెలంగాణ, ఏపీ పరిధిలో 16 వేల ఎకరాల ఆయకట్టు కలిగిన పెదవాగు ప్రాజెక్టుకు తక్షణ మరమ్మతులు చేసి ఈ సీజన్‌లోనే రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు తగిన ప్రణాళిక రూపొందిస్తున్నట్టు రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో ఇటీవల వర్షాలకు దెబ్బ తిన్న పెదవాగు ప్రాజెక్టును సోమవారం పరిశీలించారు. పెద్దవాగు గండి పడటానికి గల కారణాలను నీటి పారుదల శాఖ సీఈ శ్రీనివాసరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. తక్షణ మరమ్మతులకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. పెదవాగు ప్రాజెక్టు వరదలతో దెబ్బతిన్న ఆర్ అండ్ బీ, పీఆర్ రహదారుల మరమ్మతులు, విద్యుత్తు సౌకర్యం పునరుద్ధరణకు రూ.8.50 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. 400 ఎకరాల్లో ఇసుక మేటలు వేసినట్టు ప్రాథమిక సర్వేలో తేలిందని, ఆయా భూముల్లో ఇసుక మేటలను తొలగించేందుకు ఎకరానికి రూ.10 వేలు సహాయం, ఉచితంగా విత్తనాలు సరఫరా చేస్తామని వెల్లడించారు. వరదల్లో కొట్టుకుపోయిన గొర్రెలు, మేకలకు ఒక్కోదానికి రూ.3 వేలు, పశువులకు ఒక్కో దానికి రూ.20 వేలు అందిస్తామన్నారు. వరదలో చిక్కుకున్న 31 మందిని కాపాడేందుకు ఏపీ ప్రభుత్వం అందించిన సహకారం మరిచిపోలేదని.. వారికి ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

రాజమండ్రి వద్ద సముద్రాన్ని తలపిస్తూ..

ఏపీలోని ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి నీటి మట్టం 13 అడుగులకు చేరింది. ఎగువ నుంచి 12.05 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 175 గేట్ల ద్వారా సముద్రంలోకి 11,68,908 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సోమవారం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయగా.. మంగళవారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. వరద ప్రవాహంతో రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ల మధ్య అఖండ గోదావరి సముద్రాన్ని తలపిస్తోంది. లంకలన్నీ మునిగిపోతున్నాయి. రాజమహేంద్రవరంలో బ్రిడ్జిలంక, కేతావారి లంక, ఎదుర్లమ్మలంక ప్రాంతాల్లోని 55 కుటుంబాలకు చెందిన 136 మందిని పడవల సాయంతో పునరావాస కేంద్రాలకు తరలించారు.

ఉగ్ర గోదావరి



మేడిగడ్డ వద్ద గోదావరి ప్రవాహం

(మొదటి పేజీ తరువాయి)

చేరింది. ఎగువ నుంచి భారీగా వరద కొనసాగుతుండడంతో మంగళవారం తుది ప్రమాద హెచ్చరిక (53 అడుగులు) దాటే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరం ఉధృతితో దేవస్థానానికి సంబంధించిన స్నానఘట్టాల వద్ద ఉన్న కల్యాణ కట్ట కింది భాగం పూర్తిగా మునిగిపోయింది. ముంపు బారిన పడే అవకాశం ఉందన్న అంచనాతో 111 గ్రామాల ప్రజలను అధికార యంత్రాంగం ఇప్పటికే అప్రమత్తం చేసింది. తుది ప్రమాద హెచ్చరిక జారీ చేస్తే.. దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని పలు గ్రామాల్లోకి నీరు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కాగా, భద్రాచలం వద్ద కరకట్టను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. అనంతరం భద్రాచలం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి, గతంలో తలెత్తిన లోపాలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. మరోవైపు.. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద పోటెత్తుతోంది. సోమవారం ఉదయం నుంచి క్రమంగా పెరుగుతూ వచ్చిన వరద సాయంత్రానికి 9.36 లక్షల క్యూసెక్కులకు చేరింది. బ్యారేజీలో 85 గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద 9 మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది. ములుగు జిల్లాలోని సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద 10,15,170 క్యూసెక్కుల వరద నమోదైంది.

ఆల్మట్టి, నారాయణపూర్‌కు భారీగా వరద

కృష్ణా బేసిన్‌లో ఎగువ నుంచి భారీ వరద వస్తుండడంతో ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టులు పూర్తిగా నిండిపోయాయి. జూరాల ప్రాజెక్టుకు 1,69,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు అవుతుండగా... 37 గేట్లను ఎత్తి 1,45,410, జల విద్యుత్ ఉత్పత్తి ద్వారా 29,307 క్యూసెక్కులు కలిపి మొత్తం 1,74,717క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. మరోవైపు తుంగభద్రకు 1.02 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు అవుతుండగా.. మూడు గేట్లు ఎత్తి 16వేల క్యూసెక్కులను వదులుతున్నారు. రెండూ కలిపి శ్రీశైలం జలాశయానికి 1.90లక్షల క్యూసెక్కులపైగా వరద వస్తోంది.

ఎలాంటి నష్టం జరగొద్దు: సీఎస్

రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సీఎస్ శాంతి కుమారి ఆదేశించారు. డీజీపీ జితేందర్‌తో కలిసి కలెక్టర్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. జిల్లాల్లో ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని జిల్లాల్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లు, పునరావాస కేంద్రాలనును ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కాగా, వరదల విపత్తును సమర్థంగా ఎదుర్కొంటామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ములుగు జిల్లాలోని ముంపు ప్రాంతాల్లో ఆమె పర్యటించారు.

పంటలకు నష్టం..

రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో సోమవారం మోస్తరు వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లాలో 9.7, భద్రాద్రి జిల్లాలోని పినపాక, దుమ్ముగూడెంలో 9.2, కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్‌లో 7.14, పెద్దపల్లి జిల్లాలోని ముత్తారంలో 7, నల్లగొండ జిల్లాలోని శాలిగౌరారంలో 4.9, మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో 4.34, సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో 3.4 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని అన్నారం, జనగామ, సూపాక, ఆల్గామ, సిర్సా గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పత్తి, ఇతర పంటలు నీట మునిగాయి. శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి డివిజన్లలోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్ పడింది. ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో పలు చోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. అందవెల్లి వంతెన అప్రోచ్ రోడ్డు కోతకు గురికాగా రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 15 మండలాల్లోని మూడు వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్టు తెలిసింది. వర్షాలతో కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ఏరియాల్లో 1.60లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. మంచిర్యాల జిల్లాలోని వేమనపల్లి మండలంలో లోలెవల్ కాజ్‌వే నీట మునగడంతో వైద్య సిబ్బంది నాటు పడవలో వెళ్లి జాజులపేటలో వైద్య శిబిరం నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మూసీ ప్రాజెక్టులోకి సోమవారం 3,180 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వపై ఇప్పటికే బుంగ పడగా, తాజాగా కాల్వ కట్ట కోతకు గురవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కాల్వ కట్ట కింద భాగంలో 20రోజుల కిందటే బుంగ పడింది. నీటి ప్రవాహం కొనసాగుతుండగానే కాల్వ కట్ట కోతకు గురవటంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. మెదక్ జిల్లాలోని సింగూరు ప్రాజెక్టులోకి 1270క్యూసెక్కుల వరద వస్తోంది.

తల్లీ, బిడ్డను వాగు దాటించిన పోలీసులు

మావోయిస్టుల వేటలో నిమగ్నమైన పోలీసు బలగాలు ఓ బాలింతకు సాయం చేసి మానవత్వం చాటుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా నంబి గ్రామానికి చెందిన మాధ్వి జాగి అనే మహిళ నెలలు నిండకుండానే ప్రసవించింది. దాంతో పుట్టిన బిడ్డకు అనారోగ్య సమస్య ఏర్పడింది. తల్లి, బిడ్డను వైద్యం కోసం పక్కనే ఉన్న ఊసూరుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా నంబి వాగును దాటలేకపోయారు. ఈ విషయం అక్కడ విధుల్లో ఉన్న బలగాలకు తెలియడంతో.. రెండు డ్రమ్ములపై తడిక వేసి, దానిపై బాలింతను, బిడ్డను కూర్చోబెట్టి వాగు దాటించారు. చికిత్స అనంతరం తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నట్టు తెలిసింది. కాగా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలోని అర్లపెంటకు చెందిన రవ్వా దేవా అనారోగ్యంతో ఇటంపాడులో మరణించగా.. అతడి కుటుంబ సభ్యులు జడ్డీపై మృతదేహాన్ని ఉంచి 20కిలోమీటర్ల మేర మోసుకెళ్లారు.

హెలికాప్టర్‌లో కూంబింగ్ బలగాల తరలింపు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఎలిమిడి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 19న ఎన్‌కౌంటర్ జరగ్గా, తిరిగి వచ్చే క్రమంలో వాగులు దాటలేక దండకారణ్యంలో చిక్కుకుపోయిన ఇందులో 130 మంది పోలీసులును ప్రత్యేక హెలికాప్టర్‌లో తరలించారు. వారం రోజులుగా దండకారణ్యంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కూంబింగ్‌కు వెళ్లిన పోలీసుల కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఎనిమిది రోజుల క్రితం వంద మంది కూంబింగ్‌కు వెళ్లగా వారికి ఆహారం, మందులను అందించేందుకు మూడు రోజుల క్రితం మరో 30 మంది పోలీసులు వెళ్లారు. మొత్తం 130 మంది పోలీసులను పెనుగోలు గుట్టల నుంచి వాజేడు మండలంలోని మండపాకకు తరలించారు. కొందరు నడవలేని స్థితిలో ఉండటంతో హెలికాప్టర్ నుంచి బస్సు వరకు మోసుకుంటూ తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం నిమిత్తం వారిని వరంగల్‌కు తీసుకెళ్లారని సమాచారం.



మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం సంపుటం గ్రామానికి నాటు పడవలో వెళ్తున్న వైద్య సిబ్బంది



జూరాల గేట్ల ద్వారా విడుదల అవుతున్న వరద

(టీఎంసీలు) (క్యూసెక్కులు)

ప్రాజెక్టు	పూర్తిస్థాయి సామర్థ్యం	ప్రస్తుత సామర్థ్యం	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
ఆల్మట్టి	129.72	97.23	1,15,406	1,44,295
నారాయణపూర్	37.64	32.14	1,45,000	1,44,250
తుంగభద్ర	100.86	87.42	1,02,000	16,000
జూరాల	9.66	7.65	1,69,000	1,74,717
శ్రీశైలం	215.81	52.15	1,90,717	0
నాగార్జునసాగర్	215	122.68	0	9,378
సింగూరు	29.91	13.70	1270	391
శ్రీరాంసాగర్	80.5	21.37	20,023	518
కడెం	7.6	5.52	6,224	3,316
ఎల్లంపల్లి	20.18	10.56	24,433	331
అన్నారం	10.87	0.08	17200	17,200
మేడిగడ్డ	16.17	2.15	9,54,310	9,54,310
సమ్మక్క	6.94	3.81	10,15,170	10,15,170
సీతమ్మ	36.57	0.2	11,86,801	11,86,801

స్పోర్ట్స్

ఏ సిరీస్ ఆడాలనేది..
ఇకపై ఆటగాళ్ల ఇష్టం కాదు

మీడియాతో కోచ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అగార్కర్

- ఫిట్‌గా ఉంటే అన్నీ ఆడాల్సిందే!
- ఫిట్‌నెస్సే హార్దిక్ సమస్య
- అందుకే సూర్యకు సారథ్యం

ముంబై: భారత జట్టు ఎంపిక, భవిష్య ప్రణాళికలపై కొత్త కోచ్ గౌతమ్ గంభీర్, సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ ఏకాభిప్రాయంతో ఉన్నారు. కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన గంభీర్ టీమిండియాతో ప్రయాణం శ్రీలంకతో పరిమిత ఓవర్ల సిరీస్‌తో ప్రారంభం కానుంది. ఈనెల 27న మొదలయ్యే ఈ టూర్‌ను పురస్కరించుకొని గంభీర్, అగార్కర్ సోమవారం మీడియాతో సుదీర్ఘంగా ముచ్చటించారు. శ్రీలంకతో సిరీస్‌కు జట్టు ఎంపికపై వారు వివరణ ఇచ్చారు. ఇకనుంచి ఆటగాళ్లు తమ ఇష్టమొచ్చినట్టు ఫలానా సిరీస్‌లో తాను ఆడబోనని చెప్పడం కుదరదని తేల్చిచెప్పారు. బ్యాటర్లు, బౌలర్లకు వర్క్‌లోడ్ విభిన్నంగా ఉంటుందని వారు తెలిపారు. 'బుమ్రాలాంటి బౌలర్ విషయంలో వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ అత్యంత కీలకం. అందువల్ల కొన్ని సిరీస్‌లకు అతడికి విశ్రాంతి ఇస్తాం. ఒకవేళ బ్యాటర్ ఎవరైనా మంచి ఫామ్‌లో ఉంటే మాత్రం అతడు అన్ని మ్యాచ్‌లూ ఆడాల్సిందే' అని గంభీర్ తేల్చి చెప్పాడు. 'రోహిత్, విరాట్ ఇకపై రెండు ఫార్మాట్లే ఆడనున్నారు. అందువల్ల వారిద్దరూ సాధ్యమైనన్ని ఎక్కువ మ్యాచ్‌ల్లో బరిలోకి దిగుతారు' అని వివరించాడు. ఫిట్‌నెస్ సహకరిస్తే వారిద్దరూ 2027 వన్డే వరల్డ్ కప్‌లోనూ ఆడతారన్నాడు.

హార్దిక్‌కు ఫిట్‌నెస్ సమస్యలు..: శ్రీలంకతో సిరీస్‌కు హార్దిక్ పాండ్యాను కాకుండా సూర్యకుమార్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేయడంపై వివరణ ఇచ్చారు. దీనిపై గంభీర్ మాట్లాడుతూ.. 'కెప్టెన్ అంటే అన్ని మ్యాచ్‌ల్లోనూ ఆడాలి' అని వ్యాఖ్యానించాడు. ఫిట్‌నెస్ సమస్యలతో గతంలో హార్దిక్ కొన్ని మ్యాచ్‌లకు దూరమైన సంగతి తెలిసిందే. ఇక కేఎల్ రాహుల్ అద్భుత వన్డే ఆటగాడని అగార్కర్ చెప్పాడు. అందుకే శాంసన్ బదులు శ్రీలంక టూర్‌కు రాహుల్‌కు చోటు కల్పించామన్నాడు. 'రాబోయే రోజుల్లో పెద్ద సంఖ్యలో టెస్టులు ఆడాల్సి ఉన్నది. వాటిల్లో రాహుల్, పంత్ కీలకం. అందువల్ల లంక టూర్‌కు రెండో కీపర్‌గా పంత్‌ను తీసుకున్నాం' అని అగార్కర్ వివరించాడు.

జడేజాను తప్పించలేదు..: ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాను వన్డే జట్టునుంచి తప్పించలేదని, అతనికి విశ్రాంతినిచ్చామని అగార్కర్ తెలిపాడు. శ్రీలంకతో చిన్నపాటి సిరీస్‌కు వన్డే జట్టులో ఇద్దరు ఆల్‌రౌండర్లు ఉండడం అర్థంలేనిదన్నాడు. 'వచ్చే సెప్టెంబరు 19 నుంచి టీమిండియా 10 టెస్టులు ఆడాల్సి ఉంది. జడేజా మాకు ముఖ్యమైన ఆటగాడు. అందుకే అతడికి విశ్రాంతినిచ్చాం' అని గంభీర్ చెప్పాడు. టెస్ట్ సిరీస్ నాటికి పేసర్ షమి జట్టులోకి వచ్చే అవకాశముందన్నాడు.



శ్రీలంక చేరిన గంభీర్ బృందం

కోహ్లీతో బంధంపై..

గంభీర్‌కు, విరాట్ కోహ్లీకి మధ్య సన్నిహిత సంబంధాలు లేవన్నది తెలిసిందే. గత ఐపీఎల్‌లో వారిద్దరి మధ్య గొడవ ఆ విషయాన్ని మరింత బలపరిచింది. కానీ కోహ్లీతో సంబంధంపై గౌతీ తనదైన రీతిలో బదులిచ్చాడు. 'టీఆర్‌పీని పెంచడం కోసం కోహ్లీతో నా సంబంధం ఉండదు. అయినా మా ఇద్దరి మధ్య సంబంధం ప్రజలకోసం కాదు. మా ఇద్దరి మధ్య బంధం ఇద్దరు పరిణతి చెందిన వ్యక్తుల మధ్య సంబంధంలాంటిది' అని చెప్పాడు.

సహాయకులు నాయర్, డష్కాటే

ఆల్‌రౌండర్లు అభిషేక్ నాయర్, ర్యాన్ డష్కాటే సహాయ కోచ్‌లగా నియమితులయ్యారని గంభీర్ ధ్రువీకరించాడు. వారిద్దరితో తాను చాలాకాలంగా కలిసి పనిచేస్తున్నానని గుర్తు చేశాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ మెంటార్‌గా గంభీర్..నాయర్, డెష్కాటేతో కలిసి పని చేశాడు.

అ.. అమ్మ ఆ.. ఆట

ఒలింపిక్స్‌లో అథ్లెట్ల డబుల్ రోల్







ఓవైపు తమ చిన్నారుల ఆలనాపాలన చూసుకుంటూనే.. మరోవైపు ప్రపంచ స్థాయి అథ్లెట్లకు పోటీ ఇచ్చేందుకు ఈసారి ఒలింపిక్స్‌లో కొందరు మాతృమూర్తులు సిద్ధమవుతున్నారు. ఈ రెండు బాధ్యతలను సమతుల్యం చేసుకుంటూనే పతకం కోసం ముందుకు సాగాలనుకుంటున్నారు. అలాగే తమ పిల్లలతో గేమ్స్‌కు తరలివచ్చిన అథ్లెట్ల కోసం నిర్వాహకులు కూడా పలు ఏర్పాట్లు చేశారు. కరోనా కారణంగా టోక్యో ఒలింపిక్స్‌లో మాత్రం తమ పిల్లలతో వచ్చేందుకు అథ్లెట్లను అనుమతించలేదు. కానీ ఈసారి అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ, పారిస్ గేమ్స్ అధికారులు తొలిసారిగా ఒలింపిక్ విలేజ్‌లో ప్రత్యేకంగా నర్సరీ విభాగాన్ని ఏర్పాటు చేశారు. గేమ్స్ సందర్భంగా ఇందులో పిల్లలలో కలిసి తల్లులు లేదా తండ్రులు విలువైన సమయాన్ని గడపవచ్చు. మరోవైపు ఈ ఏర్పాట్లను అమెరికన్ మాజీ అథ్లెట్ అలిసన్ ఫెలిక్స్ సమర్థించింది. అమ్మతనాన్ని అనుభవిస్తూనే ఆటలోనూ ఉత్తమ స్థాయికి చేరుకునేందుకు ఇలాంటి నిర్ణయాలు దోహదపడతాయని తెలిపింది. గర్భం దాల్చడంతో పాటు తల్లిగా మారిన వెంటనే ఓ అథ్లెట్ క్రీడా జీవితం ముగిసినట్టు కాదనే భావనలో ఐఓసీ ఉంది. మరోవైపు పిల్లలతో కలిసి గేమ్స్‌కు వచ్చేందుకు తగిన ఆర్థిక సహాయం కోసం ఈ అథ్లెట్లు గోఫండ్‌మి లాంటి ఫండ్ రైజింగ్ సంస్థలను ఆశ్రయిస్తున్నారు. వారు విరాళాల ద్వారా నిధులను సమీకరించి వీరికి అందజేస్తుంటారు. బ్రిటిష్ రోయర్ హాడ్గిన్స్, డచ్ టీటీ ప్లేయర్ బ్రిట్ ఎర్లాండ్ తమ పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి ఈ నిధులతోనే గేమ్స్‌కు వెళ్లనున్నారు. ఇక చివరి ఒలింపిక్స్‌లో రోయింగ్ డబుల్స్ రజత పతక విజేతలు ఫ్రాన్సిస్, స్వూర్స్ గతేడాది తమ పిల్లలకు జన్మనిచ్చారు. అయినా అటు అమ్మతనానికి లోటు లేకుండా ఈసారి కూడా పతకాలను సాధించాలనే పట్టుదలతో ఉండడం అభినందనీయం.

చమరి చరిత్ర

ఆసియా కప్‌లో తొలి సెంచరీ

మలేసియాపై శ్రీలంక గెలుపు



దంబుల్లా: శ్రీలంక కెప్టెన్ చమరి అటపట్టు (69 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్సర్లతో 119 నాటౌట్) చరిత్ర సృష్టించింది. మహిళల ఆసియా కప్ టోర్నీలో శతక్కొట్టిన తొలి క్రికెటర్‌గా చమరి రికార్డు సృష్టించిన వేళ..సోమవారం జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్ శ్రీలంక 144 పరుగులతో మలేసియాను చిత్తు చేసింది. తొలుత శ్రీలంక 20 ఓవర్లలో 184/4 స్కోరు చేసింది. ఛేదనలో మలేసియా 19.5 ఓవర్లలో 40 పరుగులకే కుప్పకూలింది. గ్రూప్ 'బి' మరో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఏడు వికెట్లతో థాయ్‌లాండ్‌ని ఓడించింది. మొదట థాయ్‌లాండ్ 20 ఓవర్లలో 96/9 స్కోరు చేసింది. అనంతరం బంగ్లాదేశ్ 17.3 ఓవర్లలో 100/3 స్కోరు చేసి గెలిచింది.

నేపాల్‌తో భారత్ పోరు నేడు

రాత్రి 7నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..

వచ్చాడు.. ఏడు తీశాడు

స్కాట్లాండ్ పేసర్ కాసెల్ వరల్డ్ రికార్డు



డూండీ: స్కాట్లాండ్ పేసర్ చార్లీ కాసెల్ తన తొలి వన్డేలోనే చరిత్ర సృష్టించాడు. ఐసీసీ క్రికెట్ వరల్డ్‌కప్ లీగ్ 2లో భాగంగా ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో చార్లీ ఏడు వికెట్లతో చెలరేగాడు. దీంతో కెరీర్ తొలి వన్డేలోనే ఎక్కువ వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఇప్పటిదాకా దక్షిణాఫ్రికా పేసర్ రబాడ (2015లో బంగ్లాపై 6 వికెట్లు) పేరిట ఈ ఫీట్ కొనసాగింది. అంతేకాదు.. తన తొలి ఓవర్ మొదటి రెండు బంతుల్లోనే వికెట్లు తీశాడు. ఈ ఘనత కూడా గతంలో ఎవరికీ దక్కలేదు.

ఒలింపిక్స్‌పై ప్రత్యేక పాట



కోజికోడ్: ప్రపంచం మొత్తం ఒలింపిక్స్ హంగామా నెలకొన్న నేపథ్యంలో ఇక్కడి మలబార్ క్రిస్టియన్ కాలేజీకి చెందిన ఓ ప్రొఫెసర్, విద్యార్థిని కలిసి విశ్వక్రీడలపై ప్రత్యేక పాటను రూపొందించారు. ఈ కళాశాలకు చెందిన చరిత్ర మాజీ విభాగాధిపతి వశిష్ఠ్.. ఈ ఇంగ్లిష్ పాటకు సాహిత్యం అందించగా, విద్యార్థిని ఫాతిమా స్వరపర్చింది. ప్రపంచ శాంతి కోసం ఒలింపిక్స్ అనే థీమ్‌తో ఈ పాటను రూపొందించారు.

పారిస్ ఒలింపిక్స్ 3 రోజుల్లో

టెన్నిస్ త్రయం.. తెచ్చేనా పతకం?



ఒలింపిక్స్‌లో ఈసారి భారత్‌కు పతకం లభించే క్రీడాంశంలో టెన్నిస్ కూడా ఉందనడంలో సందేహం లేదు. పురుషుల డబుల్స్‌లో 44 ఏళ్ల రోహన్ బోపన్నకు జతగా శ్రీరామ్ బాలాజీ ఆడనుండగా.. సింగిల్స్‌లో సుమిత్ నగాల్ పారిస్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాడు. మొత్తంగా ఈ ముగ్గురి ప్రదర్శనపైనే టెన్నిస్ మెడల్ ఆధారపడి ఉంది. డబుల్స్ ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానంలో ఉన్న రోహన్ బోపన్నకు నేరుగానే ఒలింపిక్ బెర్త్ దక్కింది. అలాగే టాప్-10లో ఉన్న ప్లేయర్స్‌కు తమ భాగస్వామిని ఎంచుకునే అవకాశం ఉం టుంది. దీంతో తను 54వ ర్యాంకర్ యుకీ భాంబ్రిని కాకుండా 67వ ర్యాంకులో ఉన్న బాలాజీని పార్ట్‌నర్‌గా ఎంచుకోవడం ఆశ్చర్యపరిచింది. అయితే క్లే కోర్టులో బాలాజీకి మెరుగైన రికార్డు ఉండడమే దీనికి కారణంగా చెప్పవచ్చు. ఏప్రిల్‌లో ఇటలీలో చాలెంజర్ టోర్నీ డబుల్స్ టైటిల్‌ను, గత నెలలో పెరుగియా చాలెంజర్‌లో రన్నరప్‌గానూ నిలిచాడు. శక్తివంతమైన సర్వీస్‌లతో పాటు బ్యాక్‌హ్యాండ్ షాట్లతో ప్రత్యర్థికి సవాలు విసరగలడు. అందుకే తనకు సరైన జోడీగా బోపన్న భావించడంతో కెరీర్‌లో తొలిసారి బాలాజీకి ఒలింపిక్స్‌లో ఆడే అవకాశం దక్కబోతోంది. ఏదిఏమైనా ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచిన జోష్‌లో ఉన్న బోపన్న తన భాగస్వామి సహకారంతో దేశానికి పతకం అందించగలడన్న నమ్మకం అభిమానుల్లో ఏర్పడింది.

నగాల్ వరుసగా రెండోసారి..

సింగిల్స్ విభాగంలో దిగ్గజ ఆటగాడు లియాండర్ పేస్ వరుసగా రెండు ఒలింపిక్స్ (1996, 2000)లో ఆడగా.. ఆ తర్వాత సుమిత్ నగాల్ కూడా అదే ఫీట్‌ను నమోదు చేయబోతున్నాడు. ర్యాంకింగ్స్ కటాఫ్ తేదీ జూన్ 10 వరకు నగాల్ 77వ ర్యాంకులో కొనసాగడంతో అతడికి ఈ సువర్ణావకాశం దక్కింది. టోక్యో గేమ్స్‌లోనూ పాల్గొన్న నగాల్ తొలి రౌండ్‌ను దాటగలిగాడు. అయితే 1996 గేమ్స్‌లో పేస్ కాంస్యంతో చరిత్ర సృష్టించాడు. అలాంటి అద్భుత ప్రదర్శనను నగాల్ నుంచి ఆశించగలమా? అంటే సందేహమే. క్లే కోర్టులో తను మెరుగ్గానే ఆడగలిగినా.. నడాల్, అల్కారజ్, జొకోవిచ్‌లాంటి స్టార్లను దాటుకుని పతకం సాధించడమంటే దాదాపు అసాధ్యంగానే చెప్పవచ్చు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఒలింపిక్స్ తర్వాత శ్రీజేష్ వీడ్కోలు

న్యూఢిల్లీ: భారత హాకీ జట్టు వెటరన్ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్‌కు ఈ ఒలింపిక్సే కెరీర్‌లో చివరిది కానుంది. పారిస్ క్రీడల తర్వాత హాకీకి గుడ్‌బై చెబుతున్నట్టు శ్రీజేష్ సోమవారం సోషల్ మీడియా ద్వారా ప్రకటించాడు. 18ఏళ్ల తన సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలకనున్నట్టు అందులో పోస్ట్ చేశాడు. శ్రీజేష్ నాలుగోసారి ఒలింపిక్స్‌లో ఆడుతున్నాడు. చాలాసార్లు భారత జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించిన శ్రీజేష్.. ఇప్పటిదాకా 328 అంతర్జాతీయ మ్యాచ్‌లాడాడు. పలు వరల్డ్‌కప్‌ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

రిజిస్ట్రేషన్‌శాఖలో 147 మంది సీనియర్ అసిస్టెంట్ల బదిలీ

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్, స్టాంప్‌లశాఖలో ఒకే చోట కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న 147 మంది సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేస్తూ రిజిస్ట్రేషన్, స్టాంప్‌ల కమిషనర్ అండ్ ఐజీ జ్యోతి బుద్ధప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. జోన్-2 పరిధిలో 19మందిని, జోన్-3 పరిధిలో 12మందిని, జోన్-4లో 26మందిని, జోన్-5లో 13మందిని, జోన్-6లో 67మందిని, జోన్-7 పరిధిలో 5గురిని బదిలీ చేస్తూ ఆయన ఉత్తర్వులు జారీ చేశారు.

పద్మశ్రీ గ్రహీతలకు రూ.25వేల పింఛన్: జూపల్లి

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవలే పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న గడ్డం సమ్మయ్య, దాసరి కొండప్పకు ప్రతి నెలా రూ.25 వేల ప్రత్యేక పింఛన్‌ను అందజేయనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. పద్మ విభూషన్, పద్మశ్రీ పురస్కార విజేతల సన్మాన కార్యక్రమంలో పద్మశ్రీ గ్రహీతలకు రూ.25 వేల పింఛన్ ఇస్తామని సీఎం రేవంత్ ప్రకటించారని, అందులో భాగంగా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉత్తర్వులు జారీ చేశామని ఆయన చెప్పారు.

5 నుంచి లాసెట్ కౌన్సెలింగ్

లాసెట్ కౌన్సెలింగ్‌ను ఆగస్టు 5 నుంచి చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 24న విడుదల చేయనున్నారు. రాష్ట్రంలోని లా సీట్ల భర్తీకి సంబంధించి అడ్మిషన్ల కమిటీ సోమవారం ప్రత్యేకంగా సమావేశమై చర్చించింది. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశం అనంతరం లాసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 24న నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. తర్వాత ఆగస్టు 5 నుంచి 20 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌ను, ఆగస్టు 22, 23వ తేదీల్లో వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఆగస్టు 27వ తేదీన సీట్లను కేటాయించనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు 28 నుంచి 30వ తేదీలోపు ఆయా కాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

ఎమ్మార్పీఎస్ నేతను నిర్బంధించిన ఫాంహౌస్ కూల్చివేత

శంషాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎమ్మార్పీఎస్ నాయకుడు నరేందర్‌ను నిర్బంధించిన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ధర్మగిరిగుట్టలోని ఫాంహౌస్‌ను పోలీసుల సూచనలతో సోమవారం మునిసిపల్ సిబ్బంది కూల్చివేశారు. రాజేంద్రనగర్ మునిసిపాలిటీ నార్సింగి బృందావన్ కాలనీలోని ఓ భూ వివాదానికి సంబంధించి రౌడీషీటర్లు ఎమ్మార్పీఎస్ నేత నరేందర్‌ను కిడ్నాప్ చేసి శంషాబాద్ ధర్మగిరిగుట్టలో వారి ఫాంహౌస్‌లో నిర్బంధించి అతడిపైకి కుక్కలను వదిలి భయభ్రాంతులకు గురిచేయగా.. పోలీసులు దర్యాప్తు చేసి నరేందర్‌ను సురక్షితంగా ఇంటికి చేర్చిన విషయం తెలిసిందే. నార్సింగిలోని బృందావన్ కాలనీకి చెందిన నిందితులు అహ్మద్ ఖాన్, షేక్ హమ్దాస్, జాఫర్, మసూద్, మరికొందరు కలిసి అక్షయ్ సక్సేనా, అతడి సోదరులకు చెందిన 200 గజాల భూమిని పదేళ్ల క్రితం ఆక్రమించి ఈ ఫాంహౌస్‌ను కట్టినట్టు దర్యాప్తులో తేలింది. పోలీసుల సూచనలతో శంషాబాద్ మునిసిపల్ కమిషనర్ భూ రికార్డులు పరిశీలించగా అనుమతులు లేకుండా ఫాంహౌస్ నిర్మించినట్టు నిర్ధారితమైంది. దీంతో మూడు జేసీబీలతో ఫాంహౌస్‌ను కూల్చివేశారు.

సివిల్స్ అభ్యర్థులకు సింగరేణి సాయం

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించి మెయిన్స్‌కు అర్హత పొందిన తెలంగాణ అభ్యర్థులకు సింగరేణి సంస్థ రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల వారికి రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం పేరుతో సాయం అందిస్తామని సింగరేణి సోమవారం ప్రకటించింది. పూర్తి వివరాలకు సింగరేణి వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరింది.

పాపాలకు 'నిప్పు'?

మదనపల్లి సబ్ కలెక్టర్ ఆఫీసు దహనం

- 25 విభాగాల్లోని ఫైళ్లు బూడిద
- అందరి చూపు మాజీ మంత్రి పెద్దిరెడ్డి పైనే

రాయచోటి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం మంటల్లో తగలబడింది. అందుకు కరెంటు షార్ట్ సర్క్యూట్ కారణం కాదని ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. ఇక.. అసలు 'కుట్ర' ఏమిటో బయటపడాల్సి ఉంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధించిన భూముల వ్యవహారాలతో ముడిపడిన ఫైళ్లు అక్కడే ఉండటం... అత్యంత కీలకమైన నిషేధిత భూముల జాబితా సెక్షన్‌లోనే అగ్గి రాజుకోవడంతో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ సంఘటనను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ సోమవారం మధ్యాహ్నం సంఘటనా స్థలాన్ని సందర్శించారు. సుమారు మూడు గంటల పాటు సంఘటనా స్థలాన్ని పరిశీలించి.. ఇది ప్రమాదం కాదు.. ఉద్దేశ్యపూర్వకంగా జరిగిన సంఘటనగా తేల్చారు. పోలీసులు, ఇతర వర్గాల సమాచారం ప్రకారం... ఆదివారం రాత్రి 11.15 గంటల సమయంలో మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిప్పు రాజుకుంది. అక్కడ కాపలాగా ఉన్న నిమ్మనపల్లె అగ్రహారం వీఆర్ఏ రమణయ్య ఈ విషయాన్ని తొలుత గుర్తించారు. వెంటనే మండల డిప్యూటీ తహసీల్దార్ (డీటీ)కు ఫోన్‌లో ఈ సమాచారం అందించారు. డీటీ ఈ విషయాన్ని ఆర్డీవో క్యాంప్ క్లర్కుకు ఫోన్‌లో తెలియజేశారు. ఆ తర్వాత 11.22 సమయంలో ఫోన్ ద్వారా సీసీ, డీటీలు కలిసి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయానికి పక్కనే ఉన్న ఫైర్ స్టేషన్ నుంచి 11.44 గంటల సమయంలో ఫైరింజన్లు వచ్చాయి. సుమారు గంట పాటు కష్టపడి మంటలను అదుపులోకి తెచ్చాయి. ఈలోపే... 25 విభాగాలలో ఫైళ్లు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఆర్డీవో చాంబర్, ఏవో చాంబర్‌లకు ఎటువంటి నష్టం వాటిల్లలేదు. సమాచారం అందుకున్న ఆర్డీవో హరిప్రసాద్, వన్‌టౌన్ సీఐ వలిబషులు సంఘటనా స్థలానికి వచ్చారు. కానీ... వీరెవరూ సంఘటన గురించి తమ పైఅధికారులకు తెలియచేయలేదు. కలెక్టర్‌కుగానీ, ఎస్పీకిగానీ చెప్పలేదు. పైగా... ఆర్డీవో మీడియాతో అర్ధరాత్రి మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని చెప్పారు. దీంతో అందరూ దీనిని 'ప్రమాదం'గానే భావించారు. కానీ... మెల్లమెల్లగా అనేక అనుమానాలు ముసురుకున్నాయి. సబ్ కలెక్టర్ ఆఫీసులో 22ఏ (నిషేధిత భూముల జాబితా) విభాగంలోనే మంటలు మొదలు కావడం గమనార్హం. ఆదివారం సెలవు. అయినప్పటికీ... సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్, మరికొందరు రాత్రి 11 గంటల వరకు అక్కడే ఉన్నారు. గతంలో ఇక్కడ మురళి అనే అధికారి ఆర్డీవోగా పని చేశారు. అప్పట్లో మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి చెప్పినట్లల్లా నడుచుకున్నారు. డీకేటీ భూముల డాక్యుమెంట్లను అక్రమంగా మార్చేసినట్లు అనుమానాలున్నాయి. అంతకుముందు ప్రకాశం జిల్లాలో జరిగిన అవకతవకల నేపథ్యంలో... ఎన్నికల ముందు ప్రభుత్వం ఆయనకు ఎమ్మార్వోగా రివర్షన్ ఇచ్చింది. మదనపల్లి ఆర్డీవోగా హరిప్రసాద్ అనే అధికారిని నియమించింది. అన్నింటికంటే ముఖ్యంగా... తాజాగా ప్రభుత్వం ఐఏఎస్ అధికారి శ్యాంస్వరూప్‌ను మదనపల్లి సబ్‌కలెక్టర్‌గా నియమించింది. ఆయన ఇంకా బాధ్యతలు స్వీకరించలేదు. ఐఏఎస్ అధికారి సబ్‌కలెక్టర్‌గా వస్తే... పాత పాపాలన్నీ తవ్వే అవకాశముందని, దొరికిపోతామని 'పాత అధికారులు' బెంబేలెత్తినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే... వ్యూహాత్మకంగానే సబ్ కలెక్టర్ ఆఫీసులో మంటలు పుట్టించారనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

ఈ ఫైళ్ల కోసమేనా?

పుంగనూరు మండల పరిధిలో 900 ఎకరాలకు పైగా భూములను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అప్పట్లో కట్టబెట్టారు. ప్రస్తుత ప్రభుత్వం ఇటీవలే వీటిని రద్దు చేసింది. ఈ ఫైళ్లు ఇంకా మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలోనే ఉన్నట్లు సమాచారం. అదే విధంగా పెద్దతిప్పసముద్రం మండలంలోని కర్ణాటక రాష్ట్రానికి చెందిన మఠం భూములు 500 ఎకరాలకు పైగా ఉన్నాయి. వీటిని కూడా పెద్దిరెడ్డి అనుచరులు, బినామీలు ఆక్రమించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మదనపల్లి రింగురోడ్డు బండమీదికమ్మపల్లె పరిధిలోని సర్వే నెంబరు 552లో సుమారు రూ.20 కోట్ల విలువ చేసే 2.5 ఎకరాల భూమి పెద్దిరెడ్డి భార్య స్వర్ణలత పేరు మీద రిజిస్టర్ అయింది. ఈ భూమి ఎన్‌వోసీ విషయంలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి.

త్వరలో రెండో విడత రుణమాఫీ: తుమ్మల



హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి):రెండో విడత రుణమాఫీని సాధ్యమైనంత త్వరలో అమలుచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రుణమాఫీ-2024లో మొదటి విడతగా లక్ష రూపాయలలోపు రుణాలకు సంబంధించి 11.50 లక్షల కుటుంబాలకు రూ. 6,098.94 కోట్లు విడుదల చేశామని తెలిపారు. వీటిలో ఆర్‌బీఐ నుంచి అందిన సమాచారం మేరకు 11.32 లక్షల కుటుంబాలకు రూ. 6,014 కోట్లు ఖాతాల్లో జమ అయినట్లు తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాలతో... 17,877 ఖాతాలకు చెందిన రూ. 84.94 కోట్లు జమ కాలేదని తెలిపారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించి, ఆర్‌బీఐ నుంచి ఆ నిధులు వెనక్కి రాగానే తిరిగి రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తుమ్మల వెల్లడించారు. వాణిజ్య బ్యాంకులకు అనుసంధానం చేసిన సీడెడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సంబంధించిన 15,781 రుణ ఖాతాలకు సంబంధించిన తనిఖీ పూర్తయ్యిందని, ఆ ఖాతాలకు కూడా రుణమాఫీ నిధులు విడుదల చేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో మరో మూడు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించినట్లు ఆయన తెలిపారు.

ఆర్థిక సర్వేలో సిద్దిపేట స్టీల్ బ్యాంకుకు గుర్తింపు

- ప్లాస్టిక్ రహిత ఆలోచన గొప్పదని ప్రశంస

సిద్దిపేట టౌన్, జూలై 22 : సిద్దిపేటను ప్లాస్టిక్ రహితంగా మార్చాలన్న ఉద్దేశంతో అమలు చేస్తున్న సిద్దిపేట స్టీల్ బ్యాంకు కార్యక్రమానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. సోమవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే ఈ కార్యక్రమాన్ని ప్రశంసించింది. స్టీల్ బ్యాంకు ఆలోచనతో ప్లాస్టిక్ ఉపయోగం వల్ల వచ్చే నష్టాల గురించి ప్రజలు తెలుసుకున్నారని సర్వే పేర్కొంది. నెలకు దాదాపు 28 క్వింటాళ్ల ప్లాస్టిక్ వినియోగం కాకుండా నివారించగలిగారని తెలిపింది. సిద్దిపేట స్టీల్ బ్యాంక్ స్ఫూర్తిని దేశమంతా అమలు చేస్తామని పేర్కొంది. కాగా, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లను వివిధ రంగాల్లో విస్తరించి ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేయడంలో తెలంగాణ పాత్రను కూడా సర్వే ప్రశంసించింది. భారత ఫార్మాసూటికల్ ఉత్పత్తిలో 30 శాతం మేర తెలంగాణలోనే జరుగుతోందని, అక్కడ వెయ్యి లైఫ్ సైన్సెస్ కంపెనీలు.. వినూత్నమైన, జనరిక్ మందుల తయారీ కోసం 200 ఎఫ్‌డీఏ ఆమోదించిన కేంద్రాలు ఉన్నాయని తెలిపింది. 2020లో ఫిబ్రవరిలో మాజీ మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటలో స్టీల్ బ్యాంకులకు శ్రీకారం చుట్టారు. ఫంక్షన్లలో ప్లాస్టిక్ గ్లాస్‌లు, ప్లేట్లు వంటి వస్తువులు వినియోగించకుండా మునిసిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో స్టీల్ బ్యాంక్‌లను ఏర్పాటు చేశారు. దీంతో ఫంక్షన్లలో ప్లాస్టిక్ వినియోగం తగ్గింది. కాగా, ఆర్థిక సర్వేలో సిద్దిపేట స్టీల్ బ్యాంక్‌ను ప్రశంసించడంపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేస్తూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. సిద్దిపేటను మరోసారి జాతీయ స్థాయిలో నిలిపిన ప్రజలు, అధికారులకు అభినందనలు తెలిపారు

నిధులివ్వండి..

(మొదటిపేజీ తరువాయి)



కేంద్రమంత్రి హరిదీప్‌సింగ్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్

గోదావరి జలాలతో నింపేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టులకు రూ.6వేల కోట్లు కేటాయించాలని అభ్యర్థించారు. తెలంగాణలో 7.85లక్షల ఇళ్లకు నల్లా కనెక్షన్ లేదని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీటితో పాటు పీఎంఏవై కింద నిర్మించనున్న ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇచ్చేందుకు రూ.16,100 కోట్లు అవసరమవుతాయని, జల్‌జీవన్ మిషన్ కింద నిధులు కేటాయించి విజ్ఞప్తి చేశారు. అలాగే, ధాన్యం సేకరణ, బియ్యం సరఫరాకు సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల మంత్రి ప్రహ్లాద్ జోషిని సీఎం రేవంత్ కోరారు. 2014-15 ఖరీఫ్‌లో అదనపు లెవీ సేకరణకు సంబంధించిన రూ.1468.94 కోట్ల రాయితీని పెండింగ్‌లో పెట్టారని, ఇందుకు సంబంధించిన పత్రాలన్నీ సమర్పించామని గుర్తుచేశారు. పీఎం గరీబ్ కల్యాణ్ యోజనకు సంబంధించి 2021 మే నుంచి 2022 మార్చి వరకు సరఫరా చేసిన 89,987టన్నుల బియ్యానికి సంబంధించిన రూ.343.27 కోట్లను విడుదల చేయాలని కోరారు. 2021 మే నుంచి 2022 మార్చి వరకు జాతీయ ఆహార భద్రతా చట్టం పరిధిలో కాకుండా పంపిణీ చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.79.09కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, పార్లమెంట్ హౌస్‌లోని కార్యాలయంలో కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రి హర్‌దీప్‌సింగ్ పురితో సీఎం భేటీ అయ్యారు. తెలంగాణలో రూ.500కే వంట గ్యాస్ సిలిండర్‌ను అందిస్తున్నామని గుర్తు చేస్తూ.. ఇందుకు సంబంధించిన సబ్సిడీని సంబంధిత కంపెనీలకు ముందుగానే చెల్లించే వెసులుబాటు కల్పించాలని కోరారు. తద్వారా లబ్ధిదారులకు నేరుగా రూ.500కే సిలిండర్ అందించే వీలు ఉంటుదన్నారు. అలా వీలుకానీ పక్షంలో తాము చెల్లించే సబ్సిడీని 48 గంటల్లోపు లబ్ధిదారులకు అందేలా చూడాలని కోరారు. కేంద్ర మంత్రులతో జరిగిన సమావేశాల్లో సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు అనిల్‌కుమార్, రఘురామిరెడ్డి, అధికారులు ఉన్నారు.

ఆర్ఆర్ఆర్ నిర్మాణాన్ని వేగవంతం చేయండి

కేంద్రానికి మంత్రి కోమటిరెడ్డి వినతి

రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలో ఆయన జాతీయ రహదారులు, రోడ్డు రవాణా శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని రహదారుల నిర్మాణంపై మంత్రి కూలంకషంగా చర్చించారు. నల్లగొండ బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించేందుకు స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ (ఎస్ఎఫ్‌సీ) మీటింగ్ ఏర్పాటు చేసి త్వరగా టెండర్లు పిలవాలని కోరారు. రాష్ట్రంలోని 16 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చే ప్రతిపాదనలపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని అభ్యర్థించారు. నల్లగొండ బైపాస్ నిర్మాణంపై వారంలో ఎస్ఎఫ్‌సీ ఏర్పాటు చేస్తామని అనురాగ్ జైన్ హామీ ఇచ్చినట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

రాహుల్, ప్రియాంక, ఖర్గేతో రేవంత్, మంత్రుల భేటీ

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు భేటీ అయ్యారు. ఈ సమావేశాల్లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కూడా ఉన్నారు. రుణమాఫీసహా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న తీరును రాహుల్, ప్రియాంకకు వివరించామని భట్టి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీలో రూ.10లక్షల వరకు చికిత్స, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత కరెంట్ తదితర హామీలను నెరవేర్చిన విషయాన్ని ప్రస్తావించినట్లు వెల్లడించారు. హామీలను నెరవేర్చిన నేపథ్యంలో జనంలోకి వెళ్లాలని నిర్ణయించామని, ఈ మేరకు తెలంగాణలో నిర్వహించే బహిరంగ సభకు రావాలని రాహుల్‌ను ఆహ్వానించినట్లు చెప్పారు. కాగా, రాష్ట్రంలో రాజకీయ పరిణామాలను వారికి వివరించామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తెలంగాణలో క్రీడలకు ఈసారి గతం లోకంటే మూడింతలు ఎక్కువగా బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని వినతిపత్రం ఇచ్చారు. అనంతరం సీఎం రేవంత్ రాత్రి పదిగంటలకు హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు.

వేతనాలు ఎన్నడో?

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగుల పరిస్థితి మరీ దయనీయంగా తయారైంది. వైద్య ఆరోగ్య శాఖలో సుమారు 30 వేల మందికి సకాలంలో వేతనాలు అందడం లేదు. జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో 17,514 మంది పనిచేస్తున్నారు. ఇందులో సెకండ్ ఏఎన్ఎమ్, ఎంఎల్‌హెచ్‌పీలు, స్టాఫ్ నర్స్ ల్యాబ్ టెక్నీషియన్లు, అకౌంటెంట్లు, డీఈవోలు ఉన్నారు. వీరికి నెల రోజుల వేతనాలు పెండింగ్ ఉన్నాయి. వైద్య విద్య సంచాలకులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో పనిచేసే సుమారు 15 వేల మందికి గత 2-3 నెలలుగా జీతాలు అందడం లేదు. ఇందులో స్టాఫ్ నర్సులు, టెక్నీషియన్లు, శానిటరీ, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు గత మూడు నెలల వేతనాలు, కూరగాయలు, గ్యాస్ ఖర్చులు, అంగన్‌వాడీ కేంద్రాల అద్దెలు ఇవ్వాల్సి ఉంది. ఒక్క అంగన్‌వాడీ టీచర్లకే సుమారు రూ.31 కోట్లు, ఆయాలకు రూ.14 కోట్లు బకాయిలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు చాలావరకు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. వాటికి గత పది నెలలుగా అద్దెలు చెల్లించడం లేదని, కోడిగుడ్ల బిల్లులు కూడా పెద్దమొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయని చెబుతున్నారు. జనవరి వరకే వాటి బిల్లులు చెల్లించారని, తర్వాత నుంచి పెండింగ్‌లో ఉన్నాయంటున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో వంటపని చేసేవారు, సహాయకులకు గత ఏడాది డిసెంబరు నుంచి వేతనాలు రావడం లేదని చెబుతున్నారు. మొత్తం 54 వేల మంది ఇబ్బందులు పడుతున్నారని అంటున్నారు. సర్వశిక్షా అభియాన్‌లో పనిచేసే వారికి మే-జూన్ నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. గురుకుల విద్యాలయాల్లో కూడా ప్రతి నెలా 15 తర్వాతే వేతనాలు ఇస్తున్నారని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది చెబుతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రభుత్వం గత రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేదని సమాచారం. రాష్ట్రంలోని 7,280 మందికి రెండు నెలల వేతనాలు రూ.15.29 కోట్లు బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, రాష్ట్రంలోని 12,761 గ్రామపంచాయతీల్లోని 29,676 మంది పారిశుద్ధ్య కార్మికులకు 5 నెలల వేతన బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం ఇటీవల రూ.150.57 కోట్లు విడుదల చేసింది.

అసెంబ్లీకి కేసీఆర్!

- ప్రతిపక్ష నేత హోదాలో తొలిసారి శాసనసభకు



హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకైనా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరవుతారా!? గత సమావేశాల తరహాలో దూరంగా ఉంటారా!? రాజకీయ వర్గాలను వేధిస్తున్న ప్రశ్న ఇది! అయితే, ప్రతిపక్ష నేత హోదాలో ఈసారి సమావేశాలకు కేసీఆర్ హాజరు కానున్నట్లు తెలుస్తోంది. గత పదేళ్లపాటు సభాధ్యక్షుడి హోదాలో హాజరైన కేసీఆర్.. ప్రతిపక్ష నేత హోదాలో హాజరు కావడం ఇదే తొలిసారి కానుంది. అంతేనా.. నిరుద్యోగుల సమస్యలు, ఆరు గ్యారెంటీలపై ప్రభుత్వాన్ని నిలదీయడానికి ఆయన సిద్ధమైనట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టుపై కూడా ఆయన స్పష్టత ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, సభ కొనసాగినన్ని రోజులు ఆయన వస్తారా..? కేవలం బడ్జెట్ ప్రవేశపెట్టే రోజు, మరికొన్ని రోజులు మాత్రమే పాల్గొంటారా? అన్న దానిపై స్పష్టత లేదు. కాగా.. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సభలో అధికార కాంగ్రెస్‌ను ప్రశ్నించేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. ప్రధానంగా రుణమాఫీకి ఆంక్షలు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, జాబ్ క్యాలెండర్ విడుదల, ఇటీవలి అరెస్టులు తదితరాలను ప్రస్తావించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో శాంతి భద్రతల వైఫల్యం, చేనేత కార్మికుల ఆత్మహత్యలు తదితరాలపై విమర్శలతోపాటు ఆరు గ్యారంటీల అమలుకు సభలో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేయనుంది. రైతు భరోసా చెల్లింపులో జాప్యం, పంటలకు మద్దతు ధర, బోనస్ చెల్లింపు, రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను సభ దృష్టికి తీసుకెళ్లనుంది. సమావేశాల్లో పార్టీ వైఖరి, సభలో ఏయే సమస్యలను లేవనెత్తాలన్న దానిపై మంగళవారం బీఆర్ఎస్ ఎల్పీ సమావేశం నిర్వహించనున్నారు.

బిల్లులే కీలకం!



(మొదటిపేజీ తరువాయి)

సంతాపం తెలపనుంది. చనిపోయేనాటికి ఆమె కంటోన్మెంట్ సిటింగ్ ఎమ్మెల్యే కావడంతో సంప్రదాయాన్ని అనుసరించి మంగళవారంనాటి సమావేశం సంతాప తీర్మానానికే పరిమితమవుతుంది. అది ఆమోదం పొందిన వెంటనే స్పీకర్ ప్రసాద్‌కుమార్ సభను బుధవారానికి వాయిదా వేస్తారు. అనంతరం ఆయన నేతృత్వంలో శాసనసభ వ్యవహారాల కమిటీ (బీఏసీ) సమావేశం జరగనుంది. సభను ఎన్ని రోజులు నిర్వహించాలి? ఏయే అంశాలపై చర్చించాలి!? తదితర అంశాలపై ఇందులో నిర్ణయాలు తీసుకోనున్నారు. ఈ సమావేశాలు పది రోజులపాటు కొనసాగే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. గత ఏడాది డిసెంబరులో కొలువుదీరిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను గత సమావేశాల్లో ప్రవేశ పెట్టిన సంగతి తెలిసిందే. లోక్‌సభ ఎన్నికలు ముగిసి మోదీ సర్కారు కూడా పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వమూ పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. ఈ సమావేశాల్లో పూర్తిస్థాయి బడ్జెట్‌తోపాటు పలు కీలక బిల్లులకూ ఆమోదం పొందనుంది. బుధవారం నుంచి పూర్తిస్థాయిలో జరగనున్న బడ్జెట్ సమావేశాలు వాడీ, వేడిగా జరిగేందుకు ఆస్కారం ఉంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మొదలుకుని పఠాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వరకు.. పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దశలవారీగా కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్‌లో వారి చేరిక తర్వాత జరుగుతున్న మొదటి సమావేశాలు ఇవే. ఫిరాయింపులకు సంబంధించి అధికార పార్టీపై శాసనసభ వేదికగా మాటల దాడికి బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. అలాగే, రైతు బంధు, రుణ మాఫీ, ఆరు గ్యారెంటీల అమలు వంటి అంశాలపైనా సర్కారును నిలదీయాలని భావిస్తోంది. అయితే, గత ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన వారిని బీఆర్ఎస్ఎల్పీలో విలీనం చేసుకున్న అంశాన్ని లేవనెత్తి.. ఎదురుదాడి చేసేందుకు కాంగ్రెస్ సమాయత్తమవుతోంది. రాష్ట్రంలో ప్రత్యామ్నాయంగా ఎదిగే ప్రయత్నాల్లో ఉన్న బీజేపీ సైతం.. వివిధ అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు శాసనసభను వేదికగా చేసుకోవాలని భావిస్తోంది. కాంగ్రెస్ పార్టీ కూడా రైతు రుణమాఫీ సహా చేసిన పనులను ప్రజలకు చెప్పుకోవడానికి అసెంబ్లీని వేదికగా వినియోగించుకోనుంది.

మరో సీటు అదనంగా..!

గత శాసనసభ సమావేశాల సందర్భంగా 64గా ఉన్న సీఎల్పీ సభ్యుల సంఖ్య ఈసారి 65కు చేరుకుంది. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ గెలుపుతో మరొకరు చేరారు. అదే సమయంలో ఈ సిటింగ్ సీటును కోల్పోయిన బీఆర్ఎస్ బలం.. సభలో 38కి పడిపోనుంది. సాంకేతికంగా 38 మంది అయినా.. ఇప్పటికే 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్ సభ్యుల సంఖ్య కేవలం 28 మాత్రమే.

అవినీతి, హామీల అమలుపై నిలదీద్దాం

- బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నిర్ణయం
- అంబేడ్కర్ విగ్రహం నుంచి పాదయాత్ర

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గడచిన ఎనిమిది నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై, హామీల అమల్లో వైఫల్యాలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని బీజేపీ ఎమ్మెల్యేలు నిర్ణయించారు. ముఖ్యంగా, రుణమాఫీ పథకాన్ని ఆర్భాటంగా ప్రకటించినా అరకొరగా అమలు చేయడంతో వేలాది మంది రైతులు ఆందోళనతో ఉన్నారని సర్కారును నిలదీయనున్నారు. ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన విధంగా.. రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని, ఇందుకు అసెంబ్లీ సమావేశాలను వేదికగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సోమవారం బీజేఎల్పీలో బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భేటీ అయ్యారు. పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. రైతు భరోసా అమల్లో కూడా రాష్ట్ర ప్రభుత్వ వైఖరి రైతులను మోసం చేసేలా ఉందని ఆరోపించారు. నిరుద్యోగులకు, యువతకు, మహిళలకు ఇచ్చిన హామీల అమల్లో వైఫల్యాలను ఎండగట్టాలని తీర్మానించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా మంగళవారం ఉదయం 9.30 గంటలకు ట్యాంక్ బండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. అనంతరం, నడుచుకుంటూ గన్ పార్కుకు చేరుకుని అమరవీరులకు నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి అసెంబ్లీకి చేరుకోవాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిర్ణయించినట్లు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోందని, ప్రజా సమస్యలను చర్చించేందుకు అవకాశం లేకుండా చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం బీజేపీయేనని, బీఆర్ఎస్ కానే కాదని అన్నారు. ఇటీవలి ఎంపీ ఎన్నికలే అందుకు నిదర్శనమన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీ చికిత్స ధరల సవరణ

1375 వైద్య చికిత్సల ధరలు సవరిస్తూ జీవో

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): 11 సంవత్సరాల తర్వాత రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద అందించే వైద్య చికిత్సల ధరలను సర్కారు సవరించింది. ఈ మేరకు 1,375 రకాల వైద్య చికిత్సల ధరలను సవరిస్తూ వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు ఉత్తర్వులను జారీ చేశారు. సోమవారం సచివాలయంలో ఆరోగ్యశ్రీ చికిత్స ధరల సవరణ జీవోను వైద్య ఆరోగ్యమంత్రి దామోదర రాజనర్సింహ విడుదల చేశారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ కింద మొత్తం 1,672 వైద్య సేవలు అందుబాటులో ఉండగా వీటిలో 297 మినహా మిగిలిన వైద్యసేవ(ప్యాకేజీ)ల రేట్లను పెంచారు. ఆరోగ్య శ్రీలో కొత్తగా 163 ప్యాకేజీలను చేర్చినట్లు జీవోలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ సర్కారు రాజీవ్ ఆరోగ్యశ్రీ చికిత్సల ధరలకు సంబంధించిన రివైజ్డ్ రేట్ల గురించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సగటున 20-25 శాతం మేర చికిత్సల ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. తాజా నిర్ణయం వల్ల సర్కారుపై ఏటా అదనంగా రూ.487 కోట్ల భారం పడుతుందని, ధరల సవరణ ద్వారా 79 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని మంత్రి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లో 1,042 సర్కారీ దవాఖానాలుండగా, 368 ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. తాజా రేట్ల ద్వారా ఆరోగ్యశ్రీ కింద ఒక కుటుంబానికి ఏటా రూ.10 లక్షల మేర ఉచిత వైద్యం అందుతుందని జీవోలో పేర్కొన్నారు. గతేడాది డిసెంబరులో ఈ పథకం పరిమితిని కాంగ్రెస్ సర్కారు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. అలాగే కొత్తగా 163 ఆరోగ్య ప్యాకేజీలను గుర్తించింది. తాజాగా చికిత్స ధరల పెంపు కారణంగా రూ.140 కోట్లు, కొత్త ప్యాకేజీల చేర్పు వల్ల మరో రూ.348 కోట్లు మొత్తంగా రూ.488 కోట్ల మేర ఏటా సర్కారుపై అదనపు భారం పడనుందని వైద్యవర్గాలు వివరించాయి. కొత్త ప్యాకేజీల వల్ల 1.5 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

గుండె చికిత్సలో కొత్తగా 12 ప్యాకేజీలు:

కొత్తగా ఆర్యోగ్యశ్రీలో 163 ప్యాకేజీలను ప్రవేశపెట్టగా వాటిలో గుండె చికిత్సకు సంబంధించి 12 ప్యాకేజీలు ఉన్నాయి. వాటిలో కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీలు ఉండగా, మెడికల్ మేనేజ్‌మెంట్ ఆఫ్ అక్యూట్ హార్ట్ ఫెయిల్యూర్(సీహెచ్ఎఫ్)/స్ట్రక్ మెడికల్ మేనేజ్‌మెంట్‌కు రూ.44 వేల ప్యాకేజీని ఖరారు చేశారు. అలాగే డెర్మటాలజీలో 2, ఎండోక్రైనాలజీలో 7 ప్యాకేజీలు చేర్చగా, ఇందులో డయాబెటిక్ కీటో ఎసిడోసిస్‌కు రూ.44 వేల ప్యాకేజీ ఖరారు చేశారు. అలాగే జనరల్ మెడిసిన్‌లో 3, జనరల్ సర్జన్‌లో 15, జీరియాట్రిక్ మెడిసిన్‌లో 1, ఇంటర్వెన్షనల్ రేడియాలజీలో 17, మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీలో 9, నెఫ్రాలజీలో 16, న్యూరాలజీలో 8, న్యూరో సర్జరీలో 18, న్యూక్లియర్ మెడిసిన్‌లో 3, ప్లాస్టిక్ సర్జరీలో 9, పల్మనాలజీలో 3, రేడియేషన్ ఆంకాలజీలో 3, రుమటాలజీలో 7, సర్జికల్ ఆంకాలజీలో 9, యూరాలజీలో 11, వాస్క్యులర్ సర్జరీలో 6 ప్యాకేజీలు కొత్తగా చేర్చారు. అలాగే ల్యాప్రోస్కోపిక్, రోబోటిక్ సర్జరీ, టైప్-1 డయాబెటిక్‌కు ఇన్సులిన్ పంప్స్, అఫెరిసిస్ వంటివి ఆరోగ్యశ్రీలోకి కొత్తగా తీసుకురాగా ఇన్సులిన్ పంప్స్‌కు రూ. 2 లక్షల వరకు ప్యాకేజీ నిర్ణయించారు.

విద్యుత్ సంస్థల్లో పదోన్నతులను సమీక్షించాలి

» తెలంగాణ విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల జేఏసీ డిమాండ్

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి విద్యుత్ సంస్థల్లో పదోన్నతులను సమీక్షించి న్యాయం చేయాలని తెలంగాణ విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం విద్యుత్ సౌధలో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్‌రాస్‌తో జేఏసీ ప్రతినిధులు సమావేశమయ్యారు. విద్యుత్ సంస్థల్లో రెండేళ్లుగా పదోన్నతులు కల్పించకుండా అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయం, వ్యవసాయ వర్సిటీ, పోలీసు శాఖలతోపాటు పలు శాఖల్లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పదోన్నతులను సమీక్షించారని.. విద్యుత్ సంస్థల్లో ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. గత కొంతకాలంగా వివిధ క్యాడర్లలో సీనియార్టీలను నిర్ధారించని కారణంగా ఒక్క జూనియర్ లైన్‌మెన్ కేడర్‌లోనే 3,600 మంది పదోన్నతులు అందుకోలేకపోయారన్నారు. తగిన వివరణ కోసం ప్రభుత్వానికి ఫైలు పంపామని, వివరణ రాగానే నిర్ణయం తీసుకుంటామని రోనాల్డ్‌రాస్ పేర్కొన్నారు.

కారుతో బైక్‌ను గుద్ది.. మృతదేహాన్ని 3 కిలోమీటర్లు ఈడ్చుకెళ్లి

» సంగారెడ్డి జిల్లాలో ఓ కారు డ్రైవర్ నిర్వాకం

మునిపల్లి, జూలై 22: కారులో వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడమే కాకుండా, బైకర్ ఏమయ్యాడో కూడా చూడకుండా మృతదేహాన్ని 3 కిలోమీటర్ల దూరం ఈడ్చుకుంటూ వెళ్లాడు ఓ కారు డ్రైవర్. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద జరిగింది. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం గట్లు ఖానాపూర్ తండాకు చెందిన మోగావత్ వెంకటేశ్(22) మియాపూర్‌లో ఉంటూ ఎల్‌ఎల్‌బీ చదువుతున్నాడు. జహీరాబాద్‌కు పని నిమిత్తం ఆదివారం బైక్‌పై వచ్చాడు. అదే రోజు అర్ధరాత్రి 2 గంటల సమయంలో తిరిగి హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో.. మునిపల్లి మండలం లింగంపల్లి శివారులో ఓ దాబా వద్ద, హైదరాబాద్ నుంచి వస్తున్న కారు వెంకటేశ్ బైక్‌ను ఢీ కొట్టింది. కారు డ్రైవర్ రాజ్‌కుమార్ ఆగకుండా కారును అలాగే పోనిచ్చాడు. వెంకటేశ్ కారు కింది భాగంలో చిక్కుకుపోయాడు. అది గమనించని రాజ్‌కుమార్ వెంకటేశ్‌ను మూడు కిలోమీటర్లు ఈడ్చుకెళ్లాడు. కంకోల్ టోల్‌ప్లాజా సిబ్బంది కారుకు చిక్కుకొని ఉన్న మృతదేహాన్ని గమనించి కారును ఆపారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ప్రభుత్వాస్పత్రుల్లో వసతులపై వివరణ ఇవ్వండి

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక వసతులతోపాటు మెడికల్, పారామెడికల్ సిబ్బంది ఖాళీల భర్తీపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. 'పశ్చిమ బెంగాల్ ఖేత్ మజ్దూర్ సమితి వర్సెస్ స్టేట్ ఆఫ్ వెస్ట్ బెంగాల్ కేసులో సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన తీర్పుతోపాటు ఇండియన్ పబ్లిక్‌హెల్త్ స్టాండర్డ్స్-2022 ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది, సౌకర్యాలు లేవని పేర్కొంటూ హెల్పింగ్ పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ అనే సంస్థ అధ్యక్షుడు అఖిల్ శ్రీగురుతేజ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. కోఠి మెటర్నిటీ వంటి ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగినంతగా సౌకర్యాలు, సిబ్బందిలేరని, సరిపడా ఐసీయూ పడకలు లేవని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. సుప్రీంకోర్టు తీర్పులు, ప్రమాణాల ప్రకారం సౌకర్యాలు ఉన్నాయా? అనే అంశంపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

బ్యారేజీల పరీక్షల రిపోర్టులు ఇవ్వండి

» నీటి పారుదల శాఖ అధికారులకు ఎన్‌డీఎస్‌ఏ ఆదేశం

» గ్రౌటింగ్ చేశాక పరీక్షలు ఎలా ప్రారంభిస్తారని ప్రశ్న

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలు దెబ్బతినడానికి గల కారణాలు తెలుసుకోవడానికి తాము సూచించిన సిఫారసుల ప్రకారం జరిగిన పరీక్షల నివేదికలు అందించాలని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) ఆదేశించింది. సోమవారం న్యూఢిల్లీలో ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అనిల్ జైన్, నిపుణుల కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్‌తో పాటు తెలంగాణ నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, ఈఎన్‌సీ(ఓ అండ్ ఎం) నాగేందర్‌రావు, రామగుండం సీఈ సుధాకర్‌రెడ్డి సమావేశమయ్యారు. బ్యారేజీలకు తాము చెప్పిన పరీక్షలన్నీ చేశారా..? అని ఎన్‌డీఎస్‌ఏ అధికారులు ప్రశ్నించగా.. మేడిగడ్డలో బోర్‌హోల్స్ వేస్తుండగా ఇసుక, నీరు బయటికి రావడంతో పరీక్షలను నిలిపివేశామని అధికారులు బదులిచ్చారు. పరీక్షలకు ముందే ప్లింత్ శ్లాబు కింద గ్రౌటింగ్ చేయడంతో బోర్‌హోల్స్ వేయగానే ఇసుకతో పాటు నీరు బయటికి వచ్చిందని, గ్రౌటింగ్ చేశాక పరీక్షలు ఎలా ప్రారంభిస్తారని ఎన్‌డీఎస్‌ఏ ప్రశ్నించింది. ఇప్పటిదాకా జరిగిన పరీక్షల నివేదికలన్నీ అందించాలని కోరగా, మంగళవారం ఇస్తామని అధికారులు చెప్పారు.

గెస్ట్ లెక్చరర్ల వేతనాలు పెంచుతాం: శ్రీధర్ బాబు

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న 1,654 గెస్ట్ లెక్చరర్ల వేతనాలను పెంచుతామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. గెస్ట్ లెక్చరర్ల ఉద్యోగ భద్రత, గౌరవ వేతనాల పెంపు విషయమై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో మంత్రిని గెస్ట్ లెక్చరర్ల సంఘం ప్రతినిధులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో గెస్ట్ లెక్చరర్ల వేతనాన్ని ఇప్పుడున్న రూ.28 వేల నుంచి రూ.42 వేలకు పెంచుతామని హామీనిచ్చిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని శ్రీధర్ బాబు ముఖ్య కార్యదర్శికి సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

గ్యాస్ గీజర్ నుంచి కార్బన్ మోనాక్సైడ్ లీక్!

» జెక్‌కాలనీలో ముగ్గురి మృతికి అదే కారణమా?

» అన్ని కోణాల్లో విచారిస్తున్న పోలీసులు

బంజారాహిల్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సనత్‌నగర్‌లోని జెక్ కాలనీలో ముగ్గురు కుటుంబ సభ్యుల మరణానికి స్నానాల గదిలోని గ్యాస్ గీజర్ నుంచి వెలువడిన కార్బన్ మోనాక్సైడ్ కారణమై ఉండవచ్చని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. జెక్ కాలనీకి చెందిన వెంకటేష్, ఆయన భార్య మాధవి, కుమారుడు హరికృష్ణ ఆదివారం అనుమానాస్పదంగా వారుండే ఫ్లాట్‌లోని బాత్‌రూంలో మరణించిన విషయం తెలిసిందే. మొదట షార్ట్ సర్క్యూట్ కారణంగా వీరు మరణించి ఉంటారని అందరూ భావించారు. అయితే మృతదేహాలను పోస్టుమార్టంకు పంపిన అనంతరం వారు కార్బన్ మోనాక్సైడ్ పీల్చుకోవడం వల్లే మరణించినట్టు వైద్యులు ప్రాథమికంగా తేల్చి చెప్పారు. హరికృష్ణ మానసికంగా చాలా కాలంగా ఇబ్బంది పడుతున్నాడు. అతనికి తల్లిదండ్రులే ప్రతి రోజూ స్నానం చేయించేవారు. వీరి బాత్‌రూంలో గ్యాస్ ఆధారిత గీజర్ ఉంది. ఆదివారం హరికృష్ణకు స్నానం చేయిస్తుండగా గీజర్ నుంచి కార్బన్ మోనాక్సైడ్ విడుదల కావడం.. దాని రుచి, వాసన లేకపోవడం వల్ల దాన్ని పీల్చుకోవడం వల్లే ముగ్గురూ మరణించి ఉంటారని అనుమానిస్తున్నారు.

శ్రీ చైతన్య విద్యార్థికి ప్రధాని ప్రశంసలు



హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బావదాన్ పుణేకు చెందిన శ్రీ చైతన్య టెక్నో పాఠశాల విద్యార్థి ఆదిత్యను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా ప్రశంసించారని శ్రీ చైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ సుష్మ తెలిపారు. దేశానికి చెందిన ఆరుగురు సభ్యుల విద్యార్థి బృందం యునైటెడ్ కింగ్‌డమ్‌లోని బాత్‌లో జరిగిన 65వ అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలింపియాడ్- 2024లో నాలుగు బంగారు, ఒక రజత పతకంతోపాటు మొత్తంగా 4వ ర్యాంకులో నిలిచిందని ఆమె చెప్పారు. ఈ బృందంలో శ్రీ చైతన్య టెక్నో పాఠశాల విద్యార్థి ఎంవి. ఆదిత్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రధాని మోదీ ప్రశంసలు అందుకున్నాడని సుష్మ పేర్కొన్నారు.

నివేదికల్లేకుండా ఒట్టిచేతులతో వస్తారా?

» ఈసారి సమగ్ర వివరాలతో రావాల్సిందే

» 317 జీవోపై శాఖల అధికారులకు మంత్రివర్గ ఉపసంఘం సూచన

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆయా శాఖల అధికారులంతా 317 జీవోపై శాఖల వారీగా నివేదికలతో హాజరు కావాలని మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించినా.. చాలా మంది నివేదికలు లేకుండానే సోమవారం నాటి సమావేశానికి హాజరయ్యారు. మరి కొంత మంది అరకొర సమాచారంతో వచ్చారు. దీంతో మరోసారి సమగ్ర వివరాలతో అన్ని శాఖల అధికారులు సమావేశానికి రావాలని మంత్రివర్గ ఉపసంఘం సూచించింది. మంత్రి వర్గ ఉపసంఘంలో సభ్యులుగా ఉన్న మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సచివాలయంలో రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఉద్యోగులు వారి సమస్యలను వివరించేందుకు మరో పది రోజులు గడువు ఇవ్వాలని ఉద్యోగుల తరఫున టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు మంత్రివర్గ ఉపసంఘానికి వినతి పత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో వివిధ జిల్లాలకు బదిలీ అయిన సిబ్బందిలో చాలా మందిని 317 జీవోని దృష్టిలో పెట్టుకుని అధికారులు బదిలీ చేశారు. అయితే బదిలీ ఉత్తర్వుల్లో ఆ విషయాన్ని వెల్లడించకపోవడంతో చాలా మందికి విషయం తెలియలేదు. ప్రస్తుతం సాధారణ బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల సమయంలో బదిలీపై వెళ్లిన ఉద్యోగులు ఇప్పుడు తమ సొంత జిల్లాలకు పంపాలని కోరగా.. 317 జీవో కింద అభ్యంతరాలు నమోదు చేసుకోనందున బదిలీకి వీలు కాదని తెలుపుతూ ఆయా శాఖల ఉన్నతాధికారులు కొర్రీలు వేస్తున్నారు. దీంతో చాలా మంది ఉద్యోగులు తమ అభ్యంతరాల నమోదుకు మరో అవకాశమివ్వాలని ఉప సంఘానికి విజ్ఞప్తి చేశారు.

నీటిపారుదల శాఖలోనూ...

మరో వైపు నీటిపారుదల శాఖ ఉద్యోగుల్లోనూ గందరగోళం నెలకొంది. రాష్ట్రపతి ఉత్తర్వులకు వ్యతిరేకంగా 317 జీవోను, జోనల్ వ్యవస్థను ఉల్లంఘిస్తూ కొత్త సర్కిళ్ల ఏర్పాటు పేరుతో బదిలీలు చేశారు. ఈ వ్యవహారంపైనా మంత్రి వర్గ ఉపసంఘానికి ఫిర్యాదులు వెల్లువెత్తినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో శాఖల వారీగా సమగ్ర నివేదికలతో తదుపరి సమావేశానికి శాఖాధిపతులు హాజరు కావాలని మంత్రి వర్గ ఉపసంఘం ఆదేశించింది. సోమవారం నాటి సమావేశానికి రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, జీఏడీ సర్వీసెస్ కార్యదర్శి మహేశ్ కుమార్ ఎక్కాదత్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవి గుప్తా, పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.

పైసల్లేక పథకాలు పరేషాన్

ఎన్నికల్లేక పంచాయతీలకు నిధులు నిల్.. కల్యాణలక్ష్మి చెక్కులు ఇచ్చేది ఎప్పుడు?

» ఆసరా పింఛన్లూ ఆగిపోయాయి

» ఉపాధి హామీలో రాష్ట్ర వాటా ఏది?

» పోలీసు వాహనాలకూ డీజిల్ ఇవ్వట్లేదు

» రాష్ట్రంలో తీవ్రంగా విద్యుత్తు సమస్యలు

» 40% మందికి రుణమాఫీ ఎగ్గొట్టారు

» చిట్‌చాట్‌లో హరీశ్‌రావు వ్యాఖ్యలు



హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సర్కారు మొద్దు నిద్రతో సంక్షేమ పథకాలకు నిధుల్లేని పరిస్థితి నెలకొందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. గ్రామ పంచాయతీలు మొదలు.. జీహెచ్ఎంసీ దాకా నిధుల లేమితో అభివృద్ధి అటకెక్కిందని ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన అసెంబ్లీ బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో విలేకరులతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. "కాంగ్రెస్ సర్కారు సమస్యలను పరిష్కరించకుండా మొద్దు నిద్రపోతోంది. బీఆర్ఎస్ తట్టి లేపినా.. లేవడం లేదు. సర్పంచ్ ఎన్నికలను నిర్వహించకపోవడంతో.. కేంద్రం నుంచి రూ.750 కోట్ల గ్రాంట్ విడుదలవ్వలేదు. గ్రామ పంచాయతీలకు మార్చికి ముందే కేంద్రం రూ.500 కోట్లను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం వాటిని పంచాయతీలకు అందజేయనే లేదు. పారిశుధ్య కార్మికుల సమస్యలను మేం లేవనెత్తితే.. వారికి జీతాలను విడుదల చేస్తామనే ప్రకటన సర్కారు నుంచి వచ్చింది. కేంద్రం జాతీయ ఉపాధి హామీ పథకానికి రూ.850 కోట్లిచ్చింది. రాష్ట్రం మాత్రం తన వాటా రూ.350 కోట్లను విడుదల చేయలేదు. కేంద్రం ఇచ్చిన నిధులను 15 రోజుల్లో సంబంధిత విభాగాలకు విడుదల చేయకుంటే.. రాష్ట్రం వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు రెండు నెలలుగా జీతాల్లేవు. జీహెచ్ఎంసీ కార్పొరేటర్లకు అత్యవసర పనుల నిమిత్తం నెలకు ఇచ్చే రూ.40లక్షలను ఆపేశారని, దీంతో ఏడు నెలలుగా డివిజన్లు అస్తవ్యస్తంగా తయారైందన్నారు. కేంద్రం నిధులిస్తున్నా.. రాష్ట్రం మ్యాచింగ్ గ్రాంట్స్ ఇవ్వకపోవడంతో పలు పథకాలు నిలిచిపోయే పరిస్థితి దాపురించింది" అని హరీశ్‌రావు దుయ్యబట్టారు. రాష్ట్రంలో రెండు నెలలుగా ఆసరా పింఛన్లను ఇవ్వడం లేదని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఇవ్వడం లేదని, ఇప్పటి వరకు లక్షకు పైగా చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయని విమర్శించారు. హోంగార్డులకు జీతాలు సరిగ్గా ఇవ్వడం లేదని, కొన్ని నెలలుగా పోలీసు వాహనాలకు పెట్రోల్/డీజిల్‌కు డబ్బులు కూడా ఇవ్వని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల పోలీసులు పర్సంటేజీ ముట్టజెబితే బిల్లులు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఐదు డీఏలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు.

విద్యుత్తు సంక్షోభం

రాష్ట్రంలో విద్యుత్తు శాఖ తీవ్ర సంక్షోభంలో ఉందని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. "వినియోగం గతంలో మాదిరిగానే ఉంది. అయినా.. కరెంటు కోతలు ఎందుకు? అదే ప్రశ్న వేస్తే.. విచిత్రమైన కారణాలు చెబుతున్నారు. తొండలు, బల్లుల వల్ల ఈ దుస్థితి అంటున్నారు. కాదుకాదు.. హరీశ్‌రావు చెబితే కరెంటు తీసేస్తున్నారని అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. రైతులు డీడీలు కట్టినా ట్రాన్స్ ఫార్మర్లు రావట్లేదని, స్తంభాలను ఏర్పాటు చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో పంచాయతీలు, స్కూళ్లు విద్యుత్తు బిల్లులు చెల్లించడం లేదని, దీంతో విద్యుత్తుశాఖ ఆదాయానికి గండి పడుతోందన్నారు. ప్రజాపాలనలో కంచెలే ఉండవన్న కాంగ్రెస్.. అసెంబ్లీ చుట్టూ నాలుగు కంచెలు వేసిందని విమర్శించారు.

రుణమాఫీ ఎగ్గొట్టారు

రైతు రుణమాఫీకి రేషన్‌కార్డు, పీఎంకిసాన్ నిబంధనలను అమలు చేయడంతో పలువురు అర్హత కోల్పోయారని, 40% మందికిపైగా రైతులకు ప్రభుత్వం రూ.లక్షలోపు మాఫీ ఎగ్గొట్టిందని హరీశ్‌రావు ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లా తాంసీ మండలంలో విమల అనే మహిళకు రూ.59వేల అప్పుంటే రూ.3వేలు మాఫీ అవుతున్నట్టు మెసేజ్ వచ్చిందని, ఇలాంటి తప్పులు చాలా ఉన్నాయన్నారు. గత నిబంధనలే అమలు చేస్తున్నామని మంత్రులు చెబుతున్నారని.. అలా చేసి ఉంటే.. అధిక సంఖ్యలో రైతులకు రుణమాఫీ అవుతుందన్నారు. రైతు బీమా చెక్కులు కూడా సకాలంలో అందించడం లేదన్నారు.

పీహెచ్‌సీల్లో స్పెషాలిటీ డాక్టర్లా?

వైద్యశాఖలో అవసరం ఉన్నచోట కాకుండా... ఏమాత్రం వసతుల్లేని ఆస్పత్రులకు స్పెషాలిటీ డాక్టర్లను బదిలీ చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వ అనాలోచిత చర్యలకు నిదర్శనంగా రెండు వేల పడకల ఆస్పత్రుల్లో సూపరింటెండెంట్, హెచ్‌వోడీలుగా పనిచేసిన వారిని వంద పడకల ఆస్పత్రులకు పంపారని దుయ్యబట్టారు. బిహారీలకు ప్రాధాన్యమిస్తున్నారని బీఆర్ఎస్ హయాంలో విమర్శలు చేసిన రేవంత్‌రెడ్డికి ఇప్పుడు వారే ముద్దయ్యారా? అని ప్రశ్నించారు. సివిల్ సర్వీస్ అధికారులకు కులం, ప్రాంతం ఆపాదించడం సరికాదని హితవుపలికారు. సిద్దిపేటలో అమలు చేసిన పలు కార్యక్రమాలకు కేంద్ర ఆర్థిక సర్వేలో చోటు దక్కడం తనకు ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

నూతన న్యాయ చట్టాలపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి చెప్పాలి

నియంతృత్వ సెక్షన్లను సవరించాలని కేంద్రానికి లేఖ రాయాలి

వీటిపై అసెంబ్లీలో చర్చించి తీర్మానం చేయాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా అమల్లోకి తెచ్చిన నూతన న్యాయచట్టాలపై పలు వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని, ఈ విషయంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి తమ వైఖరి ఏంటో చెప్పలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్నాటక ముఖ్యమంత్రులు ఈ చట్టాల అమలును వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించారని, అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై తక్షణం స్పందించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి సోమవారం కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. నూతన చట్టాల్లో ఉన్న నియంతృత్వ సెక్షన్లను సవరించాలని కేంద్ర ప్రభుత్వానికి వెంటనే లేఖ రాయాలని, అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి రాష్ట్రం తరఫున ఒక తీర్మానాన్ని కేంద్రానికి పంపాలని ఆయన డిమాండ్ చేశారు. పౌరులను అణచివేసే చట్టాలు, అందులోని సెక్షన్లపై రాష్ట్ర పరిధి మేరకు ఒక కమిటీని వెంటనే నియమించి వాటిపై చర్చించి.. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. నూతన చట్టాల ప్రకారం నిందితులకు బెయిలిచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గిపోతాయని, పోలీసులకు, ప్రభుత్వానికి విపరీతమైన అధికారాలు సంక్రమిస్తాయన్నారు. గతంలో 15 రోజుల పోలీసు కస్టడీ ఉంటే.. ఇప్పుడు 90 రోజులకు పెంచారని, ఈ గడువును ఉపయోగించి ఎన్నిసార్లయినా కస్టడీలోకి తీసుకునే అవకాశం కల్పించారన్నారు. తద్వారా నిందితుడికి న్యాయస్థానం బెయిలిచ్చినా పోలీసులు కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.



లంచం డబ్బుతో సస్పెన్షన్‌లో ఉన్న సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సాయి వెంకట కిషోర్



ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ దమ్మాయిగూడ మునిసిపల్ కమిషనర్ రాజమల్లయ్య

సస్పెన్షన్‌లో ఉన్నా లంచం ఇవ్వాల్సిందే..

5 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సంగారెడ్డి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్

30 వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన దమ్మాయిగూడ మునిసిపల్ కమిషనర్

హైదరాబాద్ సిటీ/సంగారెడ్డి క్రైం/కీసర రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సస్పెన్షన్‌లో ఉన్నా.. లంచం విషయంలో తగ్గేది లేదంటూ వసూళ్లకు పాల్పడిన ఓ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు పక్కా ప్లాన్‌తో పట్టుకున్నారు. సంగారెడ్డి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ మట్టపర్తి సాయి వెంకటకిషోర్ ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు. గతేడాది అమీన్‌పూర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మెరుగు రవిగౌడ్‌ను భూవిక్రయ కేసు విషయంలో అరెస్ట్ చేసి భూమి దస్తావేజులు తీసుకుని తన దగ్గర పెట్టుకున్నారు. ఆ కేసులో జైలుకు వెళ్లిన రవిగౌడ్.. ఇటీవలే విడుదలై భూమి పత్రాలు ఇవ్వాలని వెంకట కిషోర్‌ను కోరారు. రూ.కోటిన్నర ఇస్తేనే పత్రాలు ఇస్తానని, లేదంటే వాటిని కాల్చేస్తానని వెంకటకిషోర్ బెదిరించారు. తొలుత రూ.10లక్షలు తీసుకున్న వెంకటకిషోర్.. మిగిలిన డబ్బుల కోసం వేధిస్తున్నాడు. దీంతో రవి గౌడ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. మియాపూర్‌లో బాధితుడి నుంచి రూ.5లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వెంకటకిషోర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా, మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ మునిసిపల్ కమిషనర్ రాజమల్లయ్య ఏసీబీకి చిక్కారు. సోమవారం ఆయన చాంబర్‌లోనే రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. దమ్మాయిగూడ మునిసిపాలిటీ పరిధిలోని ఓ స్థలం విషయంలో ముషీరాబాద్‌కు చెందిన సుదర్శన్, అతడి వ్యాపార భాగస్వామి సత్యనారాయణకు మధ్య కోర్టులో కొన్నాళ్లుగా వివాదం నడుస్తోంది. సుదర్శన్‌కు చెందిన మూడు గుంటల స్థలాన్ని సత్యనారాయణ కబ్జా చేసి అతడికి రోడ్డు లేకుండా అడ్డుగా గోడ నిర్మించాడు. ఈ నేపథ్యంలోనే ఆ గోడను కూల్చివేసేందుకు కమిషనర్ రాజమల్లయ్యను సంప్రదించగా.. ఆయన రూ.60వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో సుదర్శన్.. ఏసీబీ అధికారులను సంప్రదించాడు. రూ.30వేలు రాజమల్లయ్య తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

మహబూబాబాద్ జిల్లాకు దాశరథి పేరు?

» శతజయంత్యుత్సవాలు ప్రారంభం

» జూకంటి జగన్నాథంకు దాశరథి సాహితీ పురస్కారం

» పాల్గొన్న మంత్రులు జూపల్లి, పొన్నం ప్రభాకర్ తదితరులు

» సాహిత్య స్ఫూర్తిపై చర్చాగోష్ఠులు నిర్వహించాలి: బండ ప్రకాష్



ప్రముఖ కవి జూకంటి జగన్నాథంకు దాశరథి సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న మంత్రులు జూపల్లి, పొన్నం, శాసన మండలి ఉపాధ్యక్షుడు బండ ప్రకాశ్ తదితరులు

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మలిదశ తెలంగాణ ఉద్యమానికి దాశరథి వంటి మహాకవుల సాహిత్యం ప్రధాన భూమికగా నిలిచిందని, ఆ వైతాళికుల స్ఫూర్తితో తాము స్వరాష్ట్ర సాధన కోసం చట్టసభల్లో, ప్రజా క్షేత్రంలో రాజీ లేని పోరాటాన్ని సాగించామని మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. పాట అత్యంత శక్తిమంతమైనదని, చైతన్యాన్ని రగిల్చి అందరినీ ఒక్క తాటిపైకి తేగల సత్తా కవులు, కళాకారులకే ఉందంటూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సందర్భాలను గుర్తుచేసుకున్నారు. రవీంద్ర భారతిలో మహాకవి దాశరథి కృష్ణమాచార్య శత జయంతి సంవత్సరం సోమవారం మొదలైన సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఏర్పాటు చేసిన దాశరథి చిత్ర ప్రదర్శనను మంత్రులు ప్రారంభించారు. దాశరథి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ప్రముఖ కవి జూకంటి జగన్నాథంకు దాశరథి సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. శాలువ, జ్ఞాపికతో సన్మానించి, రూ.1,01,116 నగదు చెక్కును అందించారు. సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాకు దాశరథి పేరు పెట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ఈ శతజయంతి సంవత్సరంలోనే ప్రకటించేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. దాశరథి కుటుంబానికి తమ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి చెప్పారు. ఆయన పోరాట చైతన్య స్ఫూర్తిని తెలుగు వారంతా స్మరించుకునేలా ఈ ఏడాదంతా కార్యక్రమాలు నిర్వహించేందుకు భాషా సాంస్కృతిక శాఖ సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 'ఆ చల్లని సముద్ర గర్భం.' పాటను ఎన్నిసార్లు విన్నా మళ్లీ వినాలనిపిస్తుందని, దాని ఔచిత్యం ఈనాటికి ఉందని అన్నారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ దాశరథి సాహిత్యం- వ్యక్తిత్వంతో పాటు ఆ మహనీయుడి పోరాట జీవితంపై రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో, జిల్లా కేంద్రాల్లో చర్చాగోష్ఠులు నిర్వహించాలని భాషా సాంస్కృతిక శాఖకు సూచించారు. రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ మాట్లాడుతూ అవార్డు స్వీకర్త జూకంటి జగన్నాథాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ వంటి పదవితో గౌరవించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మానుకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు అలేఖ్య పుంజాల, భాషా సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, డైరెక్టర్ మామిడి హరికృష్ణ, దాశరథి కుమార్తె ఇందిర, కుమారుడు లక్ష్మణ్ పాల్గొన్నారు. దాశరథి సొంతూరు మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు గ్రామస్థులు కార్యక్రమానికి హాజరయ్యారు.

సీఎం నివాళులు

న్యూఢిల్లీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : దాశరథి కృష్ణమాచార్య శత జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఎం రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. తుగ్లక్ రోడ్‌లోని అధికారిక నివాసంలో ఉదయం దాశరథి చిత్రపటానికి సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నివాళులర్పించారు.

ఆ 3 సంఘాలకే గుర్తింపు

» వారు లేఖలు ఇచ్చిన ఆఫీస్ బేరర్లకే.. బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చాం

» వైద్య శాఖ కమిషనర్ కర్ణన్ వివరణ

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గుర్తించిన టీఎన్‌జీవో, టీజీవో, టీజీడీఏ యూనియన్లు లేఖలు ఇచ్చిన ఆఫీస్ బేరర్లకే బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చామని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. ఈ సంఘాలకు మాత్రమే సాధారణ పరిపాలన శాఖ నుంచి గుర్తింపు ఉందని పేర్కొన్నారు. వైద్య విద్య సంచాలకుల పరిధిలో 1,036 బదిలీలు చేపట్టగా అందులో 38 మందికి.. వైద్య విధాన పరిషత్ పరిధిలో 1,159 మందిలో 28 మందికి.. ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో 2,196 మందిలో 143 మందికి.. కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలో 920 మందికి గాను ముగ్గురికి మాత్రమే బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చామని వివరించారు. మొత్తంగా నాలుగు విభాగాల పరిధిలో 212 మందికే బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చామని వెల్లడించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన మాజీ డీహెచ్ గడల బదిలీ కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ పరిధిలో ఒక్క స్టాఫ్ నర్స్ తప్ప మిగిలిన అన్ని కేడర్ల బదిలీల ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. త్వరగా వారి బదిలీల ప్రక్రియను కూడా పూర్తి చేస్తామన్నారు. వైద్య విద్య సంచాలకుల పరిధిలో ఇటీవల చేపట్టిన సాధారణ బదిలీలకు సంబంధించిన అధ్యాపకుల బదిలీల జీవో సోమవారం విడుదలైంది. ఇందులో పలు కాలేజీల ప్రిన్సిపాళ్లు, ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు ఉన్నారు. వీరంతా తక్షణమే విధుల్లో చేరాలని జీవోలో పేర్కొన్నారు.

ఆఫీస్ బేరర్ల లేఖలతో వసూళ్లు చేయలేదు: ఐఎన్‌టీయూసీ

అధికార పార్టీ గుర్తింపు సంఘం పేరిట 300 మంది ఉద్యోగులకు ఆఫీస్ బేరర్లు పత్రాలు ఇచ్చి వాళ్ల నుండి డబ్బులు వసూలు చేసినట్లు వచ్చిన వార్తలు పూర్తిగా నిరాధారమని ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం ఐఎన్‌టీయూసీ(3194) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొందుగుల వెంకటేశ్వర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యాంసుందర్ తెలిపారు. తాము ఇప్పటి వరకు 50-60 మందికి మాత్రమే ఆఫీస్ బేరర్ల పత్రాలు ఇచ్చామని తెలిపారు. వైద్యారోగ్య శాఖ బదిలీల్లో మోసం పేరిట 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై వారు వివరణ ఇచ్చారు. తమ సంఘానికి గుర్తింపు లేదంటూ తెలంగాణ వైద్య, ప్రజారోగ్య సంఘం అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన పదేళ్లుగా టీఆర్ఎస్ అనుబంధ సంఘంలో కొనసాగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ ఐఎన్‌టీయూసీ ముసుగులో కొత్త యూనియన్ స్థాపించారని తెలిపారు. పదేళ్లలో ఆయన టీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అక్రమాలను బయటకు తీసి, చర్యలు తీసుకోవాలని అధికారులను కోరామని చెప్పారు. వైద్య శాఖలో గత పదేళ్లుగా జరగని బదిలీలు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పారదర్శకంగా జరుగుతున్న వేళ కొన్ని గుర్తింపు లేని వైద్య సంఘాలు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం డీహెచ్ విభాగం నాయకుడు డాక్టర్ లాలూ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలపారు. సీనియారిటీ జాబితాను తప్పుల తడకగా మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● మంగళవారం 23 జూలై 2024
diksuchi@andhrajyothy.com

డిగ్రీతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం
ఎస్ఎస్‌సీ సీజీఎల్ఈ-2024

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ)... కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో గ్రూప్-బి, సి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



పోస్టుల వివరాలు

- గ్రూప్-బిలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్/అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, సబ్ ఇన్‌స్పెక్టర్, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్, రీసెర్చ్ అసిస్టెంట్, డివిజన్ అకౌంటెంట్, జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి.
- గ్రూప్-సిలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్/జూనియర్ అకౌంటెంట్, పోస్టల్ అసిస్టెంట్/సార్టింగ్ అసిస్టెంట్, సీనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్/అప్పర్ డివిజన్ క్లర్క్, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, ట్యాక్స్ అసిస్టెంట్, సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఉన్నాయి.

అర్హతలు: ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్మీడియట్ స్థాయిలో మేథమెటిక్స్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఆ తరవాత డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. లేదా డిగ్రీ స్థాయిలో స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ గ్రేడ్-2 పోస్టులకు స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎన్‌హెచ్‌ఆర్‌సీలో రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టులకు కనీసం ఏడాది రీసెర్చ్ అనుభవం ఉన్నవారికి, న్యాయశాస్త్రంలో డిగ్రీ లేదా హ్యూమన్ రైట్స్‌లో డిగ్రీ పూర్తిచేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. నిర్దిష్ట విద్యార్హతలన్నీ 2024 ఆగస్టు 1లోపు పొంది ఉండాలి.

వయసు: జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు 32 ఏళ్లు, గ్రూప్- సి పోస్టులకు 27 ఏళ్లు. మిగతా అన్ని పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి 30 ఏళ్లు. నిబంధనల ప్రకారం రిజర్వేషన్ వర్గాలకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

వేతనం: పే లెవల్-4, 5, 6, 7లతో ప్రారంభ వేతనం లభిస్తుంది. కనిష్ఠ ప్రారంభ వేతన శ్రేణి రూ.25,500 - రూ.81,00; గరిష్ఠ ప్రారంభ వేతన శ్రేణి రూ.44,900 - రూ.1,42,00.

ఎంపిక ప్రక్రియ: రెండు దశల్లో నిర్వహించే రాత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

టైర్-1 పరీక్ష: దీనిని 200 మార్కులకు నిర్వహిస్తారు. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(25 ప్రశ్నలు), జనరల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(25 ప్రశ్నలు), ఇంగ్లిష్ కాంప్రహెన్షన్(25 ప్రశ్నలు) నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ఈ పరీక్షలో నిర్దేశిత కటాఫ్ మార్కులతో ఉత్తీర్ణులైన వారిని టైర్-2 పరీక్షకు ఎంపిక చేస్తారు.

టైర్-2: ఈ పరీక్షను మొత్తం నాలుగు పేపర్లలో నిర్వహిస్తారు.

- పేపర్-1లో రెండు సెషన్లు ఉంటాయి. సెషన్-1(సెక్షన్-1)లో మేథమెటికల్ ఎబిలిటీ(మాడ్యుల్-1), రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్(మాడ్యుల్-2) విభాగాల నుంచి 30 ప్రశ్నల చొప్పున మొత్తం 60 ప్రశ్నలు వస్తాయి. ఒక్కో ప్రశ్నకు 3 మార్కుల చొప్పున మొత్తం 180 మార్కులు కేటాయించారు. సెషన్-1(సెక్షన్-2)లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్(మాడ్యుల్-1)లో 45 ప్రశ్నలు, జనరల్ అవేర్‌నెస్(మాడ్యుల్-2)లో 25 ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 70 ప్రశ్నలకు 210 మార్కులు కేటాయించారు. సెషన్-1(సెక్షన్-3)లో కంప్యూటర్ నాలెడ్జ్(మాడ్యుల్-1) నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. దీనికి కేటాయించిన మార్కులు 60. సెషన్-2(సెక్షన్-3)లో డేటా ఎంట్రీ స్పీడ్ టెస్ట్(మాడ్యుల్-2)ని 15 నిమిషాల్లో పూర్తి చేయాలి. పేపర్-2 స్టాటిస్టిక్స్‌కి సంబంధించింది. దీనిని 100 ప్రశ్నలు- 200 మార్కులకు నిర్వహిస్తారు. పేపర్-3ని జనరల్ స్టడీస్ (ఫైనాన్స్ అండ్ ఎకనామిక్స్)తో 200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో 100 ప్రశ్నలు ఉంటాయి. అన్ని పోస్టుల అభ్యర్థులు పేపర్-1కు తప్పనిసరిగా హాజరు కావాలి. పేపర్-2 జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు మాత్రమే ఉంటుంది. అదేవిధంగా పేపర్-3ని అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులకు నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 24
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** ఆగస్టు 10, 11
- **టైర్-1 పరీక్ష:** సెప్టెంబరు/అక్టోబరు
- **టైర్-2 పరీక్ష:** డిసెంబరు
- **వెబ్‌సైట్:** https://ssc.gov.in/

ప్రిపరేషన్

ఇంటెలిజెన్స్-రీజనింగ్: ఈ విభాగం కోసం వెర్బల్, నాన్ వెర్బల్ రీజనింగ్‌పై అవగాహన పెంచుకోవాలి. ఇందుకు కోడింగ్, డీకోడింగ్, నెంబర్ సిరీస్, ఎనాలజీ, క్లాసిఫికేషన్, సిలాజిజమ్స్ మ్యాట్రిక్స్ కోడింగ్, వెన్ డయాగ్రమ్స్ వంటి వాటిపై పట్టు సాధించాలి.

జనరల్ అవేర్‌నెస్: ఇందులో చరిత్ర, జాగ్రఫీ, ఆర్థిక వ్యవస్థ, రాజ్యాంగం, కరెంట్ అఫైర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి అంశాలపై ప్రశ్నలు వస్తాయి. దీని కోసం దినపత్రికలు, ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్, మనోరమ ఇయర్ బుక్ ఫాలో కావాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్: ఇందులో శాతాలు, స్క్వేర్‌రూట్స్, సరాసరి, లాభ-నష్టాలు, కాలం-పని, కాలం-దూరం వంటి అంశాలే కాకుండా జామెట్రీ, ట్రిగ్నోమెట్రీ టాపిక్స్‌ను కూడా ప్రిపేర్ కావాలి. ఇందుకోసం 10వ తరగతి వరకు గల మేథ్స్ పుస్తకాల్లోని సంబంధిత అంశాలను అధ్యయనం చేయాలి.

ఇంగ్లీష్: ఇందులో కాంప్రెహెన్షన్, ఎర్రర్ డిటెక్షన్స్, సినానిమ్స్, ఎంటానిమ్స్, కరెక్ట్ స్పెల్లింగ్ వంటి ప్రశ్నలు వస్తాయి. మంచి స్కోర్ సాధించాలంటే వొకాబులరీపై ఎక్కువగా దృష్టి సారించాలి.

పేపర్-2, పేపర్-3: జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల అభ్యర్థులకు నిర్వహించే పేపర్-2, అదే విధంగా అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుల అభ్యర్థులకు నిర్వహించే పేపర్-3లో విజయం సాధించాలంటే అభ్యర్థులు బ్యాచిలర్స్ డిగ్రీ స్థాయిలో అకడమిక్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. అదేవిధంగా గత ప్రశ్న పత్రాలు, నమూనా ప్రశ్న పత్రాలను సాధన చేయాలి.

సెస్‌లో పీహెచ్‌డీ

బేగంపేట(హైదరాబాద్)లోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్ ఇన్ డెవలప్‌మెంట్ స్టడీస్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌నకు నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ సహకారం అందిస్తోంది. మొత్తం 12 సీట్లు ఉన్నాయి. రీసెర్చ్ ప్రపోజల్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. తెలంగాణ ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి. స్థానికేతరులకు హాస్టల్ సౌకర్యం ఉంది. అర్హులైన అభ్యర్థులకు ఫైనాన్షియల్ అసిస్టెన్స్/ఫెలోషిప్స్ అందిస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. మొదటి ఏడాది రెండు సెమిస్టర్లు ఉంటాయి. వీటిలో కోర్సు వర్క్‌లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌లో రీసెర్చ్ మెథడాలజీ, పర్‌స్పెక్టివ్స్ అండ్ పారాడైమ్స్ ఆఫ్ డెవలప్‌మెంట్, ఫండమెంటల్స్ ఆఫ్ ఎకనామెట్రిక్స్/ డెవలప్‌మెంట్ స్టాటిస్టిక్స్ పేపర్లు; రెండో సెమిస్టర్‌లో ఇండియాస్ డెవలప్‌మెంట్ డిబేట్, అప్లయిడ్ ఎకనామెట్రిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్, పారాడైమ్స్ ఇన్ సోషల్ సైన్సెస్ పేపర్లు ఉంటాయి. ఈ రెండు సెమిస్టర్లు పూర్తయిన తరవాత అభ్యర్థులు ప్రీ పీహెచ్‌డీ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. ఇందులో కనీసం 50 శాతం మార్కులు సాధించినవారిని మాత్రమే పీహెచ్‌డీ రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు. పీహెచ్‌డీలో చేరినవారు అయిదేళ్లపాటు రీసెర్చ్/థీసిస్ వర్క్ చేయాల్సి ఉంటుంది.

విభాగాలు: ఎకనామిక్స్, సోషియాలజీ/ఆంత్రోపాలజీ/సోషల్ వర్క్, డెవలప్‌మెంట్ స్టాటిస్టిక్స్, పొలిటికల్ సైన్స్/పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కామర్స్/బిజినెస్ మేనేజ్‌మెంట్

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో పీజీ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. యూజీసీ జేఆర్‌ఎఫ్/యూజీసీ నెట్ అర్హత తప్పనిసరి.



ఎంపిక: అభ్యర్థులు దరఖాస్తుతోపాటు కనీసం 1500 పదాలతో రీసెర్చ్ ప్రపోజల్ సబ్మిట్ చేయాలి. దీని ఆధారంగానే అభ్యర్థులను షార్ట్‌లిస్ట్‌చేసి పర్సనల్ ఇంటర్వ్యూకి పిలుస్తారు. రీసెర్చ్ ప్రపోజల్ సబ్మిట్ చేయనివారి దరఖాస్తులను పరిశీలించరు.

- యూజీసీ జేఆర్‌ఎఫ్ అర్హత ఉన్నవారికి పర్సనల్ ఇంటర్వ్యూలో సాధించిన స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. యూజీసీ నెట్ అర్హత ఉన్నవారికి నెట్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఉంటుంది.


- **దరఖాస్తు:** రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 20
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** ఆగస్టు 30
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** సెప్టెంబరు రెండో వారంలో
- **చిరునామా:** డీన్, డివిజన్ ఆఫ్ గ్రాడ్యుయేట్ స్టడీస్, సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్, నిజామియా అబ్జర్వేటరీ క్యాంపస్, బేగంపేట్, హైదరాబాద్-500016.
- **వెబ్‌సైట్:** www.cess.ac.in

విజయవాడలోని డా.వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(డావైఎస్సార్‌యూహెచ్‌ఎస్)-పోస్ట్ గ్రాడ్యుయేట్ డెంటల్ డిగ్రీ/డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్, నాన్ మైనారిటీ, అనుబంధ డెంటల్ కళాశాలల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా, మేనేజ్‌మెంట్ కోటా సీట్లు భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ డెంటల్ కళాశాలల్లో 50 శాతం సీట్లను స్టేట్ కోటా/కాంపిటెంట్ అథారిటీ కోటా కింద; మిగిలిన 50 శాతం సీట్లను ఆలిండియా కోటా కింద భర్తీ చేస్తారు. ప్రైవేట్ అన్ఎయిడెడ్ నాన్ మైనారిటీ డెంటల్ కాలేజీల్లో 50 శాతం సీట్లను కాంపిటెంట్ అథారిటీ కోటా కింద, మిగిలిన 50 శాతం సీట్లను మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేస్తారు. ఎండీఎస్, డిప్లొమా ప్రోగ్రామ్‌లను అందిస్తున్న కాలేజీలు-సీట్ల వివరాలు వెబ్‌సైట్‌లో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డా.వైఎస్సార్ వర్సిటీలో డెంటల్ పీజీ ప్రవేశాలు

అర్హత వివరాలు: పీజీ డెంటల్ డిగ్రీ/డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీడీఎస్(బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జరీ) ఉత్తీర్ణతతోపాటు 2024 జూన్ 30 నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తి కావాలి. రాష్ట్ర స్థాయి/జాతీయ స్థాయిలో ఉన్న డెంటల్ కౌన్సిల్ గుర్తింపు తప్పనిసరి. నీట్ ఎండీఎస్ 2024 అర్హత పొంది ఉండాలి.

- నీట్ ఎండీఎస్ 2024 కటాఫ్ స్కోర్: మొత్తం 960 మార్కులకుగాను జనరల్ అభ్యర్థులకు 263; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ అభ్యర్థులకు 230; జనరల్ కేటగిరీ దివ్యాంగులకు 246గా నిర్దేశించారు.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.7080; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.5,900
- **వెరిఫికేషన్ ఫీజు:** ఏపీ మినహా ఇతర రాష్ట్రాల్లో బీడీఎస్ పూర్తిచేసిన వారికి రూ.3,540; విదేశాల్లో చదివినవారికి రూ.8,260
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 24
- **వెబ్‌సైట్:** https://drysr.uhsap.in

మొరార్జీ దేశాయ్ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లొమా

కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా(ఎండీఎన్ఐవై-న్యూఢిల్లీ)-డిప్లొమా ఇన్ యోగా సైన్స్ (డీవైఎస్)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 75 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 33, ఓబీసీలకు 18, ఎస్సీలకు 10, ఎస్టీలకు 6, ఈడబ్ల్యూఎస్ వర్గానికి 8 సీట్లు ప్రత్యేకించారు. అదనంగా మరో 22 స్పెషల్ కేటగిరీ సీట్లు కూడా ఉన్నాయి. వీటిని విదేశీ విద్యార్థులు, స్పోర్ట్స్/ఎన్‌సీసీ/ఎన్ఎస్ఎస్ అభ్యర్థులు, మాజీ సైనికులు, సంస్థ ఉద్యోగుల పిల్లలకు నిర్దేశించారు. దేశవ్యాప్తంగా నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్, మెడికల్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు సెకండరీ స్కూళ్లు, ప్రీ యూనివర్సిటీలు, యూనివర్సిటీలలో యోగా ఇన్‌స్ట్రక్టర్లుగా రాణించవచ్చు.



అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. వయోపరిమితి నిబంధనలు లేవు. అభ్యర్థులు ఆరోగ్యవంతులై ఉండాలి.

ఎంట్రెన్స్ టెస్ట్: ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. జనరల్ అవేర్‌నెస్(ఇండియన్ హిస్టరీ, ఇండియన్ జాగ్రఫీ, ఫండమెంటల్ రైట్స్ అండ్ డ్యూటీస్, నేషనల్ అకడమిక్ ఇన్‌స్టిట్యూట్స్, నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ కరెంట్ అఫైర్స్, నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్స్, ముఖ్యమైన రోజులు); జనరల్ బయాలజీ(ఎనిమిది, తొమ్మిది, పది తరగతులకు సీబీఎస్ఈ నిర్దేశించిన సిలబస్); కాంప్రహెన్షన్ ఎబిలిటీ(రీడింగ్ కాంప్రహెన్షన్, ఒకాబులరీ బిల్డింగ్, పార్ట్స్ ఆఫ్ స్పీచ్, యాక్టివ్ పాసివ్ వాయిస్, డైరెక్ట్ - ఇన్‌డైరెక్ట్ స్పీచ్); యోగా(జీకే-యోగా, ఇంటర్నేషనల్ డే ఆఫ్ యోగా, కామన్ యోగా ప్రొటోకాల్) విభాగాల నుంచి ఒక్కోదానిలో 25 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. ఈ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్, ఈడబ్ల్యూఎస్, స్పెషల్ కేటగిరీల అభ్యర్థులకు కనీసం 40 శాతం మార్కులు; దివ్యాంగులు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 35 శాతం మార్కులు రావాలి. విదేశీ విద్యార్థులు ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. వీరికి అకడమిక్ మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000 ✦ **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 2
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** ఆగస్టు 11
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** ఆగస్టు 19
- **మొదటి కౌన్సెలింగ్ తేదీలు:** ఆగస్టు 22, 23
- **రెండో కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** ఆగస్టు 27 ✦ **రెండో కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 28
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** సెప్టెంబరు 2 నుంచి
- **వెబ్‌సైట్:** yogamdniy.nic.in

జాబ్ కార్నర్

ఎన్ఎంఎల్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

జంషెడ్‌పూర్‌లోని ఎన్‌టీపీసీ మైనింగ్ లిమిటెడ్(ఎన్ఎంఎల్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 144

అర్హత: పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా(మెకానికల్/మైనింగ్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ప్రొడక్షన్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 ఆగస్టు 5 నాటికి 30 ఏళ్లు, ఒకేషనల్ ట్రెయినింగ్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు 40 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ/ఎక్స్- సర్వీస్‌మెన్ అభ్యర్థులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.

జీతం: నెలకు మైనింగ్ సర్దార్ పోస్టుకు రూ.40,000; మిగిలిన ఖాళీలకు రూ.50,000.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 5


వెబ్‌సైట్: https://ntpc.co.in/



అరుదైన పురాతన మెట్లబావి

మహారాష్ట్రలోని పర్భని జిల్లా సేలు తాలూకాలో సుమారు వెయ్యి లేదా పదిహేను వందల యేళ్ల నాటిదిగా భావిస్తున్న అత్యంత పురాతన వర్తులాకార మెట్లబావి అక్కడి స్థానిక ప్రజల చొరవతో ఈ మధ్య శుభ్రపడి, మరలా అందంగా రూపు దిద్దుకుంది. ఈ బావికి ఎనిమిది వైపులా ఎనిమిది సర్పిలాకార మెట్ల వరుసలు ఉన్నాయి. భారతీయ వాస్తు నిపుణుల పనితనానికి, మన సంప్రదాయ నిర్మాణాలకు ఈ బావి ఒక మచ్చు తునక అని చెప్పుకోవచ్చు.యేళ్ల తరబడి చెత్తా చెదారం పేరుకుని పోయి ఉన్న ఈ బావిని కొన్ని రోజుల క్రితం వాలూరు స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, ఆ చెత్తను అంతా తొలగించి, బావికి మునుపటి వైభవాన్ని తీసుకొచ్చారు.


6 తేడాలను గుర్తించండి?




దారి కనుక్కోండి



జత ఉన్న బొమ్మ ఏది?



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 365

	1	3	
			1
4			
	2	4	

సుడోకు - 364 సమాధానం

5	2	1	6	3	4
3	6	4	1	5	2
4	5	6	3	2	1
1	3	2	5	4	6
6	4	5	2	1	3
2	1	3	4	6	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.